ఆగస్టు - అక్టోబర్ 2021 సంచిక : 443 వెల : 25/-

ISSN 0971-278X

# ప్రజాసాహితి

## సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక



**రైతాంగ వ్యతిరేక చట్టాల రద్దుకై పోరాడుదాం!**

జనసాహితి ప్రచురణ

# మీ విజయం మా ఘనత కాదు... బాధ్యత

Confidence
Competence
Commitment
Control
Character

CHAMPS'™



*Chief Mentor*

**R.SASI KUMAR**

B.Com., LLB., ACA, ACMA (Ind), ACMA (U.K.), CIA (U.S.A.), CMA (U.S.A.), CGMA

Mr. Sasi Kumar is the Chief Mentor at CHAMPS' who is a highly qualified and dynamic finance professional with vast experience in both Indian and International corporates. He has held responsible senior positions at Dubai and Bahrain.

He is member of numerous prestigious institutions worldwide.

He has trained many global professionals and helped them in reaching their career goals.

## COURSES OFFERED

- CA - FDN
- CA - FINAL
- CA - INTER
- CMA (U.S.A.)

Chanakya Academy for Management and Professional Studies Pvt. Ltd. (CHAMPS'™)

# 11-6-865/201, 2nd Floor, Mahboob Residency, Beside Pragati Offset Printers, FAPCCI Marg, Red Hills, Lakdi Ka Pul, Hyderabad - 500 004

info@champsindia.net | www.champsindia.net

TOLL FREE # 1800-419-7272

జనసాహితి ప్రచురణ

45 ఏళ్ళుగా నిరంతరాయంగా ప్రచురింపబడుతున్న

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

443

సంపుటి : 45

సంచిక : 1,2,3

ఆగస్టు - అక్టోబరు 2021

## ఈ సంచికలో...

website : www.prajaasaahithi.com


| | | | | |
|---|---|---|---|---|
| ✦ ముఖచిత్రం | : | రైతాంగ పోరాట చిత్రం | – చిత్తప్రసాద్ | .....01 |
| ✦ రెండవ అట్ట | : | ఛాంప్స్ – ప్రకటన | | .....02 |
| ✦ మూడవ అట్ట | : | ప్రతిఘటించండి! నా ప్రజలారా!! వారిని ప్రతిఘటించండి!! – ఇజ్రేలీ–అరబ్ కవయిత్రి దరీన్ టాటొర్ | | .....51 |
| ✦ నాల్గవ అట్ట | : | ధిక్కారమున్ సైతునా? చిత్రం | – ఆనంద్ | .....52 |
| ✦ సంపాదకీయం | : | మట్టి మనుషుల విజయానికి కలాల గళాల సంఘీభావం!! | | .....05 |
| ✦ కథలు | : | నియోగం | – నల్లూరి రుక్మిణి | .....07 |
| | : | విచారణ – అవధేష్ ప్రీత్ | తెలుగు అనువాదం : డా॥ ఆర్కె | .....27 |
| ✦ వ్యాసాలు | : | రచయితలకొక తూర్యనాదం | – హోవర్డ్ ఫాస్ట్ | .....12 |
| | : | కురుబ, కురుమ చారిత్రక వీరవనితలు, సాహిత్యకృషి | – డా॥ బి. నాగశేషు | .....19 |
| ✦ పుస్తక సమీక్ష | : | పోరాటమే జీవన స్ఫూర్తి 'గణిక' | – డా॥ గొట్టిముక్కల స్వర్ణలత | .....16 |
| | : | తొలి పార్లమెంటులో డా॥ చెలికాని రామారావు | – కొత్తపల్లి రవిబాబు | .....34 |
| | : | సకల ప్రజల జీవన ప్రతిబింబం 'అల్పపీడనం' | – చింతాడ తిరుమలరావు | .....39 |
| ✦ గల్పిక | : | మాకు పనులు సూపించండ్రా... | – శంకరం | .....22 |
| ✦ స్పందన | : | ఆఫ్ఘనిస్తాన్ నుండి అమెరికా నిష్క్రమణ! | – దివికుమార్ | .....25 |
| ✦ సినిమా సమీక్ష | : | దళిత ప్రతిఘటనాస్వరాన్ని వినిపిస్తున్న తమిళ సినిమా | – పి. పాండురంగవరప్రసాద్ | .....36 |
| ✦ కవితలు | : | ఓవీవీయస్ (**04**); కంచరాన భుజంగరావు (**11**); పి. మోహన్‌రావు (**40**); చందు (**42**) | | |
| ✦ పాట | : | అమ్మకానికి భారతదేశం | – డా॥ జి.వి. కృష్ణయ్య | .....23 |
| ✦ కరపత్రం | : | ఆట ముఖ్యమే కానీ ఆ ఆట వెనుక ఉన్న 'అసలు ఆట' తెలుసుకోవడం ఇంకా ముఖ్యం! | | .....41 |
| ✦ వివిధ | : | ముప్ఫై ఏళ్ళ క్రితం 'ప్రజాసాహితి' (**24**); సాహిత్య, సాంస్కృతిక సామాజికాంశాలు (**46-48**) ఉత్తరాలు (**38**); చైతన్యవాహిని (**49**); ఈ పుస్తకాలు అందాయి (**50**) | | |
| ✦ శాశ్వతనిధి | : | గోరంట్ల (కొత్తపల్లి) వాణీదేవి | | .....35 |
| ✦ సంతాపాలు | : | చిట్టిప్రోలు కృష్ణమూర్తి, కాకుమాను జయశ్రీ (**26**); గెయిల్ ఒమ్వెడ్, జలదంకి ప్రభాకర్, యెనికపాటి కరుణాకర్ (**43**); కొత్త శివమూర్తి, కత్తి మహేష్, కణుగుల వేంకటరావు (**44**); అత్తలూరి నరసింహారావు, యం.ఆర్. గోవిందరెడ్డి (**45**); కమలా భాసిన్ (**49**) | | |


**ప్రధాన సంపాదకుడు : కొత్తపల్లి రవిబాబు ఫోన్ : 9490196890** E-mail : ravibabujs@yahoo.co.in

*చందాలు పంపవలసిన చిరునామా :*

**డా॥ బి. అరుణ,** జనసాహితి ప్రధాన కార్యదర్శి

జనసాహితి కార్యాలయం : ప్రజాసాహితి

30–7–6, అనపర్తివారివీధి, అన్నదాన సమాజం రోడ్డు,

దుర్గాఅగ్రహారం, విజయవాడ – 520002.

ఫోన్ : 7075957010 prajasahithi1977@gmail.com

*రచనలు, పుస్తకాలు పంపవలసిన చిరునామా :*

**పి.ఎస్.నాగరాజు,** సంపాదకుడు, ప్రజాసాహితి

ప్లాట్ నెం. 59, రాధాకృష్ణ నగర్ కాలనీ

ఆర్మీ క్యాంటీన్ దగ్గర, డగ్లస్ స్కూల్ ఎదురు వీధి,

శ్రీకాకుళం – 532001

ఫోన్ : 9441913829 prajasahithi1977@gmail.com

ISSN 0971-278X

LCCN 94903393

కవిత

# స్టాన్ స్వామి కోసం....

– ఓవీవీయస్

ఆదివాసీలంటే
అడవిపూల రెమ్మలనీ,
చిగురుటాకుల హరితమని
సెలయేళ్ళ జీవమని అన్నావు
కిందిరి మేఘాల సయ్యాటలలోంచి
తొంగిచూసే సూర్యరశ్మంతా
కొండపాటల గాలుల సత్తువలో
ఒదిగి సాగే బతుకంతా
వాళ్ళదేనన్నావు
వారికేనన్నావు
కొండలలో కొండలై నిలిచి
గెడ్డలలో గెడ్డలై పారే
వాళ్ళవైన స్వేచ్ఛాజీవితాలు
వాళ్ళకు దక్కాలని నీ ఆశ
ప్రజలకు అవసరమైనంత
ప్రజలకొరకే తీసుకోవాలిగాని
మీ లాభాలు మేటలు వేయడానికి
అడవిని కొల్లగొట్టడమేమిటి?....
జలపాతాలను జైళ్ళల్లో నింపడమేమిటని
అడవి బిడ్డల్లో విచ్చుకుంటున్న నీ ప్రశ్నల చూపు
ఎడారి దాహానికి ఆటంకంగా నిలిచింది
రాజ్యాన్ని వణికించింది
కాషాయం పొదల్లో నక్కి కూర్చున్న
పెట్టుబడి పులికళ్ళు ఎరుపెక్కాయి
కంప్యూటర్ల అబద్దాల వైరస్‌లు
కేసుల సాలెగూళ్ళై అల్లుకున్నాయి
ముదిమి దేహం చుట్టూ
నిర్బంధపు జైళ్ళు మొలుచుకొచ్చాయి
మానవీయ ఆలోచనను ఏమీ చేయలేక
మానవదేహాన్ని అంతం చేశాయి
అడవిపూలు విప్పారాలనే నీ ఆకాంక్ష ముందు
దోపిడి అమానవీయమనే నీ ఆలోచన ముందు
వసంతాన్ని కాల్చుకు తినాలనే దోపిడీ తంత్రాలు
రాజ్యం ప్రయోగిస్తున్న మారణ యంత్రాలు
మరుగుజ్జులై ఓడిపోతున్నాయి
పిరికిపందలై పారిపోతున్నాయి

✦


'ప్రజాసాహితి'
కెనరాబ్యాంకు అకౌంటు వివరాలు
"అకౌంట్ నెం.
**0680101004936**
IFSC No. CNRB0000680
ఫోన్ : 94901 96890

| | |
|---|---|
| వ్యక్తులకు సం॥ చందా | రు. 300-00 |
| ఐదేళ్లకు చందా | రు. 1300-00 |
| సంస్థలకు సం॥ చందా | రు. 500-00 |

**చందాలు, విరాళాలు**
మనియార్డరు, డి.డి.ల. ద్వారా పంపండి.
చిరునామా స్పష్టంగా తెలియ జేయాలి.
డి.డి.లపై 'ప్రజాసాహితి, విజయవాడ' అని రాయండి

**ప్రజాసాహితి ప్రకటనల ధరలు**
1/4 డెమ్మీ పరిమాణం

| | |
|---|---|
| రెండవ, మూడవ అట్ట మల్టీకలర్ | రు. 20,000 |
| లోపలి పూర్తి పేజి | రు. 15,000 |
| లోపలి అరపేజి | రు. 7,000 |

ప్రజాసాహితి పాఠకులు, అభిమానులు తమతమ ప్రాంతాల నుండి (దేవుళ్ళు, సినిమాలు, వైన్‌షాపులు లాంటివి తప్ప) ప్రకటనలు సేకరించి పంపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం


## చందాదారులకు విజ్ఞప్తి

1. మీ చిరునామా పైన మీ చందా ప్రారంభమైన నెల, సంవత్సరం - చందా పూర్తయ్యే నెల, సంవత్సరం వివరాలు మీ పేరు పైన వుంటాయి. దాని ప్రకారం చందా పూర్తికాకమునుపే, చందా పంపిస్తే, పత్రిక ఆగకుండా మీకు చేరుతుంది.
2. ప్రతినెల పత్రిక మొదటివారంలో పోస్టు చేస్తున్నాం. 10వ తేదీ లోపు మీకు పత్రిక రాకపోతే పోస్టుమాన్‌ని వాకబు చేయండి. కార్యాలయానికి ఫోన్‌చేసి తెలియచేయండి.
3. చందా పూర్తయి కొన్ని సంవత్సరాలు దాటినా కొందరికి పత్రిక పంపిస్తున్నాము. ఇకముందు చందా పూర్తికాగానే, ఆపై నెల వచ్చే సంచిక నుండీ ఆపేస్తాము.
4. మీ మిత్రుల చేత, సన్నిహితుల చేత 'ప్రజాసాహితి'కి చందాలు విరాళాలు సేకరించండి.

– సంపాదకవర్గం

# సంపాదకీయం

# మట్టి మనుషుల విజయానికి కలాల గళాల సంఘీభావం!!

"పిడికెడు మట్టిలో
గరిసెడు గ్రామాలతడు
పట్టెడు సారంలో
పుట్టెడు పట్టణాలతడు
నాగలి భుజానికెత్తుకుని
నడుస్తున్న భూగోళమతడు ఆకర్షణల అద్భుతమతడు
వికర్షణల విస్ఫోటనమతడు
అమృత సారమూ అతడే! అగ్నిశిల్పము అతడే!!"

\- భాయరాజ్

అలాంటి మట్టి మనుషులను పార్లమెంటరీ చట్టసభల మూక బలంతో పుట్టెడు దుఃఖానికి గురి చేసిన మోడీ ప్రభుత్వం, గత పది నెలలుగా అగ్గి మంటలులా ఎగసిపడుతున్న రైతుజనావళి ఆగ్రహాన్ని దేశ రాజధాని నడివీధుల్లో చవిచూస్తోంది. విసిగి వేసారి తమ గ్రామాలకు తరలిపోతారులే అని పాలకులు పెట్టుకున్న ఆశ 300వ రోజు గడిచినా అడియాసగా రుజువయింది. పంజాబు హర్యానా ఉత్తరప్రదేశ్‌లకే పరిమితమైన ఆందోళన అని తమ అబద్ధాల ఫ్యాక్టరీ ద్వారా ఎంత ప్రచారం గావించినా, నిన్న (27 సెప్టెంబర్) జరిగిన దేశవ్యాప్త బంద్, రైతాంగానికి అశేష విశాల ప్రజారాసులు అందించిన విశేష సంఘీభావం విస్ఫోటనంలా వ్యక్తమయింది.

ఇతర ఏ వర్గాల ప్రజాందోళనకు అందని మహత్తర సంఘీభావం రైతాంగ పోరాటానికి ఎందుకు లభించినట్లు?

రైతు మన జాతి జీవనాడి కనుక!

వ్యవసాయం తరతరాల మన జీవన సంస్కృతి కనుక!!

భూ సంబంధాల చుట్టూ భారత సామాజిక జీవనం కేంద్రీకృతమై ఉన్నది కనుక!

"కలకంఠి కంట కన్నీరొలికితే గరళమయిపోవు అమృతమే!" అన్నట్టు, రైతుల ఉసురుతీసే పరిపాలకుల అహంకారం నైతిక బలహీనతతో ఏనాటికైనా పతనం కాక తప్పదు!

అబద్ధాలను అందంగా అల్లటంలో అందెవేసిన చేతులు, ఆత్మవంచన మీద బతకడానికి అలవాటుపడతాయి!. అందులో భాగమే ప్రపంచ ప్రజాస్వామ్యానికే భారతదేశం తల్లి లాంటిదని అమెరికాలో వారి అధ్యక్షుని ముందు నేతిబీరలో నెయ్యినంతా ఒలికించిన నరేంద్ర మోడీ, భారతదేశం తిరిగి రాగానే కళ్ళముందు రైతాంగపు దేశ వ్యాపిత బందు ఎదురైనా చూడనట్లే నటించగలిగాడు.

సరిగ్గా సంవత్సరం క్రితం కనీసపాటి చర్చకు, సెలెక్ట్ కమిటీ పరిశీలనకు కూడా పంపకుండా పార్లమెంటులో అడ్డగోలుగా ఆమోదింప చేసుకున్న రైతాంగ వ్యతిరేక 3 క్రూర వ్యవసాయక చట్టాలను, రద్దుచేసి తీరాల్సిందేనంటూ అనేక రాష్ట్రాలలో వివిధ రంగాల సాధారణ జీవనాన్ని రైతాంగ సంఘీభావ ఉద్యమం శాంతియుతంగా స్తంభింపజేసింది.

ఒకరోజు దేశవ్యాపిత బందు చేయమని 40 రైతుసంఘాల 'సంయుక్త కిసాన్ మోర్చా' ఇచ్చిన పిలుపుని అన్ని వర్గాల ప్రజలు తమదిగా స్వీకరించి ఒక్కటే గొంతుకయి నినదించారు. కార్మికుల హక్కులను హరించే నాలుగు రకాల కోడ్లను కూడా ఉపసంహరించుకుని గడచిన 100 ఏళ్లలో సాధించుకున్న కార్మిక హక్కులన్నిటినీ పునరుద్ధరించాలని కూడా ఉద్యమకారులు కోరుతున్నారు. నవరత్న పరిశ్రమలలో ఒకటిగా పేరు గాంచిన విశాఖ ఉక్కు లాంటివాటిని కార్పొరేట్ బందిపోట్లకు కారుచౌకగా కట్టబెట్టే విధానాలకు వ్యతిరేకంగా కూడా ఈ ఆందోళన సాగింది.

ఇప్పటికి 11 సార్లు రైతాంగ ఉద్యమకారులతో చర్చల తంతు నిర్వహించి కూడా నల్ల చట్టాలను వెనుకకు తీసుకునే హామీని మాత్రం ఇవ్వడానికి పాలకులు సిద్ధంగా లేరు. బీజేపీ పాలకుల హామీలన్నీ వేరే పక్షాన ఉన్నాయి. ఆ పక్షం సామ్రాజ్యవాద బహుళజాతులతోను భారతీయ బడా కార్పొరేట్ల స్వార్థ ప్రయోజనాలతోనూ కూడి ఉన్నది. భాజపావారు ఎన్నికల గెలుపు కోసం దోపిడి ముఠాలకు ఇచ్చిన హామీలు లేక అమలుపరిచే బాధ్యతగా తాము స్వీకరించిన హామీలు, చాలామంది భ్రమ పడుతున్నట్లు అవి ఈనాటివి కావు. 30 సంవత్సరాల క్రితపువి. స్వయంగా ప్రధాని మోడీనే ఒకానొక సందర్భంలో ఆ మాట ప్రకటించి ఉన్నాడు. అయితే ఆ మాట చెప్పేనాటికే మూడు వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకోవాలని రైతాంగ ఉద్యమకారులు ఢిల్లీ మహానగరాన్ని చుట్టుముట్టి మూడు వారాలు దాటిపోయింది. దాని విషయం ఆయన మాటల్లోనే తెలుసుకుందాం.

సరిగ్గా 9 నెలల క్రితం మధ్యప్రదేశ్‌లో జరిగే ఒక రైతు సదస్సుని ఉద్దేశించి, 2020 డిసెంబరు 18న, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నరేంద్ర మోడీ ఇలా చెప్పారు.

"పాతిక ముప్పై సంవత్సరాల క్రితం చేయవలసిన పనులను మేము ఇప్పుడు చేయవలసి వస్తోంది. రైతుల కోసం తీసుకొచ్చిన కొత్త చట్టాలు, సంస్కరణలు రాత్రికి రాత్రే రాలేదు. ఈ దేశంలోని ప్రతి కేంద్రప్రభుత్వం గత 20-22 సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వాలతో వీటిపై విస్తృత చర్చలు జరిపింది"

డంకెల్ ప్రతిపాదనలు పేరుతో 1991లో భారత ప్రభుత్వం ప్రపంచ బ్యాంకుతో చేసుకున్న ఒప్పందాలు ఆనాటి పత్రికలలో వెలువడుతూ ఉండేవి. వాటిని జనసాహితి కళాబృందం 1991 నుండి ప్రదర్శించిన అప్పుల భారతం, నాటకంలో అమెరికా అధ్యక్షుడు జార్జి బుష్ పాత్రధారి భారత ప్రధాని అయిన పరమ వీర నారసింహ

మహారాజ్ పాత్ర నడుమ షరతులతో కూడిన ఒప్పందంగా నాటక ప్రదర్శన ద్వారా ప్రేక్షకులకు తెలిసేటట్లు ఆనాడే చేశారు. ఆ షరతులు క్లుప్తంగా చూద్దాం!

1. రైతులకు ఇచ్చే రుణాల మీద ఎరువుల మీద సబ్సిడీలు రద్దు చేయాలి.
2. భారతదేశంలో దొరికే ముడిసరుకులు పండే ఆహారధాన్యాలు, రొయ్యలు, చేపలు వారి దేశానికి తక్కువ ధరలకు ఎగుమతి చేయాలట! వారి దేశంలో తయారయ్యే యంత్రములు యంత్ర పరికరాలు ఎలక్ట్రానిక్స్ కంప్యూటర్లు మొదలైనవన్నీ వారు చెప్పిన ధరకే మనం దిగుమతి చేసుకోవాలి.
3. మన రైతులు తమ విత్తనాల్ని ఇతరులకు అమ్మరాదు. అన్ని రకాల విత్తనాలపై పేటెంట్ హక్కులన్నీ దొరవారికే దఖలు పరుస్తూ శాసనం చేయాలట! పసుపు, అల్లం లాంటి వాటిపై పేటెంట్ హక్కులు కూడా వారి వేనట!
4. మన ప్రభుత్వరంగ సంస్థలలో బాగా లాభాలు వచ్చే వాటినన్నిటిని అమెరికా వారి అనుచరులకే కాంట్రాక్టుకు ఇచ్చి వేయాలట!
5. డాలర్‌తో రూపాయి మారకం విలువ తగ్గిస్తూ ఉండాలట!

గడిచిన 30 ఏళ్లుగా ప్రపంచబ్యాంకు విధించిన పై షరతుల ప్రకారం భారత ఆర్థికవిధానం సాగుతూ ఉన్న దుష్ఫలితాల కొనసాగింపే వ్యవసాయ రంగాన్ని ఈనాడు పూర్తిగా కార్పొరేటీకరించడం!

అయితే కాంగ్రెసు తదితర పార్టీలకు పై హామీలను అమలు పరచటానికి ఉన్న జంకు బిజెపివారికి ఎంతమాత్రం లేదని మనం అర్థం చేసుకోవాలి. మోడీ గుజరాత్‌కు ముఖ్యమంత్రిగా పనిచేస్తున్న కాలంలో 2002లో గోద్రా సంఘటనను అడ్డంపెట్టుకుని ముస్లిములను ఊచకోత కోయించడంలో ఎంత నిర్లక్ష్యంగా ప్రవర్తించగలిగాడో, అంతే కఠినంగా ప్రపంచబ్యాంకు ఆదేశాలను తాము అమలు పరచగలమని రుజువు చేసుకోవడానికి భాజపా పాలకులు చాలా ఉవ్విళ్ళూరుతున్నారు.

1991లో ఐఎంఎఫ్ వరల్డ్ బ్యాంకు భారత పాలకులకు విధించిన షరతుల ప్రకారం అలాంటి చర్యలు ఏదో ఒక రోజుకి ఎవరో ఒకరు అమలు పరిచక తప్పని స్థితి రావలసే ఉంది. ఒకరకంగా తమ ప్రపంచ యజమానుల ముందు భారత పాలకులు రుజువు పంచుకోవాల్సిన నిర్దాక్షిణ్య సమర్థతకు అది ఒక పరీక్ష. అయితే ప్రజల నిరసనను ప్రతిఘటనను, చిట్టచివరికి రాజకీయంగా ఏకాకులు అవటానికి సిద్ధపడవలసిన సిగ్గులేని చర్యగా అది మిగిలిపోక తప్పదు. చట్టబద్ధంగా దేశ రాజ్యాంగంలో పొందుపరిచిన కనీసపాటి కార్మిక హక్కులు, పౌర స్వేచ్ఛలు, ప్రజానుకూల ఆదేశిక సూత్రాలు మొదలైన వాటినన్నిటినీ ఆచరణలో ప్రజలకు పనికిరానివిగా మార్చివేసే కళను నిర్దాక్షిణ్యంగా భాజపాలకులు గడిచిన ఏడు సంవత్సరాలుగా అమలుపరుస్తున్నారు. ప్రభుత్వరంగ సంస్థల ఆస్తులన్నింటినీ కారుచౌకగా తమ ట్రిలియనీర్ (కనీసం లక్ష కోట్ల రూపాయల సంపద కలిగిన) మిత్రులకు కట్టబెట్టే పథకాలన్నీ అద్భుతమైన అభివృద్ధి నమూనాలుగా ప్రచారం కావిస్తున్నారు.

మతోన్మాద రాజకీయాలను అడ్డం పెట్టుకుని తమ కార్పొరేట్ అనుకూల విధానాలను ప్రజల చేత దిగమింగించాలని అనేక విధాలుగా ప్రయత్నిస్తున్నారు. అయితే వారి మతతత్వ రాజకీయాలు రైతాంగ ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేయాలనే కుట్రలో భాగంగా సాగుతున్నవని పశ్చిమ ఉత్తరప్రదేశ్ ప్రాంత రైతాంగానికి అర్థమైంది. 2017 ఎన్నికలలో ముజఫర్‌నగర్ ప్రాంతంలో హిందూ ముస్లిం కలహాలను పెంచి తరతరాలుగా వారి నడుమ నెలకొని ఉన్న ఐక్యతను తుంచిన సంఘ పరివార్ కుట్రలు అర్థంచేసుకున్న రైతాంగం నేడు మతాలకు అతీతంగా చేయిచేయి కలిపి పోరాట రంగంలో నిలబడటం ఈ పది నెలల్లో వారు సాధించిన గొప్ప విజయం. ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యల ప్రాతిపదికపైన సాధించే ఐక్యత మతోన్మాదుల కుట్రలను ఓడించగలదని అనుభవపూర్వకంగా దేశానికి గొప్ప గుణపాఠాన్ని అందించిన చరిత్ర కూడా నేటి రైతాంగ ఉద్యమానికి ఉంది.

దేశానికి అత్యంత కీలకమైన అత్యధికులకు ఉపాధి చూపించే వ్యవసాయ రంగాన్ని విదేశీ కార్పొరేట్ శక్తులకు వారి స్వదేశీ దళారులకు కట్టబెట్టాలని చూస్తున్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జరిగినదే నేటి బందు.

గడిచిన 30 ఏళ్లలో అప్పులపాలైన సుమారు 4 లక్షల మంది రైతాంగపు ఉసురు తీసుకున్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణను నేపథ్యంలో ఉంచుకుని నేటి రైతాంగవ్యతిరేక మూడు వ్యవసాయక నల్లచట్టాలను ఉపసంహరించుకోవాలని సాగిన మరో స్వచ్ఛంద శాంతియుత బంద్ ఇది. ఇప్పటికిది మూడో విడతగా సాగింది. అధికారంలో ఉన్న అనేక రాష్ట్ర ప్రభుత్వాలు, అధికార అనధికార పార్టీలు కూడా ఈ బంద్‌కు మద్దతు ఇచ్చాయి. బెంగాల్ లాంటి కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు బంద్‌కు మద్దతు ఇవ్వకపోయినా రైతాంగ న్యాయమైన డిమాండ్లకు తమ మద్దతు అందించాయి. ఆ విధంగా దాదాపుగా దేశమంతా ఒక్క బీజేపీ పార్టీ మినహా, మిగిలిన రాజకీయ పార్టీలు, వివిధ ట్రేడ్ యూనియన్లు, పౌర, విద్యార్థి, యువజన ప్రజాసంఘాలు, రచయితలు, కళాకారులు అలా సమస్త ప్రజానీకం ఈ బంద్ పక్షాన నిలబడటం ఆధునిక చరిత్రలో ఒక మహత్తర సంఘటనగా నిలిచిపోనుంది. వంద సంవత్సరాలక్రితం 1921లో బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా భారత జాతీయోద్యమం, ఇంకా వివిధ రైతు ఆదివాసీ ప్రజల పోరాటాలు సాగినట్లుగానే నేటికి మరొక రూపంలో అశేష ప్రజానీకం కార్పొరేట్ అనుకూల నిరంకుశ కేంద్ర పాలకుల విధానాలకు వ్యతిరేకంగా సాగించిన ఈ పోరాటం మరింత సంఘటితంగా సాగి మరిన్ని విజయాలను సాధించాలని ఆశిద్దాం! ఆహ్వానిద్దాం!!

రచయితలు కళాకారులుగా ప్రజా ఉద్యమాలను స్వాగతిద్దాం!!! అంతిమంగా సామ్రాజ్యవాద ప్రపంచీకరణాన్ని మట్టి కరిపిద్దాం! మట్టి మనుషుల మహా విజయాన్ని చరిత్ర నొసటిపై లిఖించే రోజు వచ్చి తీరుతుందని ప్రకటిద్దాం!!

***మదిలో నీ విషపు గోళ్లు దిగవు***
***అమ్మ ఒడిలో కసాయి వేళ్ళు వొదగవు***
***అణువుతో కాదు అన్నపు మెతుకులతో***
***అడుగులేస్తున్న నిశ్శబ్దపు యుద్ధ వ్యూహం బద్దలయింది!!***

28-9-2021

కథ

# నియోగం

– నల్లూరి రుక్మిణి

**ఈ** లోకం పైకి కనబడని సంకెళ్ళతో స్త్రీలను ఎంతలా బిగిస్తోందీ?

ఆశ్చర్యమూ, విచారమూతో కూడిన ఆలోచన కుంతీదేవిని కలవరపరుస్తోంది. ఆడవాళ్ళు స్వతంత్రించడం ఈ క్షత్రియపుత్రులు సహించలేరు. అందునా రాజ్యపాలకులకు అసలు నచ్చదెందుకో! అనూచానంగా వస్తున్నదేకదా తాను అనుసరించిందీ? ఈనాటికి అది ఎందుకు కంటగింపైందీ? నా అత్తనాటికీ, నా నాటికీ ఎంత అగాధం?... ప్రవాహసదృశమైన కాలం ఎంత ఉత్థాన పతనాల నెదుర్కొంటోంది.

కృష్ణుడెంత నిర్దయుడూ?... మనసులో మారుమూలకు నెట్టబడి మరుపుపొరల్లో దాగిన వాటిని బలిమిన వెలికితీసి!... ఏం! సంతోషం?. మనసు మూగగా రోదించింది.

సూర్యుడు పశ్చిమాద్రిలో నిద్ర కుపక్ర మించబోతున్నాడు.

వినీలాకాశం తన నిశీధి తెరలు దించుతూ జీవ ప్రపంచానికి విశ్రాంతి నివ్వడానికి సమాయత్తమవుతోంది. కను చీకట్ల గోచరంతో పక్షులు కిలకిలారావాలను ముగించి గూటిని వెతుక్కుంటూ బారులు తీరి ఆకాశవీధిలో వేగంగాపోతున్నాయి.

ఆ ప్రశాంత నిశ్శబ్దంలో గంగానదీ జలాల జలజలలు సహితం కుంతీదేవికి కల్లోల తరంగాలుగా మారాయి.

మరోసారి, 'కృష్ణుడెంత నిర్దయుడూ'!– తలచుకుంది. అష్టపదులు దాటి అంతిమ సమయానికి దగ్గరయిన ఈ వయస్సులో ఈ పరీక్షేమిటీ?

"ఇది పరీక్షే కావచ్చు! కానీ తప్పదు అత్తా!" – మేనల్లుడి మాటలు మృదువుగా అనిపిస్తున్నా, అవి ములుకుల్లాగే వున్నాయి. "ఎవరైనా, ఏనాడైనా తాము నిర్వహించిన చర్యకు ఫలితాన్ని స్వీకరించక తప్పదు అత్తా!"....

మేనల్లుడివి మామూలు మాటలే కావచ్చు – కానీ అవి ఆజ్ఞలవంటివే, కలవక తప్పదు... కానీ ఏ మొహం పెట్టుకునీ?..... వాడిపట్ల నేనేం నిర్వహించాననీ?....రాచరికానికి నీతి, న్యాయం వుండవుకదా!... ఆమెకు సిగ్గుగా అనిపిస్తోంది. ఈ ఆలోచనలతో కుంతీదేవి మనస్సు ద్వైదీభావంతో కొట్టుకులాడుతోంది. 'రాధేయుడు'గా పెరుగుతున్నాడని తనకు తెలియదా? తానీ ఇంద్రప్రస్థావతికి వచ్చినపుడే– రహస్యంగా తమ పాత దాసీది కలిసి– చెప్పింది కదా!– అప్పుడుకూడా బిడ్డ ఎలా వున్నాడన్న ఆసక్తితో, ఏదో మిషతోనైనా తనకు ఒక్కసారి చూపించమని చెప్పగలిగిందా? మమకారపు బంధనాలను తానే బలవంతంగా తెంచుకుంది.

అవును!... రాచరికపు 'పరువు' తననూ బంధించింది... జీవితమంతా ఈ రాచరికం దించరాని బరువును భుజాలమీద మోపి కృంగదీసింది. అందుకోసం బతుకంతా ఎదురుదెబ్బలే తప్ప పొందిందేమిటీ?... భోజరాజు కూతురిగా ఆ బాల్యంలో ఏం సుఖపడిందో!,– మిగిలిన ఈ ఏడు పదుల జీవితంలో అన్నీ అడ్డంకులే, అంతా కల్లోలమే!.

అయినా ఈ కృష్ణుడు వేటినీ వదలడుగదా! ఏ జ్ఞాపకాలు తనను కల్లోలపరుస్తాయని అట్టడుగు పొరల్లోకి నెట్టివేసిందో.. వాటినే పైకి లాగి ఎదురుగా నిలబెట్టి, తేల్చుకోమంటున్నాడు.

ఏడుపదుల వెనక్కు వెళ్ళమంటున్నాడు. తప్పదు.... పరాభవం మరోసారి నెత్తిన వేసుకోక తప్పదు. తల్లితనం కూడా రాచరికపు వస్తువే అయింది. ఎంత దురదృష్టం!

గతం ముందుకు వచ్చి ప్రశ్నిస్తూ నిలబడింది.

అవి తెలిసీ తెలియని తొలి యవ్వనపు వికసనాలు, ప్రతిదీ ఆసక్తే, కుతూహలమే. చిరుగాలి సవ్వడికూడా మైమరపు గిలిగింతలే!. అది మధుమాసం. తోటంతా సువాసన భరితమైన సంపెంగ, పారిజాతం, మరువం, ఫలపుష్పాలే. చెలులతో కలసి వాటిని ఆస్వాదిస్తూ రాచనగరు దాటి బయట వనాలలోకి తెలియకుండానే వెళ్ళిపోయింది. ఒక్కొక్క పొదనూ పలకరిస్తూ తెలియని ఉన్మత్తతతో వనమంతా కలియతిరుగుతూ స్వప్నాలలో తేలియాడుతుండగా....

ఆ చల్లని సాయంసంధ్య వనంలో దేదీప్యమైన వెలుగులు విరజిమ్ముతుండగా– తననే తదేకంగా చూస్తున్న ఓ సమ్మోహన రూపసి, ఎట్టఎదుట ప్రత్యక్షమైంది. అదే ఆమెకు పరపురుషుని తొలి దర్శనం. 'అయినా తాను భయపడి పరిగెత్తి పోయింది లేదు. భయం తనకు కొత్త పదం. అలాగే నిల్చుండిపోయింది.'

ఇరువురూ బాహ్య స్మరణ లేని ప్రతిమలయ్యారు.

అతనే ముందుగా తేరుకున్నాడు. "పృధాదేవీ"..... అంటూ నెమ్మదిగా, ఆశ్చర్యంతో నిండిన పిలుపు.

'ఇతనేమిటీ ఇంత చొరవగా ఏదో పేరు పెట్టి పిలుస్తున్నాడూ!' మౌనంగా, సూటిగా అతన్నే చూస్తోంది.

"నీ పేరు తెలియదు – అయినా నిన్ను చూసాక ఆ పేరే నీకు తగినదనిపించింది. నిండుగా సమస్త లోకాన్ని భరించే పృథివికి మరో రూపంగా గంభీరమైన నీ విగ్రహం, విశాలమైన నీ ఫాలభాగం, నీ భువన మోహన సౌందర్యం – నన్ను అలా పిలవడానికి ప్రేరేపించాయి కుంతల మహారాణీ.! నేను ఇంతవరకు మన గణాలలో ఈ అందాన్ని చూడలేదు పృథా! శ్రద్ధగా తీర్చి చెక్కిన శిల్పకారుడి సృష్టిలా వున్నావు."

ఆమెను చూస్తూ అతనేమిటేమిటో మాట్లాడుతున్నాడు. అవన్నీ ఆమె చెవికి ఎక్కడంలేదు; చూపులు మరల్చాలని తోచలేదు. అతను తనకు దూరపువాడిలా అనిపించలేదు; పచ్చని పసిమిరంగు కాంతులీనుతూ ఆజానుబాహూ – భుజానికి విల్లంబు, వీపున అంబులపొది, చేతిలో బాణాలతో ఎట్టఎదుట చిరునవ్వుతో....

ఇంతలో తనతో వచ్చిన దాసీలు ఆమెను సమీపించి – "అమ్మా!, కుంతీదేవీ!.. విహారానికి వచ్చిన సమయం మించిపోయిందమ్మా!, రాచ నగరకు తిరిగి పోదాం దేవీ!"– జ్ఞాపకం చేశారు.

అప్పటికి మామూలు స్థితికి వచ్చిన కుంతీదేవి చెలులతో కలసి మరలిపోవడాని కుద్యుక్తురాలయింది.

"దేవీ! మీరు కుంతి భోజరాజు పుత్రికలా!– మేం ఈ పొరుగునే వున్న సూర్యగణానికి చెందినవారం' – నా పేరు ఉదయుడు, వేట కోసం ఇలా వచ్చాను. మీ పాదస్పర్శతో పులకించిన ఈ నేలను విడిచి తిరిగిపోవాలని లేదు. నా జన్మ ధన్యమైంది. తిరిగి తమ దర్శనం కోసం ఈ చుట్టుపక్కలే తిరుగాడుతుంటాను."

కుంతీదేవికి అతని మాటలు లోలోపల పులకింతలు రేపాయి. అయినా చెలులతో కలసి నెమ్మదిగా ఆ వనాల నుండి రాచనగరు వైపు దారి తీసింది.

"అమ్మా! వారు మన గణానికి చెందిన వారు కారమ్మా"

"ఆ మాట అతనే చెప్పాడుకదా! అయితే నేమిటి చెలీ! అతనెంత వున్నతంగా వున్నాడూ– మనలను ఒక్క మాట మీరి మాట్లాడలేదు కదా!"–

"నిజమే దేవీ! కానీ ఇతర గణాల పురుషులతో పరిచయాన్ని మన గణపెద్దలు ఒప్పరు కదా"...

అప్పటికిక మౌనంగా తను సౌధానికి చేరింది. కానీ అతని రూపం, మాటలు ఆమెను వీడలేదు. కాలం ఆమె ఆలోచనల్ని తుడిచివేయ లేకపోయింది.

ఓ రోజు మెల్లిగా చెలులను ఏమార్చి తన సౌధం వెనకనున్న తోటలో నుండి బయలుదేరి విశాల వనాలలోకి కదిలింది. అతనిని మొదటిసారి చూసిన ప్రదేశం వైపు దారితీసింది.

నిజంగానే అతను చెప్పినట్టుగా అక్కడే శిలాతల్పంమీద ఎదురుచూస్తున్నట్టే కూర్చున్నాడు. ఆమె ఆశ్చర్యంగా అతన్నే చూసింది.

కుంతి రాకను గమనించి ఉదయుడు ఎదురేగి నిశ్శబ్దంగా ఆమెను అనుసరించాడు.

ఇరువురూ మౌనంగా ఎంతో సమయం అలా వుండిపోయారు. ఉదయుడే ముందుగా తేరుకుంటూ, "దేవీ! అప్పటి నుండి ప్రతి దినం మీ రాక కోసం ఈ ప్రదేశానికి వచ్చి, సూర్యాస్తమయం వరకు వుండి, నిరాశగా తిరిగిపోతున్నాను. ఈ రోజు నిజంగానే ధన్యుడను."

ఆ మాటకు జవాబివ్వలేదు... "మీరు, మా గణానికి చెందినవారు కాదు – కదా!"– ఎప్పటికో ఆమె పెగుల్చుకుంటూ తన సందేహాన్ని అతని ముందుంచింది.

"అవును – ఇన్నాళ్ళుగా ఆ ఆలోచనే నన్ను నిలవనీయడం లేదు, పృథాదేవీ – ఈ కట్టుబాట్లు వెనక లేవు. కొత్త కొత్త నియమాలు ఎవరికోసం, ఎందుకోసం చేస్తున్నారో తెలియడం లేదు" – విచారంగా అన్నాడు అతను.

ఆ మాటతో ఇద్దరి మధ్యా తిరిగి మాటలు కరువయ్యాయి. కుంతీదేవి మనస్సు కల్లోలమైంది. తానిలా రావడం తన తండ్రికి ఇష్టం వుండదని ఆమె మనస్సు చెప్తోంది. అయినా చలనం లేనట్లు అలాగే వుండిపోయింది. అప్పుడొకటీ, ఇప్పుడొకటీ చిన్న చిన్న మాటలేవో జరిగిపోతూ వున్నాయి. ఒకరిని వీడి ఒకరు వెళ్ళాలనిపించక అలాగే వున్నారు.

చివరకు పడమట వెలుతురు తగ్గుముఖం పట్టడంతో, నగరుకు తిరిగి వెళ్ళడానికి అడుగులు ముందుకు వేసింది. ఆమెతో పాటు అతనూ వనాల చివరిదాకా వచ్చి, కుంతీదేవి నగరులో ప్రవేశించాక వెనుదిరిగాడు.

ఆమె సౌధానికి చేరి తోటలోకి అడుగు పెట్టీపెట్టగానే చెలులు ఆతృతగా ఎదురువచ్చారు.

"అమ్మా! మీరింకా పిన్నవయస్కులు, స్వతంత్రించడం మంచిదికాదు. అయినా గణనియమాలను దాటటం గణ పెద్దలు సహించరమ్మా! ఎందుకు ప్రమాదాన్ని కొని తెచ్చుకుంటారూ? ఇంతటితో దీనిని ముగించడం మంచిదమ్మా!,..." భయపడుతూ హెచ్చరించారు. ఏది ఎటుపోయినా ప్రమాదం తమకే ననేది వారి ఆందోళన.

కుంతీదేవి మౌనంగా వుండిపోయింది.

★ ★ ★

ఎన్నోయేళ్ళుగా ఈ లోలోపలి జ్ఞాపకాలు మరుగున పడిపోయాయనుకుంది. కాని అవి ఎప్పటికీ మరుపురానివే అయ్యాయి.

తొలి విరిసీ విరియని మధురిమలు – నూతన కౌతుకం. పైగా తనంతట తానుగా ఇష్టపడి ఏర్పరుచుకున్న బంధం; అదో స్వప్నం. కాని ఆ స్వప్నం విరిగి తుళ్ళిపోనే పోయింది. దాదాపు తాను ఇంతకాలం అది గుర్తుకు లేనట్టుగానే వుండిపోయింది.' నిజంగానే తాను ఉదయుడిని మర్చిపోయిందా?.. మర్చిపోవా లనుకుంది, అంతే! – కానీ అంతా వట్టిదే అయిపోయింది. వివాహానికి ముందు మనస్సును కట్టడి చేసుకోవడానికే కృతనిశ్చయురాలైంది. రాచబిడ్డగా తండ్రి ఆజ్ఞలను ఔదల దాల్చింది.

అయితే పాండువునితో వివాహమయి హస్తినావతికి వచ్చాకనే మానిన గాయం తిరిగి సలపరించినట్లయింది. పాండువు ప్రతి రాత్రీ తనను హింసపెట్టీ.... అతను హింసపడీ.... నిర్వీర్యుడుగా మిగిలిపోయిన ప్రతిక్షణం తానెంత శిక్షను అనుభవించిందీ? అప్పుడే ఉదయునితో తన అనుబంధం మనసులోకి వచ్చేది. అతని కలయికలోని మధురానుభూతి మనసును అగ్నిలా దహించేది. అతని జ్ఞాపకాలు కాల్చివేస్తుండగా ఆమెకు తానెందుకు ఉదయుడిని వదులుకుందీ? అన్న ప్రశ్నలు నిత్యమూ తొలిచేవి.

ఆ కాలమంతా రాజ్యం... గణం, గౌరవ ప్రతిష్టలు తనకూ సంకెళ్ళు వేసాయి. 'ఉదయుడు మన 'గణం' కాదమ్మా!', అంటూనే తండ్రి తనను కట్టడి చేశాడు. దీనికితోడు అప్పటికే ఏర్పడ్డ కొత్త నీతి నిబంధనాలు స్త్రీలకు బంధనాలయ్యాయి.

"నీ వివాహం నీకు మాత్రమే చెందింది కాదు కుంతలదేవీ! ఇది రాజ్యానికి సంబంధించినది. మన వివాహ బంధాలు – రాజ్య రక్షణకోసం కొత్త బలగాన్ని, భాగ్యాన్ని చేకూర్చేవిగా వుండాలి.. గణపెద్దల, తల్లితండ్రుల అనుజ్ఞ లేకుండా నీ వివాహం ఎవరికీ సమ్మతం కాదు కుంతీ!"– "స్త్రీలు ఎల్లవేళలా అటు తండ్రో, భర్తో, ఇటు బిడ్డల సంరక్షణలో వుండాలి తప్ప– స్వతంత్రించడం ఎంత తప్పూ!"–

"ఈ నియమ నిబంధనలన్నీ మనం ఏర్పరుచుకున్నవేగా పితామహా! శకుంతల ఇష్టపడి దుష్యంతులవారిని గ్రహించింది కాదా? ఆమెకు అనుమతి ఎవరిచ్చారనీ!"

"ఆనాటికి ఈ ప్రజ ఇంతగా కట్టుతప్పి లేరు కుంతీ! అప్పటికింకా దేవలోకంతోనూ, గంధర్వులతోనూ సంబంధ బాంధవ్యాలు వుండేవి. మానవుల్లో కాలానుగుణంగా వచ్చిన మార్పుల వల్ల ఆ లోకంతో సంబంధాలు

తెగిపోయాయి. దానితో మనం కొన్ని నియమాలు ఏర్పరచుకోవాల్సి వచ్చింది.

మేనక తన లోకానికి వెళ్ళిపోయింది. తిరిగి ఇంద్రుడి కొలువులో చేరిపోయింది. బిడ్డను పెంచింది కణ్వుడేకదా!.. ఇటువంటివన్నీ జరిగాకే – గణాలు తమలో తాము – బయటి గణాలతోనూ కొన్ని నియమాలు ఏర్పరచు కొన్నాయమ్మా. ఆ నియమాలు, పూజ్యులైన పెద్దలు పెట్టిన కట్టుబాట్లు దాటటం నాకు కూడా శక్యం కాదు బిడ్డా!... ఇప్పుడింక ఈ రాజ్యాలు ఏర్పడ్డాక అవి మరింత కట్టుదిట్ట మయినాయి తల్లీ.!"

"అంటే తండ్రో, అన్నో ఒప్పుకున్న బంధానికి తప్ప ఇష్టపడి ఏర్పరచుకున్న బంధం నిషిద్ధమైపోయిందా? ఉదయుడితో నా అనురాగం మీకు ఇష్టంలేకనే కదా! ఇదంతా! ఈ నీతి నియమాలు ఎవరు ఏర్పరిచారు తండ్రీ! స్త్రీ పురుషుల అనుబంధం సహజమైంది. ఈ సహజమైన సంబంధం ఇన్ని కట్టుబాట్లతో ఎందుకు బిగించారు."

తిరిగి భోజరాజు ఉపక్రమిస్తూ,... "తల్లీ! నువ్వు చెప్పేది ఒకప్పటిది! వెనకటి రోజుల్లో 'కానీనుడైన' బిడ్డతో సహా తల్లిని వధువుగా అంగీకరించేవారు. ఇప్పుడు అటువంటి వధువును వివాహమాడటానికి ఏ రాజూ అంగీకరించడంలేదు. ఇప్పుడంతా కన్యా వివాహానికే క్షత్రియ పుత్రులు సంకల్పిస్తున్నారు." – ఆ మాట అని భోజరాజు మౌనంగా వుండిపోయాడు.

ఓ క్షణం ఆగి "నువ్వేం ఆందోళనకు చెందకు తల్లీ! నీ బిడ్డను సురక్షితంగా పెంచే ఏర్పాటు చేస్తాను. తిరిగి నువ్వు వివాహానికి సిద్ధంకావాలి కుంతీ!"– ఆజ్ఞతో కూడిన తండ్రి ఆదేశం. అప్పటి నుండి పాండురాజుతో వివాహం వరకు తను సౌధం దిగి రావడానికి లేకుండా పోయింది. అడుగుతీసి, అడుగువేయడానికి కాపలా! పాత దాసీలను మార్చి.... ప్రతిరోజూ భోజరాజు పర్యవేక్షణలో తన జీవితం.

ఈ ఆలోచనలతో తమ బంధాన్ని 'గణనీతి'కి బలిచేసిన పెద్దలపై పట్టరాని ఆగ్రహం కలిగేది. ఈ రాజులకూ, రాజరికానికీ కావల్సింది మనుషులూ, మనసులూ కాదు– పరువు, ప్రతిష్ఠలే!...

ఆ కాలం గుర్తు చేసుకుంటూ, 'అయ్యో! ఎందుకు నాకీ విషమ పరీక్ష పెట్టావు కృష్ణా!'.. దు:ఖం ముప్పిరిగొన్నదామెను. కర్ణుడిని కలవడం కంటే గడిచిపోయిన తన జీవితపు తలపులు ఆమెను క్షోభకు గురిచేస్తున్నాయి.

నీకిది చెయ్యలేని పనే! సంకట స్థితే. కానీ తప్పదు! నీ పుత్రులు రాజ్యం పొందాలనీ, వారు జయించాలనీ నీకు లేదా? పదమూడేళ్ళు పరాయి పంచలో ఎందుకు పడి వున్నావ్! నీ పుత్రులేం శౌర్యహీనులా, కార్యశూన్యులా! అయినా అన్ని అవమానాలను ఎందుక సహించారూ?.

నిజమే! అకాలంగా భర్తను మృత్యువు కబళించడంతో ఒంటరిగా చంటిబిడ్డలతో బావగారి దయాదాక్షిణ్యాల మీద బతకటం మాటలా! నిజానికి భీష్మ పితామహులు వుండబట్టి తమకీపాటి గౌరవమైనా దక్కింది. అప్పటికీ ఎన్ని చిచ్చులు పెట్టారూ? లక్క ఇల్లు దహనం దగ్గర నుండి జీవితమంతా ప్రాణాలు కాపాడుకోవడమే పనిగా మిగిలిపోయిందిగా!

మనసు గట్టి చేసుకుంది. తప్పదు తమకు రాజ్యం రావాలనీ– మానవ సమూహాలను పీనుగు కుప్పలుగా మార్చి శ్మశానాలను ఏలుకోవాలని కాదు – కానీ జరిగిన అవమానాలు బడబాగ్నిలా దహిస్తున్న ఈ లోలోపలి ఈ ఆవేదనలు తీరేదెట్లా?

తన కోడలిని నిండు సభలో ఏక వస్త్రను చేసి లాక్కురావడమే కాక, ఆమెను వివస్త్రను చెయ్యాలని నడిపిన అకృత్యం మర్చిపోయేదేనా? ఆడదాన్ని అవమానించిన మృషణ్ణులు భూమికి కూడా భారం. వారికి తగిన దండన జరగాల్సిందే!

పాండు పుత్రులను పట్టుకుని– 'మీరంతా నా పిన తండ్రికి పుట్టారా? నేనెందుకు రాజ్యమివ్వాల'ని అంటే కిమ్మనకుండా మౌనంగా వుండిపోయిన ఈ పెద్దలు నిజంగా పెద్దలేనా– ఆ ముసలి భీష్ముడికి మతిగాని పోయిందా? ఎంత అవమానం? పాండు పుత్రులు పాండురాజు బిడ్డలు కారా?.... కుంతి బిడ్డలు మాత్రమేనా?

క్షేత్రం ఎవరికి చెందుతుందో – పంట వారికి చెందుతుందనే కదా! శాస్త్రాలు చెప్పింది – తన బిడ్డలు శాస్త్ర విరుద్ధంగా జన్మించలేదే? ఆ శాస్త్రమే తప్పనుకుంటే తమ మామగారికే జన్మించారా వీరంతా?... ఆ ముసలి భీష్ముడు బలవంతంగా అంబ, అంబాలికను తీసుకు రావడమేకాక, వారి ఇష్టానికి వ్యతిరేకంగా ఆనాడు తన మారుటి తమ్ముడితో ఎందుకు నియోగింపచేశాడూ?... ముసలమ్మ సత్యవతి కానీన పుత్రుడితో కురు రాజులను కన్నప్పుడు అది న్యాయమే అయిపోయిందా? ఆ తండ్రికి పుట్టిన బిడ్డలే కదా? వీళ్ళు! వారికి చెల్లిన నియోగ పద్ధతి, తన బిడ్డలకెందుకు చెల్లలేదూ?

అసలు ఈ కురువంశమే నిజమైన కురు బీజ పునాది మీద లేదు... ఈ మాట ఆ ముసలి భీష్మునికి తెలుసుగదా! ఆ ముక్క మనవళ్ళకు చెప్పి వారిని దండించలేడా?... కాదు , కాదు అసలు కీలకమంతా ఈ ముసలాడి దగ్గరే వుంది.

పాండురాజుతో కలసి వన విహారం నెపంతో హిమాలయాలవైపు వెళ్ళడం.... కిరాతులు, గంధర్వుల పరిచయాలు – అన్నీ ఆమె ముందు పరచుకున్నట్లయింది.

ఆమెకు చనిపోయిన తన భర్త మొహం కళ్ళముందు నిలిచింది.

పాండువు తన అశక్తతను పెద్దలకు చెప్పుకోలేక, తప్పంతా తనమీద వేసి, పెద్దల ముందు దోషిగా నిలబెట్టినప్పుడు – తానెంతో ఘర్షణకు గురయ్యేది. చివరకు భీష్మ పితామహుడు కూడా కళ్ళతో తనను 'దోషి' అన్నట్లుగా చూడడం!, అవమానంగా వుండేది. కౌరవ రాజ్యానికి వారసులనివ్వలేని 'సారం లేని క్షేత్రంగా' అనుమానిస్తున్నప్పుడు క్షోభగా వుండేది. ఉదయుడి ఉదంతం, తన బిడ్డ గురించీ చెప్పాలన్నంత ఆవేశం వచ్చేది. అయితే ఎప్పుడూ తన బిడ్డ గురించి బయటపెట్టలేక పోయింది. అన్నిటినీ మౌనంగా, తిరస్కారంతో భరించింది.

చివరకు పాండువు తనను నిందించీ, నిందించీ అన్నివిధాలా ఓడిపోయి – తన ఓటమిని అంగీకరించక తప్పలేదు.

"కుంతీదేవి!... ఈ సువిశాల కౌరవ సామ్రాజ్యం నిలబడాలి. ఈ హస్తినావతి వారసుల్లేని నిర్భాగ్యురాలు కాకూడదు. అందుకు నీ సహకారం కావాలి"– ప్రాధేయపూర్వకంగా పాండువు అడగడం తనకింకా తడి ఆరని జ్ఞాపకం.

మనశ్శరీరాలు రెండూ శత్రుభావం వహించినా - భర్త అనుజ్ఞ అంగీకరించక తప్పదు; రాజ్యానికి వారసులను కనడం బాధ్యతగా 'నియోగాని'కి సిద్ధపడింది. ఇష్టపడ్డ ఉదయునిని వదులుకుంది- పెద్దల అంగీకారం లేదని, ఇష్టంలేని నియోగం ఒప్పుకుంది ఆ పెద్దల కోసమే.

స్త్రీలది ఎంత గొప్ప జీవితం? - విచారంతో అలాగే వుండిపోయింది.

అప్పటికే కనుచీకటి పడిపోయిందని, కుంతీదేవి కుటీరానికి ఇంకా చేరలేదని ఆమెను వెతుక్కుంటూ విదురుడు గంగానది ఘట్టానికి చేరాడు.

అప్పటికే గంగా మహాజలం చీకటిని నింపుకొని నీలవర్ణం నుండి కాటుక వర్ణానికి మారిపోయింది. ఆ నిశ్శబ్దంలో మహోద్రుతమైన ఆ ప్రవాహపు ఝరి, మనుషులనూ, వారి అంతరంగాలనూ తెలియని ప్రకంపనాలకు గురిచేస్తోంది.

అనంతమైన ఆ ప్రకృతి విలయోద్వేగాన్ని వింటూ కుంతి చలనం లేనట్లు ఆ రాతిమెట్లపై కూర్చుండిపోయింది.

కుంతిని గమనించిన విదురుడు.... "ఆర్యాణీ! చీకటి చిక్కనవుతోంది, పద పోదాం!" అన్నాడు.

"విదురా! నేను విన్నది నిజమేనా!"...

కుంతీదేవి ఏమడగబోతోందో అతడు ఊహించాడు.

"నిండు సభ తీరి వుండగా - దుర్యోధనుని వాచాలత్వాన్ని అటు మామగారుగానీ, ప్రపితామహుడుగానీ ఖండించలేదెందుకు?"

విదురుడు ఓ క్షణం మౌనంగా వుండి "నిజమే! ఆర్యాణీ! కానీ ఏదో మూల భీష్ములవారికీ ఆ పక్షపాత ముందేమోనని నా సందేహం!"

"అదే అయితే, బీజ ప్రధానాన్ని సమ్మతించేటట్లయితే అంబ, అంబాలికలకు పుట్టిన మీరంతా ఏ గణానికీ, ఏ వంశానికీ చెందుతారూ?.. ఆనాడు క్షేత్రమే ప్రధానమని, క్షేత్రం ఎవరికి చెందుతుందో ఆ సంతానమూ వారికే చెందుతుందని, కోడళ్ళ బిడ్డలు మీ కౌరవ వంశానికి చెందినపుడు.... ఇప్పుడీ కుంతి పుత్రులు ఎట్లా కాకుండా పోయారు. ఇదంతా తెలిసి వుండి కూడా పెద్దలు నోరెత్త లేదంటే అర్థమేమని?..."

విదురుడు సమాధాన మివ్వలేదు. నిశ్శబ్దంగా వుండిపోయాడు.

కుంతికి ఆలోచించే కొద్దీ సంభాషణ పెరిగేకొద్దీ ఆవేదన, ఆవేశం ముప్పిరి గొంటున్నాయి. ఇద్దరిదీ మౌన భాషే అయింది.

ఆ మాట అంటూ కుంతి ఆ నదీ ఘట్టం మీద నుండి పైకి లేచింది. విదురుడు ముందుకు సాగుతుండగా - తల దించుకుని కుంతి ఆలోచనల్లో మునిగిపోయింది.

తనదెంత దురదృష్ట జాతకం అనుకుంటూ, తనదేనా! స్త్రీ జాతి అంతటిది కూడా కదా!... తన కోడలు మాత్రం ఏం సుఖపడిందనీ - నా తొందరపాటుతో తాను ఐదుగురికి భార్య అయి "పాంచాలీ పంచభర్తృక" అని అవమానాలు మోయడం లేదూ!. నవ్విందనో, ఏడ్చిందనో మరొకటో నెపం పెట్టుకుని రాబోయే యుద్ధ నేరాన్ని ఆమె మీద మోపుతున్నారు పాపం! కానీ ఆమెదేం తప్పూ!...

అసలు కారణమంతా భీష్ముడి దుష్ట ఆలోచనలే! ఆ ముసలోడు శాసిస్తే - ఈ దుర్యోధనాధులు ఎదురు తిరగగలరా?.... ఎంత ఉప్పు తిన్నామన్న విశ్వాసముంటే మాత్రం - అసలు మూలాన్నే ప్రశ్నిస్తుంటే సమాధానం చెప్పాల్సిన బాధ్యత లేదూ?....

స్త్రీలెంత పరాధీనులూ? ఆనాడు తన తండ్రి, ఉదయుడు తమ గణానికి చెందినవాడు కాదని - తన అంగీకారం లేకుండా బిడ్డకు జన్మనిచ్చానని - తనకు ఉదయుడినీ, బిడ్డనూ ఇద్దరినీ దూరం చేశారు. ఇప్పుడు పాండురాజు అనుమతితో అతని ఆలోచన మీదనే అన్య మనస్కంగానే ఆ నియోగాన్ని అంగీకరించాను - అది శాస్త్ర సమ్మతమేనని - ఇన్నేళ్ళుగా అంగీకరించి - ఈ రోజు బిడ్డలు ఎదిగి రాజ్యంలో భాగం ఇవ్వాల్సి వచ్చేటప్పటికి ఈ ప్రశ్నలు పుట్టుకు వచ్చాయా?

కుంతికి తీరని అవమానంగా అనిపిస్తోంది. తన భర్త పాండువు ఆ రాజ్యం కోసమే తనను నియోగానికి పురికొల్పాడు. ఇప్పుడు ఆ రాజ్యం పంపిణీ అడ్డుకోవడానికి అదే నియోగం అడ్డు ప్రశ్నగా వస్తోంది.

ఈ అంతటిలో స్త్రీలుగా తమ ప్రమేయం ఏ మాత్రం లేనేలేదు కదా!....

ఈ ఘోర అవమానాల నుండి తన కానీనుడు తనకు గౌరవం కల్పిస్తాడేమో? ఆశగా అనుకుంది - కృష్ణుడు ఎందుకోసం ఈ పనికి పురికొల్పాడో. అయినా తను దాన్నుండి రక్షణ కవచాన్ని అందుకో గలిగితే?

ఆ మాట అనుకుంటూ తనకు తనకే అవమానంతో ఆగిపోయింది.

నిజంగా కర్ణుడు తనను ఆదరిస్తాడా? అసలు ఏ మొహం పెట్టుకొని అతని వద్దకు వెళ్ళగలదు?... నిజమే! ఆదరించడు - పైగా నిందిస్తాడు కావచ్చు. ఈ రోజు నీ బిడ్డల రక్షణ కోసం నన్ను అర్థించడానికి వచ్చావు కాని నేనే నీ కొడుకునన్న అభిమానంతో రాలేదనవచ్చు. అసలు నా జన్మమేమిటి? సూత పుత్రుడిగా నేను ఎన్ని అవమానాలు పడ్డాను - అప్పుడంతా నీ తల్లి మనసు ఏమైందని నిందిస్తే?

అవును - నేను నిందార్హురాలనే. వాడికి జరిగిన అవమానాలకు అన్యాయాలకు నేనే కారణం. కన్నబిడ్డను కన్నీట ముంచి - నదీ గర్భానికి అప్పగించిన పాపం ఊరికే పోతుందా? అయినా నా కడుపున పుట్టినవాడి ఆ నిందనలను నేను భరిస్తాను. వాడి న్యాయమైన ఆక్రోశానికి తలొగ్గుతాను. అయితే తల్లిగా తన అవమానాలకు లేపనం కావాలని బిడ్డను అర్థిస్తాను. తప్పేముందీ?..

ఏ రాజనీతి, ఏ పురుషనీతి తన బిడ్డను తనకు దూరం చేసిందో - ఆ రాజ్యమే, ఆ పురుషనీతే మరింత వికృతంగా తననూ, తన బిడ్డలనూ ప్రశ్నలు వేస్తోంది.

"కర్ణా! ఈ ఆధిపత్య పురుష నీతి విలువలతో విలసిల్లే ఈ రాజ్యనీతిని ఎదిరించు బిడ్డా" - అని చెప్పడానికైనా తన బిడ్డను కలవాలి. అందుకోసం అతనెంత అవమానంతో నిందించినా భరిస్తాను. "తల్లీబిడ్డల మధ్య - మరే ఇతర జోక్యాలు లేని ఉత్కృష్ట మానవ విలువల కోసం సాధనచెయ్యి తండ్రీ!" అని చెప్పడం కోసం నా కర్ణుడిని కలుసుకుంటాను.

ఆ మాట దృఢంగా అనుకుని కుంతి, విదురుడి వెనక స్థిరంగా అడుగులు వేసింది.✦

కవిత

# విడ్డూరమే కదా!?

- కంచరాన భుజంగరావు

ప్రజల ఊపిరే దేశం ఊపిరి!
చెమట చుక్కలే సంపద ఉనికి!
శ్రమ రూపమే భౌతిక సంస్కృతి బొడ్డుపేగు!
కానీ, శ్రమకి విలువలేని చోట
భూమికి విలువ పెరుగుతుండటం విడ్డూరమే కదా!?

మట్టినీ యిసుకనీ దిబ్బ చేసి
మట్టిమనిషి శ్వాసనాసికల్లో
దూది బిండలుగా అమర్చినాక
మన్నూమశానం కూడా
అచ్చంగా మెరిసిపోతున్న పచ్చనోట్లై
గిరాకీ పెంచుకోవడం విడ్డూరమే కదా!?

తరతరాలుగా
నడిభుజమ్మీద నాగలి మోస్తున్నోళ్లకు
వెనుకబాటున
నడ్డిమీద భారం మోపుతున్నదెవరో
పోల్చుకోవడం వల్లకావడం లేదని
ఏళ్లుగా రుజువులు దొరుకుతున్నా
చేతిలో ఉన్న పనిముట్టు
కుట్రను ఛేదించే ఆయుధం కాకపోవడం
విడ్డూరమే కదా!?

అనాదిగా అరక దున్నేటోల్లు
పూజు భుజానికి నాగలికట్టి
బెడ్డ దుక్కికి బెంగపడనోల్లు
ఇప్పుడు ట్రాక్టర్ల బాడుగలకోసం
తల తాకట్టుపెట్టి
తలబాదుకోవడం విడ్డూరమే కదా!

అన్ని కాలాల్లోనూ
అనావృష్టి సూచిక ఆకలొక్కటే!
ముద్ద కరువైన చోట
బతుకు బాధల చెరువు!
అది ఎవరి కబ్జాలో ఉంటుందో కూడా
చెప్పలేకపోవడం విడ్డూరమే కదా!?

కంకుల సందడి ఎప్పుడూ ఉన్నదే!
అయినా వడ్లకుప్పల వైభవం
కళ్లాలను మురిపిస్తుందో? లేదో?
ఎండిన ఏర్లు సాగివస్తాయో? లేదో?
కూలిన చెట్లు చివురిస్తాయో? లేదో?
కరిగిన గుట్టలు చదునుబారేనో? లేదో?
మట్టి రేణువుల అంతరంగమేమిటో
మనిషనే వాడికి పరిచయం కాకపోవడం
విడ్డూరమే కదా!?

ఒక్క జడికాలేని నిరంతర ఆసరా
ఎన్నిసార్లు చినుకులై కురిసినా
ఆకుపచ్చ చందమామను
అక్షరాల్లో ఎంతని పొగిడినా
నాగలి సమాధి చుట్టూ
ఎన్ని అక్షౌహిణుల సైన్యాన్ని సమకూర్చినా
మేడి పట్టేవాడి వారసుడు వస్తాడో? రాడో?
సందేహమై మిగలడం విడ్డూరమే కదా!?

మరి ప్రజల ఊపిరే దేశం ఊపిరైనపుడు
ముఖచిత్రం మీద పున్నమి
వెనుక అట్ట మీద ఆమాస కొలువైన దేశంలో
రేపటి ఆకలి దేహాలకు ఊపిరి అందాలన్నా...
ఆకలి పోరాటమే జీవితమైనవారికి
ఆఖరి పోరాటం ఎక్కడ మొదలవ్వాలో
తెలియాలన్నా...
యుద్ధసన్నాహాలు సాగాల్సిందిసాగుమడిలోనే...!! ✦

వ్యాసం

# రచయితలకొక తూర్యనాదం!
## (Reveille for Writers)

**- హోవర్డ్ ఫాస్ట్**

*'స్పార్టకస్', 'స్వేచ్ఛాపథం' (Freedom Road) లాంటి నవలలు రాసిన హోవర్డ్ ఫాస్ట్ తెలుగు పాఠకులకు సుపరిచితుడే. 1946లో ఆనాటి రచయితల కర్తవ్యం గురించి 'న్యూ మాసెస్' అనే అమెరికన్ కమ్యూనిస్టు వారపత్రిక ఏప్రిల్ 23వ తేదీ సంచికలో రాసిన వ్యాసం ఇది. 1946 నాటిదైనా, అమెరికన్ రచయితలను ఉద్దేశించినదైనా, ఈనాటి మన దేశ రచయితలకు కూడా కనువిప్పు కలిగించే అంశాలతో కూడి వుంది. చదవండి.*

- అనువాదం, వివరణలు : **కొత్తపల్లి రవిబాబు**

**మానవుడు** తన ఆలోచనలను రాయడం నేర్చుకున్ననాటినుండీ, స్వేచ్ఛాప్రియులకు కలం ఒక ఆయుధంగా ఉపయోగపడింది. కత్తి కంటే కలం గొప్పది అనేది కేవలం ఒక సూక్తి మాత్రమే కాదు. కత్తి అనేది అణుబాంబు రూపం తీసుకున్నా, స్వేచ్ఛాప్రియులకు లిఖిత పదాలే అణుబాంబుకన్నా శక్తిమంతమైన ఆయుధం.

నేను రచయితలను సంబోధించి చెబుతున్నాను అంటే ఈ పోరాటం వారికి పరిమితమైనదేకాక వారు ప్రత్యేకంగా బలసంపన్నులైన సాయుధులు కావడం వల్ల. కనుకనే (పాలకులు) వారంటే భయపడతారు. కనుకనే వారిని కొనేస్తారు. బ్రహ్మాండమైన బహుమతులను లంచాలు ఇచ్చి వారిని వంచిస్తారు. దానికి బదులుగా వారి నుండి ఆశించేదేమిటంటే, వారు పోరాటం నుంచి తప్పుకోవాలి. ఎటువంటి నిరసనలూ తెలియ చేయగూడదు. స్పష్టంగా, గట్టిగా వుండే వారి గొంతుకలు మూగబోవాలి. అంతిమంగా సత్యం కొరకు వారు ఎటువంటి ప్రయత్నమూ చేయగూడదు.

మనదేశంలో ఏం జరిగింది? ఒకప్పుడు రచయితలు ఇక్కడ మహా బలవంతులు. ఒక అన్యాయమైన, సామ్రాజ్యవాద యుద్ధాన్ని బలపరచడం ఇష్టంలేక జైలుకెళ్ళిన థొరో[1] గురించి; అన్యాయాన్నీ మతమౌఢ్యాన్నీ ఈసడించుకొని వాటికి వ్యతిరేకంగా ప్రతిచోటా పోరాడిన క్లెమెన్స్[2] గురించీ; ప్రజాస్వామ్యం అంటే స్పష్టమైన అవగాహన వున్న ఎమర్సన్[3] గురించీ; స్వేచ్ఛాగేయాలు రాసి, పాడిన విట్మన్[4] గురించీ; మనుషులను బానిసలుగా చేసేవారిని తీవ్రంగా ద్వేషించిన బ్రయాంటి[5] గురించీ; తిరోగమనం చేయకుండా గోడమీద పిల్లివాటంగా ప్రవర్తించని గారిసన్[6] గురించీ; బానిసత్వాన్ని బట్టబయలు చేస్తూ రాసిన స్టో[7] గురించీ; మానవులను స్వేచ్ఛాజీవులుగా చేయాలని రచించిన జాన్ స్విన్టన్[8]ల గురించి నేను చెబుతున్నాను. ఇంకా కొంచెం వెనక్కి వెళ్తే – విప్లవాలలో పాల్గొన్న విప్లవ వీరులు తమ రచనలతో పాల్గొన్న వారున్నారు. టామ్ పెయిన్[9], టిమోతీ డ్వైట్[10], జోయల్ బార్లో[11], ఫిలిప్ ఫ్రెన్యూ[12] లాంటివారు వారి వారి రచనల ద్వారా విప్లవ విజయానికి కృషిచేసిన అద్భుతమైన విప్లవ రచయితలున్నారు.

మరీ ఇటీవలి కాలంలో, మతపిచ్చినీ, సిగ్గుమాలినతనాన్నీ, మనిషి పతనాన్నీ ద్వేషించిన జాక్ లండన్[13], వాచెల్ లిండ్సే[14], అప్టన్ సింక్లెయిర్[15], ఫ్రాంక్ నారిస్[16], లింకన్ స్టెఫెన్స్[17], థియొడర్ డ్రీజర్[18], జాన్ రీడ్[19] లాంటి వందలాదిమంది రచయితలున్నారు.

మనతోపాటు జీవిస్తున్న ఈ తరంలో నిర్భయంగా బెదిరింపులకు లొంగకుండా వున్న కొందరి పేర్లు చెప్పాలంటే ఎర్నెస్ట్ హెమింగ్ వే[20], జాన్ స్టీన్ బెక్[21], ఎర్స్కిన్ కాల్డ్‌వెల్[22], క్లిఫర్డ్ ఒడెట్స్[23], ఆల్బర్ట్ హాల్పర్[24], సింక్లైర్ లూయిస్[25] వున్నారు.

మరి ఇప్పుడు మన దేశానికి ఏమైంది? వీరి గొంతులను ఏ భయభ్రాంత వాతావరణం ఎండిపోయేట్లు చేసింది? కలాలను స్థంబింప చేసింది? తప్పులపైన తప్పులు, అవమానాలపైన అవమానాలు జరుగుతుంటే మౌనమే వ్యాఖ్యానంగా మిగిలిపోయిన పరిస్థితి ఎందుకు వచ్చింది?

ఈనాడు, మన జ్ఞాపకాలలో మిగిలి వున్న బాంబు ప్రేలుళ్ళు, మూడవ ప్రపంచయుద్ధం అతి దగ్గరలో వున్నట్లు గుర్తు చేస్తున్నాయి.

హంటర్ కాలేజీ[26]లోను, బ్రాంక్స్ (Bronx)[27]లోను సామ్రాజ్యవాదుల కీలుబొమ్మల బృందమొకటి సోవియట్ యూనియన్‌పై దాడికి నాయకత్వం వహించింది. వాషింగ్టన్‌లో, ఈ దేశ ఫాసిస్టు గుంపొకటి, "అమెరికన్ వ్యతిరేక కార్యకలాపాలపై కమిటీ" అనే పేరుతో, ప్రజాస్వామ్యానికి అపవాదాలతో అపకీర్తి కలుగచేస్తోంది. నైతిక సూత్రాల మర్యాదను భగ్నం చేస్తోంది. అమెరికన్ల రాజ్యాంగబద్ధ హక్కులపై అన్ని రకాల దాడులకూ నాయకత్వం వహిస్తోంది.

టెన్నెసీలో నీగ్రోజాతివారిని ప్రభుత్వ పోలీసు ధ్వంసం చేసింది. ఫ్రీపోర్ట్, లాంగ్ ఐలాండ్[28]లో ఒక పోలీసు అధికారి ఇద్దరు నీగ్రోలను హత్య చేశాడు. దక్షిణాదిన మూడు ప్రాంతాలలో నీగ్రోలను హతమార్చారు. ఈ హంతకులపై ఎటువంటి చట్టబద్ధ చర్యలూ ప్రభుత్వం చేబట్టలేదు.

ఐదు లక్షలమంది వృద్ధ సైనికులకు ఇంటి వసతి లేదు. వారికి ఇళ్ళు సమకూర్చడానికి ఎటువంటి చర్యలూ చేపట్టలేదు. వృద్ధ సైనిక వీరులు చర్చిల్ యుద్ధ ప్రియత్వాన్ని నిరసిస్తున్నారు. ఫలితంగా వారు జైలుపాలయ్యారు. బొగ్గుగని కార్మికులు – వారిలో వేలాదిమంది వయసు మళ్ళినవారు – ఆకలితో అలమటిస్తూ సమ్మె చేస్తున్నారు.

లాంగ్ ఐలాండ్‌లో కూక్లక్స్ క్లాన్ సంస్థ పునరుద్ధరింపబడింది. అది యూదులపైనా, కార్మికసంఘాలపైనా యుద్ధాన్ని ప్రకటించింది. గతంలో కంటే మరింత పటిష్టంగా కార్మిక సంఘాలను నిర్వీర్య పరచడానికి కాంగ్రెస్ ఒక బిల్లును చర్చిస్తోంది.

ఇద్దరు జర్మన్ కమ్యూనిస్టులకు, అందులో ఒకరు హిట్లర్ కాన్‌సెంట్రేషన్ శిబిరంలో 9 ఏళ్ళు బాధలు పడినవాడు – ఐదేళ్ళ అదనపు కారాగార శిక్షను, 'విధ్వంసకర చర్యలు' చేపట్టినందుకు అమెరికన్ సైనిక న్యాయస్థానం విధించింది.

ఇక ప్రపంచంలో – యుద్ధం అనేక ప్రాంతాల్లో కొనసాగుతోంది. ఇండోనీసియా, గ్రీస్, స్పెయిన్, ఈజిప్ట్, పాలస్తీనా, ఇండియా, బర్మా, చైనా, ఫిలిప్పీన్స్‌లలో – ప్రజాస్వామ్యం కొరకు పోరాడుతున్నవారు సామ్రాజ్యవాదుల తుపాకీ తూటాలకు బలి అవుతున్నారు.

దీని కోసమేనా 30 మిలియన్లమంది తమ ప్రాణాలు త్యాగం చేసింది?

మరి రచయిత బాధ్యత ఏమిటి? అతని అంతరాత్మ ఇతరుల అంతరాత్మలాంటిదేనా? అతని అపరాధం ఇతరుల అపరాధం లాంటిదేనా? ఈనాడు ఇస్తున్న విలువైన కానుక అతన్ని మౌనం వహించేట్లు చేస్తుందా?

అతడు సాహిత్య చర్చలనే సున్నితమైన కార్యక్రమాల్లో పాల్గొంటే సరిపోతుందా? మర్యాదకు సంబంధించిన విషయాల గురించి నిగూఢమైన పదజాలంతో మాట్లాడటం సరిపోతుందా? ఉన్నత సమాజం కోసం మానవజాతి చేసే పోరాటంలో కీలకమైన అంశం పట్టించు కోకుండా అపాయమేమీ లేని పద్ధతిలో మాట్లాడటం సరిపోతుందా?

సరిపోదు అని నా అభిప్రాయం. ఒక రచయితకుండే స్థానం, హోదా చూడండి. నోరు విప్పలేని ప్రజారాశులతో అతడు స్పష్టంగా మాట్లాడగల్గిన శక్తి కలవాడు. ఎలా ఆలోచించాలో, ఎలా యోచించాలో, ఎలా భౌతిక జీవితాన్ని అంచనాగట్టాలో, ఎలా సత్యం కోసం ప్రయత్నించాలో – వీటన్నిటిలో అతడు శిక్షణ పొందినవాడు. అశేష ప్రజానీకపు భావాలు వినగల్గినవాడు. వేలాదిమందిచేత తరచుగా గౌరవింపబడతాడు. మానవుడు స్వేచ్ఛ కోసం చేసే పోరాటపు మహత్తర సంప్రదాయానికి వారసుడతడు. అతని ఉనికి ఆ వారసత్వంపై ఆధారపడి వుంటుంది. ఆ వారసత్వం ఏమిటంటే – మనుషులకున్న మాట్లాడే హక్కు, అతని ఆలోచనలను ఎటువంటి ఆంక్షలకు లోనుగాకుండా ప్రచురించే హక్కును రక్షించుకోవడం.

ఈ మహత్తర సంప్రదాయం గలవారు అతని పూర్వీకులున్నారు. శతాబ్దాల లిఖిత చరిత్ర ప్రకారం ఎందరో రచయితలు శిక్షింపబడ్డారు. చిత్రహింసలకు గురయ్యారు. జైళ్ళపాలయ్యారు, హత్య చేయబడ్డారు. కేవలం స్వేచ్ఛ కొరకు నిలబడినందుకే!

అదే సంప్రదాయంలో నిరంకుశపాలన కళలను ఏంచేస్తుందో ఉదాహరణలు అతని ముందే వున్నాయి. కళలను ఏవిధంగా యూరోపియన్ ఫాసిజం యొక్క భయభ్రాంత వాతావరణం ధ్వంసం చేస్తుందో అతను చూశాడు. పచ్చదనమే లేని ఎడారిలాంటి ఫాసిస్టు సంస్కృతిని చూశాడు.

కుళ్ళిపోయిన ఫాసిజం యొక్క ఆఖరి లక్షణం ధ్వంసమయ్యేదాకా రచయితకు తటస్థత సాధ్యమా? అణుబాంబు సృష్టించే మరణ సదృశ్యమైన అణుధార్మికత నుంచి ఈ రచయితలు నివసించే భవనాలు సురక్షితమా? ఇంతకు ముందు కంటె సంఘటితమైన శాంతియుతమైన ప్రపంచానికి చేరువైన మనం ఆశావహమైన, సుఖవంతమైన జీవితాన్ని ధ్వంసం చేసుకోవడం చూడగలమా?

ఇప్పటికీ మనం పోరాటంలోనే వున్నాం. మంచి ఆశయాలు గలవారు ఇప్పటికీ ఆ ఆశయాల సాధనకై నిలబడేవారు వేళ్ళమీద లెక్కించదగినవారు మాత్రమే వుండటమనేది సిగ్గుతో తలదించుకోవాల్సిన విషయం. 'న్యూమాసెస్'[30] ఈ పోరాటంలో భాగస్వామి. ఒక తరంపాటు మానవుడి హుందాతనం కోసం, స్వేచ్ఛ కోసం "న్యూమాసెస్" పోరాడుతోంది – ఈ పోరాటంలో లోతుగా దిగబడి వుంది. పోరాటాన్ని గట్టిగా చేస్తోంది. ఇతర పత్రికల్లో స్థానంలేని అమెరికన్ రచయితలకు "న్యూమాసెస్" పుటలు ఆహ్వానం పల్కుతున్నాయి.

"న్యూమాసెస్" ఇంకా ఆ పోరాటంలో వుంది. 'న్యూమాసెస్' పేజీలు ఆ రచయితలను ఆహ్వానిస్తున్నాయి. న్యాయాన్ని ప్రేమిస్తూ, తప్పులను ద్వేషిస్తున్న అమెరికన్లందరినీ ఇది ఆహ్వానిస్తోంది.

ఈ దేశంలో గతంలో మహామహులుండేవారు. అటువంటివారు మరల వచ్చితీరుతారు. గతంలో లాగానే, మరింత మెరుగైన ప్రపంచం కోసం ప్రజలు చేసే పోరాటాల నుంచి వారు ఉద్భవించితీరాలి!

**– 'న్యూమాసెస్' ఏప్రిల్ 23, 1946 నుంచి**

## :: వివరణలు ::

1. **Henry David Thoreau (12.07.1817 - 06.05.1862) 44 years.** 1846లో మెక్సికన్ – అమెరికన్ యుద్ధాన్ని నిరసిస్తూ, పన్ను కట్టనందుకు ఒక రాత్రి జైలుశిక్ష అనుభవించాడు. ఆయన పేరుతో ఎవరో బంధువు ఆయనకు తెలియకుండా ఆ పన్ను చెల్లించినందుకు మర్నాడే విడుదల అయ్యాడు. థొరో ప్రకృతి ప్రేమికుడు. 'వాల్డెన్' ఆయన రాసిన ప్రసిద్ధ పుస్తకం. బానిస వ్యవస్థను వ్యతిరేకించాడు. బానిస వ్యవస్థ నిర్మూలనా ఉద్యమాన్ని సమర్ధించాడు. డార్విన్ పరిణామవాదాన్ని సమర్ధించాడు. సహాయ నిరాకరణ (Civil Disobedience) పద్ధతిని ప్రవేశపెట్టాడు. టాల్‌స్టాయ్, గాంధీ, మార్టిన్ లూథర్ కింగ్ (జూనియర్)లపైన ఈ సిద్ధాంత ప్రభావం అపారం. ఆయన 44వ ఏట క్షయవ్యాధితో మరణించాడు.
2. **Clemens (30.11.1835 - 21.04.1910).** అమెరికన్ రచయిత మార్క్‌ట్వేన్ అసలుపేరు సామ్యూల్ ల్యాంగ్ హార్న్ క్లెమెన్స్. 'టామ్‌సాయర్', 'హకల్ బెరిఫిన్', 'రాజూ – పేద' మొదలగు పుస్తకాల రచయిత. సామ్రాజ్యవాదాన్ని తీవ్రంగా వ్యతిరేకించాడు. న్యూయార్క్‌లోని సామ్రాజ్యవాద వ్యతిరేక మండలికి ఉపాధ్యక్షునిగా పనిచేశాడు. అమెరికా ఫిలిప్పీన్స్‌ను ఆక్రమించడాన్ని ఖండించాడు. బానిసవ్యవస్థ నిర్మూలనను బలపరిచాడు. స్త్రీల హక్కుల కోసం, ఓటువేసే హక్కు కోసం ఉద్యమించాడు. కార్మిక ఉద్యమాలను సమర్ధించాడు. క్రిస్టియన్ మతం గురించి విమర్శనాత్మకంగా

వుండేవాడు. "ఇప్పుడు క్రీస్తు వుండి వుంటే – ఆయన క్రిస్టియన్‌గా వుండేవాడు కాదు", అని వ్యాఖ్యానించాడు.

3. **Emerson : రాల్ఫ్ వాల్డో ఎమర్సన్ (25.05.1803 - 27.04.1882).** అమెరికన్ వ్యాస రచయిత, ఉపన్యాసకుడు, తత్త్వవేత్త, బానిసత్వ నిర్మూలనావాది, కవి. అమెరికా అంతర్యుద్ధంలో బానిసల విముక్తిని కాంక్షించాడు. ఉదార ప్రజాస్వామికవాదిగా ప్రసిద్ధుడు.

4. **Whitman : వాల్ట్ విట్‌మాన్ (31.05.1819 - 26.03.1892).** అమెరికన్ కవి, వ్యాస రచయిత, జర్నలిస్టు. వచన కవితకు ఆద్యుడు. మానవతావాది, అమెరికా అంతర్యుద్ధంలో వాషింగ్టన్ నగరంలోని ఆసుపత్రులలో గాయపడినవారికి సేవ చేశాడు. అబ్రహాం లింకన్ మరణంపై రాసిన 2 కవితలు ప్రసిద్ధి చెందాయి. ఆయన ప్రసిద్ధ కవితాసంపుటి పేరు 'లీవ్స్ ఆఫ్ గ్రాస్' (Leaves of Grass) అమెరికా జాతీయ కవిగా పరిగణించారు.

5. **Bryant : విలియం కువెన్ బ్రియాంట్ (03.11.1794 - 12.06.1878).** అమెరికన్ కాల్పనికవాద కవి, జర్నలిస్టు, 'న్యూయార్క్ ఈవెనింగ్ పోస్ట్' పత్రికకు సుదీర్ఘకాలం సంపాదకుడు. కార్మికుల సమ్మె హక్కును సమర్ధిస్తూ, మైనారిటీ మతాలవారి పక్షం వాదిస్తూ, బానిసత్వ నిర్మూలన కోరుతూ సంపాదకీయాలు రాశాడు.

6. **Garrison : విలియం లాయిడ్ గారిసన్ (10.12.1805 - 24.05.0000).** అమెరికన్ పత్రిక 'ది లిబరేటర్' (1831–1865) అనే వార్తాపత్రిక ప్రచురణకర్త. అమెరికాలో బానిసల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన జర్నలిస్టు. అమెరికన్ బానిసత్వ వ్యతిరేక సొసైటీ స్థాపకులలో ఒకడు. మహిళల ఓటు హక్కు సాధన ఉద్యమంలో ప్రముఖుడు.

7. **Stowe : హారియట్ ఎలిజబెత్ బీచర్ స్టోవ్ (14.06.1811 - 01.07.1896).** 'అంకుల్ మామ ఇల్లు' పుస్తక రచయిత్రి. బానిస వ్యవస్థ నిర్మూలనావాది.

8. **John Swinton : (1829-1901).** స్కాటిష్, అమెరికన్ జర్నలిస్టు. 'ది న్యూయార్క్ టైమ్స్' పత్రికకు 1860లో ముఖ్య సంపాదక రచయిత. బానిస వ్యవస్థ నిర్మూలనకు ఒక ప్రచార కార్యక్రమం రూపొందించాడు. న్యూయార్క్ ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో లీనమై కృషి చేశాడు.

9. **Tom Paine : థామస్ పైన్ (09.02.1737 - 08.06.1809).** అమెరికన్ రాజకీయ కార్యకర్త, తత్త్వవేత్త, రాజకీయ సిద్ధాంతవేత్త, విప్లవకారుడు. గ్రేట్ బ్రిటన్ నుండి స్వాతంత్ర్యం కోసం అమెరికా చేసిన విప్లవాన్ని 1776లో ఉత్తేజపరచిన 'కామన్ సెన్స్' (1776), 'ది అమెరికన్ క్రైసిస్' (1776–1783) అనే రెండు కరపత్రాలు రచించిన రచయిత. ఫ్రెంచి విప్లవాన్ని సమర్ధిస్తూ 'రైట్స్ ఆఫ్ మ్యాన్' (1791) అనే ప్రసిద్ధ గ్రంథాన్ని రచించాడు.

బ్రిటీష్ రాజరికాన్ని విమర్శిస్తూ, స్వాతంత్ర్యం కోసం అమెరికా చేయాల్సిన పోరాటంపై రాసిన 'కామన్‌సెన్స్' అనే 42 పుటల కరపత్రం ఫిలడెల్ఫియాలో 10 జనవరి 1776లో రచయిత పేరు స్థానంలో 'ఒక ఇంగ్లీషువాడు' అనే పేరుతో విడుదల చేశారు. 3 నెలల కాలంలో 13 కాలనీల్లో వుంటున్న రెండు మిలియన్ల మందికి లక్ష కాపీలు చేరాయి. అమెరికన్ విప్లవ క్రమంలో (1775–1783) 5 లక్షల ప్రతులు అమ్ముడయ్యాయి.

10. **Timothy Dee-Bright : (14.05.1752 - 11.01.1817).** అమెరికన్ విద్యావేత్త – రచయిత.

11. **Joel Barlow : (24.03.1754 - 26.12.1812).** అమెరికన్ కవి. రాజకీయవేత్త. ఫ్రెంచి విప్లవాన్ని బలపరిచాడు. అమెరికన్ విప్లవంలో పనిచేసిన దేశభక్తుడు.

12. **Philip Freneau : ఫిలిప్ మోరిన్ ఫ్రీన్యూ (02.01.1752 - 18.12.1832).** అమెరికన్ కవి, జాతీయవాది, వార్తాపత్రిక సంపాదకుడు. అమెరికన్ విప్లవపు కవిగా ప్రసిద్ధుడు.

13. **Jack London :** అసలు పేరు **John Griffith Chaney (12.01.1876 - 22.11.1916).** అమెరికన్ నవలా రచయిత. జర్నలిస్టు – సామాజిక కార్యకర్త. సోషలిస్టు దృక్పథంతో ఆయన రాసిన 'ఐరన్ హీల్' నవల తెలుగులో 'ఉక్కుపాదం'గా పాఠకులకు పరిచయమే. జాక్ లండన్ 1896 ఏప్రిల్‌లో సోషలిస్టు లేబర్ పార్టీలో చేరాడు. 1901లో దానిని వదలి, సోషలిస్ట్ పార్టీ ఆఫ్ అమెరికాలో చేరాడు. ఆయన రాసిన కొన్ని కథలు సైన్స్ ఫిక్షన్‌గా పరిగణించవచ్చు. ఆయన ప్రసిద్ధ నవలలు – 'ది కాల్ ఆఫ్ ది వైల్డ్', 'వైట్ ఫాంగ్', 'ది సీ ఉల్ఫ్', 'ది ఐరన్ హీల్', 'మార్టిన్ ఈడెన్', 'ది కాల్ ఆఫ్ ది వైల్డ్' తెలుగులో 'ప్రకృతి పిలుపు'గా అనువాదమైంది. 23 నవలలు, 21 కథాసంపుటాలు, 3 స్వీయ చరిత్రాత్మక జ్ఞాపకాలు, 22 వ్యాస సంపుటాలు, 3 నాటకాలు, 45 కవితా సంపుటులు ప్రచురించారు.

14. **Vachel Lindsay : నికొలస్ వాచెల్ లిండ్‌సే (10.11.1879 - 05.12.1931).** అమెరికన్ కవి. పాడుకోడానికి వీలుగా రాసే ఆధునిక కవితా ప్రక్రియకు ఆద్యుడుగా గుర్తింపు గలవాడు. పాదయాత్రలు చేస్తూ తన కవితలను గానం చేస్తూ అమ్మేవాడు. ఆఫ్రో – అమెరికన్లను సమర్ధించాడు.

15. **Upton Sinclair : అప్టన్ బీవ్ సింక్లెర్ (జూనియర్) (20.09.1878 - 25.11.1968).** అమెరికన్ రచయిత. నూటికి పైగా పుస్తకాలు రాశాడు. కాల్పనిక సాహిత్యంలో (ఫిక్షన్) 1943లో పులిట్జర్ బహుమతి గ్రహీత. మాంసాన్ని పేకేజి చేసే పరిశ్రమ గురించి రాసిన 'ది జంగిల్' నవల ప్రసిద్ధి చెందింది. దీని ప్రభావం వల్లనే 1906లో ఫుడ్ అండ్ డ్రగ్ చట్టం మాంసం తనిఖీ చట్టం వచ్చాయి. 'ది బ్రాస్ చెక్' అనే నవలలో అమెరికన్ ఎల్లో జర్నలిజాన్ని బట్టబయలు చేశాడు. దాని ప్రభావంతో జర్నలిస్టులకు నైతిక సూత్రాలు రూపొందించారు. బొగ్గు, చమురు, ఆటోపరిశ్రమలపై నవలలు రాశాడు.

16. **Frank Norris : బెంజిమన్ ఫ్రాంక్లిన్ నారిస్ (జూ) (05.03.1870 - 25.10.1902).** 1896–1916 నాటి అభ్యుదయ కాలపు అమెరికన్ నవలారచయిత, జర్నలిస్టు.

17. **Lincon Steffens : లింకన్ ఆస్టిన్ స్టెఫెన్స్ (06.04.1866 - 09.08.1936).** అమెరికన్ పరిశోధనాత్మక జర్నలిస్టు. వామపక్షవాది. అమెరికా పురపాలక మండలాలలో అవినీతిని బట్టబయలు చేశాడు.

18. **Theodore Dreiser : అమెరికన్ నవలా రచయిత – జర్నలిస్టు (27.08.1871 - 28.12.1945)** 'సిస్టర్ కేరీ' (1900); 'యాన్ అమెరికన్ ట్రాజెడీ' (1925) ఆయన రాసిన ప్రసిద్ధ నవలలు. నాస్తికుడు, నిబద్ధ సోషలిస్టు. ఆగస్టు 1945లో అమెరికా కమ్యూనిస్టు పార్టీ సభ్యుడయ్యాడు. లీగ్ ఆఫ్ అమెరికన్ రైటర్స్‌కు గౌరవ అధ్యక్షుడిగా వున్నాడు.

19. **John Reed : జాన్ 'జాక్' సైలాస్ రీడ్ (22.10.1887 - 17.10.1920).** అమెరికన్ జర్నలిస్టు – కవి – క్రియాశీల కమ్యూనిస్టు. మొదటి ప్రపంచ యుద్ధంలో విలేకరిగా పేరు తెచ్చుకున్నాడు. రష్యాలో జరిగిన అక్టోబరు విప్లవం గురించి రాసిన 'ప్రపంచాన్ని కుదిపేసిన పదిరోజులు'తో మంచి పేరు గడించాడు. మాస్కోలో మరణించాడు.

20. **Ernest Hemingway : ఎర్నెస్ట్ మిల్లర్ హెమింగ్ వే (21.07.1899 - 02.07.1961).** అమెరికన్ నవలా రచయిత. కథారచయిత, జర్నలిస్టు, క్రీడాకారుడు. తన రచనలలో ఎక్కువ 1920 – 1950ల మధ్య రచించాడు. 1954లో సాహిత్యంలో నోబెల్ బహుమతి స్వీకరించాడు. ఏడు నవలలు, ఆరు కథా సంపుటాలు, రెండు కాల్పనికేతర గ్రంథాలూ రచించాడు. మొదటి ప్రపంచ యుద్ధంలో అంబులెన్స్ డ్రైవర్‌గా ఇటాలియన్ యుద్ధ రంగంలో తీవ్రంగా గాయపడి ఇంటికి చేరాడు. ఆ యుద్ధ అనుభవాలతో 'ఏ ఫేర్‌వెల్ టు ఆర్మ్స్' నవల రాశాడు. స్పానిష్ అంతర్యుద్ధాన్ని పాత్రికేయునిగా రిపోర్టు చేశాడు. ఆ అనుభవాలనే 'ఫర్ హూమ్ ది బెల్ టాల్స్' నవల రాశాడు. 'ది ఓల్డ్‌మాన్ అండ్ ది సీ' ఆయన రాసిన మరొక ప్రసిద్ధ నవల. చివరి రోజుల్లో మానసికవ్యాధితో తుపాకీతో పేల్చుకుని చనిపోయాడు.

21. **John Steinbeck : జాన్ ఎర్నెస్ట్ స్టీన్ బెక్ (జూనియర్) (27.02.1902 - 20.12.1968).** అమెరికన్ రచయిత. 1962 నోబెల్ బహుమతి విజేత. మొత్తం 33 పుస్తకాలు రాశాడు. 'ది గ్రేప్స్ ఆఫ్ రాత్' (1939) అనే నవలకు పులిట్జర్ బహుమతి లభించింది. అది ప్రచురింపబడ్డ మొదటి 75 ఏళ్ళ కాలంలో 14 మిలియన్ల ప్రతులు అమ్ముడయ్యాయి. లీగ్ ఆఫ్ అమెరికన్ రైటర్స్ అనే కమ్యూనిస్టు సంస్థలో 1935లో చేరాడు.

22. **Erskine Caldwell : ఎర్స్కైన్ ప్రెస్టన్ కాల్డ్‌వెల్ (17.12.1903 - 11.04.1987).** అమెరికన్ నవలారచయిత. కథానికా రచయిత. పేదరికం, జాతివివక్ష, సామాజిక సమస్యలపై నవలలు రాశాడు. కాల్డ్‌వెల్ 25 నవలలు, 150 కథలు, 12 కాల్పనికేతర సంపుటులు, రెండు స్వీయచరిత్రలు, యువకులకు రెండు పుస్తకాలు రాశాడు. 28 సంపుటాల 'అమెరికన్ ఫోక్స్‌వేస్' పత్రికకు సంపాదకత్వం వహించాడు.

23. **Clifford Odets : (18.07.1906 - 14.08.1963).** అమెరికన్ నాటక, సినీ రచయిత, దర్శకుడు. 'ఆర్థికమాంద్యం' ప్రభావానికి లోనైన సమాజాన్ని తన నాటకాలలో చిత్రించాడు. ఆ కాలంనాటి దోపిడీ ఆర్థిక విధానాన్ని దుయ్యబట్టాడు. ఆయన పాత్రల పెట్టుబడిదారీ వ్యవస్థతో పోరాడుతుంటాయి. 1934–35లలో కొంతకాలం కమ్యూనిస్టుపార్టీ సభ్యునిగా వున్నాడు.

24. **Albert Halper : (03.08.1904 - 19.01.1984).** అమెరికన్ నవలా రచయిత. నాటక రచయిత. శ్రామికవర్గ సాహిత్య రచన ఆయన ప్రత్యేకత. ఆర్థిక మాంద్యం కాలంలో వామపక్ష భావాలతో రచనలు చేశాడు. 'యూనియన్ స్క్వేర్' అనే మొదటి రచనే విజయవంతమైంది.

25. **Sinclair Lewis : హారీ సింక్లైర్ లూయిస్ (07.02.1885 - 10.01.1951).** అమెరికన్ నాటక రచయిత. 1930లో నోబెల్ బహుమతి అందుకున్న మొదటి అమెరికన్ రచయిత. యుద్ధకాలంలో అమెరికన్ పెట్టుబడిదారీ విధానాన్ని విమర్శనాత్మకంగా చిత్రించాడు. 'బాబిట్' అనే నవలలో అమెరికన్ వ్యాపార సంస్కృతిని వ్యంగ్యంగా విమర్శించాడు. 24 నవలలు, 71 కథలు వున్న 7 సంపుటాలు, 4 నాటకాలు, 5 కవితలు, మొదలగునవి ఆయన రచనలు.

26. **Hunter College :** న్యూయార్క్‌లోని పబ్లిక్ విశ్వవిద్యాలయంకు అనుబంధ కళాశాల 1870లో మొదటి మహిళా కళాశాలగా ప్రారంభింపబడింది. 1946 నుండి పురుషులను కూడా చేర్చుకుంది.

27. **The Bronx :** న్యూయార్క్ నగరానికి చెందిన ఒక ప్రాంతం.

28. **Freeport, Long Island :** 1946 ఫిబ్రవరి 4న లాంగ్ ఐలాండ్‌లోని ఫ్రీ పోర్ట్‌లో ఒక పోలీసు ఇద్దరు నీగ్రో బాలురను చంపేసాడు. మరొకరిని గాయపరిచాడు. వారు అన్నా, తమ్ముళ్ళు. దీనిపై స్థానిక నీగ్రోలు తిరగబడతారని వూహించి ఫ్రీ పోర్టు బస్ టెర్మినల్ చుట్టూ పోలీసులు మోహరించారు.

29. **Ku Klux Klan (KKK) :** అమెరికాలో ఏర్పడిన శ్వేతజాతి దురహంకారుల టెర్రరిస్టు సంస్థ. అంతర్యుద్ధం ముగియగానే ఏర్పడి 1870 వరకు ఒక గ్రూపు కొనసాగింది. రెండవ గ్రూపు 1915లో ఏర్పడి ఈనాటికీ సజీవంగా వుంది. తెల్లవారి ఆధిపత్యం పునరుద్ధరణ జరగాలన్నది ఈ గ్రూపు లక్ష్యం. కొత్తగా స్వేచ్ఛ పొందిన నల్లవారిని బెదిరించి, వారిపై హింసాయుత చర్యలు చేయడం వీరి కార్యక్రమం. 1868–1870 మధ్య ఇది బలీయమైన శక్తిగా ఎదిగి, టెన్నీసీ రాష్ట్రంలోని నార్త్ కెరోలినాలో శ్వేతజాతిపాలనను పునరుద్ధరించింది. అయితే ఈ సంస్థ సభ్యులు చేసే హింసాయుత చర్యలను అరిగట్టుతూ, సంస్థ నాయకుడు దీన్ని 1869లో రద్దు చేశాడు. 1882లో ఈ సంస్థ రాజ్యాంగ వ్యతిరేకమని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. కానీ అప్పటికే ఈ సంస్థ అదృశ్యమైంది. కానీ ఇప్పుడు అంటే 2021లో మరల అక్కడక్కడా ఈ సంస్థ ప్రత్యక్షమౌతోంది.


30. **New Masses : (1926 - 1948).** అమెరికన్ మార్క్సిస్టు వారపత్రిక. అమెరికా కమ్యూనిస్టు పార్టీకి అనుబంధ పత్రిక. 1911 నుండి 1917 వరకు 'ది మాసెస్' అనే మాసపత్రిక నడిచింది. కనుక దీన్ని 'న్యూ మాసెస్' అని పేరు పెట్టారు. ఇది 1926 మే నుండి 1933 వరకు 1934 జనవరి నుండి 1948 జనవరి వరకు వారపత్రికగా వచ్చింది. దీనిని 1948 మార్చిలో మరో పత్రికలో లీనం చేయగా అది 'మాసెస్ అండ్ మెయిన్ స్ట్రీం' అనే పేరుతో 1956 వరకు మాసపత్రికగా నడిచింది. ఆ తర్వాత 1956 నుండి 1963 వరకు 'మెయిన్ స్ట్రీం' పేరుతో ప్రచురింపబడింది. ✦

# పోరాటమే జీవనస్ఫూర్తి "గణిక"

డా॥ గొట్టిముక్కల స్వర్ణలత

*"Perhaps someday I'll crawl back home, beaten, defeated, But nor as long as I can make stories out of my heart break, beauty out of sorrow".* **- Sylvia Plath.**

**మహిళల** సమస్యలకు ఆకాశమే హద్దు. లైంగిక వివక్ష, గృహ హింస, బాల్యవివాహాలు, అక్రమ రవాణా, వ్యభిచారం, అత్యాచారాలు, పనిచేసే చోట వివక్ష మొదలైన ఎన్నో సమస్యలు నిత్యం స్త్రీలను సతమతం చేస్తున్నాయి. వీటన్నిటికీ మరెన్నో పార్శ్వాలు కూడా ఉన్నాయి. విద్యావంతులైన స్త్రీలవి ఒకరకపు సమస్యలైతే నిరక్షరాస్యులవి మరోరకం. సమస్యను గుర్తించగలిగే అవగాహన కొందరు స్త్రీలకు ఉంటే ఇదీ సమస్య అని కూడా గుర్తించలేని అజ్ఞానం మరికొందరు మహిళలది. వీటన్నిటితో పాటు స్త్రీని విభిన్నదారుల్లో దగాచేయడానికి నిత్యం ప్రయత్నించే పురుషుల పీడన రూపంలోనూ పీడన సాగుతూ ఒకవైపున ఉంటే, స్త్రీల కుటుంబ హింసకు పాల్పడడం మరోవైపు.




20 కథలున్న 'గణిక' కథాసంపుటిలో వస్తువు మహిళావరణానికి సంబంధించిందే అయినప్పటికీ ఒక్కొక్క కథ ఒక్కో విభిన్న పార్శ్వాన్ని తడుముతుంది. ఆయా కథల్లోని స్త్రీ పాత్రలన్నీ ఒక్కో సమస్యను ప్రతిబింబిస్తూ వుంటాయి. కొన్ని కథలు కళ్ళు తడిపితే కొన్ని కథలు ధైర్యాన్నిస్తాయి. కొన్ని కథలు జీవితాన్ని కొత్తగా చూడమంటాయి. కొన్ని కథలు జీవితాన్ని అర్థం చేసుకుంటూ ముందుకు సాగిపొమ్మంటాయి. అయితే సమస్యల వలయాలలో కొట్టుమిట్టాడుతున్న ఏ స్త్రీ కూడా నైరాశ్యంలో క్రుంగిపోవడం అనేది ఏ కథలోనూ కనిపించకపోవడం రచయిత్రి ప్రత్యేక దృక్పథాన్ని సూచిస్తుంది. ఈ కథలన్నీ చదివినప్పుడు, అనేక మంది స్త్రీ వాద రచయిత్రులు చాలా కాలంగా స్త్రీల పక్షాన నిలబడి రచనలు చేస్తున్నప్పటికీ పితృస్వామ్య మూలాలు విస్తరించిన సూక్ష్మాతి సూక్ష్మ ఆర్థిక, సామాజిక, రాజకీయ విషయాలను విశదం చేస్తూ తమ పరిజ్ఞాన గాఢతను, పరిణతినీ నిరూపించుకుంటున్న నేటి రచయిత్రులలో భండారు విజయను ప్రముఖంగా పేర్కొనవచ్చు.

సుదీర్ఘకాలంగా ప్రజాస్వామిక విలువల కోసం పనిచేసే సాంస్కృతిక కార్యకర్తగా భండారు విజయ ప్రసిద్ధులు. దీపిక (1984), తడి ఆరని దుఃఖం (2016), అలల అంతరంగం (2018) కవితా సంపుటులతో మంచి కవయిత్రిగానూ సాహితీలోకానికి చిరపరిచితులే. 'ఉద్యోగక్రాంతి' పత్రికలో (2018) కచ్చీరు ముచ్చట్లు శీర్షికతో పలు ఆర్థిక, సామాజిక, రాజకీయ అంశాలను జనరంజకంగా ప్రస్తావించిన కాలమిస్టుగానూ పేరు తెచ్చుకున్నారు. గణిక (2020) కథాసంపుటితో ఆమె తన సృజన శక్తిని మరింత పదునైన భావవాహికగా మలుచుకున్నారు. "జీవితాన్ని చదవటానికి రచయితే కానవసరం లేదు. సమస్యలను గ్రహించే శక్తి, కాస్త జ్ఞానం ఉంటే చాలు". ఇవి నిర్ణయం కథలో రమణి పాత్ర ద్వారా రచయిత్రి భండారు విజయ పలికించిన మాటలు. సమస్యలను గ్రహించే శక్తి, జ్ఞానానికి తోడు ఒక సున్నిత హృదయం, పదునైన వ్యక్తీకరణ, సామాజిక అవగాహన రచయిత్రి కథనానికి మరింత పదును చేకూర్చాయి.

"మంచినీళ్ళు" కథ ఉపరితలంలో ఒక కుటుంబానికి చెందిన కథగా కనబడు తున్నప్పటికీ ఒక వ్యవస్థ అన్ని విధాలుగా పతన మవడానికి గల కారణాలను అన్వేషించింది. కళకళలాడే పల్లెలు ఫ్యాక్టరీల దెబ్బకి కుదేలవడం, భూగర్భజలాలు అడుగంటిపోవడం లాంటి విషయాలతోపాటు దూరం వెళ్ళి నీళ్ళు తేవడానికి మగవాడు తనవయస్సులో సగానికిపైగా తక్కువ ఉన్న స్త్రీలను వివాహం చేసుకోవడాన్నీ చర్చించింది. మూడు కాన్పులై ఒంట్లో సత్తువ పోయిన సువర్ణ భర్త నారాయణ తనకన్నా ఇరవైయేళ్ళు చిన్నదైన ఆనందిని రెండో వివాహం చేసుకున్నప్పుడు **"అయినా అది మాత్రం ఏం జేస్తది? తినడానికి వాళ్ళమ్మ గారింట్లో తిండికూడా లేదని దాన్ని నా పదుచు మగడుకు కట్టబెట్టింద్రు వద్దని చెప్పడానికి అదేమన్నా మగాడా? తనలాంటి ఆడది అయిపోయే. ఈ సమాజంలో ఆడోళ్ళకు ఇష్టాలు ఎక్కడున్నాయి గనుక! మగాడు ఏంజేసినా చెల్లుతుంది. ఆడోళ్ళకు గా స్వతంత్రమే ఉంటే తనకన్నా పదేళ్ళ పెద్దోడ్ని గీ నారాయణను తను మాత్రం ఎందుకు జేసుకుంటుంది?"** అనుకుంటుంది సువర్ణ. ఆమె స్వగతానికి మళ్ళీ వివరణ ఇవ్వనవసరం లేదు. స్త్రీని పనికీ, సంసారానికీ వాడుకోవడం తప్ప ఆమెకు ఎలాంటి నిర్ణయాధికారమూ లేదన్న వ్యథ అది.

'బచ్చేపౌచ్' కూడా స్త్రీల సమస్యల వెనుకవున్న ఆర్థికాంశాలను తడిమేదే. వివాహిత స్త్రీ ఆర్థికంగా వెనుకబడి ఉన్నప్పటికీ కుటుంబం పట్ల ఎంత బలమైన బాధ్యతను కలిగి వుంటుందో రాజవ్వ పాత్ర చెబుతుంది. కుటుంబాన్ని వదిలిపోయిన భర్తను పట్టించుకోకుండా పిల్లల భవిష్యత్తు కోసం కృత్రిమ గర్భాన్ని మోయడానికి కూడా సిద్ధపడుతుంది రాజవ్వ. మరోవైపు సంపన్న కుటుంబానికి చెందిన శ్రీజ సంతానవతి కాకపోవడంతో ఆమె అత్తింటివారు ఆమెను బెదరించే పద్ధతి చూస్తే మంచి ఆర్థికస్థితి కలిగిన స్త్రీ కూడా కుటుంబ హింసకూ, అభద్రతాభావానికీ గురికావలసిందేనన్న విషయం ఈ కథ వివరిస్తుంది.

మనం బ్రతుకుతున్న వ్యవస్థ ఎంతటి అసమసమాజమో, ఎంతటి లొసుగుల మయమో, ప్రాణాలు నిలుపుకోవడానికి పడుపు వృత్తిలో కొనసాగాల్సిన పరిస్థితిలో ఉన్న స్త్రీల జీవితాన్ని "గణిక" స్పష్టం చేస్తుంది. శాంతిగా పేరు మార్చుకున్న గణిక ఒక టి.వి. ఛానెల్‌కు ఇంటర్వ్యూ ఇస్తూ వేశ్యావృత్తిలో ఉన్నవారిని అమానవీయంగా స్వార్థరాజకీయాలకు, స్వలాభాపేక్షకు వాడుకుంటున్న నాయకులను నిర్మొహమాటంగా విమర్శిస్తుంది. **"తమ జీవనగతులను ఏ రోజూ పట్టించుకోకపోగా, కనీసం భరోసాను కూడా యివ్వలేకపోవడం వ్యవస్థాగత లోపం కాదా? తమ అసలు రంగును కప్పిపుచ్చుకుంటూ పీడీ ఆక్టులు పెట్టి, జైళ్ళల్లో పెట్టి మీ కులాన్ని ప్రక్షాళన చేస్తున్నామని, మిమ్మల్ని ఉద్ధరించడానికే అరెష్టులు అని చెప్పడం పెద్దకుట్ర, కుతంత్రాలతో కూడిన రాజకీయమని, తనకు బాగానే అర్థమౌతోంది".** అంటూ సమాజంలోని లొసుగులను బయటపెడుతుంది. అంతే కాకుండా ప్రేమించేటప్పుడు గుర్తురాని కులం పెళ్ళి అయిన తర్వాత చిన్నచిన్న పొరపొచ్చాలకే గుర్తురావడం వెనుక కులాంతర వివాహాలు కుహనా ఆదర్శాలు తప్ప వ్యక్తులలో నైతికమైన ఎదుగుదల ఏమాత్రం లేదని ఉదాహరణలతో సహా వివరిస్తుంది గణిక. ఈ కథకూ, కథాసంపుటికీ కూడా 'గణిక' పేరు ఎంచుకోవడంలో రచయిత్రి సాహసం, అలాంటి వారి పట్ల తన సహానుభూతీ కనబడతాయి.

కులాంతర వివాహాల నేపథ్యంలో చెప్పిన మరో రెండు కథలు 'ఎవరుదోషి', 'నిర్ణయం'. రాఘవ ఇష్టపడిన రాజేశ్వరిని ధైర్యంగా కులాంతర వివాహం చేసుకుంటాడు. మహేందర్ తల్లిదండ్రులకు భయపడి ప్రేమించిన వేరే కులపు అమ్మాయిని పెళ్ళిచేసుకోలేక రాఘవ చెల్లెలు సామంతను పెళ్లి చేసుకుంటాడు. అంతటితో వదిలివేయకుండా ఆమెతో సంబంధాన్ని కొనసాగిస్తూ సామంతకు బాధ కలిగిస్తాడు. ఆదర్శాలను ఆచరణలో పెట్టడాన్ని సమర్థిస్తూ, పిరికితనం జీవితాన్ని నరకం చేస్తుందన్న వివేచన కలిగిస్తుంది. "ఎవరుదోషి" కథ. 'నిర్ణయం' కథ కులాంతర వివాహాలలోని మరో కోణాన్ని స్పృశిస్తుంది. **"కులాంతర వివాహాలు చేసుకోవడమే ఆదర్శంకాదు వాటిని నిలుపుకోవడమూ ముఖ్యమే. ఏ వివాహాల్లోనైనా సుఖదు:ఖాలతో పాటు కొన్ని కష్టనష్టాలు కూడా ఉంటాయి.వాటిని తట్టుకొని నిలబడ్తామని ముందుగా నిర్ణయం చేసుకున్నాకే ముఖ్యంగా మీలాంటివారు కులాంతర వివాహాలు చేసుకోవాలి"** అని అందరినీ ఎదిరించి కులాంతర వివాహం చేసుకున్న కూతురికి తల్లి రమణి హితబోధ చేస్తుంది. 'కమ్యూనికేషన్ గ్యాప్' తప్ప వేరే సమస్య లేనప్పుడు చర్చించి సరిదిద్దుకుంటే ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా జీవితం సాగిపోతుందని ఈ కథ మంచి సందేశాన్నిస్తుంది. చిన్న చిన్న సమస్యలకే కుటుంబ విచ్ఛిన్నానికి పాల్పడేవారిని ఆలోచింప చేస్తుంది. కుటుంబమంటే భార్యాభర్తలే కాదు ఇరుకుటుంబాల సాంగత్యమూ అవసరమనే రచయిత్రి పరిణత దృక్పథం ఈ కథలో కనిపిస్తుంది.

ప్రముఖ స్త్రీవాద రచయిత్రి ఓల్గా అన్నట్లు సంక్లిష్టమైన పితృస్వామ్య వలయం కొందరు స్త్రీలను బలీయంగా ఆకర్షించి అమానుషంగా తయారుచేస్తుంది. 'ప్రశ్నలోని జవాబు' కథలో నీలిమ వదిన అలాంటిదే. కుటుంబాన్నంతా చిన్నాభిన్నం చేసి తన మాట వినలేదని నీలిమపైకి నలుగురు మగాళ్ళను పంపిన మృగం ఆమె. ఇంతచేసినా నీలిమ తనలాంటి, మతిస్థిమితం కోల్పోయిన తన తల్లిలాంటి వారికి ఏదోమంచి చేయాలన్న సంకల్పంతో పురోగమించడం ప్రశ్నలాంటి తన జీవితానికి సమాధానమే.

"నైటీ," 'సుమలత' కథలు హృదయ విదారకమైనవి. సమాజంలో అడుగంటి పోతున్న మానవతకు, మానవ ముసుగులో పెచ్చరిల్లిపోతున్న మృగత్వానికి పరాకాష్ఠగా ఈ కథల్ని చెప్పుకోవచ్చు. బాలికలపై లైంగిక హింసకు పాల్పడే పురుషుల, తోడ్పడే మహిళల అమానవీయతను, పసిపిల్లలపై నిర్దాక్షిణ్యంగా జరిపే హేయమైన దుశ్చర్యలను చదువుతుంటే దుఃఖం ఆగదు. నైటీ కథలో రుక్మిణి, ఆమె కుటుంబం లైంగిక హింసకు గురైన అనాథ బాలిక మౌనిక పరిస్థితికి కదిలిపోయి ఆమెను తమ కుటుంబంలో కలుపుకోడానికి, ఆమెను సాంత్వన పరచడానికి తపించడం చూస్తే సంతోషం కలుగుతుంది. 'సుమలత' కథ కన్న తండ్రి చేతిలో అత్యాచారానికి గురైన అభాగ్యురాలిది. తన చెలెళ్ళకు తన లాంటి పరిస్థితి రాకూడదని తపించి తాను నర్సింగ్ ట్రైనింగ్ తీసుకొని చెల్లెళ్ళను చదివించి వారి జీవితాలను తీర్చిదిద్దడమే కాకుండా తన జీవితాన్నీ అందంగా మలుచుకున్న 'సుమలత' ఎంతోమంది ఆడపిల్లలకు స్ఫూర్తిని కలిగిస్తుంది. స్త్రీకి ఉన్న ఆత్మవిశ్వాసం ఎంత విలువైనదో అది ఆమె జీవితానికి ఎంతటి వెలుగునిస్తుందో సుమలత పాత్ర ద్వారా రచయిత్రి నిరూపించారు.

"పెళ్ళిచూపులు" కథ కూడా జీవితాన్ని సుఖమయం చేసుకోవాలంటే బాధిత మహిళలు ధైర్యాన్ని, జీవితం పట్ల సానుకూల దృక్పథాన్ని అలవరుచుకోవాలని చెప్తుంది. తనపై జరిగిన లైంగిక దాడి జ్ఞాపకాలు రేవతిని వదలకుండా వేధిస్తూ వివాహానికి అడ్డుపడుతుంటాయి. వికారమైన మచ్చతో వివక్షను, కుంగుబాటును ఎదుర్కొని ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలనుకున్న రాకేష్ నిజాయితీగా రేవతిని అంగీకరించడం ఇరు జీవితాలలో వెలుగును నింపే అంశం. ఒంటరిగా ఉన్న ఆడపిల్లల్ని, మహిళల్ని టార్గెట్ చేసే దుర్మార్గుల అకృత్యాలకు మౌనంగా క్రుంగిపోవడం కాకుండా చట్టప్రకారం శిక్షింపజేసే తెగువను స్త్రీలు నింపుకోవలసిన అవసరాన్ని రాకేష్ మాటల్లో చెబుతారు విజయ.

'భరోసా, ఫైల్డ్‌లెస్ సింద్రోమ్' కథలు రెండూ స్త్రీని వంచించడానికి మగాడు పన్నే కొత్త కొత్త పన్నాగాలను విశదంచేసి భర్తలను గుడ్డిగా

నమ్మే భార్యల నమ్మకాన్ని పటాపంచలు చేస్తాయి. ప్రేమించి పెళ్ళి చేసుకున్న తర్వాత తన విశృంఖల జీవనాన్ని సమర్థించుకోడానికి వివేక్ భార్యపై పిచ్చిదానిముద్ర వేయాలనుకొని ఆమె, ఆమె పిల్లల ఆత్మవిశ్వాసం ముందు విఫలం కావడం 'భరోసా" ఇతివృత్తం. 'చైల్డ్‌లెస్ సిండ్రోమ్' కథలో ఉద్యోగస్తురాలైన భార్య రాధికను తన కుటుంబ అవసరాల కోసం వాడుకొని ఆమెకు పిల్లలు పుట్టకపోవడానికి అసలు కారణమైన తన లోపాన్ని కప్పిపుచ్చుకోడానికి ఆమెలోనే ఏదో లోపం ఉన్నట్లు నమ్మిస్తాడు. తన అనైతిక సంబంధాలు గమనించకుండా ఉండడానికి ఆమెలో నిరాశా నిస్పృహలు పెరిగేలా మందులు వేస్తుంటాడు రాజేష్. అంతే కాకుండా బయటి వారి నుండి సానుభూతి పొందడానికి, తమకు పిల్లలు కలగకపోవడానికి కారణం ఆమె సహకరించకపోవడమేనని అబద్ధాలు చెబుతుంటాడు. రాజేష్ నిజస్వరూపం తెలుసుకున్న రాధిక ఆ సాలెగూడు నుంచి బయటపడి ముందడుగు వేయడం రచయిత్రి ఆ సమస్యకు చూపిన పరిష్కారమే అనుకోవచ్చు.

"తెగింపు" "రేపటితీర్పు" మీడియాలో వచ్చిన వార్తలకు స్పందించి కథలుగా మలిచినవి. "తెగింపు"లో పార్వతి పన్నెండో తరగతి వరకే చదివినా పెళ్ళిపీటల మీదకు కూడా తాగివచ్చిన వరుడిని నిర్మొహమాటంగా తిరస్కరిస్తుంది. పెళ్ళి ఆగిపోతే ఆడపిల్లకు మళ్ళీ పెళ్ళవడం కల్ల అనే మాటను రచయిత్రి నిర్ద్వంద్వంగా తిరస్కరించి స్త్రీ ఏవిధంగా జీవించాలో నిర్ణయించుకోగల అధికారం అమెకే ఉందన్న నమ్మకాన్ని, ధైర్యాన్ని కలిగిస్తుంది. "రేపటితీర్పు"లో అమాయకురాలైన రేవతి కుటుంబ హింసను భరిస్తూ కట్నంగా తెచ్చిన డబ్బునే కాక తన కిడ్నీని కూడా భర్తకిచ్చి అతడిని బ్రతికిస్తుంది. అయినా మరిది చేతిలో అత్యాచారానికి, ఆపై హత్యకు గురవుతుంది. పక్కింటి అనసూయ రాధిక అత్తింటివారికి పడే శిక్ష మిగిలిన ఆడపిల్లలకు ధైర్యాన్నిచ్చేదిగా ఉండాలని ఆ దిశగా కృషిచేస్తుంది. స్త్రీల పై జరిగే అత్యాచారాలకు కఠిన శిక్షలు పడాలన్న తీవ్రకాంక్ష విజయ కథనంలో కనిపిస్తుంది.

"శారద" కథలో శారద రెండుసార్లు నమ్మిన పురుషుడి చేతిలో మోసపోయినా స్వయంకృషితో మంచి జీవితాన్ని పొందుతుంది. ఆమె మంచితనంతో తన పిల్లల బ్రతుకు తీర్చిదిద్దటమే కాకుండా మోసగించిన మగాడిపై, అతని పిల్లలపై కూడా మానవత్వాన్ని ప్రసరింపజేసి వారికి కూడా అండగా నిలబడుతుంది. దగా పడిన చరిత్రను చెప్పడమే కాక ఎలా బయటపడాలో కూడా చెప్పే కథలు ఇవి.

"దారిదీపం"లో వసుధ ఆమె కూతురు శ్వేత సంఘంలో పెద్దమనిషిగా చలామణి అవుతూ, ఇతర స్త్రీలతో లైంగిక సంబంధాలు నడుపుతున్న రాజశేఖరానికి దూరం జరిగి అతడిని ఒంటరిగా నిలబెట్టడం అతడికి విధించిన శిక్ష. స్త్రీలు గాయలుచేసే వివాహసంబంధాల్లో రాజీపడుతూ బ్రతకడం కంటే అందులోంచి బయటపడి సంతోషంగా బతకడమే మంచిదన్న భావన విజయ కథల్లో కనిపిస్తుంది.

"ఎలుగుబంటి" కథ మహిళలకు శక్తిని, ధైర్యాన్ని, తెగువను అందించే కథ. పల్లెటూరి యాదమ్మ వేధిస్తున్న మొగుడుని దేహశుద్ధి చేసి దారికి తెచ్చుకున్న వైనం అబ్బురమనిపిస్తుంది. స్త్రీకి అబల అనే పేరు అతకదని చెప్తుంది యాదమ్మ పాత్ర. ఒదిగి వుండే స్త్రీ అవసరమైనపుడు ఎలుగుబంటి లాంటి మొగుడుని అదిలించి పిల్లిలా మార్చవలసిందేనన్న సందేశమిస్తుంది ఈ కథ.

"రిటైర్మెంట్ కథ కూడా ఆలోచింపజేసే కథ. స్త్రీకి ఉన్న సహజమైన ప్రేమాభిమానాలు, జాలి, కరుణలాంటి మానసిక అంశాలు కొన్నిసార్లు అడ్డంకులుగా మారే పరిస్థితిని ఈ కథ వివరిస్తుంది. బాధ్యతలనుండి తప్పించుకొని పారిపోయిన భర్తను పిల్లలమాట కాదనలేక ముసలితనంలో భరించవలసిరావడం ఈ కథ ప్రధానాంశం. సునంద తప్పనిసరి పరిస్థితులల్లో అతన్ని అంగీకరించి తాను చేసే సామాజికసేవలో అతనికీ భాగం కల్పిస్తుంది. సగటు పాఠకులకు మాత్రం పిల్లలు రిటైరైన తల్లిని ఇబ్బంది పెట్టకుండా అతనికి మరోదారి వెతికి ఉండే బాగుండేది అనిపిస్తుంది.

"సుశీల లేచిపోయిందా!" కథాంశం ఆత్మవిశ్వాసంతో వ్యవహరించే మహిళలందరికీ అనుభవ పూర్వకమే. తమ జీవితాలకు సంబంధించిన నిర్ణయాలు తామే తీసుకొని ధైర్యంగా వ్యవహరించే మహిళల పట్ల తేలికగా వ్యవహరించే సమాజానికి సుశీల అపవాదులు మోస్తూకూడా తన జీవితాన్ని తీర్చిదిద్దుకున్న విధానం ఒక చెంపపెట్టు. తన ప్రమేయం లేకుండా వచ్చే అపవాదులను నివృత్తి చేయాల్సిన అవసరం లేదన్న సందేశం ఈ కథ నుండి వినిపిస్తుంది.

రచయిత్రి 1984 నుండి కవయిత్రిగా సృజనరంగంలో ఉంటూ 2020తో కథారచయిత్రిగా అవతరించడం ఒక ప్రయోజనాన్ని ఆశించి చేసినపనే కావచ్చు. సాధారణంగా కవిత్వం సమస్యను చక్కగా ఆవిష్కరించగలదు గానీ పరిష్కారాన్ని చూపలేదు. ఈ పరిమితిని కథ / నవల అధిగమించగలవు. సమర్థతగల రచయిత కథను / నవలను సమాజానికి నకలుగా వర్ణిస్తూ పరిష్కారాలనూ చూపగలరు. భండారు విజయ ఈ కథల్లో చేసిన పని ఇదే. స్త్రీ జీవితంలో ఎన్ని విభిన్న సమస్యలకు ఆస్కారముంటుందో వాటన్నిటినీ విభిన్న కథారూపాలలో ప్రస్తావించడమేకాక ప్రతి సమస్యకూ ఒక పరిష్కారమార్గాన్నీ సూచించారు. రచయిత్రి కంఠస్వరం నుండి కాక ఆయా స్త్రీ పాత్రల తెగువే తమ సమస్యలకొక పరిష్కారం చూపించినట్లు వర్ణించడం విశేషం. సువర్ణ, ఆనంది (మంచినీళ్ళు), శాంతి (గణిక), సునంద (రిటైర్మెంట్), రాజవ్వ, శ్రీజ (బచ్చేపాచ్), నీలిమ (ప్రశ్నలోనే జవాబు), శారద (శారద) సుశీల (సుశీల లేచిపోయిందా), సుమలత (సుమలత), మౌనిక (నైటీ), రేవతి (పెండ్లిచూపులు), రాధిక (చైల్డ్‌లెస్ సిండ్రోమ్), సామంత (ఎవరుదోషి?), రాధిక (రేపటితీర్పు) యాదమ్మ (ఎలుగుబంటి), వసుధ (దారిదీపం) మొదలైన పాత్రలు సమాజంలో సరైన ముగింపు లేని లేదా సరైన ముగింపు చెప్పలేని అనంతమైన కథలకు (స్త్రీ సమస్యలకు) ప్రతీకలు. ఒక్కో పాత్ర ఒక్కో సమస్యకు చిరునామా. గణిక కథానంపుటి తప్పకుండా పాఠకులకు అనంతమైన స్త్రీల సమస్యల పట్ల ఒక అవగాహన కలిగించి వారిలో ఒక స్ఫూర్తిని రగిలింపచేస్తుందనేది నిర్వివాదం. ✦

# కురుబ, కురుమ చారిత్రక వీరవనితలు, సాహిత్య కృషి

డా॥ బి. నాగశేషు

**భారతదేశంలో** అనేక కులాలు, మతాలు ఉన్నాయి. ఆయా కులాలకు మతాలకు వాటి ప్రత్యేకమైన చరిత్ర, సంస్కృతి సంప్రదాయాలు కలిగి ఉన్నాయి. కులాలన్నీ ప్రాచీనమైనవని తెలుస్తుంది. మరి ఎక్కువ తక్కువలు ఎక్కడనుండి వచ్చాయో వారి సృష్టికర్తలెవరో సమాజాభివృద్ధిని పరిశీలిస్తే తెలుస్తుంది. విభిన్న సంస్కృతులు కలిగిన కులాల గురించి కులపురాణాలలో చెప్పారు. తెలుగు కన్నడ ప్రాంతాలలో కురుబల సంస్కృతి సంప్రదాయాలు ఏ విధంగా ఇతర కులాలకంటే విభిన్నంగా ఉన్నాయో తెలుసుకొందాం. కురుబలను వివిధ ప్రాంతాల్లో వివిధ పేర్లతో పిలుస్తారు. అంతేకాకుండా వారి సంస్కృతి సంప్రదాయాలు కూడా ప్రాంతానికి ప్రాంతానికి వేరుగా ఉన్నాయి. భారతీయ స్త్రీల స్థానమానాల విషయం గురించి ప్రస్తావిస్తే 12వ శతాబ్దపు కన్నడ శరణుల వచన సాహిత్యం మొలెముడిబందరెహెణ్ణంబరు, గడ్డ, మీసెబందరె గండెంబరు అని స్త్రీ పురుష తారతమ్యాన్ని వ్యతిరేకించినా, శరణతత్వం కంటే మనుతత్వం పురుష ప్రపంచాన్ని బాగా ఆకర్షించింది. స్త్రీల శారీరక అవయవాల అభివృద్ధిని శాపంగా చూసే సమాజంలో ఏ జాతి స్త్రీ కూడా ఈ వివక్షకు అతీతం కాదు, కాకాపోతే నిమ్నవర్గాల స్త్రీలు శారీరక, మానసిక, ఆర్థిక కులపర వివక్షలను అదనంగా మోయాల్సి ఉంటుంది. మొత్తంగా ఏ జాతి స్త్రీ బాధల రాగమైనా ఒకేవిధంగా ఉంటుంది ఆలాపనే కాస్త భిన్నంగా ఉంటుంది. గుంపు పరంగా ఎక్కువున్నా, సామాజికంగా వెనుకబడిన కురుబ వర్గ మహిళ చారిత్రకంగా ఏ విధమైన ప్రస్థానాన్ని పొందింది అని ఒక్కసారి చరిత్ర పుటల్లోకి తొంగిచూస్తే తెలుస్తుంది.

కురుబ కులానికి కర్ణాటకలో కురుబ, గౌరవ, గోండ, రాజగోండ అని తెలుగు రాష్ట్రాలలో కురుబ, కురుమన్ అనే పేర్లతో పిలుస్తారు, అస్సాంలో గొండ్ల, ధనవరా అని, గుజరాత్లో గడాలియా, అహీర్, ధనగర్ అని, బీహార్లో ధనగర్, గడెవియా అని, హరియాణలో బంగీల, బరేల, బిర్లా, కలనాలియా అని, హిమాచల్‌ప్రదేశ్‌లో గదేరియా అని, జమ్మూకాశ్మీర్ గడ్డి, కేరళలో రాజగొండ, గోదారి, హెగ్డె, గౌడి, పులయన్ అని, మధ్యప్రదేశ్‌లో ధనగర, బాగ్లా, గాడ్రి, హతగార్, పాల్, కురుయర్ అని, మహారాష్ట్రలో ధనగర్, కురుబర్, గడారియా అని, మేఘాలయలో కుమర్, రుద్రపాల, గొండ, ఒరిస్సాలో కురువన్, కురుంబ, మధ్యగొండ అని పిలుస్తారు. పంజాబ్‌లో గడారియా, గదారియా, రాజస్థాన్‌లో గడారియా, చండాలియా, గావళ, అని తమిళనాడులో కురుంబ, గొండ అని త్రిపురాలో గొండ, కురారియా అని ఉత్తరప్రదేశ్‌లోగడ్డి, గడారియా, పాల్ అని పశ్చిమబెంగాల్లో గొండ, గుదేరి, పాల్ అని ఛండీఘడ్‌లో గడారి, గడ్డి అని ఢిల్లీలో గడ్డి, గాగ్రికుమార్ అని గోవా, దామన్‌లలో ధనగర్ అని పాండిచ్చేరిలో కురుబ, మొద్యగొండ, రాజగొండ అని పిలుస్తారు. మొత్తంగా దేశవ్యాప్తంగా కురుబ కులం వ్యాపించింది. కురుబ, గొండ, గౌరవ, ధనగర అనే పేర్లు సామాన్యంగా కనిపిస్తాయి. వీరిలో కురుబలు కాస్త ఆధునీకరణ చెందినవారు కురుబలో కురు, గొండలో కొండ అనే రెండు శబ్దాలు కొంచెం ఎత్తు ప్రదేశాలను సూచిస్తాయి, ఒకరకంగా కొండగుట్టలల్లో నివశించేవారని, కర్ణాటకలో హట్టి అని పిలిచేలాంటి ప్రదేశాలలో నివసించేవారని తెలుస్తున్నది. పేర్లు వేరేవేరే అయినా సాంస్కృతికంగా వీరందరూ ఒకే వర్గానికి చెందినవారే ఈ కులాల్లోని మహిళల బాధలు కూడా ఒకటే.

చారిత్రకంగా కూడా చాలా ప్రాచీనకాలం నుండే కురుబలున్నట్లు తెలుస్తున్నది. జానపద పురాణాల్లోను, జానపదుల కథల్లోను, పొదుపుకథల్లోను, సామెతల్లోను కులగురువుల గురించి చర్చించారు. ఈశ్వరుని అంశతో పుట్టారని చాలా శ్రేష్టమైనవారని ఐతిహ్యాలలో ఉంది. వీరిలో మహిళకు ద్వితీయస్థానాన్ని కట్టిపెట్టారు, డా॥ వీరణ్ణదండె సంపాదించిన ఆలు మతస్థుల మహాకావ్యంలో కురుబల అనేక విషయాలు చారిత్రకంగా చర్చించబడ్డాయి. వీరు బీరప్ప, మాళప్ప, జక్కప్పలు ఆరాధ్య దైవాలుగా కొలుచుకొంటారు, అంతేగాకుండా రేవణసిద్దేశ్వరుడు, అరకేరిఅమోఘసిద్ధ కూడా కులగురువు, మైలారలింగ ఆరాధ్యదైవం, కురుబలకు సుదీర్ఘ చరిత్ర ఉంది, ఇంతటి ప్రాశస్త్యం ఉన్న కురుబలు తదనంతరకాలంలో కనిపించకపోవడం చరిత్ర వక్రబుద్ధికి నిదర్శనం. భారతదేశంలోని దక్షిణాపథంలోని సమాధులు, ఇతర అవశేషాలను ఆధారంగా వంశ శాస్త్రజ్ఞులైన హ్యడాన్‌గారు కురుబల చరిత్రను క్రీ.శ.4000–5000 వెనుకటిదని చెప్పారు మధ్య ఏషియా నుండి బయలుదేరి వారి మూలాలను వెతుకుతూ కైబర్ బోలన్ మార్గం గుండా భారతదేశంలో ప్రవేశించి, వారి సంస్కృతిని నిర్మించుకొన్నారు అని ఆయన చెప్తారు. కురుబలను హట్టికారులని పిలిచేవారు, వీరి గురించి రుద్రాధ్యాయంలో ఉంది. క్రీ.శ.12వ శతాబ్దం నాటికే కురుబ సమాజం బాగా పేరుగాంచినదని శంబాజోషి అభిప్రాయపడ్డారు. క్రీ.శ. మూడవ శతాబ్దం నాటికే కురుబలు రాజులై అధికారంలో ఉన్నారని సర్, డబ్లు ఇలియట్ అభిప్రాయపడ్డారు. దక్షిణ భారతదేశంలో దొరికిన అతిప్రాచీన నాణాలు కురుబలవే అని అంటారు ఇలియట్.

కురుబలు మొట్టమొదట స్థాపించిన పట్టణం పులాల, ఈ రాజ్యానికి కురుంబరు అని పిలిచేవారు కేరళలోని మలబారు జిల్లాలో ఈ ప్రదేశం నేటికీ ఉంది. విజయనగర సామ్రాజ్యానికి పునాది వేసిన అక్క, బుక్కలు, కదంబులు, పల్లవులు, దేవగిరి యాదవులు, ఇందూరు హోళ్కర్, బడోదయగాయకవాడులు, రాష్ట్రకూటులు వీరందరూ కురుబలనే చరిత్రకారులు నిర్ణయించారు. ఇంతటి సుదీర్ఘ చరిత్రలో ఎక్కడా కురుబ మహిళ హాజరు లేదు. అహల్యాబాయి హోల్కర్ అనే మహిళ తప్పితే

చరిత్ర వెలుగులో ఏ మహిళ కనబడలేదు. కురుబలు రాజులుగా ఉన్న రోజుల్లోనే మహిళలు వెలుగులోకి రాలేదు. కానీ అక్కడక్కడ మెరుపులాగా మెరిసిన కొంతమందిని పరిచయం చేసుకొందాం.

## దానచింతామణి కంచికబ్బె

బెళగావి జిల్లా బైలహొంగల సమీపంలో సొగల క్రీ.శ. 980లోని శాసనంలో కంచికబ్బె అనే కురుబ మహిళ ప్రస్తావన ఉంది, ఒక రకంగా శాసనాలలో దొరికిన మొట్టమొదటి కురుబ మహిళ. ఈమె వీరుబెళవడియ రాజైన కరియకేతిమయ్య భార్య, 65 వరుసల శాసనంలో 35 వరుసలు కంచికబ్బె వర్ణన ఉంది.

పరహిత గుణ చరితద ధన
గరగోత్రద కంచియబ్బె మాతారత్నం
ధరెగెసెవ ధా నదర్మద
పరిణతికెయ పిరిదు పరమ మహేశ్వరియే. (దానచింతామణి కంచికబ్బె)

## ఆముగె రాయమ్మ

ఈమె రాసిన 116 వచనాలు లభ్యంగా ఉన్నాయి. శరణుల సమాజోద్ధరణ ఉద్యమంలా తాను పొందిన సామాజిక, ధార్మిక సమానత్వాన్ని మరియు వ్యావహారిక జాగృతిని తనకే పరిమితం చేసుకోకుండా, సామాజిక శుద్ధీకరణ కోసం, సామరస్య జీవితం కోసం ఆసక్తిని విస్తరించుకోవడం నిమ్నవర్గానికి చెందిన వచన కవయిత్రుల విశేష సాధన, తత్త్వనిష్ఠ, వ్రతాచారం పట్ల గౌరవం సత్యశుద్ధి ఇవన్నీ ప్రామాణికమైన బతుకును బతకడానికి మూలసూత్రాలయ్యాయి.

సమకాలీన ధార్మిక మరియు సామాజిక పరిస్థితుల గురించి రాయమ్మ విస్తృతంగా ఆలోచించారు. వాస్తవ జీవితంలోని వైరుధ్యాలు రాయమ్మను తీవ్రంగా తట్టిలేపాయి. అందువల్లే రాయమ్మ వచనాల్లో స్వానుభవంతో పాటు సామాజిక ప్రజ్ఞ, ఆసక్తి ప్రధానంగా కనిపిస్తాయి. ఏదైనా విషయం పట్ల తీవ్రంగా ఆలోచించే మనస్తత్వం కాదు, ఆత్మనిర్భరత, ధైర్యం, న్యాయం, కర్తవ్యనిష్ఠ, రాయమ్మ గుణస్వభావాలు. రాయమ్మ మాటల్లో వ్యంగ్యం, కటువైన భాష, ఏదైనా మొహమాటం లేకుండా అవతలి వ్యక్తికి చెప్పడం లాంటి విషయాలు ఈమె స్వభావాన్ని తెలిపే గుణాలుగా ఈమెకు విశేషమైన గుర్తింపునిచ్చాయి. ఉన్నతకులాలు అని పిలవబడేవాళ్ళు క్రింది కులాలపట్ల చూపే తారతమ్య నీతి, అహంకారపు మాటలు, అనైతికత, అసమానతలను చూసి కోపంతో రగిలిపోయారు. వాటన్నింటినీ ఎప్పటికప్పుడు ప్రతిఘటిస్తూ ఖండిస్తూ వాటి పట్ల తన స్వరాన్ని పెంచటం రాయమ్మ వ్యక్తిత్వానికి నిదర్శనం.

స్వతహాగా స్వాభిమానురాలైన రాయమ్మ తనలో ఉండే ఆత్మవిశ్వాసం జాగృతి ఆనాటి స్త్రీ లోకానికి మార్గదర్శకాలయ్యాయి.

అరివే (జ్ఞానమే) గురువు అంటారు. మనకు బుద్ధి (తెలివి) ఉంటే గురువు అనేవారు అనవసరం అంటారు. తెలివి ఉన్నవారికి గురువు అవసరం ఏముంటుంది? తెలివి ఉన్నవారికి భయం ఏముంటుంది. తెలివి ఉన్న వారికి జంగమభయం ఎందుకు అని ప్రశ్నించే రాయమ్మకు గురులింగ జంగమతత్త్వాలు తెలివి సంపాదనకు సాధనాలే కానీ అవే లక్ష్యాలు కాదు అనే స్పష్టత ఉంది.

## విజయనగర రాణి గంగాంబిక

14వ శతాబ్దం కర్ణాటక చరిత్ర పుటల్లో కనిపించే ఇంకొక పేరుగాంచిన మహిళ, విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన సంగమ వంశపు కోడలు గంగాంబిక. బుక్కన్నరాజు కొడుకైన కంపణ్ణ భార్య ఈమె. సంస్కృతభాషలో 'మధురావిజయం' లేదా 'వీరకంపరాయచరితం' రచించారు. సంస్కృతంలో పాండిత్యం గడించడం చాలా గొప్ప విషయం. ఒక చారిత్రక కావ్యాన్ని రాసేంతటి జ్ఞానాన్ని ఒక వెనుకబడిన వర్గ రచయిత్రి సంపాదించిందంటే అదొక చరిత్రగా చెప్పుకోవచ్చు. తన భర్త ముస్లింల నుండి మధురైను వశం చేసుకోవడం, ముస్లింల పాలనలో దక్షిణ భారతదేశంలో వైదికధర్మం, సామాన్యుల జనజీవితం ఎంత హీనాతిహీనంగా ఉండేదో ఈ కావ్యాన్ని చదివితే అర్థమవుతుంది. ఈ కావ్యంలో రచయిత్రి కూడా ఒక పాత్రగా కనిపించడం కొసమెరుపు.

## రాణి అవ్వమ్మ

16, 17 శతాబ్దంలో బళ్లారి పాలేగాళ్లలో అవ్వమ్మ రాణి ప్రస్తావన ఉంది. విజయనగర రాజుల పతనానంతరం బళ్లారి ప్రాంతం చిన్నచిన్న పాలేగాళ్ల వశమైనది. వారిలో బళ్లారి పాలేగారుడైన బాలద హనుమప్ప నాయకుడు ఒకరు. ఇతను కురుబ కులస్థుడని గెజిట్, కైఫీయతులు స్పష్టంగా చెబుతున్నాయి. బాలదహనుమప్ప కొడుకైన రామప్ప నాయకుని భార్యే అవ్వమ్మ. నేటికీ బళ్లారిలో అవ్వమ్మ పేరుతో బావి ఉన్నది. పరిపాలనలో చాలా మంచి పనులు చేశారు అవ్వమ్మ.

## వీరరాణి బెళవడి మల్లమ్మ

17వ శతాబ్దంలో దాదాపు మున్నూట అరవై గ్రామాల అధిపతి అయిన ఈశ ప్రభువు భార్య మల్లమ్మ పేరు కూడా చరిత్రలో లిఖించదగ్గది. మల్లమ్మ పేరుమీద మరాఠీ దాఖలాలు, కైఫీయతులు ఇవన్నీ మల్లమ్మ చరిత్రను తెలియజేస్తాయి. మల్లమ్మ పతి ఈశప్రభు శివాజి యొక్క మరాఠ సైన్యంతో పోరాడి యుద్ధంలోనే మరణిస్తాడు. మల్లమ్మ కదనరంగంలోకి దూకుతుంది ఎంత పోరాటం చేసినా మరాఠ సైన్యం చేతిలో ఓడిపోతుంది. శివాజీ ఆమెను ఎంతో గౌరవంగా చూసుకొంటాడు. నీలాంటి సుందర వీరనారి కడుపున నేను పుట్టి వుంటే ఎంతో అందంగా కనిపించేవాన్ని కదా అంటాడు. ఆమెతో యుద్ధం చేసే సమయంలో అనుచితంగా ప్రవర్తించిన సుకజి అనే సైన్యాధ్యక్షుని కళ్లు పీకేపిస్తాడు. కురుబ మహిళలు రాజకీయంగానే కాకుండా ఆధ్యాత్మికరంగంలో కూడా రాణించారు.

## ఇటగి భీమవ్వ

ఆధ్యాత్మికరంగంలో ఇటగి భీమవ్వకు అంత పెద్ద ఘనమైన స్థానాలేమీ లేవు. తన భర్త అయిన ఒగెదాడప్ప యధార్థబుద్ధి వల్ల భీమవ్వ ఇహ పర జీవితాలను సమానంగా గడిపింది. ఆధ్యాత్మికతను కాలయాపన కోసం కాకుండా రాట్నం పెట్టి నూలు వడుకుతూనే ఏకాగ్రతతో ఒకవైపు దైవచింత మరొకవైపు ఆదాయ సమీకరణ రెండిటిని సమానంగా చూసింది. తన జీవనోపాధికి రాట్నాన్నే సాధనంగా నమ్ముకొన్నది. కాళీగా కూర్చుని ఊసుపోని కబుర్లతో కాలాన్ని గడపకండి. చేతిలో ఒక రాట్నం ఉంటే నూలు తీసుకొని నెమ్మదిగా

బతకవచ్చు, అంటూ స్వావలంబన బతుకు గురించి చెబుతుంది. హిందూ ముస్లిం మతాల మధ్య సామరస్యాన్ని తీసుకొచ్చింది భీమవ్వ.

## సజ్జల గుడ్డ శరణమ్మ

కుష్టగి తాలూకు ముదనూరులో శరణమ్మ జన్మించారు. చిన్నతనంలోనే తండ్రిని పోగొట్టుకొన్నది. తల్లి పోషణలో పెరిగింది. ఊరూరు తిరుగుతూ సజ్జలగుడ్డలో స్థిరపడింది. గుడదూరు దొడ్డబసవార్య నుండి లింగదీక్ష స్వీకరించి, గురూపదేశం తీసుకొంటుంది. ఒక బహుజన సమాజానికి చెందినది అందునా స్త్రీ అయి అంతమాత్రం పేరు గడించిందంటే అదొక పెద్ద సాధనగానే పరిగణించవచ్చు. భారతజాతి జీవితానికి ఆయువుపట్టులాంటి వృత్తి అయిన పశువుల పెంపకం, వ్యవసాయం రెండింటినీ సమానంగా నెరవేర్చి, జాతి మనుగడకు పునాదులు వేసిన కురుబలు చరిత్రలో అణగారిపోవడానికి కారణాలు తెలియరాలేదు.

వీరి ఆచార వ్యవహారాలు గమనిస్తే వింతగా అనిపిస్తాయి. కురుబలలో పత్తి కంకణం, ఉన్ని కంకణం అని రెండు సంప్రదాయాలున్నాయి. ఈ ఆచారం బహుశా గొర్రెలు కాసేవాళ్లు ఉన్ని అందుబాటులో ఉండటంవల్ల వారు ఉన్ని కంకణాన్ని, వ్యవసాయదారులు పత్తి కంకణాన్ని ఉపయోగించుంటారు. అది కాలక్రమేణ ఒక సంప్రదాయంగా పరిణమించి పత్తి కంకణం కట్టుకొనేవాళ్లు, ఉన్ని కంకణం కట్టే వాళ్ల ఇండ్లల్లో పెళ్లిళ్లు చేసుకోరు, పత్తి కంకణం కట్టుకొనేవాళ్లు కురుబల్లో శ్రేష్టులు అనేంతగా స్థిరపడింది. నిజానికి ఇద్దరూ ఒకటే. వాళ్ల వాళ్ల అనుకూలంగా వాళ్లు నడుచుకొన్నారు తప్పితే, కంకణం ఏదైనా ఒకటే. ఇద్దరూ సమానమే. పూర్వం కురుబల్లో స్త్రీలు స్నానం చేయడమంటే అదేదో అపవిత్రమైనదనే భావన వ్యవసాయం చేసే స్త్రీలలోను, గొర్రెలు కాసే స్త్రీలలోను ఉండేది. కారణం వీరికి ప్రత్యేకంగా స్నానపు గదులు ఉండేవికాదు. ఇంటి ప్రధాన ద్వారం మూసేశారంటే అప్పుడు వారు స్నానం చేస్తున్నట్లు లెక్క. స్నానం చేయాలంటే ఒక కారణం ఉండాలి. లేదా పండుగ. ఇది ఒకనాటి మాట. నేడు చాలా నాగరికతగా కురుబలు జీవిస్తున్నారు. గోండు మహిళలు చీరను కాళ్లు కనపడకుండా కట్టుకొనేవారుకాదు. కేవలం మోకాళ్ల వరకే చీర కట్టుకొనేవారు. ఎదపైన కొంగువేసుకొనేవారు. వీపంతా కనిపంచినా పట్టించుకొనేవారు కాదు. ఇప్పుడు పరిస్థితిలో మార్పు చాలా వచ్చింది. భర్త చనిపోతే భార్య తాళిలోని ఒక చిన్న ముక్కను భర్త నోట్లో వేసేవారు. వైద్యానికి దూరంగా ఉండే గోండులు అడవుల్లో కలియతిరిగి ఆయుర్వేద గుళికలను తయారు చేసుకొనేవారు. ఇప్పుడు వైద్యవృత్తిలో చాలామంది ఉన్నారు. ఇక అమ్మాయిల పెళ్లి విషయంలో సంతలో గొర్రె మాదిరిగా బేరమాడుతుంటారు. ఆడ, మగ తేడా లేకుండా అనేక అగ్ని పరీక్షలు పెడుతుంటారు. వాటినన్నిటినీ నెగ్గుకొని రావడమంటే మాటలు కాదు. అమ్మాయి ఒళ్లంతా చూసేవారు సుడులున్నాయని, ఎదురుసుడి వివాహానికి పనికిరాదని తిరస్కరించేవారు. వక్ష స్థలంలో కాస్త తగ్గుగా ఉంటే అలాంటి ఆడవారు పరీక్షల్లో ఫెయిల్. కన్య కాలివేళ్లు పొడవుగా ఉంటే వివాహానికి అనుకూలవతిగా నిర్ణయించేవారు. అమ్మాయి నిలబడ్డప్పుడు అరికాలు నేలకు తాకకపోతే సంతానం కలగదని పెళ్లికి పనికిరాదని ఫెయిల్ చేసేవారు. ప్రస్తుతం ఇవన్నీ తగ్గుముఖం పట్టాయి. తాను దాటాల్సిన అగ్ని గుండాలు తక్కువయ్యాయి. 14వ శతాబ్దం తర్వాత దాదాపు ఆరు శతాబ్దాలు కురుబ రచయిత్రి కనిపించకపోవడం కారణాలు తెలియరాలేదు. ఆ తరువాత శైక్షణిక (మహిళా విద్యావికాస) ప్రభావంతో అనేకమంది కురుబ స్త్రీలు చదువుకోవడం, సాహిత్య కార్యక్రమాలలో పాలుపంచుకోవడం జరిగింది. ఆధునిక కన్నడ సాహిత్యంలో డా॥ మల్లికా ఘంటిగారు విశేషమైన కృషి జరిపారు. అట్టడుగుస్థాయి నుండి విశ్వవిద్యాలయ కులపతి స్థాయికి ఎదిగిందంటే ఆమెలోని కార్యదీక్షను అభినందించవచ్చు. క్రాంతివీర సంగొళ్లిరాయణ్ణ అహల్యాబాయిహోళ్కర్, ఇటగిభీమాంబ జీవిత చరిత్రలను రాశారు. అంతే కాకుండా అనేక ప్రక్రియల్లో అనేక రచనలు చేశారు. డా॥ సునందమ్మ కూడా కథ, నవల, నాటకం, విమర్శ, పరిశోధన లాంటి మహిళాచింతన రచనలు చేశారు. వాటిలో లేబర్ వార్డునల్లి ఒందుదిన, ద్విత్వ, పరివర్తన, హాలుమతద మహిళె చెప్పుకోదగ్గవి. శ్రీమతి సరోజా ఇట్టణ్ణ గృహిణిగా ఉంటూనే అనేక వైవిధ్యమైన రచనలు చేశారు. సోమణ్ణన కథెగళు, బిసిలు – నెరలు, కాయుతిరు అనేవి ప్రముఖ రచనలు. సరోజా ఇట్టణ్ణ కూతురు విజయశ్రీ నాన్యాకె బరెయుత్తేనె, వచనసాహిత్యదల్లి మహిళె, కంబలి – సాంస్కృతిక అధ్యయన అనే అంశం మీద పరిశోధన చేశారు. డా॥ చంద్రకళా బిదరి ఎచ్చరాదాగ, కెణకదిరి, మహిళాబతుకు అనే రచనలు చేశారు. సునీతా బిరాదార హూదోట, ఒలిదజీవ అనే రచనలు చేశారు. డా॥ అన్నపూర్ణ గోసబాళ తగర పవాడ, సిద్ధమంక చరిత్రె, హాలుమత పురాణ, మాలింగరాయకావ్య, మైలారలింగకావ్య, మొదలైన రచనలు చేశారు. అన్నపూర్ణ నరేంద్ర వచనాలు, గజల్స్ కూడా రాశారు. బెక్కణ్ణు ఉపాయ, పాటీచీల, ముఖ్యమైనవి. సుమలతా అళకవాడి మహిళా బదుకినమజలుగళు అనే రచనలు చేశారు. హరయబ్ కెంచమ్మ, కెందతుంబిద మడిలు, ఆశాకిరణగళు, బాళినబెళకు ఈమె రచనలు. డి.పి. విద్యావతి చుకుచుకుబుకురైలే, విజయామోహన్, కవనకుసుమ, తబ్బలిసారు, కణ్ణి, సరస్వతిగారి హంపియశాసనగళు, కనకదాసరు ఒందుఅధ్యయన వీటితో పాటు చాలా రచనలు చేశారు ఆధునికుల్లో శాసనాలపైన పరిశోధన చేసిన కురుబ మహిళ ఈమె. ప్రేమ్ వాయ్, శోభాతమ్మణ్ణ, డా॥ నళిని లాంటివారు బహుముఖ ప్రజ్ఞ కలిగినవారుగా గుర్తింపు పొందారు. ఇలా ఆధునిక సాహిత్యంలో చాలామంది కురుబ కవయిత్రులు ఉన్నారని తెలుస్తున్నది. చారిత్రకంగా, రాజకీయంగా, సాహిత్యపరంగా, నాటకరంగ పరంగా, సినిమా ఇలా అనేక రంగాలలో నేటి మహిళ ప్రయాణిస్తున్న కాలంలో ఇంతటి గుర్తింపు పొందిన కురుబ కవయిత్రులు ఎందుకు మరుగున పడ్డారో తెలియరాలేదు.


**ఆధారగ్రంథాలు :**

'కురుబమహిళె', 'చెన్నప్ప కట్టి'. 'ప్రసారంగ' కన్నడ విశ్వవిద్యాలయ, హంపి 2017

'కురుబ జనపద (సం)' 'చెన్నప్పకట్టి', 'ఆర్.ఎస్.వాడేద'

'కురుబర హెజ్జెగళు'. 'చంద్రకాంత బిజ్జరిగి'

గల్పిక

# మాకు పనులు సూపించండ్రా...

– శంకరం

**ఏరా** నాగీసూ ఇయ్యాల ఆటో ఎయ్యనేదా? అడిగేడు సూరి ఖాళీగా, కొంచెం డల్‌గా కూర్చున్న నాగేష్‌ను చూసి.

"ఏటెల్లడం లేరా, తత్కుకొడుకులు ఒక్కల్ని ఎగస్టా ఎక్కించుకున్నానని రెండువేలు ఫైనేసేసేడు. సూసేవోల్లకి ఆటోలు నడిపీవోల్లకీ, టాక్సీలు నడిపీవోల్లకీ పదేసి వేలిస్తన్నారని గోలే గానీ 'గోల గోవిందానిదీ, ముదుపులు గోవిందరాజులివీ' అన్నట్టు డీసిల్ ధరలు పెంచీసి, లైఫ్ టాక్సులు పెంచీసి, ఫైన్ల మీద ఫైన్లు గుంజిస్తూ ఒక చేత్తో పదివేలిచ్చినట్టే ఇచ్చి – మరో చేత్తో ఇరవై వేలు దొబ్బుతున్నాడు...."

"మీకే కాదురా, మా రైతుల్కి కూడా సమచ్చరానికి పదమూడేలైదొందలు ఇత్తన్నారు. గానీ ఒకపాలి రెండేలు, ఇంకోపాలి మూడేలు.... అట్టాగిత్తుంటే ఏదో సిన్నా సితకా పన్లకి సొమ్మంతా అనాసరంగా కర్చైపోతంద్రా. యవుసాయానికి మాత్రం పనికిరాడంనేదు. డబ్బులిచ్చి సుకమేటుంది? నీకు తెలుసు కదా నాకు సొంతబూవి ఇరవై సెంట్లు మించి నేదని. మన రంగబావుగారి కాడ ఐదెకరాల్దీసుకోని కౌలు సేత్తన్నానని. మన్రాస్టరంలో లచ్చల్లో నాలాంటి కౌలురైతులుంటే డెబ్భైవేల మందికే ఈ సొమ్ములు కూడా అందుతున్నాయంట. మరి నానెన్ని పుర్రాకులు పడ్డాను నా పేరు అందల రాయించుకోనీకి. ఎన్ని పాట్లు పడ్డా ఏదో ఒక సాకు సూపించి తిరగ్గొట్టెత్తంద్రు. సేసీది నేక పెట్టుబడి కూడా రంగబావునే అడగతన్నాను. ఏటి మిగిల్తుందో ఏదో ఆ బగవంతుడికే ఎరుక. పొలం పన్లేన్నప్పుడు ఏదో ఒక పనికి నానూ, మీ అప్పా ఎల్తన్నాం కాబట్టి ఏదో ఒకిదంగా రోజు గడిసిపోతంది...."

"అంతదాకా ఎందుకురా మా సిన్నమ్మల్ని మనూరు బళ్లోనే ఏసేను. సంవత్సరానికి పదిహేను వేలు ఆల్లమ్మ అకౌంట్లో గవుర్నమెంటు ఏస్తుంది. సరిగ్గా పండుగ ముందు చేసి ఆ డబ్బులు ఆకౌంట్లో పడేసరికి మనాదోల్లందరూ ఆ సొమ్ములట్టుకోని పండుగ బట్టలకనీ, ఖర్చులకనీ తీసికెల్లి షాపుల ఓనర్ల చేతుల్లో పోస్తన్నారు. ఎంతమంది నిజంగా పిల్లల చదువులకి దాస్తున్నారు? ఎక్కడో ఒకలూ, అరా.... అంతే!"

"అంటే ఈ సొమ్ములు కూడా మార్కిట్లోకీ, షావుకార్ల జేబుల్లోకీ, ఎంతో కొంత టేక్సులు కడతారు గామట్టి మళ్లీ గవుర్మెంటోడి సేతికే చేరతన్నాయి. అంతేనా?"

"అవున్రా సూరీ, నువ్వు మీ అన్న పంచలోనే వుంటన్నావు గదా, సొంత కొంప కట్టుకునీ ఆలోచన లేదట్రా?"

లేకనేవిరా బాబూ! గవుర్మెంటు ఫ్రీగా ఇల్లు కట్టిత్తారంటే నాకు గూడా మన్రంగబావు సేత పెసిరెంటుకి జెప్పించి నాకో బెత్తెడు జాగా ఏర్పాటు సేసుకున్నాను. తీరా జూత్తే మన జన్నారం కొండవతల బూవులిచ్చేరు. అదంతా రాళ్ళూ రప్పల్తోసీ, ఎక్కీ దిగీ అన్నట్టుంది. ఎవుడు కట్టుకోని ఉండగలర్రా అక్కడ? మనకి కొంచెం నయమే కాస్త ఎత్తులో వున్నాం కోనంగి వాళ్ళకిచ్చిన జాగాలు చూసావా మొన్న వర్షాలకి ఎలాగ మునిగిపోనయ్యో? ఆటిల్ని ఎత్తు చేసుకోనీకీ బోల్డు కర్సవుద్దట. ఇంగ ఇల్లెలా కడతారో మరి?"

"అద్సరేగానీ సూరీ, ఏవో నానా పాట్లూ పడి మీరు పంటల్ని పండిస్తన్నారు, బానే వుంది, ఈ మజ్జిన రైతులికి ఏయో కేంద్రాలు పెట్టేరట కదా. అందల మీకు పంటలమ్ముకోడం; ఇత్తనాలు, ఎరువులు సబ్సిడీ మీదివ్వడం జరుగుతుందా? అయ్యేట్టిన్తర్వాత రైతులికేవైనా మేలు జరుగుతుందంటావా?"

"సానా సోట్ల అయ్యింకా ఓపినింగే కాలేదు. ఓపినింగైనకాడ అమ్మకాలు జరగవంటే.... రంగు బానేదని, తేవెక్కుపోయిందని ఏదో వంకెట్టి రేటు తగ్గించెత్తన్నారు. అసల్సంగతేటంటే కిందటేడు కొన్న దాన్యానికి ఇప్పటికీ పేమెంటు సెయ్యనేదు. అందుకనే సానామంది రైతులు కల్లాలకాడే మిల్లర్ల ఏజెంట్లుకి అమ్మీసుకుంతన్నారు. ఆల్లు కూడా రేటు తగ్గించినా పేమెంట్లు ఎమ్మట్నే జేసెత్తారు. ఇంగ ఇత్తనాలు, ఎరువులంటావా, ఒక్కోపాలి బయట సాపులకంటే పదో, పరకో ఎక్కువే దీస్కుంటన్నారు. పేరుకే అంతా.... బయటికి జరిగేది వేరు."

మంగలి సన్నిబాబు శ్మశానంలో అప్పులపాలై బలవంతంగా ఉసురుదీసుకున్న ఒక కౌలురైతును దహనం చేసి, ఆ దారిగుండా వస్తున్నాడు. నాగేష్ చూసి అతడ్ని పిలిచాడు.

"ఏం సన్నిబాబూ, పాపం రాంబాబు పోయాడట కదా?"

"అవును బావూ! రైతుల పేనాలు గాల్లో దీపాలైపోనాయి. ఆల్లతో పాటే మా బతుకులూ బుగ్గవుతున్నాయి...."

"అందుకనే కదా మీ పెద్దోణ్ణి టౌనుకి పంపించేసావు!"

"అవునూ, నీకు పింఛనొత్తందా?"

అదెందుకడుగుతావులే బావూ! బడ్డీ వుంది కదా, బడ్డీ వున్నోల్లకి పదేసి వేలిస్తన్నారని పింఛనీ వద్దన్నెప్పేను. మరి ఏ లెక్కల్లో నన్ను తప్పించీసారో తెల్వదు. సర్పంచి బాబునడిగితే మొన్న ఎలచ్చన్లో నువ్వు ఓటెవుడికేసావో ఎల్లి ఆడ్నడగరా అన్నాడు. మా ఆవిడికి కాలు కొంచెం అవుకని మీకు తెల్సు కదా. అనకాపిల్లి ఎన్టీఆరాసుపత్రికెళ్ళి దానికి సదరం సట్టెపికేటు కోసరవని రెండు, మూడేలు కర్సెట్టాను. డాట్రుగారు వారం రోజుల్లో మీ ఇంటికి పోస్టులో వచ్చెత్తదన్నారు. ఇప్పుటికి రెండు మాసాలు దాటిపోనాది, సట్టిపికేటు అతీ గతీ నేదు. నా బతుకు రెంటికీ సెడ్డ రేవడైపోనాది.... ఎల్లొత్తాను బావూ...."

"చూసావురా సూరిగా అయినోల్లుకి ఆకులు.... కానోల్లకు కంచాలు అన్నట్టు వచ్చినోడికొస్తన్నాయి, లేనోడికి లేదు...."

"లాయరు పన్జేసీవోల్లకి కూడా ఐదేసేలు పంచుతుంద్రంట.... ఆల్లకెందుకండీ బావూ? నాకు తెలీకడుగుతాను!"

"ఆల్లకీ, ఈల్లకీ అనేముంది, నాకు తెలిసి పదెకరాల మాగాణీ వున్నోడిక్కూడా సొమ్ములందుతున్నాయి. రానోడిదే పాపం."

"ఏ రావడం లేరా మద్యపానం నిషేధం అని మందు ధరల్ని విపరీతంగా పెంచీసేరు. తాగీవోడు తాగడం మానెత్తాడా? దాంతో దొంగసారాని కాయడం ఎక్కువైపోయింది.... తాగుడూ ఎక్కువైపోయింది.

ఏదో రకంగా యింట్లోకి సొమ్ములొచ్చి పడ్డంతో కష్టపడి పన్చెయ్యెడ మెందుకని, వచ్చిం డబ్బుల్తో సుబ్బరంగా తాగి తిరుగుతున్నారు. డబ్బులివ్వకపోతే ఆడోల్లని తంతున్నారు. నువ్వేటంటే అను గానీ ఇట్టా సొమ్ములు పంచడం ప్రజల్ని సోమరిపోతుల్లా తయారుసెయ్యడవే. ఎవుడడిగేడ్రా ఈల్లని సొమ్ములు పంచమని...."

"సొమ్ములు పంచుతున్నారు సరే.... కష్టపడీవోడికి సేతిల డబ్బులు ఆడతన్నాయా అసలు? సెరువు పన్లు సేసివోల్లకి ఎన్నో కోట్లు బాకీ ఉండిపోనాదట.... మొన్న టీ.బి.లో సూసేను. సివరాకరికి రోడ్లు, కాలవలు సుబ్రం సేసీవోల్లకీ ఆరేసి నెల్లు జీతాల్నేవట...."

"అవునొరే మా జగిలీడు గోవాడ ఫేక్ట్రీలో సేస్తండు గదా.... నాలుగు నెల్లనుండీ ఆల్లకి జీతాల్నేవట. అసలు అధికారంలో వున్నోడికి మనకి వచ్చీ ఆదాయవెంత? దాంతో ప్రజలకి చెయ్యాల్సిన ముఖ్యవైన పన్లేంటి? ఇప్పుటికే మన రాష్ట్రానికి అప్పెంతుంది? ఇలగ అడిగినోడికీ, అడగనోడికీ సొమ్ములు పంచుకుంటూ పోతే ముందు తరాలవాళ్ళకి ఇయ్యనీకి గుళ్ళో ప్రసాదమైనా మిగులుద్దా అనే ఇంగితం వుండాలి కదరా."

"బాసెప్పేవురా! పసూకుంకాలని ఒకుళ్ళూ, పుస్తిల తాళ్ళని ఒకుళ్ళూ ఎవుళ్ళిస్టవొచ్చినట్లు ఆల్లు సొమ్ములు పంచడవే పరిపాలన సెయ్యడవని అనుకుంతుంతే ఇంగ పెజలు పనీపాటూ సేత్తారంటావా? ఎగసాయవూ సెయ్యకపోయి, పేక్ట్రీలు ఆడకపోయి, రోడ్లు సూసిసావా? ఎంతెంత బొక్కలు పడిపోనాయో! రాస్టరం మొత్తం మీన నాకుదెల్సి ఒక్క రోడ్డు కూడా బానేదు. అయినా ఎవుడి బాబు సొమ్ము – ఎవుడు, ఎవుడికి పంచుతున్నాడ్రా? ఒకే కౌలు పని సేసీ రైతులికి ఒకుడికిచ్చి, ఒకుడికియ్యకపోతే మనం, మనం తన్నుకు సావమనేనా?"

రాష్ట్రంలో కొత్తగా ఈ రెండేళ్ళలో ఒక్క ఫేక్ట్రీ కూడా రాలేదు. డబ్బులు ఎలా సంపాదించాలో తెలీక, వైజాగులో వున్న గవర్నమెంటు బూవులన్నీ అమ్మెయ్యడానికి తయారైపోయారు. ఇంక జలయజ్ఞం అన్నారు – అది ముందుకు మూడడుగులు, వెనక్కి ఏడడుగులు నడుస్తుంది.

"పెజలందరూ ఒకే మాట మీదుంటే అధికారం సేసీవోడికి సాగుద్దట్రా? అందుకనే ఒకుడికిచ్చి, ఒకుడివ్వకపోతే ఆల్లూ ఆల్లూ జుట్లు పట్టుకుంటారు, లేకపోతే ఊల్లో వున్న నాయకుల జుట్లు పట్టుకుంటారు. సిన్న పిల్లలకి కూడా రేసనివ్వడానికి ఆదార్‌ని కలపమని గూకున్నారు. పాపం పిల్లల్ని అట్టుకొని ఆల్ల అమ్మలో, బాబులో ఆదార్ కేంద్రాలమ్మట గంటలు గంటలు దేవులాడతన్రు. ఒక పక్కనేమో దేనికీ ఆదార్న్ కంపల్చరీ చేయ్యొద్దూ అంటున్రు, ఇంగోపక్క పెద్దల్తో పాటు పిల్లల్నీ సంపుతున్రు. అసలు పరిపాలన ఏటి సాగుతుందో కూడా తెలవకుండా పోయిందిరా."

"డిల్లీ పెద్దలు వున్నకాడికి పేక్ట్రీలు, బేంకులు, ఎల్లైసీలు, రైలుటేసన్లు, ఇమానాలు, ఓడలు.... ఒకటేంటి..... కంటికి కనిపిత్తన్న అన్నిటీ అమ్మీసుకుంతంన్రంట.... ఈడ కూడా అట్టాగే జేస్సి, ఉజ్జోగులకిత్తన్నట్టు అందరికీ తలకో ఇంతని పడీసి, ఆల్లమట్టుకాల్లు రేట్లన్నీ పెంచీసి మీ సావు మీరు సావండ్రా అంటారేమో!!"

మాకు పన్లు సూపించండ్రా.. మా పిల్లలకి మంచి చదువు చెప్పించి ఉజ్జోగాలేయించండ్రా అంటే అయ్యన్నీ ఒగ్గేసి ప్రజలు మానం జంపుకొని చేతులు సాచేలా జేత్తన్నారు. కలికాలవంటే ఇదేనేమో!!! ✦

పాట

# అమ్మకానికి భారతదేశం

– డాక్టర్ జి.వి.కృష్ణయ్య

**రండి** బాబు రండి.. బలె చౌకబేరమండీ..మీరు. రండి.
ప్రభుత్వ ఆస్తులమ్మే పథకాలు ఎన్నోవున్నయి
దేశభక్తికి వారసులం కార్పొరేట్ల స్నేహితులం ॥ రండి ॥

ఎయిర్ పోర్టు విమానాలు ప్రైవేటుపరం చేస్తాము
పోర్టులు ప్రాజెక్టులన్ని గుత్తగ అమ్మేస్తాము
గుత్తాధిపతులారా పెత్తనం తీసుకోండి. ॥ రండి ॥

సోకైనా రోడ్లుమావి టోకుగా అమ్ముతాము
విశాలంగ నిర్మించిన రవాణా సౌకర్యం
రహదారికి టెండరేసి రాజమార్గమందుకోండి! ॥ రండి ॥

విద్యుత్తు సరఫరాను విడివిడిగా తీసుకోండి
మీటర్లతో తోముడూ బిల్లులతో బాదుడూ
కరెంటూ కోతలూ అడ్డొస్తె కేసులూ! ॥ రండి ॥

యల్ఐసి, యఫ్‌సిఐ టెలికం గ్యాసులైను
గెస్టహౌస్ హొటళ్లు ప్రాంతీయ కేంద్రాలు
పిపిపి విధానంలో ప్రైవేటుకి పందారం! ॥ రండి ॥

జాతీయ బ్యాంకులన్ని ప్రైవేటులొ మిళితమై
సంక్షేమం సబ్సిడీలు సమూలంగ తొలగించీ
అభివృద్ధి జపమాలతొ దేశాన్నే మారుస్తాం! ॥ రండి ॥

ఆటలొద్దు పాటలొద్దు క్రీడాప్రాంగణమొద్దు
ఖాళీస్థలమమ్ముతాము కాంప్లెక్సులు కట్టండి
వ్యాపార కూడల్లే అభివృద్ధికి నమూనాలు! ॥ రండి ॥

ఇనుము ఉక్కు బొగ్గుగనుల వ్యాపారం మాకొద్దు
జాతీయ వనరులను జాగిలాల కందిస్తాం
మైనింగ్ మాఫియాకు మహాయోగముందండీ! ॥ రండి ॥

మందబైలు పొరంబోకు గ్రామకంఠముండబోదు
పంచాయితి వేలంలో ప్రైవేటు సైన్యాలు
శవాలకు శ్మశానంలొ కాటికాపరి సుంకాలూ! ॥ రండి ॥

ఇంటిపన్ను ఆస్తిపన్ను చెత్తపన్ను పెంచుతాము
మున్సిపాలిటీ కార్పొరేషన్ కార్పొరేట్లకిస్తాము
ఊడగొట్టి వసూలుచేసి వస్తాదులకిస్తాము! ॥ రండి ॥

జీయస్టీ విధ్వంసం జీడీపీ పతనం
పెద్దనోట్లు రద్దయినా చమురు ధరలు పెరిగినా
తాకట్టులో భారతాన్ని తాకబోము ఏనాటికి! ॥ రండి ॥

భారతమ్మ బిడ్డలార కళ్ళు తెరిచి చూడండి
వీరుల త్యాగాల ఫలం పరాయిదైపోతోందీ
ఈ దేశం ఈ సంపద మాదేనని చాటండి
పిడికిలెత్తి సాగండీ ఎదురుతిరిగి నిలవండి! ॥ పిడికిలి ॥ ✦

# ముప్ఫై ఏళ్ళ క్రితం ప్రజాసాహితి

## 1991 ఆగస్టు సంచిక : 1, సంపుటి : 15

నలభై నాలుగేళ్ళ "స్వతంత్ర" భారతావనిలో.... సునీల్ పద్వాల్ గీసిన ముఖచిత్రంతో ఈ సంచిక వెలువడింది. రైతాంగ సమస్యల మీద రాసిన 'నివురుగప్పిన నిప్పు' అనే సంపాదకీయం, క్రాంతికిరణ్ రాసిన 'పైరుతల్లి' కథ, నిర్మలానంద అనువాదం చేసిన కె.యల్.గార్గ్ రాసిన 'అమరవీరుడు' అనే పంజాబీ కథ, డా॥ కిరణ్మయి అనువాదం చేసిన అమృతాప్రీతమ్ రాసిన 'రచయిత్రుల బాధలు' వ్యాసం, చలసాని ప్రసాదరావు రాసిన 'అశ్వత్థామ హతం.... కుంజరమ్!' తోటకూర మోహనరావు రాసిన "అథః పతనమవుతున్న మానవ విలువలు" ఉదయరేఖ రాసిన "ఒక అపవిత్ర వివాదం" అనే స్పందనలు, ఉదయ్ కుమార్ సోనీ రాసిన 'ధరలు.... బాబోయ్ ధరలు!!' వీధి నాటకం, సమతారావు రాసిన 'వస్తున్నాం..... మేం వస్తున్నాం' నృత్యగేయం. సి. శారద రాసిన 'స్వాహాతంత్రం' గేయం, నిర్మలానంద అనువాదం చేసిన మార్గరెట్ వాకర్ రాసిన 'నిరసన ప్రదర్శన' అనే అమెరికన్ నీగ్రో కవిత. సూర్యచంద్రరావు రాసిన 'ఓ రష్యా! ద్రోహం కరిచిన రష్యా! కవిత, శ్రీధర్ రాసిన 'ప్రశ్నించే నక్షత్రం' కవిత, ఆర్. రామకృష్ణ రాసిన 'బోలో.... స్వతంత్ర భారత్‌కి' కవిత, శ్రీ కాంతి రాసిన 'దగాపడే తమ్ముళ్ళ' కవిత, రెండో అట్టపై సూర్యసాగర్ రాసిన 'జెండా' కవితలను ప్రచురించారు. వీటితోపాటుగా 'కరపత్రాలు–కదిలేచరిత్ర' శీర్షికలో "దేశ ఆర్థికరంగంలో సామ్రాజ్యవాదుల జోక్యాన్ని నిరసించండి! దేశాన్ని తాకట్టు పెడుతున్న పి.వి. ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా పోరాడండి! ధరలను తగ్గించాలని ఉద్యమించండి!" అని పి.డి.యస్.యు (విజృంభణ), డి.ఎస్.ఓలు పిలుపు ఇచ్చిన కరపత్రాన్ని, 'ఆగస్టు 10–15 వరకు నిర్బంధ వ్యతిరేక వారాన్ని' పాటించండి! మహిళా ఉద్యమంపై ప్రభుత్వ నిర్బంధానికి, అధిక ధరలకు, ప్రజావ్యతిరేక బడ్జెట్‌కు వ్యతిరేకంగా పోరాడుదాం!' అనే పిలుపుతో వున్న ప్రగతిశీల మహిళాసంఘం (స్త్రీ విముక్తి) ఆంధ్రప్రదేశ్ కరపత్రాన్నీ ప్రచురించారు. కొత్తపల్లి రవిబాబు అనువదించిన రాల్ఫ్ ఫాక్స్ రాసిన 'నవల–ప్రజలు' అనే ధారావాహికను, చైతన్యవాహిని, స్వీకారం ఉత్తరాలు శీర్షికలుతోపాటు వెనుక కవరుపేజీలో జి. గోవర్ధన్ రాసిన "నాయన్నా – కూలన్నా" జనంపాటను ప్రచురించారు. 1/8 క్రౌన్‌లో 72 పేజీలు; వెల : రూ. 4/–

## 1991 సెప్టెంబర్ సంచిక : 2, సంపుటి : 15

డిక్షనరీలో విప్లవం అనే మాట వుంది కనుక అది మారణాయుధం, తీవ్రవాద సాహిత్యం అంటూ పోలీసులు అరెస్ట్ చేస్తున్నట్లున్న కార్టూన్‌ను సురేంద్ర గీయగా 'ప్రతిస్పందన' సౌజన్యంతో ముఖచిత్రంగా ముద్రించారు. "భూస్వామ్య సంస్కృతీ కుల దురహంకారాలను అంతం చూడమంటున్న చుండూరు" అన్న సంపాదకీయాన్నీ, కరుణకుమార రాసిన 'కొత్త చెప్పులు' కథనూ, సి. రామ్మోహన్, కె. రవిబాబు అనువదించిన సుమంతా బెనర్జీ రాసిన "హిందుత్వ సిద్ధాంతం – సామాజిక మనః ప్రవృత్తి", క్రాంతికిరణ్ రాసిన "జీవన విహంగం" అనే వ్యాసాల్నీ, శ్రీకృష్ణ రాసిన "ధర్మసంస్థాపనార్థాయ", దివికుమార్ రాసిన "(దా)రుణ భారం" ఉదయ్‌కుమార్ సోనీ రాసిన 'నేరమూ–శిక్ష' అనే గల్పికలనూ, వి.ఆర్.మాటూరి రాసిన "దళితులూ – సామాజిక న్యాయం", శ్రామిక రాసిన "చలనం ఆయుధమైనవేళ" అనే స్పందనలూ, స్రవంతి రాసిన 'క్షుభిత స్వగతం!' కవిత, డా॥ కిరణ్మయి అనువదించిన యూసఫ్ ఇమాన్ రాసిన 'నీ శత్రువుని ప్రేమించు' అనే అమెరికన్ నీగ్రో కవితనూ, కృపా రాసిన 'ఖైదీ గీతం' కవిత, చైతన్య ప్రకాశ్ రాసిన 'నువ్వు–నేను' కవిత, గొట్టుముక్కల జయ రాసిన 'సామ్యం' అనే కవితలనూ, శశి రాసిన "మరో సౌరాజ్జెం లడాయి", బి.యన్.బి. రాసిన "మాలోల్లమంటావు", స్వామి రాసిన 'మేలుకో దళితన్న', రాజేంద్ర రాసిన "సింహమల్లె గర్జించుమన్న" జనం పాటలను ప్రచురించారు. వీటితో పాటుగా కె. రవిబాబు అనువదించిన రాల్ఫ్ ఫాక్స్ రాసిన 'నవల–ప్రజలు' ధారావాహికనూ, చైతన్యవాహిని, స్వీకారం శీర్షికలు ఉన్నాయి. రెండవ కవరు పేజీలో చెరుకు సుధాకర్ రాసిన 'నెత్తుటి బొట్టు' కవితను, మూడవ కవరుపేజీలో ఛాయరాజ్ రాసిన "చైర్స్ చైర్స్" కవితనూ, వెనుక అట్టమీద మోహన్ గీసిన నిర్బంధాలకు ఎదురొడ్డి పోరాడుతామన్న చిత్రాన్ని ప్రచురించారు. 1/8 క్రౌన్‌లో 68 పేజీలు; వెల : రూ. 4/–

## 1991 అక్టోబర్ సంచిక : 3 సంపుటి : 15

మోహన్ గీసిన 'మార్క్సిజం అజేయం' అనే కారల్‌మార్క్స్ ముఖచిత్రంతో ఈ సంచిక వెలువడింది. 'అపజయం కడుపులోనే విజయం దాగి ఉంది' అనే సంపాదకీయంలో సోవియట్ సోషలిస్టు రష్యా – సామ్రాజ్యవాద రష్యాగా సాక్షాత్కరించిన వైనాన్నీ 19వ శతాబ్దం నుండీ వచ్చిన రష్యన్ సాహిత్యాన్ని పరిచయం చేస్తూ మార్క్సిజం అజేయమనీ, అంతిమ విజయం ప్రజలదేననీ తేల్చి చెప్పారు. నారాయణస్వామి రాసిన 'మనిషికోసం అన్వేషణ', సుధాకిరణ్ రాసిన 'శిరస్సు ఆయుధంగా'..., జంధ్యాల పాపయ్యశాస్త్రి రాసిన "విశ్వ వైతాళికుడు" ఛాయరాజ్ రాసిన 'ఎర్రజెండా' కవితలు వున్నాయి. వలన్ తీన్ కతాయెవ్ రాయగా గిడతూరి సూర్యం అనువాదం చేసిన 'జెండా' అనే కథను ప్రచురించారు. రష్యన్ నవల "తల్లి భూదేవి"ని క్రాంతికిరణ్ పరిచయం చేశారు. ఉద్యమానికి చురకలాంటి 'ఇలా మిగిలేం' పుస్తకాన్ని దివికుమార్ సమీక్షించారు. జాక్ లండన్ రాసిన 'సోషలిజం అనివార్యం' అనే వ్యాసాన్ని చలసాని ప్రసాదరావు అనువదించారు. 'రష్యా పరిణామాలు, ఫ్యూడల్ సంస్కృతి – రివిజనిస్టు రష్యా పొగడ్తలు' అనే వ్యాసాన్ని దివికుమార్ రాశారు. 'స్పందన' శీర్షికలో 'కళాఖండాల మీద కసి దేనికి?' అనే ఆంధ్రభూమి దినపత్రిక సంపాదకీయాన్ని ప్రచురించారు. 'దళితన్న కన్నెర్రజెయ్' అనే పాటను స్వామి రాశారు. చుండూరు సంఘటనల మీద జనసాహితీ, ప్ర.జా.ర.స., విరసం సంఘాల కరపత్రాలు, ఉత్తరాలు, చైతన్యవాహిని శీర్షికలు ఉన్నాయి. రెండవ అట్టమీద సూర్యచంద్రరావు రాసిన 'సర్వ (ఆ)రోగ్య నివారిణి' కవిత, వెనుక అట్టమీద మయకోవస్కీ రాయగా శ్రీశ్రీ అనువదించిన 'లెనిన్ నేడు లేడూ – చూడు జనంలో ఉన్నాడు!' అనే కవితను ప్రచురించారు. 1/8 క్రౌన్‌లో 80 పేజీలు; వెల : రూ. 4/–

# ఆఫ్ఘనిస్తాన్ నుండి అమెరికా నిష్క్రమణ!

- దివికుమార్

**తాలిబన్ల** అణచివేత పేరుతో అమెరికా, దాని తోడుదొంగల (నాటో) సైన్యం ఆఫ్ఘనిస్తాన్‌పై దురాక్రమణ జరిపి, గడిచిన 20 ఏళ్లుగా దారుణ మారణకాండ సాగిస్తే ఖండించకుండా మిన్నకుండిన కొంతమంది, ఇప్పుడు తాలిబన్లు సాగించబోయే ఆగడాలపై ఆందోళన వ్యాప్తిచేస్తున్నారు. ఆఫ్ఘన్‌లను ఆఫ్ఘన్లే ఏలుకుంటే అదేదో దురాగతంగానూ అమెరికా సామ్రాజ్యవాదం ఆక్రమించుకుంటే సదాచారంగానూ వీరికి కనిపిస్తోంది.

నిజానికి 40 ఏళ్ల క్రితం సోవియట్ యూనియన్ తన సైనిక బలగాలతో 1979లో ఆఫ్ఘనిస్తాన్‌లో తిష్ట వేయడం కూడా దురాక్రమణ తప్ప మరొకటి కాదు. ఆఫ్ఘనిస్తాన్‌లో ఎలాంటి ప్రభుత్వం ఉండాలి అని నిర్ణయించుకోవాల్సింది ఆఫ్ఘనులే గాని ఏ విదేశీ శక్తులు కాదు. ఆఫ్ఘన్ల స్వాతంత్ర్యాన్ని సార్వభౌమత్వాన్ని అత్యంత నాగరీకులమనుకునేవారే గౌరవించడం నేర్చుకోవాల్సిన పరిస్థితి రావడం ఒక చారిత్రక అభాస!

గడిచిన 170 సంవత్సరాల కాలంలో 1921–70ల మధ్య మాత్రమే ఆఫ్ఘన్ దేశము, ప్రజానీకము సాపేక్షంగా స్వతంత్రంగా జీవించగలిగారు. అంతకుముందు రష్యన్ జార్ చక్రవర్తుల కంటే ముందే ఆఫ్ఘన్ను ఆక్రమించుకోవాలని భారత భూభాగం నుండి బ్రిటిష్ వలసవాదులు మూడుసార్లు విఫల యత్నాలు చేశారు. సోవియట్ యూనియన్ ప్రపంచ ఆధిపత్యశక్తిగా మారిన ఫలితంగా ఆఫ్ఘనిస్తాన్ మరొకసారి అగ్రరాజ్యాల ఆధిపత్య పోరు మధ్య చిక్కుబడింది. అందుకు అతిముఖ్య కారణం దాని భౌగోళిక సరిహద్దులు అని అర్థం చేసుకోవాలి.

ప్రపంచంలోనే అతిపెద్ద దేశాలైన భారత్ చైనా రష్యనులతో పాటు ఇరానుల నడుమ అది ఉండటం. మధ్య ఆసియా దేశాలకు చేర్చే రహదారి ప్రదేశమై ఉండటంతో దానికి భౌగోళిక ప్రాధాన్యత కలిగింది!! వియత్నాంపై అమెరికా సాగించిన దురాక్రమణ యుద్ధంలో ఓటమిపాలై ఘోరంగా రాజకీయ పరాభవం పొందిన తరువాత, ఆఫ్ఘనిస్తాన్‌లోకి సోవియట్ యూనియన్ తన సైన్యాలతో ప్రవేశించింది. 10 సంవత్సరాలపాటు ఆ ఊబిలో సోవియట్ సైన్యం కూరుకుపోయేట్లు చేసి దానిని ముప్పతిప్పలు పెట్టేవిధంగా పాకిస్తాన్ ప్రభుత్వాన్ని, దేశాన్ని అమెరికా పావులా వాడుకుంది. ఆఫ్ఘనులోని స్వాతంత్ర కాముకులనూ, పాక్, ఆఫ్ఘనులోని మత ఛాందసవాద యువకులను పోగేసి ఆల్ ఖైదాలు, తాలిబన్లు, ముజాహిదీన్‌లనే పేర్లతో అమెరికన్ సామ్రాజ్యవాద రహస్య సైనిక నిపుణులు తిరుగుబాటు దళాలను తయారుచేశారు. వారిని తమ తుపాకీ మందులాగా వాడుకున్నారు.

సౌదీ అరేబియా దేశానికి చెందిన ఒసామా బిన్ లాడెన్ మొదట అమెరికా కంపెనీల కాంట్రాక్టర్‌గా ఉండేవాడు. ఎట్టకేలకు పది సంవత్సరాల తర్వాత సోవియట్ యూనియన్ తన సైనిక దళాలను వెనకకు తీసుకోవడం తూర్పు యూరప్ దేశాలలో దాని ప్రభావం తగ్గిపోవటం, రెండు సంవత్సరాలు తిరిగేసరికి సోవియట్ యూనియన్ కుప్పకూలి 15 రాజ్యాలుగా విడిపోవడంతో అమెరికా ప్రపంచంలోనే ఏకైక అగ్రరాజ్యంగా విర్రవీగే పరిస్థితులు వచ్చాయి. ఇక ప్రపంచంలో తనకు ప్రధాన శత్రువు కమ్యూనిజం కాదని అమెరికా భావించింది.

సుమారు 15 సంవత్సరాల క్రితం జనసాహితి తన పదవ రాష్ట్ర మహాసభలో ఆమోదించిన పత్రంలోని ఈ క్రింది పేరా మనకి ఒక స్పష్టత నిస్తుంది. "సోవియట్ పరిణామాలతో "చరిత్రాంతం" (End of History ఫుకాయామ) అనే భావజాలాన్ని సృష్టించి పెట్టుబడిదారీ విధానమే (సామ్రాజ్యవాదమే) చరిత్రలో చిట్టచివరిది అంటూ ప్రచారం చేశారు."

"నాగరికతల నడుమ యుద్ధాలు (Clash of civilizations) అంటూ శామ్యూల్ హంటింగ్టన్ అనే ఆయన మరొక సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టాడు. దాని ప్రకారం అభివృద్ధి చెందిన పాశ్చాత్య (యూరోపు – అమెరికాలోని) క్రిస్టియన్ దేశాల నాగరికతకూ, వెనుకబడిన పశ్చిమాసియా ఆఫ్రికా ప్రాంతాలకు చెందిన ముస్లిముల నాగరికతకు నడుమ సాగుతున్న ప్రపంచవ్యాపిత ఘర్షణే "నాగరికతల మధ్య ఘర్షణ" అనే భావజాలాన్ని వ్యాప్తి చేశారు. చమురు నిక్షేపాలు దండిగా ఉండే పశ్చిమాసియాను తన గుప్పిట్లోకి తెచ్చుకోవడానికి ఆ ప్రాంతంలో ఉంటున్న ముస్లిం రాజ్యాలను లొంగతీసుకోవడానికి, అలా లొంగనివారిపై తన దాడిని ఎక్కుపెట్టడానికి సృష్టించినదే హంటింగ్టన్ యొక్కా పై సిద్ధాంతం. ప్రపంచ సామ్రాజ్యవాదానికి భావజాలరంగాల్లో, సామాజికరంగాల్లో అప్పటిదాకా శత్రువుగా నిలిచిన మార్క్సిజం – సోషలిజంలకు కాలం చెల్లిపోయింది అంటూ ఈ "నాగరికతల నడుమ యుద్ధం" అనే సిద్ధాంతం ముందుకు వచ్చింది. సామ్రాజ్యవాదం విస్తరించుకోవడానికి, ప్రపంచీకరణయి దురాక్రమణలు చేయడానికి దీన్ని వ్యూహాత్మకంగా అమలు జరిపారు. భారతదేశంలో బాబ్రీ మసీదు వివాదం నుండి గుజరాత్ దురాగతాలదాకా, ఆఫ్ఘనిస్తాన్ ఇరాకుల దురాక్రమణ నుండి ఇస్లామిక్ టెర్రరిజం అనే పేరుతో సాగిస్తున్న అణచివేతలదాకా ఈ సిద్ధాంతపు వికృత రూపాన్ని మనం చూడవచ్చు" (పుట 4)

ప్రపంచ స్థాయిలో ముస్లిములు అంటేనే టెర్రరిస్టులు అన్న భావజాలాన్ని అనుమానాన్ని ద్వేషాన్ని ఒక విధానంగా వ్యాప్తి చేశారు. తన పరాధీన దేశాల సాయంతో టెర్రరిజాన్ని తన సాయుధ శక్తుల ఒక రహస్య ఉప అంగంగా తయారు చేశారు. అయినా అమెరికా పెంచి పోషించిన తాలిబన్లు వారి హద్దులలో ఉండకుండా ఎదురుతిరిగి తమదైన ఇస్లామిక్ ఛాందసవాద ఉలిపికట్టె పద్ధతులతో ఆఫ్ఘనిస్తాన్ని

పరిపాలించడం సాగించారు. తిరిగి ఆఫ్ఘనిస్తాన్‌ని తన గుప్పిట పెట్టుకోవడానికి అమెరికాలోని ప్రపంచ వాణిజ్య సంస్థ భవనాలను కూల్చివేసిన సాకుని అడ్డంపెట్టుకుని ఈసారి 2001 నవంబర్లో ఆఫ్ఘనిస్తాన్‌పై ప్రత్యక్ష దురాక్రమణ చేసింది. సుమారు 155 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. వేలమంది అమెరికా సైనికులను బలి పెట్టారు. పాకిస్థాన్లో తలదాచుకుని ఉన్న ఒసామా బిన్ లాడెన్‌ను కిడ్నాప్ చేసి హతమార్చారు.


ఒక తోలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసి దాన్ని కూడా తిరిగి మార్చి, వేలాది ఆఫ్గన్ పౌరులను హతమార్చి, ఇంకా అంతకు అంతమంది తిరుగుబాటుదారులను కూల్చి, లక్షలాది ఆఫ్గన్ పౌరులు వలసలు పోయేలా అమెరికా పాలకులు ఒకరి తర్వాత ఒకరు చేశారు. అంతేకాకుండా ఇరాకు లిబియా యెమెన్ దేశాలపై కూడా దురాక్రమణలు చేశారు. ఇరాను దేశంపై పలు ఆంక్షలు విధించారు. సిరియాలోని ఆసాద్ ప్రభుత్వాన్ని దింపడానికి నానా హైరానా పడిపోతున్నారు. ఎన్ని చేసినా చివరికి ఆఫ్ఘనిస్తానులో నిలవలేక నిష్క్రమించాలనే నిర్ణయం తీసుకున్నారు. లాభాలు పోగేసుకోవడానికి ఎంతటి వినాశనమయినా సామ్రాజ్యవాదులకు చీమకుట్టినట్లు కూడా ఉండదు.

ఆఫ్ఘనిస్తాన్లో స్వేచ్ఛ ప్రజాస్వామ్యం నెలకొల్పుతామని అప్పుడు బీరాలు పలికిన అమెరికా ఆల్-ఖైదాను అదుపులో పెట్టడమే తన 20 సంవత్సరాల కార్యక్రమంగా ఇప్పుడు చెప్పుకుంటోంది. ఆఫ్ఘనిస్తాన్లో విదేశాల జోక్యం లేని స్వతంత్ర సార్వభౌమ అధికారం గల ప్రభుత్వం ఉండాలి. ఎప్పటికైనా ప్రజాస్వామ్య సంస్కృతి అక్కడ నెలకొనాలి. పితృస్వామిక ఆధిపత్యానికి తావులేని స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు మహిళ లందరికీ సమకూరాలి. వాటిని నెలకొల్పలేని పరిపాలకులు ఎవరైనా వారికి ఎదురు నిలిచే హక్కు ఆఫ్ఘన్ ప్రజలకు ఉండాలి. ఆ దేశంలోని సమస్త జాతులు తెగల ప్రజల నడుమ సమానత్వ సంబంధాలు నెలకొనాలి. మత ఛాందసత్వం ఉన్మాదం అంతమై లౌకిక సంస్కృతి నెలకొనాలి. అయితే అమెరికా సామ్రాజ్యవాదులు తెర వెనకకు తప్పుకున్నట్లు చెప్తున్నారు కానీ పూర్తిగా వదిలి పోయినారని చెప్పలేము. వారేకాక రష్యా, చైనా దేశాలు కూడా ఆఫ్ఘన్ భవిష్యత్తుని ప్రభావితం చేసే అవకాశం ఉంది.

మోడీ ప్రభుత్వానికి, డోనాల్డ్ ట్రంప్‌ని భుజాన వేసుకుని భంగ పడినట్లే ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికాకు జూనియర్ పార్టనర్‌గా వ్యవహరిస్తూ ఏకాకిగా మిగిలిపోయిన దురవస్థ ప్రాప్తించింది. అమెరికాకు తొత్తుగా మారిన పాకిస్తాన్ ప్రభుత్వం తన పౌరులను వివిధ రకాల టెర్రరిస్టు దాడులకు బలి చేసింది. మన దక్షిణాసియా ప్రాంతంలో టెర్రరిజానికి వ్యతిరేకంగా నిజంగా పోరాడవలసినవారు ఉపఖండ ప్రజానీకం ఆఫ్ఘనిస్తాన్ ప్రజలు.

ఆఫ్ఘనిస్తాన్ను వదిలిపెట్టినట్టే కనిపిస్తున్న అమెరికా సామ్రాజ్యవాదం తన అణ్వాయుధాల రాక్షస క్రీడను ఆసియా పసిఫిక్‌లో ప్రదర్శించడానికి ఉవ్విళ్లూరుతోంది. యుద్ధం లేకుండా, ఆయుధ ప్రయోగం, వ్యాపారం, లేకుండా సామ్రాజ్యవాదం మన లేదు. శాంతికాముకులయిన ప్రపంచ ప్రజానీకం అమెరికాతో సహా మొత్తంగా సామ్రాజ్యవాదాన్ని మట్టుపెట్ట లేనంతకాలం యుద్ధాల, టెర్రరిజాల వినాశనం నుండి విముక్తి కాలేరు. ✦

## చిట్టిప్రోలు కృష్ణమూర్తి మరణం



**పల్నాడు** కవిగా పేరుపొందిన కవి, రచయిత చిటిప్రోలు కృష్ణమూర్తి తన 89వ యేట 02.09.2021 హైదరాబాదులో మరణించారు. ఆయన గుంటూరు జిల్లా దాచేపల్లి మండలం గామాలపాడులో 26-12-1932లో జన్మించారు.

ఆయన చదివినది ఎస్.ఎస్.ఎల్.సి. అయినా వ్యవసాయం చేసుకుంటూ తెలుగు, సంస్కృతం, హిందీ, ఇంగ్లీషు భాషల్లో పట్టు సాధించారు. 1964లో ప్రారంభించిన 'పురుషోత్తముడు' కావ్యాన్ని 2006లో పూర్తిచేయగా, దానికి 2008 సంవత్సరానికి కేంద్ర సాహిత్య బహుమతినందుకున్నారు.

తన 27 ఏళ్ళ వయసుకే రాసిన 'కైకేయి' కావ్యాన్ని 1964 నుండి 1966 వరకు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బి.ఏ. తెలుగుకు పాఠ్యగ్రంథంగా పెట్టారు. ఇంకా ఆయన 'తరంగిణి', 'మాఘమేఘాలు', 'మహిష శతకం', 'అక్షర దేవాలయం', 'సాకేతము', 'వివేకవాణి' మొత్తం 9 గ్రంథాలు రాశారు. ఎన్నో అవార్డులు అందుకున్నారు. ✦

## మానవ హక్కుల కార్యకర్త జయశ్రీ మరణం

**మానవ** హక్కుల సంఘం వ్యవస్థాపక సభ్యురాలు, న్యాయవాది కాకుమాను జయశ్రీ జూలై 31, 2021 రాత్రి హైదరాబాద్‌లో గుండెపోటుతో మరణించారు. ఆమె కడపజిల్లా ప్రొద్దుటూరులో ఏప్రిల్ 15, 1960న బంగారయ్య, వెంకటమ్మ దంపతులకు జన్మించారు.

మూడున్నర దశాబ్దాలుగా దళితుల, మహిళల, అణగారిన వర్గాల ప్రజల హక్కుల కోసం, ప్రజాసమస్యలపై రాయలసీమ కరువు సమస్యలపై కృషిచేశారు. 1986లో న్యాయశాస్త్ర పట్టాపొందిన ఆమె సామాజిక కట్టుబాట్లను ధిక్కరిస్తూ ఇస్లాం మతానికి చెందిన అత్తాబ్ బాషాను పెళ్ళాడారు. రాయలసీమ విమోచనాసమితి స్థాపకులు యం.వి. రమణారెడ్డి దగ్గర జూనియర్‌గా చేరి న్యాయవాద వృత్తి మొదలుపెట్టిన జయశ్రీ 1988 నుండి పౌరహక్కుల సంఘంలో పనిచేశారు. ఆ తర్వాత 1998 నుండి చివరివరకూ మానవహక్కుల వేదిక జిల్లా కన్వీనర్‌గా, రాష్ట్రకమిటీ సభ్యులుగా చివరివరకూ కొనసాగారు. సమాజ మార్పుకోసం, మానవహక్కుల కోసం చివరికంటా జయశ్రీ కృషిచేశారు. ✦

కథ

# విచారణ

హిందీమూలం : **అవధీష్ ప్రీత్,** సీనియర్ జర్నలిస్టు – హిందుస్తాన్ టైమ్స్ గ్రూప్

హిందీ నుండి ఇంగ్లీషు : **యతీష్ అగర్వాల్**

ఇంగ్లీషు నుండి తెలుగు అనువాదం : **డా॥ ఆర్కె**

**కా|మ్రేడ్** విజయ్‌మిత్రా మృతిపై వచ్చిన ప్రజాందోళన వలన ప్రభుత్వం కార్డియాలజిస్టు డా॥ సి.కె. భగత్‌ను సస్పెండ్ చేసి, అతని ప్రవర్తనపై విచారణ కమిటీ నియమించటం తప్పనిసరైంది. సమస్యను సున్నితమైనది, తీవ్రమైనదిగా పరిగణించి 15 రోజులలో కమిటీ తన రిపోర్టును సమర్పించాలని ఆదేశించింది.

డా॥ రజనీష్ ఆచార్య, కార్డియాలజిస్టు డా॥ జీవకాంత్ యాదవ్, న్యూరాలజిస్టు, డా॥ రామ్‌శేష్‌దేవ్, సైకియాట్రిస్టు ముగ్గురు సభ్యులతో ప్రభుత్వం ఒక కమిటీని రూపొందించింది. ఈ క్రింది విషయాలను సమగ్రంగా పరిశీలించమంది.

- విజయ్‌మిత్రా మరణానికి అసలైన కారణం ఏమిటి?
- జనవరి 1న డ్యూటీలో లేనప్పటికి డా॥ సి.కె. భగత్ ఐసియులోని మిత్రాను పరీక్షించటానికి ఎందుకు వెళ్ళవలసి వచ్చింది?
- ఒక ప్రభుత్వ సీనియర్ డాక్టర్‌లా డా॥ సి.కె.భగత్ ప్రవర్తన వుందా?
- డా॥ సి.కె. భగత్ డెత్ సర్టిఫికెట్ యివ్వటం సరైనదేనా?

విజయ్‌మిత్రా మరణానికి దారితీసిన పరిస్థితులను అర్థం జేసుకోవటానికి సాక్షులను పిలవాలని కమిటీ తీర్మానించింది. ఆ సాయంత్రం జరిగిన సంఘటనతో సంబంధం వున్న ప్రతి ఆసుపత్రి ఉద్యోగికి సమన్లు జారీ చేసింది. వ్యక్తిగతంగా హాజరై నిజాల్ని చెప్పమంది. ప్రతి ఒక్కరి వాంగ్మూలాన్ని కమిటీ రికార్డు చేసింది.

## డా॥ సి.కె. భగత్ వాంగ్మూలం :

జనవరి 1న నేను డ్యూటీలో లేని మాట నిజమే. హాస్పిటల్ కాంపస్‌లోని నా ఇంటి వద్దనే వున్నాను. నా భార్యకి పక్షవాతం వుంది. ఆమెకు నిరంతరం నర్సింగ్ సేవలు చేయాలి. ఆమెను బాత్‌రూమ్ నుండి బెడ్‌రూంకి తీసుకొస్తుండగా కాలింగ్ బెల్ మ్రోగింది. నేను అలాగే నా భార్యను బెడ్‌పై టివి చూసేందుకు వీలుగా ఒక ప్రక్కకు పరుండబెట్టి, వీపు వెనుక దిండు వుంచి, కాళ్లపై దుప్పటి కప్పాను. నేను అలా చేస్తూండగానే కాలింగ్‌బెల్ పదే పదే మోగటం, ఆ వ్యక్తి తలుపు బాదటం జరిగింది. ఆ పిలిచే వ్యక్తి బాధలో, చాల ఆదుర్దాతో వున్నాడని నాకర్థమైంది. నా భార్యను బెడ్‌పై వదిలి త్వరగా తలుపు తెరవటానికి వెళ్ళాను. తలుపు దగ్గర నా పి.జి. స్టూడెంట్ డా॥ సుజాత నిలబడి వుంది. ఆమె ఆందోళనతో గట్టిగా ఊపిరి పీల్చుకుంటోంది. సరాసరి కార్డియాలజీ వార్డు నుండి నా ఇంటికి పరుగున వచ్చిందని స్పష్టమవుతోంది.

ఏ పోస్టు గ్రాడ్యుయేట్ స్టూడెంటు అయినా తన సీనియర్‌ని చూడగానే విష్ చేస్తారు. నేను తలుపు తెరవగానే డా॥ సుజాత నాకు విష్ చేయటానికి బదులు గబగబా మాట్లాడసాగింది. 'సర్, చాలా సీరియస్ పేషంట్‌ను ఇప్పుడే తీసుకొచ్చారు. అతనిని నేను ఐసియులో జాయిన్ చేశాను. అతనిని చూడటానికి ఏ సీనియర్ డాక్టరు వార్డులో లేరు. ఎవరూ లేకపోవటం వలన సర్, మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్నాను. దయచేసి వస్తారా, సర్' అంది.

ఆమె చెప్పింది విన్నాను. 'డా॥ సుజాతా, ఆ పేషంట్ ఏ రకంగానైనా మీకు బంధువా?' మామూలుగా అడిగాను.

'నో సర్', నా ప్రశ్న పూర్తవకుండానే అనేసింది.

'అలాంటప్పుడు ఎందుకంత ఉద్వేగంగా వున్నావు?' ముఖం చిట్లించి అడిగాను.

'డా॥ చౌదరి'.... నెమ్మదిగా చెప్పింది.

'ఆయనెక్కడ? ఆయన కోసం నీవు ఎందుకు ప్రయత్నించలేదు?'

'సర్, డా॥ చౌదరి డ్యూటీకి రిపోర్టు చేయలేదు. అతని ఇంటికి ఫోన్ చేశాను, ఎవరూ పలకలేదు.'

ఆమె తన వాక్యం పూర్తి చేయకముందే 'హాస్పిటల్ కాంపస్‌లోని మరో సీనియర్ కార్డియాలజిస్టు కోసం ప్రయత్నించావా? అని అడిగాను.

'ఎవరూ దొరకలేదు సర్, సీనియర్ ఫిజీషియన్ల టీంను డైరెక్టర్ సాధారణ పరీక్షలు చేయటానికి ముఖ్యమంత్రి ఇంటికి తీసుకెళ్లారు.' నా సహాయం కోసం తప్పనిసరిగా రావాల్సి వచ్చిన పరిస్థితిని డా॥ సుజాత వివరించింది.

నా భార్య జబ్బు మనిషి. నేను డ్యూటీలో లేను. మొదట వెళ్లకూడదనుకున్నాను. కాని డా॥ సుజాత ఆతృత, నిస్సహాయత చూసిన తర్వాత వెళ్లకపోవటం అనైతికమవుతుం దనుకున్నాను.

రెండు నిముషాలలో వస్తాను డా॥ సుజాత వెళ్లేముందు నా భార్యను సౌకర్యంగా పడుకోబెట్టి వస్తాను. మీరు పిలిచినపుడు ఆమెను బెడ్‌పైకి తీసుకురావటానికి సహాయపడుతున్నాను. సాయంలేకుండా ఆమె కదలలేదని మీకు తెలుసు. పనిమనిషి ఈ రోజు శెలవులో వుంది.

వస్తానని హామీ యిచ్చి, డా॥ సుజాతను తలుపు వద్దే వదలి భార్య వున్న బెడ్‌రూంకి వెళ్లాను. ఆమెను సుఖంగా పండుకొనేట్టుజేసి, కాళ్లపై దుప్పటి కప్పి, టివి స్విచ్ వేసి 'ఐసియులో ఒక సీరియస్ పేషంట్‌ను చూచి, వెంటనే వస్తాను' అన్నాను.

ఆమె ఏదో చెప్పాలని చూసింది. ఆమె మాట పూర్తికాకుండానే నేను బయటకు వచ్చేశాను. డా॥ సుజాత నా కోసం వేచి వుంది. ఆమె ముఖంలో భయం, పశ్చాత్తాపం రెండూ కనపడుతున్నాయి. 'డా॥ సుజాత, ఫిజీషియన్ కుండాల్సిన మొదటి లక్షణం ఏమిటో తెలుసా? ఆమె వైపు చూస్తూ అడిగాను.

ఆమె నావైపు చూచింది. 'సెంటిమెంట్ వుండగూడదు భావోద్వేగం పనికిరాదు. పూర్తిగా లీనమైపోగూడదు' అని చెప్పాను. అలా చెప్పటానికి రెండు స్పష్టమైన కారణాలున్నాయి. ఒకటి : ఆడపిల్లలు

సహజంగానే భావోద్రేకంగా వుంటారు. రెండు : డా॥ సుజాతను మళ్లీ మామూలు స్థితికి తీసుకురావాలి.

ఇది ఎంతవరకు ఆమెకు వుపయోగ పడిందో చెప్పలేను. మేం హాస్పిటల్ వైపు వడవడిగా నడిచి వెళ్లాం. అప్పుడామె చెప్పింది. 'ఒక పేషంట్ కోసం వచ్చి అంత నిశ్శబ్దంగా వున్న జనాన్ని నేనెప్పుడూ చూడలేదు. అదే నన్ను ఇబ్బంది పెట్టింది మనసిక ఆందోళనకి గురిచేసింది.'

డా॥సుజాత తన పరిస్థితిని వివరించటానికి ప్రయత్నం చేస్తోందనిపిస్తోంది. నా మాటలు ఆమెను బాధించి వుండొచ్చు. ఆమె ముఖకవళికలు చదవాలనుకొన్నాను. గాని వేగంగా నడుస్తూ వుండటంవల్ల సాధ్యం కాలేదు. మాట్లాడకుండా మౌనంగా వుండటమే మంచిదనుకొన్నాను.

ఐసిసియులోకి వెళ్ళాం. సిస్టర్ ఆల్విన్ పేషంట్ నరానికి ఐ.వి. సెట్ అమర్చుతోంది. ఆమె చిరునవ్వుతో గుడ్ ఈవినింగ్ అంటూ విష్ చేసింది. నేనది పట్టించుకోలేదు. అది మామూలే. పేషంట్ వివరాలు చూడటానికి కేస్‌షీట్ తీసుకున్నాను.

పేషంట్ పేరు విజయ్ మిత్రా. వయస్సు 50 ఏళ్లు. బి.పి. చాల ఎక్కువగా వుంది. ఇసిజిలో తేడా వుంది. పేషంట్‌ను చూశాను. ఆక్సిజన్ మాస్క్ వుంది. కష్టంగా ఊపిరి పీలుస్తున్నాడు. ఇసిజి మోనిటర్‌లోని గీతలు చూస్తుంటే అతడు చావు బతుకుల మధ్య ఊగిసలాడుతున్నట్టు తెలుస్తోంది.

'సర్, మీ డయోగ్నిసిస్ ఏమిటి? అతనికి నిజంగా గుండెపోటు వచ్చిందంటారా?'

డా॥ సుజాత ప్రశ్నలోని అంతరార్థం నాకర్థంకాలేదు. ఆమె అమాయకత్వానికి కొంచెం ఆశ్చర్యం కల్గింది. ఆమెవైపు నిశితంగా చూసి 'ఏమిటి నీ ఉద్దేశ్యం' అడిగాను.

'నిజానికి....' ఏదో చెప్పాలనుకొని ఆగిపోయింది. ఎందుకో సంకోచిస్తోంది.

ఆమె సందిగ్ధత నాకర్థమవటంలేదు. ఆమె అనవసరంగా ఆందోళన పడుతోందని పిస్తోంది. 'డా॥ సుజాత, ఏమైంది మీకు?' ఆమెవైపు తిరిగి అడిగాను.

'ఏమీ లేదు సార్', మరింత కంగారు పడింది. ఏదో దాస్తున్న అపరాధిలా చూచింది. మళ్లీ మామూలు స్థితికి రావటానికి ప్రయత్నిస్తూ 'సర్, ఈ మనిషి గుండెపోటుతో బాధపడతాడని నేను అనుకోవటంలేదు' అంది.

'అలా ఎందుకనుకొంటున్నావ్?' కొంచెం అపనమ్మకం మొదటిసారి కలిగింది. ఇసిజి మోనిటర్‌పై దృష్టి పెట్టి చూడసాగాను.

'హింసను బలంగా నమ్మిన మనిషి, మరో మనిషిని ఒక్కక్షణం కూడా సంశయించకుండా నరికివేసే మనిషి, మూకుమ్మడి హత్యకు మారుపేరైన మనిషి.... అలాంటి మనిషికి హృదయమనేది వుంటుందా సర్. 'డా॥ సుజాత ఉద్వేగంతో తడబడింది. దిగ్భ్రాంతితో ఆమెవైపు చూచాను.

ఆమె కళ్లలో అమాయకత్వం వుంది. విచారమూ వుంది. 'నాకసలేమీ అర్థంగావటం లేదు. డా॥ సుజాత, అసలేమిటి నువ్వనేది?'

'సర్, ఇతను నక్సలైట్ లీడర్. మీకు తెలిసే వుంటుంది సర్. నక్సలైట్లు రక్తపాతాన్ని నమ్ముతారు' డా॥ సుజాతారాయ్ మాట తడబడింది.

డా॥ సి.కె. భగత్ హఠాత్తుగా మౌనంలోకెళ్లి పోయాడు. 'నక్సలైట్లకి రక్తపాతంలో నమ్మకం వుంది' అన్న డా॥ సుజాత మాటలకి తాను ఎలా ఫీలయ్యాడో తనకు ఇప్పటికీ జ్ఞాపకం వుంది.

కేస్ షీట్‌లోని పేరును గుర్తుకు తెచ్చుకున్నాడు. విజయ్‌మిత్రా తనలోతానే గొణుక్కున్నాడు. నక్సలైట్ లీడర్ విజయ్‌మిత్రా. ఆ పేరు మారుమ్రోగింది. పేషంట్ దగ్గరకి పరుగెత్తాడు. మొదట్లో పరీక్ష చేసినపుడు తాను పేషంట్ ముఖం చూడలేదు. ఆక్సిజన్ మాస్క్ వుంది. అప్పుడతనికి అతని ముఖాన్ని చూడాలనే ఆసక్తి లేదు. ఇప్పుడతని ప్రక్కనే నిలబడి ఆ మనిషి వంక తదేక దీక్షగా చూడటంలో నిమగ్నమైపోయాడు. జ్ఞాపకాల దొంతరలను త్రవ్వుకొంటూ ఆలోచనల లోతుల్లోకెళ్లిపోయాడు.

అదే ఎత్తు, అదే దారుఢ్యం, రంగు, అవే రూపురేఖలున్నప్పటికీ, ముఖంలోని వృద్ధాప్యం, తెల్లజుట్టు, నిశ్శబ్దంగా మూసుకున్న కళ్లు ఆ డాక్టరుకు తెలిసిన ఒకనాటి విజయ్‌మిత్రాను పోలిలేవు. 20-25 సంవత్సరా క్రితంనాటి విజయ్‌మిత్రా ముఖం జ్ఞప్తికి తెచ్చుకున్నాడు. ఆయన కళ్లు ఆకస్మికంగా సంభ్రమాశ్చర్యాలతో విచ్చుకున్నాయి.

డా॥ సి.కె.భగత్ హఠాత్తుగా మౌనంలో కెళ్లిపోయాడు. అతని ముఖ కవళికలు విచిత్రంగా మారిపోయాయి. ముగ్గురు కమిటీ మెంబర్లలో ఒకరైన సైకియాట్రిస్ట్ డా॥ రామ్‌శేష్‌దేవ్ ఆయన్ని ఊహల్లోంచి బయటకు తీసుకురావటానికి ప్రయత్నించాడు. 'మీకు ఏమైంది డా॥ భగత్?'

'ఓహ్! నాకిప్పుడు జ్ఞాపకం వస్తోంది. డా॥ సుజాత కూడా అదే ప్రశ్న అడిగింది. 'ఏమైంది, సర్' అని. జవాబు యివ్వకుండానే సిస్టర్ ఆల్విన్‌ను పిలిచాను. ఆమె పరుగెత్తు కుంటూ వచ్చింది. అవసరమైన పనులు పురమాయించాను. 'సిస్టర్, పేషంట్ బ్లడ్ శాంపిల్స్ తీసుకోండి. ట్రాప్ టెస్టు, బయోకెమిస్ట్రీ టెస్టులకు పంపండి. తన సహాయకుడిని పిలిచాడు'.

సిస్టర్ ఆల్విన్ వెంటనే తన పనిలోకి వెళ్లిపోయింది. డా॥ సుజాత స్ట్రెప్టోకైనేస్ ఇంజెక్షన్ ఒకటి పేషంట్‌కు యిచ్చింది. నేను ఐవి లైనును చెక్ చేశాను. కాస్త రిలీఫ్‌గా వుంది. ఇసిజి మోనిటర్ కుడివైపు కూర్చోవటానికి రెడీ అయ్యాను. సిస్టర్ ఆల్విన్ కోసం వేచి చూస్తున్నాను. కాస్త విచారంగా వుంది. 'మీరేమనుకొంటున్నారు. సర్' డా॥ సుజాత అడిగింది.

డా॥ సి.కె. భగత్ విజయ్ మిత్రా గురించిన ఆలోచనల్ని జ్ఞప్తికి తెచ్చుకొంటున్నాడు. విజయ్ తన రూంమేట్‌గా వున్నప్పుడు తాను మెడికల్ కాలేజీలో మూడవ సంవత్సరంలో వున్నాడు. విజయ్ ఒడ్డూ పొడవు సాధారణంగా వుంటుంది. నల్లగా వుంటాడు. క్లాసులో నెమ్మదైన విద్యార్థి. శరీరం ఒకచోట, మనస్సు మరోచోట వున్నట్టు కనిపిస్తాడు. రెండవ సంవత్సరము వరకు భగత్‌కి విజయ్‌తో సంబంధాలు మామూలుగా పరిమితంగా వుండేవి. రూమ్మేట్లయిన తర్వాత అతనిని దగ్గరగా తెలుసుకోసాగాడు. వారిద్దరి మధ్య సంబంధం మొదట సాధారణంగా వున్నా కాలం గడిచినకొద్దీ గోడ బద్దలయింది. ఇద్దరూ మనస్సు విప్పి ఆలోచనల్ని పంచుకొనేవారు.

ఆ రోజులలో విజయ్ అర్ధరాత్రి వరకు మెలకువగానే వుండి, టేబిల్ లైట్ దగ్గర చదువుకొంటూ వుండేవాడు. భగత్ మాత్రం పెందలాడే నిద్రపోయేవాడు. ఎప్పుడైనా రాత్రి మెలకువ వచ్చి లేచిచూస్తే, విజయ్ చదువుతూనే వుండేవాడు. ఒకరోజు రాత్రి విజయ్ రూంలో లేకపోవడం చూశాడు. బాత్‌రూంకి వెళ్లి వుంటాడులే అనుకొని మళ్లీ నిద్రకుపక్రమించాడు.

అయినా ఎప్పుడు రాత్రి నిద్రలేచి చూసినా, విజయ్ లేకపోవటం గమనించాడు. చివరికి విజయ్ అదృశ్యమవటంలో రహస్యాన్ని ఛేధించాలని నిశ్చయించుకున్నాడు. 'రాత్రిపూట ఎక్కడ కెళ్తున్నావ్, పార్టనర్? ఏమన్నా ప్రేమ వ్యవహారం వుందా? అని అడిగాడు.

విజయ్ ఆ ప్రశ్నను దాటవేశాడు. అతనిలో ఆశ్చర్యం లేదు. ఏదో తప్పుచేసి దొరికిపోయాననే భావన లేదు. అస్పష్టంగా నవ్వాడు. 'ఏమీ ఆందోళనపడకు మిత్రమా! ఒక్కోప్పుడు నాకు ఊపిరాడనట్టుగా వుంటుంది. బయటకెళ్లి నడుస్తుంటాను.'

ఆ జవాబుకి భగత్ సంతృప్తిపడలేదు. విజయ్ చెప్పాల్సింది చెప్పాడు. ఆ విషయం అంతటితో అయిపోయింది. విజయ్ వ్యక్తిగత జీవితంలో జోక్యం చేసుకోవటం భగత్‌కి యిష్టం లేకపోయింది. ఇంక ఎలాంటి విచారణ చేయదలచలేదు.

అయినా ఆ రహస్యం తెలిసిపోయింది. విజయ్ బెడ్ ప్రక్కనే మెడిసిన్‌తో ఎలాంటి సంబంధం లేని పుస్తకాల్ని భగత్ చూశాడు. కమ్యూనిస్టు మానిఫెస్టో, దాస్ కాపిటల్, మార్క్స్, లెనిన్, మావోసేటుంగ్ పుస్తకాలలో విజయ్ పూర్తిగా లీనమైపోవటం గమనించాడు. అలసటతో కన్నులు మూసుకున్నాడు. ట్రాన్స్‌లోకెళ్లినట్టు ఆలోచనారహితుడయ్యాడు.

విజయ్ తన కాలాన్ని వృధా చేసుకుంటున్నాడని భగత్ అనుకొన్నాడు. అతడు దారితప్పగూడదు : తన లక్ష్యానికి దూరంగాకూడదు. ఒకరోజున అతనికి కౌన్సిలింగ్ యివ్వాలనుకున్నాడు. 'విజయ్, ఈ పనికిరాని పుస్తకాల కోసం నీవు టైమ్ ఎందుకు వేస్టు చేసుకొంటున్నావ్?'

విజయ్ కూడా ఇందుకు సిద్ధంగానే వున్నాడు. సంయమనం కోల్పోకుండా అతడు నెమ్మదిగా జవాబిచ్చాడు. 'భగత్, నీవు వృధా అనుకొనే ఈ పుస్తకాలే ఏదో ఒకరోజున ఈ ప్రపంచాన్ని మారుస్తాయి. మరింత మంచిగా బ్రతికే ప్రపంచాన్ని తయారుచేస్తాయి.'

'కాని ఈ పుస్తకాల్ని చదివి నీవు ఫిజీషియన్ కాలేవు.'

'నీవు చెప్పింది నిజమే. ఆందోళన పడకపోగా మరింత దృఢంగా మారాడు. నేను డాక్టరుని కాలేకపోవచ్చు. జబ్బుపడినవారికి చికిత్స అందించలేకపోవచ్చు.... జబ్బుతో అనారోగ్యంపాలైన ఈ మానవ సమాజాన్ని బాగుచేయగలను.

భగత్ నిశ్చేష్టుడయ్యాడు. విజయ్ కొంత పిచ్చివాడయ్యాడు అనుకున్నాడు. అయినా విజయ్ అతని కళ్లలోకి సూటిగా చూస్తూ చిరునవ్వుతూనే వున్నాడు. భగత్ మరో ఎత్తుగడతో అతని మనోభావాలకి తాకేలా 'విజయ్, ఇదంతా తెలుసుకొంటే నీ కుటుంబం గుండె బద్దలవుతుంది. నువ్వు డాక్టరువు కావాలని వారి కల. వారి ఆశల్ని, కలల్ని ఎందుకు నాశనం చేస్తావ్? వారిపట్ల ఇది పూర్తిగా అన్యాయం కాదా?'

ఈసారి విజయ్ ఎదురు చెప్పలేదు. ఆ వాదనతో కూడ అతడు ప్రభావితమైనట్టు లేదు. భగత్‌కు మరో మార్గం లేకపోయింది. విజయ్ ముందు తన పథకం పారలేదని అర్థమైంది. అతను చదివే పుస్తకాలు, తరచుగా రాత్రిళ్లు లేకపోవటం, అతని ఆలోచనలు, పనులు ఒక మెడికల్ స్టూడెంటుకి సంబంధం లేనివి. చాల విచారకరం. భగత్ బాధపడ్డాడు. దేవుడా! విజయ్ తన మార్గాన్ని మార్చుకోవాలి.

తిరస్కరిస్తున్నా చాలాసార్లు భగత్ అతనికి హితవు చేస్తూనే వున్నాడు.

'విజయ్! పనికిరాకుండా పోతున్నావా! డాక్టరుగావటం అనేది దేవుడిచ్చిన ఒక గొప్ప వరమని భావించటంలేదా.... వృత్తిలో మొదటిది. అన్నిటికి మించి సమాజానికి సేవచేసే మహత్తర అవకాశం?'

విజయ్ జవాబిచ్చాడు. 'నా స్నేహితుడా! నీ ఫీలింగ్స్‌ను అర్థం చేసుకున్నాను. నువ్వు హితవు పలుకుతున్నావ్. నీవు చెప్పినట్లు చేస్తే జీవితం మరింత సుఖవంతంగా వుంటుంది.... కాని.... ప్రతి మాట నొక్కి పలుకుతూ, 'దారిద్ర్యం, అసమానతలు, ఆకలి, అన్యాయం, అణచివేత, దోపిడి, అత్యాచారాలు, శ్రమ, కాయకష్టం అంటే చీదరింపులు.... ఇవి చూసినపుడు నాకు కుదురుండదు. బాధ, పశ్చాత్తాపం నన్ను చుట్టుముట్టేస్తాయి. ఈ అన్యాయమైన సామాజిక నిర్మాణంలో నేనొక భాగం కాలేను.

రోజులు గడిచినకొలదీ విజయ్ మిత్రా పట్టుదల పెరుగుతోంది. రాత్రుళ్లు లేబర్ కాలనీల్లో గడుపుతున్నాడు. పగలు ప్రజా ఉద్యమాలలో, ఊరేగింపులు, సభలు, సెమినార్‌లలో పాల్గొంటున్నాడు. రోజుల తరబడి హాస్టల్‌కి రాకుండా దూరంగా వుంటున్నాడు. చదువుకు రానురాను దూరమైపోతున్నాడు.

విజయ్‌ను ఒప్పించటానికి తరచు తాను చేసిన ప్రయత్నాల్ని భగత్ గుర్తుకు తెచ్చుకున్నాడు. కాని ప్రతిసారి విజయ్ జవాబు చెప్పలేని కఠినమైన ప్రశ్నల్ని సంధించి త్రిప్పి కొట్టేవాడు. అప్పుడప్పుడు విజయ్ అంటుండేవాడు 'వైద్య విద్యార్థులు దోపిడీ చేయబడుతున్నారు. వెట్టి కూలీలలా చూడబడుతున్నారు. దీనికి వ్యతిరేకంగా మనం మన గళాన్ని విప్పాలి. ఈ అత్యాచారాలకు వ్యతిరేకంగా విద్యార్థులంతా ఐక్యం గావాలి.'

భగత్ తన శరీరం భయంతో మొద్దుబారిందనుకొన్నాడు. వారిని ఎవరో వెనుక నుండి గమనిస్తున్నట్టు భయపడ్డాడు. అలా ఎవరన్నా చేస్తున్నారేమోనని హాస్టల్ రూం చుట్టూ తిరిగి చూచేవాడు. తన రూమ్మేట్ గురించి నిరంతరం భయంతో వుండేవాడు. విజయ్‌ను చూస్తే కలవరపడేవాడు. అతడు లేకపోతే ఏదో పోగొట్టుకొన్నట్టు ఫీలయ్యేవాడు. అది కలయిక, ఎడబాటుల వింత కేసు.

ఒకరోజున పోలీసులు అకస్మాత్తుగా వారి హాస్టల్ రూంలోకి త్రోసుకొచ్చారు. వారి వద్ద సెర్చి వారెంట్ వుంది. విజయ్‌మిత్రాను జైలులో పెట్టారు. రూమ్మేట్ అరెస్టు వార్త వినగానే భగత్ రక్తం గడ్డ కట్టింది. శరీరం మొద్దుబారింది. గుండె జారింది. పోలీసులు గాలింపు సాగిస్తుంటే అతడు బెదిరిపోయాడు.

విజయ్‌మిత్రా పుస్తకాలన్నింటిని పోలీసులు పట్టుకుపోయారు. అవి దిండు ప్రక్కన, పరుపు క్రింద, అల్మారాలో, పెట్టెల్లో వున్నాయి. అవి నిషేధించబడిన సాహిత్యం అని వారన్నారు. వెళ్లిపోయేముందు ఒక పోలీసు ఆఫీసరు విజయ్ గురించి భగత్‌ని అనేక ప్రశ్నలు అడిగాడు. తనకేమీ తెలియదని భగత్ చెప్పాడు. అతని సీనియర్లు, బ్యాచ్‌మేట్స్, టీచర్లు పోలీసు ఆఫీసర్లకి భరోసా యిచ్చారు. అతను కాలేజీలో ఒక మంచి విద్యార్థి అని, యాదృచ్ఛికంగా వారిద్దరు రూమ్మేట్స్ అయ్యారని పోలీసులకు చెప్పారు.

వాళ్లు వెళ్ళిపోయాక తాను మామూలు మనిషిగావటానికి చాలకాలం పట్టింది. అప్పుడప్పుడు తన మనస్సు విజయ్ వైపు లాగేది. కడుపులో ఏదో కలవరం కలిగి ఆపివేసేది. ఈ భయోత్పాదం నుండి ఎలా బయటపడతానో తనకి తెలియటంలేదు. అందమైన అతని నల్లని ముఖం, మెరిసే కళ్లు, తిరుగుబాటుతత్వం తన కళ్లముందు తిరిగి తిరిగి కదులాడుతుండేవి. భగత్ తనలో తనే ప్రశ్నించుకొనేవాడు. విజయ్ నక్సలైట్లవైపుకెందుకు వెళ్లాడు? పోలీసులు అతనిని ఎందుకు అరెస్టు చేశారు? ఆ మార్గం తప్పా? రైటా?

ఆ రాత్రి భగత్ నిద్రపోలేదు. విజయ్ లేని బెడ్ తనని కలత పెడుతోంది. తన మనస్సును ఫ్రీగా వుంచటానికి ప్రయత్నించాడు. కాని ప్రయత్నం చేసినకొద్దీ విజయ్ ఆలోచనల నుండి దూరం కాలేకపోతున్నాడు. చివరికి అతడు లేచి నేలపై పడి వున్న విజయ్ పుస్తకాలను తీసుకొని అల్మరాలో సర్దాడు. బెడ్‌ను సరిచేశాడు. దిండును పెట్టేటప్పుడు, దిండు లోపల ఏదో తగిలింది. చెయ్యి లోనికి పోనిచ్చాడు. ఎర్ర ప్లాస్టిక్ కవరున్న డైరీ అది. అది తిరగవేయగానే విజయ్ ఎన్నో విషయాల్ని.... సంఘటనల్ని.... ఆలోచనల్ని.... వ్యక్తిగత ఉదాహరణల్ని రికార్డు చేశాడనిపించింది.

భగత్ డైరీని చదవసాగాడు. అది అతని అంతరంగాన్ని తాకింది. కొన్ని విషయాలకి పులకించిపోయాడు. మరికొన్నిటికి ముగ్ధుడయ్యాడు. అదే సమయంలో కొన్ని భయోపితం చేశాయి. ఒకచోట, విజయ్ ఇలా రాశాడు. "విశ్లేషణాత్మక మనస్సు లేకపోవటం వల్ల, మన మిత్రులు కాస్త జటిలమైన సమస్యలను పరిశోధించలేకపోతున్నారు. దానికి బదులు దగ్గరి దోవలను వెదుక్కుంటున్నారు. అప్పుడప్పుడు అలాంటి పరిష్కారమార్గాలు విజయవంతంగావచ్చు గాని, సాధారణంగా అవి పూర్తిగా విఫలమవుతాయని ఋజువయింది – మావోసేటుంగ్".

ఈ వాక్యాలు చదువుతూ భగత్ విజయ్ మానసిక స్థితిని అంచనా వేయగలిగాడు. బహుశ ఈ వాక్యాలు తనని ఉద్దేశించినవేననే ఆలోచన అతని మనస్సుని తట్టింది. తరచుగా తాను విజయ్ వాదనల్ని ఒప్పుకునేవాడు కాదు. పైగా ఎగతాళి చేసేవాడు. 'విజయ్, పిచ్చివాడిలా బ్రతకమాకు' మని మనస్సులోనే అనుకొనేవాడు.

డా॥ సి.కె.భగత్ పెదాలు వణికాయి. తనలోతనే 'ఫూలిష్‌మాన్' అని గొణుక్కున్నాడు. న్యూరాలజిస్టు డా॥ జీవకాంత్ యాదవ్ ఏదో తప్పు జరుగు తోందనుకొన్నాడు. 'భగత్! ఒంట్లో బాగుందా?' అని అడిగాడు.

డా॥ భగత్ తన మనస్తాపాన్ని దాచుకోలేక పోయినా, ప్రశాంతంగా వుండటానికి ప్రయత్నించాడు. 'యస్....యస్, డా॥ యాదవ్, నేను బాగానే వున్నాను'. తాను చెప్పదలచు కొన్నదానికంటే, తన మనస్సులోని ఆలోచనల్ని కమిటీ మెంబర్లు ఎక్కువగా పసిగడుతున్నా రనుకొన్న డా॥ భగత్, ప్రశాంతంగా, తన సాక్ష్యాన్ని మళ్లీ చెప్పసాగాడు.

'నా మనస్సులోని ఆలోచన ఏమిటని డా॥ సుజాత ప్రశ్నించినపుడు, నేను తిరిగి ఆమెను మరో ప్రశ్న అడిగాను. "నీకు వ్యక్తిగతంగా ఈ పేషెంట్ తెలుసా?"

నో, సర్! పేపర్లు, మాగజైన్లలో అతనిని గురించి చదివాను. అతనితో వచ్చినవారితో మాట్లాడిన తర్వాతనే నిజానికి అతను నక్సలైట్ లీడరని నాకు తెలిసింది.

సిస్టర్ ఆల్విన్ తిరిగి రాలేదని సడెన్‌గా నాకు గుర్తొచ్చింది. డా॥ సుజాతకి కొన్ని సూచనలు చెప్పి, నేను ఐసిసియు నుండి బయటకొచ్చాను.

'సిస్టర్ ఆల్విన్ వున్న వరండాలోకి పరుగున వెళ్లాను. ఆమె కలవరపాటుతో వుంది. నన్ను చూచిన వెంటనే "సర్, అక్కడ ఎవరూ లేరు. ఎమర్జెన్సీ లాబ్‌ను కట్టేశారు" అని బిగ్గరగా చెప్పేసింది.

"ఎందుకు కట్టేశారు?" నాకు కోపం పెల్లుబికింది. ఇన్‌స్టిట్యూషన్ అలాంటి తప్పులు కొత్త కాదు. కాని ఆరోజున నేను అసంతృప్తి చెందాను. నిజానికి ఆగ్రహం కల్గింది. సిస్టర్ ఆల్విన్‌ను ఐసిసియులోనికి వెళ్లమని, నేను బిల్డింగ్ బయటకొచ్చాను.

బయట నిశ్శబ్దంగానే వున్నా, ఆందోళనతో ఎందరో వున్నారు. వాళ్ళు కళ్ళు నావైపే వున్నాయి. వారి కళ్లల్లో ఆశలు, సందేహాలు, అనుమానాలు, ప్రశ్నలు, ఏదో చెప్పాలనే ఫీలింగు వాళ్లలో వుంది. వాళ్లందరి చూపును తట్టుకొనే శక్తి నాలో లేదు. బయట పడాలనుకొని, డాక్టర్స్ రూంలోకి వచ్చాను. అకస్మాత్తుగా ఇన్‌స్టిట్యూట్ అంతా చీకటి అయిపోయింది. కరెంటు పోయింది. ప్రతి పనీ ఆగిపోయింది.

ఆ చీకటి భయంకరంగా వుంది. రెండు ముఖాలు నా మనస్సును ముంచెత్తాయి. నా భార్య, ఐసిసియులో మృత్యువుతో పోరాడుతున్న పేషంట్ విజయ్ మిత్రా. ఆ రెండు ముఖాలు ఒకదానిలో ఒకటి లీనమవుతున్నాయి. కరెంట్ రావటం కోసం వేచి చూస్తున్నాను.

'జనరేటర్ ఎందుకు వేయలేదో నాకాశ్చర్యంగా వుంది. ఆ చిమ్మచీకట్లో అప్రయత్నంగానే ఐసిసియు వైపు పరుగెత్తాను. లోపలికి వెళ్లగానే లైట్లు వెలిగాయి. కళ్లు చిట్లించాను. మరుక్షణమే ఇసిజి మోనిటర్ వైపు భారంగా చూశాను. నేను చూసింది మెరుస్తున్న చదునైన తిన్నని గీత. ఆ పేషంట్ గుండె ఆగిపోయింది. వెంటనే నాడి కోసం చూశాను. నేనెంత కలవరపడిపోయానంటే, నా చేతిని అతని రేడియల్ ఆర్టరీపై పెట్టలేకపోయాను. గుండెను తిరిగి పనిచేయించటానికి ప్రయత్నించాను. ఎడ్రినల్ ఇంజెక్షన్ను గుండెలోకి యివ్వకముందే, డా॥ సుజాత, "సర్ లాభం లేదు చనిపోయాడు" అంది.

ఆ టైమ్‌లో డా॥ సుజాతలో ఉద్వేగం లేదు, ఆందోళన లేదు, అని నేను గుర్తించాను. ఆమె మామూలుగా మాట్లాడింది. నా ఆదుర్దాని పారద్రోలటానికే ఆమె కావాలని అలా ప్రవర్తించింది అని నాకు అనిపించింది. కాని పేషంట్ చనిపోయాడనటాన్ని నేను అంగీక రించలేకపోతున్నాను. నా నిరాశ నా మాటలోనే ధ్వనించింది. 'ఓహ్, టెర్రిబుల్, అతన్ని మనం కాపాడలేకపోయాం'.

కమిటీ ముందు వాంగ్మూలం యిస్తున్న డా॥ భగత్ తిరిగి హఠాత్తుగా మౌనం వహించాడు. అతని నుదుట చెమట కారుతోంది. దానిని తుడుచుకోవటానికి కర్చీఫ్ తీశాడు. అనేక జ్ఞాపకాలు అతనిని చుట్టుముట్టుతున్నాయి. గతంలోకి అతని ఆలోచనలు పరుగెత్తాయి.

జైలు నుండి, కాలేజీ బహిష్కరణ నుండి విజయ్ మిత్రాను ఎవరూ తప్పించలేకపోయారు. విద్యార్థులంతా చేయగల్గినదంతా చేశారు. భగత్, ఇతర విద్యార్థులు కాలేజీ అధికారుల ముందు చెప్పాల్సినంతా చెప్పారు. విజయ్‌మిత్రా రాజకీయ నిర్ణయం అతని వ్యక్తిగతమని, అది

పరిగణనలోకి తీసుకొని అతనిని బహిష్కరించే అధికారం కాలేజీ అధికారులకు లేదని వాదించారు. వారి వాదనను కాలేజీ అధికారులు అంగీకరించలేదు. విద్యార్థుల గళం ఉద్యమంగా మారకముందే, అధికారులు వాళ్లపై ఉచ్చు బిగించారు. కాలేజి కాంపస్ లోపల పోలీసు పోస్టును పెట్టారు. ప్రొఫెసర్లు విద్యార్థుల నైతిక శక్తిని దెబ్బతీసేందుకు కఠిన వైఖరిని అవలంబించారు.

విజయ్‌మిత్రా బహిష్కరణ కొంతకాలం వివాదాస్పద అంశమైంది. కాని క్రమంగా దాని జ్ఞాపకం మరుగునపడింది.

తన రూమ్మేట్ జ్ఞాపకాన్ని చెరిపివేయటం భగత్‌కి అంత సులభం కాదు. విజయ్ పడుకునే బెడ్, అతని పుస్తకాలు, పెట్టె, టేబిల్ లైట్, బట్టలు ఆ దృశ్యం మనస్సు నుండి పారద్రోలటం సాధ్యం కాదు. విజయ్ మాటలు, ఆలోచనలు, హావభావాలు, అతను కనుబొమ్మలు ముడవటం, అతని ప్రవర్తన తనని వెంటాడుతున్నాయి. విజయ్ అంతగా ఎందుకు ఆకర్షితుడయ్యాడో అర్థంగావటంలేదు.

కొద్దికాలం తర్వాత విజయ్ సామాను పట్టుకుపోవటానికి అతని తండ్రి వచ్చాడు. అతను అలిసిపోయి, నిరాశతో, దుఃఖంలో వున్నాడు. భగత్ నిలువెల్లా చలించిపోయాడు. అతికష్టంగా ఆ వృద్ధుడితో 'అంకుల్, నేను ప్రయత్నించాను గాని.....' అని మాత్రం చెప్పగలిగాడు. అంతకంటే ఎక్కువ మాట్లాడ లేకపోయాడు. విజయ్ తండ్రి కూడ అతనితో మాట్లాడటానికి ఆసక్తి చూపలేదు. తన కొడుకు సామాన్లు సైకిల్ రిక్షాపై సర్దుకున్నాడు. ఇద్దరి మధ్యా మౌనమే. ఆ మౌనం చెప్పాల్సినదానికంటే ఎక్కువే మాట్లాడింది. తన రూమ్మేట్ తండ్రి దూరంగా వెళ్లిపోతూ ఒక నీడలా మసకబారు తున్నంతవరకూ హాస్టల్ గేటు దగ్గరే నిలబడి చూశాడు.

భగత్‌ను నిరాశ ఆవహించింది. విజయ్ సామాన్లు వెళ్లిపోయాయి. ఏదో తెలియని శూన్యం తనను చుట్టేసినట్లుంది. ఎవరో చెవిలో నిశ్శబ్దంగా చెబుతున్నట్టు అప్పుడతనికి వినిపించింది. 'మిత్రమా! నా డైరీ నీ దగ్గరే ఎందుకు వుంచుకున్నావ్?' విజయ్ మిత్రా నాలోనే వున్నాడా? తన దిండు గలేబి నుండి డైరీని జాగ్రత్తగా బయటకు తీశాడు. తనని తనే ప్రశ్నించుకున్నాడు. 'ఆ డైరీ నీకు తెలుసు. అతని తండ్రికి ఎందుకప్పగించలేదు?'

తన దగ్గర జవాబు లేదు. డైరీ పేజీలు త్రిప్పసాగాడు. అందులో ఏదైనా జవాబు దొరుకుతుందేమోనని. డైరీ పేజీలు త్రిప్పు తుండగా, తనని మంత్రముగ్ధుడిని చేసిన కొన్ని పదాల దగ్గర హఠాత్తుగా ఆగిపోయాడు. విజయ్‌మిత్రా వ్రాసుకున్నాడు. "సాయుధ తిరుగుబాటుకు సిద్ధంగావాలంటే శ్రామికవర్గం రైతాంగాన్ని కలుపుకోవటానికి ప్రయత్నించాలి. గ్రామీణ ప్రాంతాలలో రైతులతో విప్లవ కమిటీలు ఏర్పాటు చేసి, బూర్జువాజీ భూములను స్వాధీనం చేసుకోవాలి. విప్లవం విజయవంతంగావాలంటే / కార్మికవర్గం నాయకత్వాన్ని తన చేతుల్లోకి తీసుకోవాలి. – లెనిన్"

ఆ పేజీ చదువుతుంటే భగత్‌కి భయం వేసింది. డైరీని తను వుంచుకోగూడదని నిశ్చయించుకున్నాడు. విజయ్ తండ్రికి ఆ డైరీని అప్పగించాలనే తన ఆలోచనను ఇప్పుడు అమలుచేయాలనుకొన్నాడు. తన జేబులో డైరీని పెట్టి, రైల్వేస్టేషన్ వైపు వడిగా వెళ్లాడు.

విజయ్ తండ్రి రైల్వేస్టేషన్‌లోని బెంచిపై తన ఆలోచనల్లో మునిగిపోయి కూర్చొని వున్నాడు. భగత్ అతనికి డైరీని యిచ్చాడు. తన కొడుకు శవాన్ని అందుకొన్నట్టు, ఆ డైరీని తీసుకుంటూన్నప్పుడు విజయ్ తండ్రి చేతులు వణికాయి.

నుదుటిపై చెమటను పదేపదే తుడుచు కుంటున్న డా॥ భగత్‌ను చూచి డా॥ రజనీష్ ఆచార్య జోక్యం చేసుకుంటూ 'డా॥ భగత్, మీకు బాగుండకపోతే, ఈ మీటింగ్ వాయిదా వేద్దాం' అన్నాడు.

డా॥ భగత్ కర్చీఫ్‌ను చేతిలో ముడుచుకొని 'వాయిదా వేయాల్సిన అవసరంలేదు డా॥ ఆచార్య, నేను బాగానే వున్నాను' అన్నాడు.

మౌనాన్ని బద్దలు చేస్తూ డా॥ భగత్ తన సాక్ష్యాన్ని నెమ్మదిగా కొనసాగించాడు.

పేషంట్ శవాన్ని ఇన్‌స్టిట్యూట్ బిల్డింగ్ వెలుపలికి తీసుకొని రాగానే దుఃఖంలో వున్న జనం నినాదాలు చేశారు. "కామ్రేడ్ విజయ్ మిత్రా అమర్ రహే" వారి గుండెల్లోంచి వచ్చిన ఆ నినాదాలు ఇన్‌స్టిట్యూట్ అంతా ప్రతిధ్వనించాయి. ఆ పరిస్థితిలో ఏం చేయాలో తెలుసుకోవటం నాకు కష్టమైంది. డాక్టర్స్ గదిలో మూగబోయి కూర్చుండిపోయాను. డా॥ సుజాతారాయ్ నా వెంట వచ్చింది. ఆ గదిలోనే కూర్చుంది. ఆందోళన చేస్తున్న ప్రజలు, వారి నినాదాలు ఆమెకు తెలుసు. ఆమె భయపడిపోయింది. ముఖం పాలిపోయి వుంది. ఇలాంటి సమయంలో ఆమెను వదలి వెళ్లటం మంచిదిగాదనుకున్నాను. నిశ్శబ్దంగా కూర్చొని వున్నాను. సిస్టర్ ఆల్విన్ తన పని తాను చేసుకుంటోంది.

'హఠాత్తుగా డా॥ చౌదరి డాక్టర్ల గదిలోకి రావటం చూశాను. నాకు రిలీఫ్ వచ్చినట్లయింది. గాభరాతో, భారంగా శ్వాస పీలుస్తూ నా దగ్గరకొచ్చి 'డా॥ భగత్, ఏమిటిది? అంత జనం, గొంతెత్తి అరుస్తూ.... అంతా బాగానే వుందా?' అడిగాడు.

"ఒక పేషంట్.... నక్సలైట్ లీడర్ చనిపోయాడు. వాళ్లంతా అతని మనుష్యులు." చిన్నగా మాట్లాడుతూ చెప్పాను. ఇంటికి పోవటానికి లేచాను. "డా॥ చౌదరి; మీరు ఇప్పుడు ఇక్కడికొచ్చారు. నేను శెలవు తీసుకుంటున్నాను. డెత్ సర్టిఫికెట్ మీరు రాయండి" అన్నాను.

డా॥ చౌదరి అందుకు సిద్ధంగా లేడు. అతని ముఖం పాలిపోయింది. గొణిగాడు. 'నేను ఒకసారి కూడ పేషంట్‌ను చూడలేదు. అతని క్లినికల్ హిస్టరీ నాకు తెలియదు. నేను డెత్ సర్టిఫికెట్ రాయటం సరికాదు'.

'ఆశ్చర్యపోయాను, డా॥ చౌదరిని శల్య పరీక్ష చేస్తూ చూశాను. బయట జనం అరుపులు తగ్గుముఖం పట్టాయి. లోపల పరిస్థితి ఆందోళనకరంగా వుంది. ఏంచేయాలో నాకర్థం గావటంలేదు. విషయాన్ని వివరించటానికి ప్రయత్నించాను.

"డా॥ చౌదరి, మీరు డ్యూటీలో వున్నారు. రూల్స్ ప్రకారం కేసు మీది".

'డా॥ చౌదరి ఒప్పుకోలేదు. ఏ తర్కాన్ని ఒప్పుకోవటానికి ఆయన సిద్ధంగా లేడు. పేషంట్ శవంతో జనం బయట వున్నారు. పరిస్థితి ఏ సమయంలోనైనా దిగజారిపోవచ్చు. ఇంటి దగ్గర నా భార్య ఒక్కటే నిస్సహాయంగా వుంది. నా నరాలు తెగిపోతున్నాయి. నాలోని సహనం కోల్పోకుండా వుండటానికి, డెత్ సర్టిఫికెట్ రాయాలని నిశ్చయించుకున్నాను.'

## డా॥ సుజాతరాయ్ వాంగ్మూలం :

డా॥ సుజాతరాయ్‌నైన నేను జనవరి 1న కార్డియాలజీ వార్డులో డ్యూటీ రెసిడెంటు డాక్టరుగా వున్నాను. విజయ్‌మిత్రా అనే పేషంట్‌ను వీల్‌చైర్‌లో స్పృహలేని స్థితిలో తీసుకువచ్చినరోజున డా॥ చౌదరి డ్యూటీ డాక్టరు. ఆ పేషంట్‌ను ప్రాథమిక పరీక్ష చేసి, పరిస్థితి సీరియస్‌గా వుందని భావించాను. అతని కూడా పెద్దసంఖ్యలో ఆందోళనతో వున్న జనం వచ్చారు. నాకు భయమేసి, నిస్సహాయంగా వుండిపోయాను. ఐసిసియులోకి వెంటనే జాయిన్ చేశాను. డా॥ చౌదరి కోసం ఫోన్ చేశాను. ఎన్నిసార్లు చేసినా, ఆయన దొరకలేదు. అప్పటికి, ఆ పేషంట్ నక్సలైట్ లీడరని, బయట నిలబడిన జనం అతని మద్దతుదారులని తెలిసింది. ఏమవుతుందోననే భయం చుట్టు ముట్టింది. వార్డు వెనుక తలుపు నుండి బయటపడి సీనియర్ డాక్టరు కోసం చూశాను.

కాంపస్ అంతా చచ్చినంత నిశ్శబ్దం అలముకొంది. నన్ను భయపెడుతున్నది నాలోని భయమా లేక ఈ నిశ్శబ్దమా అనేది నేను చెప్పలేను. వెంటనే డా॥ భగత్ ఇంట్లో లైట్ వెలిగి వుండటం నేను చూశాను. ఆ అయోమయ స్థితిలో నేను ఆయన ఇంటి కాలింగ్ బెల్ నొక్కాను.

డా॥ భగత్ తలుపు తీశారు. ఆయన అడగకముందే, 'నేనొక సీరియస్ పేషంట్‌ను జాయిన్ చేశాను, వచ్చి సహాయం చేయండి' అన్నాను. ఆందోళనతో వున్న నా ముఖాన్ని చూసిన ఆయన నాతో వార్డుకు రావటానికి ఒప్పుకున్నారు.

ఆ పేషంట్ నక్సలైట్ లీడర్ విజయ్‌మిత్రా అని తెలుసుకున్న తర్వాత ఆయన ఆశ్చర్య చకితుడయ్యాడు. అయనేదో గుర్తుకు తెచ్చుకొంటున్నట్టు నాకనిపించింది. వెంటనే పేషంట్ బెడ్ ప్రక్కకి వెళ్ళి, గట్టిగా ఊపిరి పీల్చుకొని, 'డా॥ సుజాత, ఈ పేషంట్ మీకు తెలుసా?' అని అడిగారు.

అవును నాకు తెలుసు, నక్సలైట్ లీడర్‌గానే గాదు. నక్సలైట్ ఉద్యమం పుట్టిన ప్రాంతంలో నేనొకప్పుడు వున్నాను. విజయ్ మిత్రా కోపానికి మా కుటుంబం బలైంది. అయినా డా॥ భగత్‌కి ఆ రహస్యం నేను చెప్పలేదు. నిజానికి ఆ క్షణంలో డా॥ భగత్‌కి కూడ విజయ్‌మిత్రా బాగా తెలిసినవాడై వుంటాడని నేను పసిగట్టాను. పేషంట్ ముఖంలోకి తొంగి చూచినపుడు డా॥ భగత్ కళ్లలో అతనిని గుర్తించటాన్ని, అతనిపట్ల ప్రేమానురాగాన్ని ఆ వెంటనే ఆయన ముఖంలోని విచారాన్ని నేను గమనించాను.

విజయ్‌మిత్రా క్లినికల్ పరిస్థితిపట్ల డా॥ భగత్ నిరంతరం అప్రమత్తంగా వుంటూనే వున్నాడు. ఇసిజి గీతలలో తేడా కనిపించి నప్పుడల్లా ఆయన భృకుటి ముడుచుకొనేది. డా॥ భగత్ కలవరపడుతున్నాడని నాకర్థమైంది. ఈ పరిస్థితి నుండి ఆయన బయటపడాలనో, లేదా నా మనస్సులో నక్సలైట్స్ అంటే వున్న విపరీతమైన భయం వల్లనో, డా॥ భగత్‌ను నేనో తెలివితక్కువ ప్రశ్నను అడిగాను. 'సర్, ఈ ఆటవిక మనిషికి గుండె వుంటుందా?'

డా॥ భగత్ నిట్టూర్పుతో చెప్పారు. 'డా॥ సుజాత, ఈయన ఏ ప్రపంచాన్ని నిర్మించటం కోసం పోరాడుతున్నాడో, ఆ పోరాటమార్గం సామాన్యుడికి దుస్సాధ్యం.

డా॥ భగత్‌కి పేషంట్ గురించి బాగా తెలుసునని, అతనితో సాన్నిహిత్యం వుందని కూడ అర్థమైపోయింది. విజయ్‌మిత్రా చేసే యుద్ధాన్ని మీరు సమర్థిస్తారా అని డా॥ భగత్‌ను అడగాలనుకున్నాను. అలాంటి సూటి ప్రశ్న వేయటం పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థినికి భావ్యం కాదని ఆగిపోయాను.

డా॥ భగత్ మరింత ఆందోళనగా వుంటున్నారు. ఆయన గొణిగినట్లు అన్నారు. 'డా॥ సుజాత, ఎలాగైనా మనమీపేషంట్‌ను రక్షించాలి'.

కాని పేషంట్ బతకలేదు. చాలా గట్టిగా ప్రయత్నించినా, డా॥ భగత్ కాపాడలేక పోయాడు. దోపిడీకి గురైన ప్రయాణీకుడు, అన్నీ పోగొట్టుకున్న తర్వాత, తన దుఃఖాన్ని ఎవరికి చెప్పుకోలేని స్థితిలో వున్నట్టుగా ఆయన కనిపించాడు. నిరాశ, నిస్పృహతో భారంగా అడుగులేస్తూ ఐసిసియు నుండి డాక్టర్స్ గది వైపుకు నడిచి వెళ్లాడు. నేను నిశ్శబ్దంగా ఆయన వెంట నడుస్తూ, రూంలోని కుర్చీలో కూర్చుండిపోయాను.

కొద్దిసేపు తర్వాత డా॥ చౌదరి వచ్చారు. బయట విజయ్‌మిత్రా మద్దతుదార్లు తమ మనోభావాల్ని వెల్లడిస్తున్నారు. డా॥ చౌదరి రూంలోకి ప్రవేశించగానే, డా॥ భగత్ ఆయనకి డెత్ సర్టిఫికెట్ రాయమని చెప్పి, వెళ్లిపోవటానికి కుర్చీ నుండి లేచాడు. కాని అలా రాయటానికి డా॥ చౌదరి అంగీకరించలేదు. ఆ విషయంపై ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. డా॥ భగత్‌కి కోపం వచ్చింది. కూర్చుండిపోయాడు. ఆయన ఆవేశంతో వణికిపోయాడు. ఆ స్థితిలోనే డెత్ సర్టిఫికెట్ రాశాడు.

డా॥ భగత్ డెత్ సర్టిఫికెట్‌పై సంతకం చేసి, టేబుల్‌పై దానిని వుంచి, వెనువెంటనే డాక్టర్స్ గది నుండి లేచి వెళ్ళిపోయాడు.

## సిస్టర్ ఆల్విన్ వాంగ్మూలం :

సిస్టర్ ఆల్విన్ హెమ్‌బ్రమ్‌నైన నేను జనవరి 1 రాత్రి కార్డియాలజీ వార్డులో సీనియర్ నర్సుగా డ్యూటీలో వున్నాను. విజయ్‌మిత్రాను కొందరు తీసుకురాగా, డా॥ సుజారాయ్ పరీక్ష చేసి, ఆక్సిజన్ యిచ్చి ఐసిసియులోకి జాయిన్ చేయమని చెప్పారు. కొంచెంసేపటి తర్వాత డా॥ భగత్, డా॥ సుజాతారాయ్ ఐసిసియులోనికి వచ్చారు. ఆయన పేషెంట్‌ను పరీక్షచేసి లేబొరేటరీకి రక్తం శాంపిల్స్ పంపి బయోకెమిస్ట్రీ టెస్టులు చేయించమన్నారు. ఎమర్జన్సీ లాబ్ కెళ్లాను. అది మూసివేసి వుంది. ఆ విషయం డా॥ భగత్‌కి చెప్పాను. ఆయన ఆందోళన పడ్డారు. వరండావైపు వేగంగా వెళ్లారు. ఇంతలో కరెంటు పోయింది. లైట్లు రాగానే డా॥ భగత్ ఐసిసియులోకి పరుగెత్తుకుంటూ వచ్చారు. ఇసిజి మోనిటర్ చూచి 'ఒహ్, నో' అంటూ అరిచారు.

పేషెంట్ నాడి పట్టుకోవటానికి డా॥ భగత్ ప్రయత్నించారు. ఆయన కలవరపడ్డాడు. ఏంచేయాలో ఆయనకి పాలుపోలేదు. ఇంతలో డా॥ సుజాతారాయ్ 'సర్, పేషెంట్ చనిపోయాడు' అని అనటం విన్నాను.

## జనరేటర్ ఆపరేటర్ వాంగ్మూలం :

జనవరి 1 రాత్రి కరెంటు సప్లై కట్ అయింది. నేను డ్యూటీలో వున్నాను. వెంటనే జనరేటర్ స్విచ్ వేయటానికి వెళ్లాను. ఇంధనం వెళ్లే మార్గంలో ఏదో దుమ్ములాంటిది అడ్డు పడింది. స్విచ్ వేయటానికి కొంత టైం పట్టింది. నా దగ్గర వాచీలేదు. ఎంత టైమో చెప్పలేను.

## డా॥ చౌదరి వాంగ్మూలం :

డా॥ నీలాంకర్ చౌదరినైన నేను జనవరి 1 రాత్రి కార్డియాలజీ వార్డులో డ్యూటీలో

వున్నాను. క్యాంపస్‌లో నాకు క్వార్టర్స్ యివ్వకపోవటం వల్ల, సిటీలో ఇంటిలో అద్దెకుంటున్నాను. ఆరోజు రాత్రి డ్యూటీకి రావటానికి ఇంటి నుండి బయలుదేరగానే, గవర్నర్ కాన్వాయ్ వెళుతుండటం వలన మెయిన్‌రోడ్ బ్లాక్ చేశారని చెప్పారు. ట్రాఫిక్‌ను మళ్లించటం వలన, మిగతా రోడ్లు కిక్కిరిసి పోయాయి. అందువల్ల సరైన టైమ్‌కి ఇన్‌స్టిట్యూట్‌కి రాలేకపోయాను.

క్యాంపస్‌కి చేరేసరికి, ఒక శవం, చుట్టూ జనం వుండటం చూశాను. జనం గుమిగూడి నినాదాలిస్తున్నారు. వాళ్లు ఏ క్షణంలోనైనా హింసాయుతంగా మారవచ్చుననిపించి భయపడ్డాను. డాక్టర్స్ రూంలోకి రాగానే డా॥ భగత్, డా॥ సుజాతారాయ్ కనిపించారు. డా॥ భగత్, డెత్ సర్టిఫికెట్ రాయమన్నారు. నేను పేషెంట్‌కి చికిత్స చేయలేదు. పేషెంట్ జబ్బు ఏంటో నాకు తెలియదు. అలాంటప్పుడు డెత్ సర్టిఫికెట్ నేను రాయటం సరికాదు, సమర్ధనీయం కాదు అన్నాను. నేను నా వాదన వివరించగానే డా॥ భగత్ కోపగించుకున్నారు. సహనం కోల్పోయారు. మానసిక ఆందోళనతో ఆయనే డెత్ సర్టిఫికెట్ రాశాడు.

డెత్ సర్టిఫికెట్ చూచిన తర్వాత నాకు పిడుగుపడినట్లయింది. నా కళ్లను నేను నమ్మలేక పోయాను. చదవమని డా॥ సుజాతారాయ్ కిచ్చాను. ఆమె కూడా ఆశ్చర్యపోయింది. మరణానికి కారణం అనే కాలంకు ఎదురుగా డా॥ భగత్ 'వ్యవస్థ వైఫల్యం వల్ల మరణం సంభవించింది' అని రాశారు.

**రివ్యూ :**

డా॥ సి.కె. భగత్ నుండి వివరణ అవసరమని విచారణ కమిటీ నిర్ణయించింది. డా॥ సి.కె. భగత్‌ను పిలిచారు మళ్లీ. విచారణ కమిటీ తరఫున డా॥ రజనీష్ ఆచార్య అడిగారు. 'డా॥ భగత్, మీరు బాధ్యత గల సీనియర్ కార్డియాలజిస్టు. అలాంటి డెత్ సర్టిఫికెట్ ఎందుకిచ్చారు?'

'నేనేమన్నా తప్పు రాశానా?' డా॥ భగత్ నెమ్మదిగా చిరునవ్వుతో అనగానే కమిటీ సభ్యులు అంతా మూగబోయారు.

కొంచెం సంకోచిస్తూ డా॥ రామ్‌శేష్‌దేవ్ మళ్లీ అడిగారు. 'ఖచ్చితంగా, డా॥ భగత్, మీరు అలా రాయటం సరైనదేనా.'

'అవును. నూటికి నూరుపాళ్లు! డా॥ భగత్ మాట కఠినంగా వుంది. కర్కశంగా వుంది. గొంతుకను అదే స్థాయిలో వుంచి ఆయన మళ్లీ అడిగాడు.

'ఇంకేమైనా ప్రశ్నలున్నాయా? జంటిల్‌మన్?'

ఇంకా ఎలాంటి ప్రశ్నలు వేయవద్దని కమిటీ నిర్ణయించుకొంది. కార్డియాలజీ డైరెక్టర్, ఇతర డాక్టర్లు ఎవరినీ ప్రశ్నించటానికి పిలువలేదు, వారికి ఈ సంఘటనతో ఎలాంటి ప్రత్యక్ష సంబంధం లేదు గనుక.

**రిపోర్టు :**

తమ ముందున్న సాక్ష్యాధారాలు, పరిస్థితులు, సాక్షులు చెప్పిందానిని పరిగణనలోకి తీసుకొని ప్రతి మెంబరు ఈ విధంగా రిపోర్టు యిచ్చారు.

**కార్డియాలజిస్టు డా॥ రజనీష్ ఆచార్య రిపోర్టు :**

విజయ్ రక్తపరీక్షలు చేయలేదు గనుక గుండెపోటు అనే రోగ నిర్ణయాన్ని నిర్ధారించలేం. కేసు రికార్డులను బట్టి పరిస్థితి సీరియస్ అని చెప్పవచ్చు. అతనికి ఇంటెన్సివ్ కేర్ కావాలి. అది అందించలేకపోయారు. ఈ కేసు ప్రాథమిక వైద్య నైతిక నియమావళి ఉల్లంఘించిన అశ్రద్ధ.

**న్యూరాలజిస్టు డా॥ జీవాంకర్ యాదవ్ రిపోర్టు :**

సాక్ష్యాలు, పరిస్థితులు, పేషెంట్ నేపథ్యం జాగ్రత్తగా చూచిన తర్వాత నరాలు చిట్లటం వలన విజయ్‌మిత్రా మరణించాడని తెలుస్తోంది. అతడు మెదడు పనిచేయటం ఆగిపోయింది. భౌతికంగా అతడు బతికివున్నా, మెదడు చనిపోయింది. అలాంటప్పుడు వెంటనే ఒక న్యూరాలజిస్టును సంప్రదించాల్సింది. అది జరగలేదు. నా అభిప్రాయం విజయ్‌మిత్రాది బ్రెయిన్ డెత్.

**సైకియాట్రిస్టు డా॥ రామ్‌శేష్ రిపోర్టు :**

విజయ్‌మిత్రా నక్సలైట్ లీడర్, కార్యకర్త గనుక అతడు మానసిక ఒత్తిడితో వుంటాడు. అతను తన ఊహాలోకంలో నివశిస్తాడు. అదో మానసిక వ్యాధి. అది నాయకులకి, కార్యకర్తలకి అందరికీ వుంటుంది. అది శిఖరానికి చేరితే, అతడు సైకోగా మారతాడు, పిచ్చివాడవుతాడు. లేదా డిప్రెషన్‌లోకి వెళతాడు. సాక్ష్యాల్ని పరిస్థితుల్ని, సాక్షుల వాంగ్మూలాలు పరిశీలించిన తర్వాత, విజయ్‌మిత్రా మానసిక ఒత్తిడి వల్ల చనిపోయాడు.

ముగ్గురు కమిటీ మెంబర్లు అనేక విషయాలపై ఏకాభిప్రాయానికొచ్చారు. డా॥ చౌదరి ఆరోజు రాత్రి జనవరి 1న డ్యూటీలో వున్నాడు. ట్రాఫిక్ జామ్ వలన సరైన సమయానికి ఇన్‌స్టిట్యూట్‌కి రాలేకపోయాడు. అతని స్థానంలోకి డా॥ భగత్ వచ్చి పేషెంట్‌కు చికిత్స చేయటం తప్పు. ఆ రకంగా చేయటం ద్వారా అతడు ఇన్‌స్టిట్యూట్ రూల్స్‌ను అతిగా ఉల్లంఘించాడు.

భార్యకి సుదీర్ఘకాలంగా వున్న జబ్బు వల్ల, కార్డియాలజీ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ పదవి యివ్వలేదని లిటిగేషన్‌లో వుండటం వలన, డా॥ సి.కె. భగత్ నిరాశ, నిస్పృహ, ఆత్మనూన్యతకి లోనై డిప్రెషన్‌తో బాధపడుతున్నాడు. ఆయన మానసిక స్థితి మామూలుగా లేదు.

డా॥ సి.కె. భగత్ రాసిన డెత్ సర్టిఫికెట్‌పై చట్టపరమైన చెల్లుబాటును వివరిస్తూ, జనవరి 1 రాత్రి డా॥ సి.కె. భగత్ డ్యూటీలో లేదు గనుక ఆయన డెత్ సర్టిఫికెట్ యివ్వగూడదు. ఆయన అన్ని రూల్సు, రెగ్యులేషన్స్‌ను అతిక్రమించాడు. అయినప్పటికి అంతిమ నిర్ణయం తీసుకునే ముందు లీగల్ స్పెషలిస్టు అభిప్రాయాన్ని తీసుకోవాలని భావించింది.

**ప్రభుత్వ నిర్ణయం :**

సాక్ష్యాధారాలు, అప్పటి పరిస్థితులను బట్టి విచారణ కమిటీ ఇచ్చిన రిపోర్టు ప్రకారం నక్సలైట్ నాయకుడు విజయ్‌మిత్రాతో డా॥ సి.కె. భగత్ సన్నిహిత సంబంధాలున్నాయని ఋజువయింది. ప్రభుత్వంపై బురద జల్లటానికే ఆయన చట్టబద్ధతలేని డెత్ సర్టిఫికెట్‌ను యిచ్చాడు. అతని చర్య క్రమశిక్షణారాహిత్యం. ఒక ప్రభుత్వ సేవకుడి ప్రవర్తనకు అనుగుణమైనది కాదు. డా॥ సి.కె. భగత్ వైద్య నైతిక నియమావళిని ఉల్లంఘించటం వలన, అభ్యంతరకరమైన పద్ధతిలో ప్రవర్తించటం వలన అతనికి పెన్షన్ యిస్తూనే వెంటనే నిర్బంధ పదవీ విరమణ చేయబడినాడు.

**డా॥ సి.కె. భగత్ ప్రతిస్పందన :**

కామ్రేడ్ విజయ్, నీకు హృదయమే లేకుంటే! ✦


**పుస్తక సమీక్ష:** డా॥ చెలికాని రామారావు 36వ వర్ధంతి సందర్భంగా

# తొలి పార్లమెంటులో డా॥ చెలికాని రామారావు

**కొత్తపల్లి రవిబాబు**

**భారతదేశం** సర్వసత్తాక, సార్వభౌమదేశంగా ప్రకటించుకున్న తర్వాత 1952 ఫిబ్రవరిలో జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితంగా ఏప్రిల్ 17న మొదటి లోక్‌సభ ఏర్పడింది. ఆనాడు లోక్‌సభలో మొత్తం సభ్యులు 489 మంది కాగా వారిలో కాంగ్రెస్ 364 స్థానాలు, కమ్యూనిస్టు పార్టీ 16 స్థానాలు, సోషలిస్టు పార్టీ 12 స్థానాలు, ఇతర పార్టీలు 60 స్థానాలు స్వతంత్రులు 37 స్థానాలు గెల్చుకున్నారు.

ఈ ఎన్నికలలో వృత్తి రీత్యా ప్రజావైద్యునిగా వున్న డా॥ చెలికాని రామారావు కాకినాడ నియోజకవర్గం నుండి మొదటి పార్లమెంటుకు కమ్యూనిస్టు అభ్యర్థిగా ఎన్నికయ్యారు. ఆ పార్లమెంటులో రాజకీయ నాయకులకన్నా రాజకీయవేత్తలు (not politicians, but states men) ఎక్కువగా వుండేవారు. పార్లమెంటు సభ్యత్వం ఇప్పటిలాగా జీతభత్యాలకు, అనేక సదుపాయాల కోసం కాదు. దేశ భవిష్యత్తును దృష్టిలో వుంచుకొని ఒక దార్శనికతతో అనేక విషయాలపై కూలంకషంగా చర్చించి అవసరమైన చట్టాలు చేసే బాధ్యత స్వీకరించడం కోసం వుండేవారు. ఈనాడు పార్లమెంటులో శాసన సభల్లో అత్యధికులు నేర చరిత్ర కలిగినవారు కాగా మరికొందరు అత్యధిక ధనికవర్గానికి చెందిన వారుగా వున్నారు. ఎక్కువమంది సొంత ఆలోచనకు పదును పెట్టకుండా పార్టీ అధినేత అభిప్రాయానికి వంతపాడేవారుగానే వున్నారు.




డా॥ రామారావు అధికారపార్టీ చేపట్టిన ప్రగతిశీల పథకాలను సమర్థిస్తూనే, వాటిలోని లోటుపాట్లనూ, ఆ పార్టీలోని అవినీతి ధోరణులను పార్లమెంటులో ఎండగట్టేవారు. నదీజలాల సమస్య ఈనాటికీ అనేక రాష్ట్రాలలో ఉద్రిక్తతలను పెంచుతోంది. ఆంధ్రాస్టేట్ బిల్లు (14.08.1953) – (24.08.1953)పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "నీటి సమస్య తరచుగా నెత్తురుటేరులు పారిస్తుంది. పెను సమస్యకు దారితీస్తుంది" అనీ, "బ్రిటీషు ప్రభుత్వమూ, కాంగ్రెసు ప్రభుత్వము – రెండూ రాయలసీమ పాలిట శనిలా తయారయ్యాయి.... కేంద్ర ప్రభుత్వం ప్రాజెక్టుల అభివృద్ధికి భారీగా ఆర్థిక సహాయం అందించాలి – దానిలో ఎక్కువభాగం రాయలసీమకు ఖర్చుచేయాలి, మొదటి ప్రాధాన్యం రాయలసీమకు ఇవ్వాలి" అని వాదించారు.

రాయలసీమవారే ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రులుగా పనిచేసినా, రాయలసీమ జలవనరుల సంగతీ, ఇరిగేషన్ ప్రాజెక్టుల గురించీ, క్షామ నివారణ చర్యల గురించీ తగినంతగా పట్టించుకోకపోవడం చారిత్రక సత్యం. అందుకే ఈనాటికీ కొందరు తమకు ప్రత్యేక రాష్ట్రం కావాలని కోరుతున్నారు. రాయలసీమ అస్తిత్వ ఉద్యమం రూపందుకుంటోంది.

1954లో భాషాప్రయుక్త రాష్ట్రాల గురించీ, 1956లో రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ బిల్లుపైనా జరిగిన చర్చలో డా॥ రామారావు బొంబాయి నగరం మహారాష్ట్రకే చెందాలని హేతుబద్ధంగా వాదించారు. ప్రతి భాషాప్రయుక్త రాష్ట్రానికీ సొంత హైకోర్టు తప్పనిసరిగా వుండాలన్నారు. రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ సందర్భంగా సరిహద్దు కమిటీలను ఏర్పరచాలనీ, దానిలో జ్యుడీషియల్ అధికార్లు వుండాలనీ సూచించారు. కట్టుదిట్టమైన ఏర్పాటు లేకపోవడం ఫలితంగా ఈనాడు అస్సాం – మిజోరం రాష్ట్రాల సరిహద్దు సమస్యపై ఇరు రాష్ట్రాల పోలీసులూ కాల్పులకు తెగబడటం చూస్తున్నాం.

1956లో రాష్ట్రపతి ప్రసంగంపై తీర్మానం సందర్భంగా భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకోసం జరిగిన ఉద్యమంలో 'మా ఆంధ్రా వాళ్ళం ముందున్నా'మనీ, 'ఆంధ్రావాడినీ, కమ్యూనిస్టునీ, భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటులో పశ్చాత్తాపం ఎరగనివాడినీ అయినందుకు గర్వపడుతున్నాను' అని రామారావు ప్రకటించారు.

డా॥ రామారావు వృత్తిరీత్యా వైద్యునిగా వున్న అనుభవాన్ని పురస్కరించుకొని, 1954, 55లలో కుటుంబ నియంత్రణ, మందులు, మాయానివారణల బిల్లు, ఆహార కల్తీ నిరోధక బిల్లు, ఔషధాల బిల్లులపై సాధికారికంగా సూచనలు ఇచ్చారు. అధిక జనాభా వల్లనే అభివృద్ధి కుంటుపడుతోందనే ప్రభుత్వ వాదనను త్రోసిపుచ్చుతూ, వైద్యశాస్త్రం ప్రకారం తక్కువ ప్రొటీన్ల ఆహారం తీసుకునేవారు అధిక సంతానం కలిగి వుంటారనీ, మాంసకృత్తులు ఎక్కువ తీసుకునేవారిలో గర్భధారణ (fertility) శక్తి తగ్గుతుందనీ, పెట్టుబడిదారీ సమాజం ప్రజలను దోచుకుంటూ, వారిని ఆకలికి గురిచేస్తూ వారి దీనత్వానికి కారణం అధిక జనాభా అని మోసం చేస్తోందనీ ప్రకటించారు. నదులలో నీరు అపారంగా సముద్రంలో కలిసి వృధా కావటాన్ని ప్రాజెక్టుల ద్వారా అరికట్టి, బీడు భూములను సాగుచేసి, భూమి ఉత్పాదకతను పెంచడం విషయం పక్కన బెట్టి; "ప్రజలు భూమికి భారం అయ్యారని చెప్పడం మూర్ఖత్వం అవివేకం

అవుతుంది. అయితే అసంఖ్యాకుల శ్రమ ఫలాన్ని కొద్దిమంది అనుభవించే విధానం వున్నంతవరకు, భూమికి ప్రజలు భారమే అవుతారు. అంతవరకు ఈ ఆకలి బాధలు, దయనీయ జీవన పరిస్థితులు తప్పవు. ఇది జనాభా వృద్ధి వలన ఎంతమాత్రం కాదు" అంటూ లార్డ్ బోయడ్ ఆర్ చెప్పిన మాటలు ఉదహరించారు.

1954 నాటికే పార్లమెంటు మాయాశక్తులున్న మందుల ప్రచారాన్ని అరికట్టే బిల్లును చర్చించి చట్టం చేసింది. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోకపోవడం వల్ల, శాస్త్రీయమైన ఉచిత వైద్యం అందించకపోవడం వల్ల ప్రజలు వింత చికిత్సకి, విడ్డూరమైన మందులు కోసం పరుగులు తీస్తున్నారనీ, ఈ బిల్లును సమర్ధిస్తున్నాననీ డా॥ రామారావు ప్రకటించారు. ఇప్పటికీ రకరకాల నాటు మందులకూ, ప్రసాదం పేరుతో ఇచ్చే లేహ్యాలూ, తాయెత్తులు, రక్ష రేకులు, మాయా ఉంగరాలు, రంగురాళ్ళూ, ఫ్లేవర్ మెడిసిన్ మొదలగునవి సమాజంలో ప్రబలంగా వున్నాయంటే దానికి కారణం సామాన్య ప్రజానీకానికి వైద్యం అందుబాటులో లేకపోవడమే. కరోనా చికిత్స కోసం కార్పొరేటు ఆసుపత్రులు లక్షలాది రూపాయలు వసూలు చేయడం మన కళ్ళముందే వుంది.

ప్రత్యేక వివాహ బిల్లు, హిందూ వారసత్వ బిల్లుపై చర్చలో పాల్గొన్న డా॥ రామారావు, "మనది చాల ప్రాచీనమైన గొప్ప మతం. దీనిలో మంచితోపాటు భయానకమైన విషయాలు ఎన్నో ఉన్నాయి. కాలం చెల్లిన దుర్మార్గమైన ఆచారాలను మతంగా భావించి వాటిని విమర్శించడం తప్పంటున్నారు" – అని వివరించారు. ఇక హిందూ వారసత్వ బిల్లు కంటితుడుపు చర్యే అన్నారు. నలుగురు కొడుకులూ, ఒక కూతురు వుంటే ప్రతి కుమారుడికీ ఆస్తిలోని 5వ భాగం, కూతురికి మాత్రం 5వ వంతులో 5వ వంతు అంటే ఆస్తిలో 25వ వంతు వస్తుంది. బర్మాలో కూతుర్లను కొడుకుతో సమానంగా చూస్తారు. మనం కూడా ఆ సమానత్వాన్ని ఇవ్వాలి అని డా॥ రామారావు చెప్పినది కొన్ని దశాబ్దాల తర్వాత ఈనాడు సుప్రీంకోర్టు తీర్పు ద్వారా ఆడవారికి లభించింది.

పెప్సూలో రాష్ట్రపతి పాలనపై చేసిన తీర్మానాన్ని చర్చిస్తూ డా॥ రామారావు ప్రజలపై పోలీసుల దురాగతాలను, భూస్వామ్య రాజ్యవంశీకులకు మద్దతుగా అణచివేత చర్యలను, బూటకపు ఎన్‌కౌంటర్లనూ, ఆంధ్రా – తెలంగాణాలలో కమ్యూనిస్టులపైనా, ప్రజలపైనా జరిగిన పోలీసు దౌర్జన్యాలను ఎండగట్టారు.

ఇలా పార్లమెంటులో అనేక విషయాలపై ప్రజానుకూలంగా ఆయన వాదించారు. వీధి బాలల, యాచక నిరోధ బిల్లు (1955), మద్య నిషేధంపై (1956), నిత్యావసర వస్తువుల బిల్లు (1952), సభ్యుల జీతాలు, భత్యాలు (1954), మొదలైన ఎన్నో అంశాలపై ఆయన పార్లమెంటులో సూచనలిచ్చారు.

ఒక ప్రజాప్రతినిధిగా అత్యున్నతమైన శాసనాధికారం గల పార్లమెంటులో సభ్యునిగా తన బాధ్యతగా ప్రజల ప్రయోజనాలు కాపాడే విధంగా సూచనలు ఇచ్చి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా ప్రఖ్యాతిగాంచిన డా॥ చెలికాని రామారావుకు ఆయన 36వ వర్ధంతి సందర్భంగా నివాళులు. కొత్తగా రాజకీయాల్లోకి ప్రవేశిస్తూ, చిత్తశుద్ధితో కృషి చేయాలనుకునేవారందరికీ ఇది ఒక పాఠ్య గ్రంథంగా ఉపయోగపడుతూంది.

**(తొలి పార్లమెంటులో డా॥ రామారావు.**
**అనువాదం : డా॥ పి.యస్. ప్రకాశరావు, బి.ఎస్. శ్రీనివాస్.**
**సంపాదకులు : డా॥ సి. కృష్ణ మోహనరావు.**
**1/8 డెమ్మీ 232 పుటలు. ప్రథమముద్రణ : జనవరి 2021.**
**వెల : అమూల్యం.**
**ప్రతులకు : డా॥ చెలికాని రామారావు స్మారక కమిటీ,**
**రామచంద్రపురం, తూ.గో.జిల్లా – 533255.**
**ఫోన్ : 98493 48162)**

## గోరంట్ల (కొత్తపల్లి) వాణీదేవి 3వ వర్ధంతి



**గోరంట్ల** (కొత్తపల్లి) వాణీదేవి వెంకటకృష్ణవర్మ, సరళాదేవి దంపతులకు తొలి సంతానంగా 16-12-1936న జన్మించారు. తల్లిదండ్రులిద్దరూ హిందీ పండితులు, స్వాతంత్ర్య సమరయోధులు. వాణీదేవి విద్యావనం (కృష్ణాజిల్లా)లో హిందీ చదివారు. అక్కడే చదివిన గోరంట్ల వెంకటేశ్వరరావును వివాహం చేసుకున్నారు. కొన్నేళ్ళపాటు మహిళా సంక్షేమశాఖలో అధికారిగా, అరకువ్యాలీలో, స్టువర్టుపురం సెటిల్‌మెంట్‌లో పనిచేసి, చీరాల పురపాలక ఉన్నత పాఠశాలలో భర్తతోపాటు హిందీ పండితులుగా స్థిరపడ్డారు. హిందీ నుండి వీరు అనువదించిన ఎన్నో కథలను 'విపుల' మాసపత్రిక ప్రచురించింది.

వీరి భర్త వెంకటేశ్వరరావు తన 86వ ఏట 2013 జనవరి 1న మరణించారు. వీరి జ్యేష్టకుమారుడు మధుబాబు 2003 జూన్ 30న బొంబాయిలో ఒక ప్రమాదంలో మరణించారు. వాణీదేవి తన 82వ ఏట చీరాలలో 27 జులై 2018న మరణించారు.

మొదటి వర్ధంతి సందర్భంగా వారిని జ్ఞాపకం చేసుకుంటూ వారి కుమార్తె కొత్తపల్లి సుధ, కొడుకు లోకేశ్, కోడళ్ళు కల్యాణి, శైలజలు 'ప్రజాసాహితి' శాశ్వతనిధికి 27 జులై 2019న నలభై వేలు విరాళంగా ఇచ్చారు. వారికి కృతజ్ఞతలు. ప్రజాసాహితి




# దళిత ప్రతిఘటనాస్వరాన్ని వినిపిస్తున్న తమిళ సినిమా

– పి. పాండురంగ వరప్రసాద్

**కరోన** కల్పించిన నిర్బంద విశ్రాంతిలో చూసిన మూడు తమిళ చలనచిత్రాలూ నన్ను ఆకట్టుకున్నాయి. మొదటిది 2019 లో విడుదలై ఘనవిజయం సాధించిన 'అసురన్'. ఇది తెలుగులో ఇటీవల 'నారప్ప' గా విడుదలైంది. రెండవది ఈ సంవత్సరమే వచ్చిన 'కర్ణన్'. మూడవది 'సర్పేట్ట పరంబరా'. తమిళ సినిమా దర్శకులు, నిర్మాతలు దళిత సమస్యని, భూమి సమస్యని, ఆత్మగౌరవ సమస్యని ఎంత సీరియస్‌గా తీసుకున్నారో ఈ సినిమాల వల్ల అర్థమౌతుంది. సమస్యని ప్రస్తావించడమేకాక సహజత్వానికి దగ్గరగా, ఆడంబరరహితంగా కథను నడిపించడం దర్శకుల ప్రతిభను చాటి చెబుతుంది. ఇటువంటి సినిమాలు తీయడానికి ధైర్యముండాలి. పేరున్న నటులు నటించడానికి ముందుకు రావాలి. 'కర్ణన్' 'అసురన్' సినిమాలు కుల అణచివేతను, వర్గ దోపిడీని, భూమి సమస్యని చిత్రిస్తే, మూడవ చిత్రంలో చెన్నైలోని పేదప్రజల జీవితాలను, 1970లలో వారు ఆసక్తి చూపించిన బాక్సింగ్‌ను చిత్రించారు.

దాదాపు 28 సంవత్సరాల క్రితం ప్రముఖ తమిళ రచయిత్రి పూమణి వ్రాసిన 'వెక్కై' (వేడి) అనే నవల ఆధారంగా ప్రముఖ దర్శకుడు వెట్రి మారన్ తీసిన ఐదవ చిత్రం 'అసురన్'. ఆయన మొదటి నాలుగు చిత్రాలకు విమర్శకుల ప్రశంసలేగాక అవార్డులు కూడా అందుకున్నాడు. ఆయన ప్రజల, అణగారిన వర్గాల సమస్యలు, రాజ్యమూ, పోలీసులూ చేసే హింస తన చిత్రాలలో చిత్రించారు. 'అసురన్'లో కథానాయకుడు శివసామి బక్క రైతు. అతని రెండు ఎకరాల భూమి, సిమెంటు ఫ్యాక్టరీ పెట్టాలనుకుంటున్న భూస్వామి వడమారన్ నరసింహన్ భూమిని ఆనుకుని వుంటుంది. శివసామి భూమిని కొనివేయాలనే ఆలోచనలో భూస్వామి వుంటాడు. శివసామి పెద్దకొడుకు మురుగేశన్, వడమారన్ ఘర్షణ పడతాడు. వడమారన్ తన పొలానికి వేసిన విద్యుత్ కంచెలో పడి శివసామి పెంపుడుకుక్క చనిపోతుంది. దీనిపై జరిగిన పంచాయితీలో చేను చుట్టూ కంచె వేసుకోవడం మా హక్కు అన్న భూస్వామి వాదననే పంచాయతీ పెద్దలు కూడా సమర్థిస్తారు. దీనిపై ఆగ్రహించిన మురుగేశన్ ఆ రాత్రే కంచెను ధ్వంసం చేస్తాడు. అణగి మణిగి వుండాల్సినవారు ఇలా బరితెగిస్తారా అంటూ వడమారన్ మురుగేశన్‌ను అరెస్టు చేయిస్తాడు. కొడుకును విడిపించుకోడానికి, కేసు ఎత్తివేసుకొమ్మని కోరుతూ శివసామి పెద్దల దగ్గరకు వెళ్తాడు. భూమికి మంచి ధర ఇస్తానని దానిని తనకు అమ్మితే కేసు వెనక్కి తీసుకోడానికి అంగీకరిస్తాడు వడమారన్. కానీ భూమిని అమ్మడానికి ఇష్టపడడు శివసామి. అయితే గ్రామంలో అందరి పాదాలకు సాష్టాంగ నమస్కారం చేస్తే కేసు వెనక్కి తీసుకుంటామని పెద్దలు చెబితే శివసామి అలాగే చేసి కొడుకును విడుదల చేయిస్తాడు. జైలు నుండి బయటకు వచ్చిన కొడుకు మురుగేశన్, తండ్రికి జరిగిన ఘోర అవమానాన్ని భరించలేక సినిమాకు వెళ్ళిన వడమారన్‌ను ఎవరూ చూడకుండా చెప్పుతో కొడతాడు. ఉగ్రుడైన వడమారన్, మురుగేశన్‌ను క్రూరంగా హత్య చేయిస్తాడు. తల లేని మొండాన్ని వదలి వెళతారు. పోలీసులు కేసు పెట్టరు. తన అన్నను చంపినా తండ్రి ఏమీ చేయడంలేదని చిన్న కొడుకు చిదంబరం వడమారన్ చేయి నరకడానికి దాడిచేస్తే ఆ దాడిలో వడమారన్ చనిపోతాడు. దానితో భయపడి తండ్రీకొడుకులు అడవిలోకి పారిపోతారు. శివసామి భార్య, కూతురు అతని బావమరిది కలసి వేరే వూరికి వెళ్తారు. వడమారన్ మనుషులూ, పోలీసులూ వారికోసం వెదుకుతూ వుంటారు. చిదంబరాన్ని చంపడానికి వారు చేసే ప్రయత్నాన్ని శివసామి అడ్డుకుంటాడు. ఆ తర్వాత తన కథ కొడుకుకు చెబుతాడు.

ఫ్లాష్‌బాక్‌లో శివసామి ఒక మిల్లు యజమాని దగ్గర పనిచేస్తూ అతని సారా వ్యాపారంలో సహాయపడుతూ వుంటాడు. ఒకసారి శివసామి మేనకోడలు చెప్పులు వేసుకుని ఊరిలోనికి వచ్చిందని మిల్లు ఉద్యోగి ఒకడు ఆమెను అవమానించి, ఆ అమ్మాయితో చెప్పులు నెత్తిన పెట్టుకుని ఊరంతా నడిపిస్తాడు. ఇది తెలుసుకుని శివసామి ఆ ఉద్యోగిని, అతనికి సహకరించిన మిత్రుడినీ పట్టుకుని చెట్టుకు కట్టివేస్తాడు. మిల్లు యజమాని వచ్చి సంగతి తెలుసుకుని ఆ ఉద్యోగి తరపున మాట్లాడి శివసామిని దూషిస్తాడు. 'నీకు ఇచ్చిన చనువును దుర్వినియోగం చేస్తున్నావు. నీ స్థానం ఎక్కడో తెలుసుకో' అని హెచ్చరిస్తాడు. ఉద్యమ సంఘాలలో పనిచేస్తున్న శివసామి అన్న యాజమానుల భూస్వామ్య తత్వాన్ని వివరిస్తాడు. సినిమాలో ఎక్కడా కుల ప్రస్తావన రాదు గాని శివసామి దళిత కులానికి చెందినవాడని అర్థమౌతూ వుంటుంది. బ్రిటీషు ప్రభుత్వం షెడ్యూలు కులాలకు ఇచ్చిన 'పంచమి' భూములు భూస్వామి ఆక్రమణలో ఉంటాయి. హక్కుల ఉద్యమంలో పనిచేస్తున్న న్యాయవాది (ప్రకాశ్‌రాజ్) గ్రామ ప్రజలను సమావేశపరచి ఈ భూములు వారివేనని, వారు తప్ప వాటిని అమ్మటం కానీ, కొనటం కానీ ఇతరులు ఎవరూ చేయరాదనీ, ఆ భూములకోసం పోరాడాలనీ చెబుతాడు. ఈ ఉద్యమానికి శివసామి అన్న నాయకత్వం వహిస్తాడు. ఈ విషయం తెలిసిన మిల్లు యజమాని విశ్వనాథన్, అతనివర్గంవారు శివసామి ఇంటిమీద దాడిచేసి ఇల్లు తగలబెడతారు. ఇంటిలోని వారందరూ మంటల్లో కాలి చనిపోతారు. (1968లో కీలవేన్మణి సంఘటన ఆధారం). తరువాత శివసామి ఆ ఊరు వదలి ప్రస్తుతం వుంటున్న ఊరిలో స్థిరపడతాడు. పెళ్లి చేసుకుంటాడు.

తరువాత కథ వ్యక్తిగత పగ సాధింపు ధోరణిలో సాగుతుంది. శివసామినీ, చిదంబరాన్నీ చంపడానికి ప్రయత్నిస్తారు. న్యాయవాది రాజీ ప్రయత్నం చేస్తాడు. శివసామి భూమిని ఇస్తే కేసులు ఎత్తివేసుకుని ఘర్షణ లేకుండా వుంటామని వడమారన్ కుటుంబ సభ్యులు చెబుతారు.

శివసామి తన పొలాన్ని రాసి ఇచ్చేస్తాడు. మాట తప్పిన వడమారన్ కొడుకు, తమ్ముడు చిదంబరాన్ని తీసుకుపోయి చంపివేస్తుంటే శివసామి వెళ్ళి వాళ్ళను చంపుతాడు. జైలు శిక్ష పడుతుంది.

పైపైన చూస్తే ఇది వ్యక్తిగత కక్ష సాధింపు, ముఠా తగాదాల సినిమాగా వున్నప్పటికీ, దళిత ఆత్మగౌరవ సమస్యను ప్రధాన అంశంగా చేసుకుని చిత్రం కొనసాగుతుంది. ప్రస్తుతం వున్న రాజకీయ వాతావరణంలో కుల ప్రస్తావన చేయటానికి వెనుకాడిన దర్శకుడు అది దళితకుల సమస్యేనని అర్థం అయేటట్లు స్ఫురింపచేశాడు. అదేవిధంగా భూమి సమస్య కీలకమైనదనీ, దానికోసం భూస్వాములు ఎంతకైనా తెగిస్తారనీ, ఎంత చిన్న కమతమైనా దళితుల చేతుల్లో వుండనీయరనీ ప్రతిభావంతంగా చిత్రీకరించారు. భూమి సమస్య అసలు సమస్యే కాదనీ, దున్నే వానికే భూమి, వ్యవసాయ విప్లవం అనేవి కాలం చెల్లిన పాత చింతకాయ పచ్చడి మాటలు అనే వాళ్ళకు సమాధానం అన్నట్లుగా భూమి సమస్య ఎంత కీలకమో, తనకున్న భూమిని వదులుకోడానికి రైతు ఏ మాత్రం ఇష్టపడడనే వాస్తవాన్ని చక్కగా చిత్రీకరించారు. ఎంత అవమానాన్నైనా భరించడానికి శివసామి సిద్ధపడతాడుగాని భూమిని వదులుకోడానికి ఇష్టపడడు.

అయితే వెట్రిమారన్ ప్రధానంగా అంబేద్కర్ భావజాలానికి పెద్దపీట వేశారు. చివరి సన్నివేశంలో శివసామి జైలుకు వెళుతూ కొడుకుతో 'మన దగ్గర భూమి వుంటే వాళ్ళు గుంజుకుంటారు, మన దగ్గర డబ్బు వుంటే లాగేసుకుంటారు. మన దగ్గర చదువు వుంటే వాళ్లేమీ చేయలేరు. చదువుతో అధికారాన్ని సంపాదించాలి. ఆ అధికారాన్ని వాళ్లలా కాకుండా అందరి క్షేమం కోసం వుపయోగించాలి' అని చెబుతాడు. భూమి కోసం, సమాజ సంపదలో భాగస్వామ్యం కోసం, సమసమాజం కోసం పోరాడితేనే ఆత్మగౌరవాన్ని కాపాడుకోగలమనీ, మనల్ని మనం రక్షించుకోగలమనీ చెప్పకుండా, కేవలం అంతా చదువుతోనే సాధించవచ్చని చెప్పడం వ్యక్తిగత ప్రయోజనానికేగాని సమష్టి ప్రయోజనం కోసం కాదు. అంతేకాదు సినిమా అంతా (ఫ్లాష్‌బాక్ మినహాయించి) రెండు కుటుంబాల మధ్య ఘర్షణగానే కనబడుతుంది. కానీ అంతర్గతంగా వున్న కుల సమస్యను, భూమి సమస్యనూ తీసుకుని సామూహిక పోరాటంగా మలచలేదు. అంతిమంగా వ్యక్తివాదాన్ని చెప్పినప్పటికీ ప్రజల సమస్యలనూ, వారి భావోద్వేగాలనూ అత్యంత సహజంగా చిత్రీకరించిన విధానం అమోఘం.

'కర్ణన్' సినిమాకు దర్శకుడు మారి సెల్వరాజ్. ఈయన దర్శకత్వం వహించిన రెండవ చిత్రం ఇది. దీనికి ఆధారం 1995లో తిరునల్వేలి జిల్లాలో కొడియాంకులమ్ గ్రామంలో దళితులపై జరిగిన హింసాకాండ. ఆ గ్రామంలో బస్సు ఆపరు. ప్రక్క వూరు వెళ్ళి బస్సు ఎక్కాలి. బస్సు కండక్టర్‌తో కొడియంకుళం గ్రామ యువకునికి జరిగిన సంఘర్షణ పెరిగి రెండు కులాల మధ్య ఘర్షణగా మారింది. ఈ సంఘర్షణలో 18 మంది చనిపోయారు. దేవర్ కులానికి చెందినవారికి అండగా పోలీసులు ఆ గ్రామంపై దాడిచేసి దళితుల ఇళ్లను ధ్వంసం చేశారు. మహిళలను పిల్లలను, వృద్ధులను విచక్షణారహితంగా కొట్టారు. 1995 ఆగష్టు 31న ఘటన తమిళనాడులో రాజకీయ ప్రకంపనలను సృష్టించింది. దేవేంద్రకుల వెల్లలార్ కులానికి చెందిన దళితులంతా సంఘటితమయ్యారు. వారు ఆ ప్రాంతంలో దాదాపు 20% వుంటారు. ఇది జయలలిత ప్రభుత్వ ఓటమికి దారి తీసింది. ఈ ఘటన ఆధారంగా తీసిన 'కర్ణన్', మారి సెల్వరాజ్ దర్శకత్వ ప్రతిభకు అద్దం పడుతుంది. అత్యంత సహజమైన దృశ్యాలు, సంగీతం ప్రేక్షకులను పరవశం చేస్తాయి. సినిమా చూస్తున్న అనుభూతి కంటే మనం కూడా ఆ గ్రామంలో నివసిస్తున్నామనే భావం కలుగుతుంది. పుట్టా, చెట్టూ, కుక్కా, గాడిదా, గుర్రం, పందీ, పక్షులు, చిన్న చిన్న కీటకాలను కూడా ప్రతీకాత్మకంగా మనకు దర్శకుడు చూపించాడు. రెండు కాళ్ళు కట్టివేసివున్న గాడిద ఆ వూరిలో బంధనాలతో బతుకుతున్న దళితులకు ప్రతీకగా వుంటుంది. అనేక ఘటనల తరువాత కథానాయకుడు కర్ణన్ ఆ గాడిద కాళ్ళకు కట్టిన కట్టు తెగ గొడతాడు. అంటే బంధనాలు తెంచుకుని ముందుకు వెళ్లడానికి నిర్ణయించుకున్నాడని సూచిస్తాడు. ప్రతి సన్నివేశాన్ని ఎంతో అర్థవంతంగా, సహజత్వానికి దగ్గరగా చిత్రీకరించారు. చనిపోయిన కర్ణన్ చెల్లెలు ప్రతి సంఘటన, సందర్భంలోను కనిపిస్తూ తన భావాన్ని వ్యక్తం చేస్తుంటుంది. ఆ గ్రామం దళితుల అభ్యుదయ భావాలకు ప్రతీకగా వుంటుంది.

ఇంకా ఈ చిత్రాన్ని వివరంగా పరిశీలిస్తే గర్భవతి ఐన ఒక మహిళకు బస్సు ఆపకపోవడంతో ఆమె కొడుకు బస్సు పైకి రాయి విసురుతాడు. దానితో ప్రారంభమయిన సంఘర్షణ కర్ణన్ నాయకత్వాన బస్సును ధ్వంసం చేసేంతవరకు పోతుంది. దానితో పోలీసులు ఆ గ్రామంపై దాడి చేస్తారు. ప్రక్క గ్రామానికి చెందిన అగ్రకుల పెత్తందారులు పోలీసులను మరింత ప్రేరేపిస్తారు. అంతకు ముందునుండే అ వూరివారికీ, దళితులకూ మధ్య ఘర్షణ జరుగుతూ వుంటుంది. దళిత గ్రామమంతా సంఘటితంగా పోలీసులను ఎదుర్కోవాలని నిర్ణయించుకుంటుంది. పోలీసులు ఆ గ్రామ పెద్దలను అరెస్టు చేసి చిత్రహింసలు పెడతారు. కర్ణన్,గ్రామ యువకులతో కలసి వెళ్ళి పోలీసులను తరిమిగొట్టి తమ పెద్దలను తెచ్చుకుంటారు. దానితో పోలీసులు ఎస్పీ కన్నబీరన్ నాయకత్వంలో వందల సంఖ్యలో గ్రామాన్ని చుట్టుముట్టి ధ్వంసం చేస్తారు. ఈ సమయంలోనే కర్ణన్‌కు సైన్యంలో వుద్యోగం వస్తుంది. కానీ అతను గ్రామాన్ని ఈ పరిస్థితిలో వదలి వెళ్లనంటాడు. గ్రామ పెద్దలు కలిసి మాట్లాడి పంపిస్తారు. గ్రామ పొలిమేరలలో వుండగానే పోలీసుల దాడి గురించి తెలిసి వెనక్కి వచ్చేస్తాడు. పోలీసులతో భీకరంగా ఘర్షణ జరుగుతుంది. ఈ ఘర్షణలో ఎస్పీ కన్నబీరన్‌ను కర్ణన్ చంపేస్తాడు. దానికి 10 సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించి కర్ణన్ తిరిగి వచ్చి పెళ్లి చేసుకుంటాడు .

ఈ ఘర్షణ వివరాల్లోకి వెళ్తేగాని దళితులపై జరిగే దౌర్జన్యాలు అర్థంగావు. ఎస్పీ కన్నబీరన్, గ్రామపెద్దను తలపాగాను తీసేయమంటాడు. గ్రామస్తులు దానికి అంగీకరించరు. 'మీకు దుర్యోధన, అభిమన్యు, కర్ణన్ అనే పేర్లు ఎందుకురా' అని వాళ్ళను దూషిస్తాడు. దళితులు అటువంటి పేర్లు పెట్టుకోడానికి అనర్హులు అంటాడు. 'పోలీసుల దాడి బస్సు ధ్వంసం చేసినందుకు కాదు, మనం తలలెత్తి తిరుగుతున్నందుకు, వారి పెత్తనాన్ని ప్రశ్నిస్తున్నందుకు, వారి ఎదురుగా మాట్లాడుతున్నందుకు 'అని కర్ణన్ చెబుతాడు. ఇటువంటి సన్నివేశాలతో దళితులు తమ ఆత్మగౌరవంకోసం చేసిన పోరాటాన్ని దర్శకుడు అద్భుతంగా చిత్రీకరించాడు. సంఘటిత పోరాటం ద్వారానే ఆత్మగౌరవాన్ని నిలుపుకోగలమన్న చైతన్యాన్ని దళితులలో కలిగించే విధంగా ఈ చిత్రం వుంది. ధనుష్ లాంటి అగ్రస్థాయి హీరోను పెట్టుకున్నందుకు చిత్రంలో కొన్ని కమ్మర్షియల్

అంశాలు జోడించడం చూస్తాం. హీరోను పరాక్రమవంతుడుగా చూపే ప్రయత్నం కొంత జరిగినప్పటికీ మొత్తంగా ప్రజలలో చైతన్యాన్ని పెంచే విధంగా చిత్రీకరణ సాగింది.

'సర్పేట్ట పరంబరా' సినిమా దర్శకుడు పా.రంజిత్ గతంలో రజనీకాంత్ తో 'కాలా', 'కబాలి' వంటి చిత్రాలు తీశాడు. 'కాలా' కూడా దళిత ఆత్మగౌరవాన్ని పెంపొందించే చిత్రమే. కానీ హీరోయిజం వుంటుంది. అయితే ఇప్పుడు మనం మాట్లాడుతున్న మూడవ సినిమా పై రెండు సినిమాలకు భిన్నమైన వస్తువుతో వుంది. కులానికి సంబంధించిన అంశం అంతర్లీనంగా వున్నప్పటికీ పేద, ధనిక అంతరాలు కనిపిస్తాయి. 1970లలో చెన్నైలోని పేద ప్రజలు నివసించే ప్రాంతాలలో జరిగే బాక్సింగ్ పోటీల నేపథ్యంలో కథ సాగుతుంది. సర్పేట్ట పరంబరాయి, ఇడియప్పన్ పరంబరాయి అనే రెండు సంస్థల మధ్య జరిగిన బాక్సింగ్ పోటీ ఏ విధంగా జరిగిందీ, ఒకరిపై ఒకరు పైచేయి సాధించడానికి వేసిన ఎత్తులు, జిత్తులు వివరంగా చిత్రీకరించారు. బాక్సింగ్ అంటే ఇష్టపడే కబిలన్ కథానాయకుడు. అతనికి కోచింగ్ ఇవ్వడానికి ఇష్టపడని గురూజీ రంగన్, చివరకు అతనినే తన శిష్యుడిగా పోటీలోనికి దించుతాడు. కానీ సర్పేట్ట పరంబరాయిలోని సంపన్న కుటుంబాలు ఇతనిని అంగీకరించకుండా అతనికి ఇబ్బందులు కలుగ చేస్తూ వుంటాయి. అతను ఓడించడానికి రకరకాల పద్ధతుల్లో ప్రయత్నిస్తాయి. అయితే కబిలన్ వాటినుండి బయటపడి విజేతగా నిలుస్తాడు. ఈ కథలోనే సమకాలీన రాజకీయాలను మేళవించారు. ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ, ఆ కాలంలో జరిగిన అకృత్యాలు, అరెస్టులు, డి.ఎం.కె. ప్రభుత్వ రద్దు, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటం మొదలైన ఘట్టాలు చిత్రంలో చూపించారు.

ఒక వైపు బాక్సింగ్‌ను ప్రధాన అంశంగా చూపిస్తూనే, మరోవైపు కబిలన్, అతని భార్య మరియమ్మకు మధ్య వున్న అనుబంధాన్ని, ఆప్యాయతను, ప్రేమను, భావోద్వేగాలను అద్భుతంగా చిత్రీకరించారు. అదే సమయంలో కబిలన్‌కు తన తల్లితో వున్న అనుబంధాన్ని, ఆమె క్రమశిక్షణను కూడా చాలా బాగా చిత్రీకరించారు. మానవ సంబంధాలను, భావోద్వేగాలను, పంతాలు, పట్టింపులు, బలహీనతలను వివిధ సందర్భాలలో దృశ్యమానం చేశారు. ఎక్కడా కులం గురించి ప్రస్తావించ నప్పటికీ కబిలన్ పెళ్ళిలో అంబేద్కర్,బుద్ధుడు పటాలను చూపెట్టడం, వివిధ సన్నివేశాల్లో బుద్ధుడి విగ్రహాన్ని, అంబేద్కర్ ఫొటోని, పెరియార్ చిత్రపటాన్ని చూపడం ద్వారా తన భావాలను దర్శకుడు ప్రకటించాడు. కబిలన్ తన భార్యతో 'ఈ రోజు నీకిష్టమైన బీఫ్ బిర్యానీ తెచ్చాను' వంటి సంభాషణల ద్వారానూ, ఇంకా కొన్ని ప్రతీకాత్మక చర్యల ద్వారానూ, సంభాషణల ద్వారానూ దళితులు ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకోవాలనే తపనను  కులం పేరు ప్రస్తావించకుండానే చెప్పగలిగాడు.

వీటిలో 'కర్ణన్', 'అసురన్' సినిమాలు దేశంలో పెరుగుతున్న దళిత చైతన్యానికి ప్రతీకలుగా కనిపిస్తాయి. 'కర్ణన్'లో దళితుల ఆత్మగౌరవ పోరాటం వుంటే, 'అసురన్'లో ఆత్మగౌరవంతో పాటు భూమి కోసం, భుక్తి కోసం, మనుగడ కోసం జరిగే సంఘర్షణ వుంది. ఈ మూడు సినిమాలలో దళితులలో ఆత్మగౌరవ కాంక్షను రగిలించేవిగానూ, ఆత్మస్థైర్యాన్ని నింపేవిగానూ వున్నా కూడా, దళితులు భూస్వామ్య సామ్రాజ్యవాద పీడన నుండి విముక్తి పొందాలంటే ఆ చైతన్యం చాలదు. ఈ చైతన్యం మరింత విస్తృతమై సమస్త పీడిత జన చైతన్యంగా మారాలని వుద్బోధించే విధంగా చిత్రాలు రావాలి. ఈ మూడు సినిమాలు చూస్తున్నంతసేపూ మన రాష్ట్రంలో జరిగిన కంచికచర్ల కోటేశు, కారంచేడు, చుండూరు, పదిరికుప్పం మొదలగు ఘటనలు కళ్ళముందు మెదిలాయి. గత శతాబ్దంలో అమెరికాలో నల్లజాతి ప్రజలపై, వారి ఆవాసాలపై పోలీసుల సహకారంతో శ్వేత జాతీయులు చేసిన దారుణాలు జ్ఞాపకం వచ్చాయి. మన రాష్ట్రంలో ఇన్ని ఘటనలు, దాడులు, హత్యలు జరిగినా వీటిని కథావస్తువుగా తీసుకుని ఒక్క తెలుగు సినిమా కూడా రాలేదు.

'కర్ణన్', 'అసురన్' సినిమాలు దక్షిణ తమిళనాడు ప్రాంతానికి చెందిన సినిమాలు. అవి ఆ ప్రాంతపు తమిళ మాండలీకంలో వున్నాయి. దక్షిణ తమిళనాడులో తెలుగు ప్రజల సంఖ్య ఎక్కువ. ఆ ప్రభావమేమో కానీ, ఈ చిత్రాలలోని తమిళ సంభాషణల్లో ఎక్కువ తెలుగు పదాలు వినిపిస్తాయి. ఈ ప్రాంతాన్ని అక్కడివారు దక్షిణాంధ్ర అని పిలుస్తారు.

ఇటీవల వస్తున్న తమిళ సినిమాలలో మనం గమనించవలసిన మరో విషయం ఇక్కడ ప్రస్తావిస్తాను. ఈ చిత్రాలలో కథానాయకులు ఎన్టీఆర్, ఎమ్జీఆర్ సినిమాలలో వలె సంపన్న లేదా మధ్యతరగతి విద్యావంతుల కుటుంబాలకు చెందినవారు కాదు. పీడిత ప్రజల, దళిత కుటుంబాలవారే ఈ తమిళ సినిమాలలో కథానాయకులుగా చిత్రించడం ఒక ప్రగతిశీల పరిణామం. తమిళ యువ దర్శకులు పా.రంజిత్, మారి సెల్వరాజ్, వెట్రి మారన్, దళిత ఆత్మగౌరవాన్ని బలపరిచే చిత్రాలు తీయడమేగాక, రాజ్యం, దాని అంగమైన పోలీసులు, పాలకవర్గాలకు, పెత్తందార్లలకు ఏ విధంగా వూడిగం చేస్తున్నారో, చట్టాలు ఎంత బలహీనమైనవో, అవి ఎవరికి అండగా వుంటున్నాయో ధైర్యంగా చూపిస్తున్నారు. వారికి మన అభినందనలు. ✦

**'కారా** మాస్టరు రాసిన 'చావు' కథ' అనే వ్యాసంలో కరోనా విలయతాండవం చేస్తున్న తరుణంలో – అభివృద్ధి మాయలూ, ప్రచారాల ఆర్భాటాలూ ఊదరగొట్టటమే తప్ప దోపిడీ సంబంధాలు ఏమీ మారలేదనేది ఈ కథ చదివితే స్పష్టమవుతుంది. శానిటైజర్లు, మాస్కులు, పల్స్ ఆక్సీమీటర్లు, ఆక్సిజన్ కాన్‌సన్‌ట్రేటర్లు ఎవరికివారే సంపాదించుకోవాల్సిన దుస్థితిలోకి వదిలేసిన ప్రభుత్వాల నిర్వాకం పట్టరాని కోపం తెప్పించుతుందని ఈ కథ చదివితే తెలుస్తుంది. ప్రచురించిన మీకు ధన్యవాదములు.

ఇదే సంచికలో వచ్చిన వాడి, వేడి సంపాదకీయంలో మోడీ ప్రభుత్వం రాజద్రోహం పేరుతో భావప్రకటనా స్వాతంత్ర్యం హరించడం, రవాణారంగం మీద ధరల మీద ధరలు పెంచుకుంటూ పోవడం, భారత్ అతి చిన్న దేశమైన బంగ్లాదేశం కంటె దిగజారి పోయిందని, మూఢనమ్మకాల్నీ, అశాస్త్రీయమైన ఆలోచనల్నీ పనిగట్టుకొని ప్రజల్లో రెచ్చగొడుతూందనీ తీర్మానించడం ఎంతో సమంజసంగా ఉంది.


**13-7-2021** **– కొత్తపల్లి హరిబాబు, గుంటూరు**

పుస్తక పరిచయం

# సకల ప్రజల జీవన ప్రతిబింబం 'అల్పపీడనం'

- చింతాడ తిరుమలరావు

**గురజాడ** అడుగు జాడలలో సాహితీ ప్రయాణం చేస్తున్న ఉత్తరాంధ్ర రచయితల స్ఫూర్తితో కథలు రాస్తున్న కథకుల్లో దాసరి రామచంద్రరావు ఒకరు. శ్రీకాకుళ ఉన్నత సాహితీ వారసత్వాన్ని అంది పుచ్చుకుని 'అల్పపీడనం' పేరుతో మొదటి కథాసంపుటి వెలువరించారు. కథాదీపధారి "కారా"గారి సాన్నిధ్యంలో ఎదిగిన కథాకుసుమాలు సామాజిక స్పృహా సౌరభాన్ని వెదజల్లుతున్నాయనడం అతిశయోక్తి కాదు. ఉత్తరాంధ్ర జనజీవన విధ్వంసాన్ని, సామాజిక మార్పులను నమోదుచేసి, ప్రత్యేకం నుంచి సాధారణీకరణానికి పయనించి, అభ్యుదయ దృష్టి కోణంతో కథలు రాసారు.




పదిహేడు కథల సమాహారం ఈ 'అల్పపీడనం' కథా సంకలనం. ఒక్కొక్క కథ ఒక్కో ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ కథలన్నీ శ్రీకాకుళ జనజీవన దర్పణాలుగా నిలుస్తాయి. ఒక ప్రత్యేక సందర్భం నుండి వర్తమానతలో సర్వవ్యాపితమైన బడుగుల జీవన వాస్తవికత ఈ కథలలో దృశ్యమానమవుతుంది. మారుతున్న కాలమాన పరిస్థితులలో ప్రతి మనిషీ అల్పపీడనానికి గురైనవారుగానే కనిపిస్తారు. నిజానికి అల్పపీడనమన్నది వాతావరణంలో జరిగే మార్పుగా మనకు కనిపించినప్పటికీ, సామాజిక అల్పపీడనానికి గురైన సామాన్యుల జీవితాలలో వచ్చే మార్పులు, దాని దుష్ప్రభావం ఈ కథల్లో కళ్ళకు కట్టినట్టు చూపిస్తారు రచయిత. దిగువ మధ్యతరగతి కుటుంబంలోని అమ్మాయి రజస్వల సందర్భంలో ఫంక్షన్ చేయడం, దాని కోసం పెడుతున్న అనవసర ఖర్చు, హైరానా పడడం, ఫలితంగా అప్పుల పాలవడం ఈ కథా నేపథ్యం. ఈ అనవసర ఆర్భాటాలకు పోవడం వెనుక ఉన్న కారణాలను విశ్లేషణ చేయవలసిన అవసరాన్ని గుర్తుచేసింది ఈ కథ. ఒకరిని చూసి ఒకరు పోటీగా యిలాంటి ఆర్భాటాలు చేసి ఆర్థిక ఇబ్బందులపాలవడం అనే పరిస్థితిలోకి అనివార్యంగా నెట్టబడడం వెనుక నేపథ్యంగా వున్న వస్తు వినిమయ సంస్కృతిని విశ్లేషణ చేస్తుందీ కథ.

విద్య అంగడి సరుకుగా మార్పులకు గురవడం, కార్పొరేట్ విద్యారంగ అనైతికత, ప్రభుత్వమే విద్యావ్యవస్థను ఎలా పతనం చేస్తుందో అద్దం పట్టినట్టు చూపించిన కథ 'వెల్‌విషర్స్'. రచయితకు సరైన సామాజిక దృష్టికోణం వుందని తెల్పిన ఇంకో కథ 'ఉసురు'. శ్రమదోపిడీకి గురైన ముసలాయన తన కష్టానికి తగిన కూలి దక్కకపోవటంతో చేస్తూన్న జీవన పోరాటాన్ని ఈ కథలో చిత్రించారు. వ్యాపారి అర్ధ రూపాయి దగ్గర కూడా ముసలివాన్ని మోసం చేసినపుడు ఆ ముసలాయన బాధను దృశ్యీకరించారు. నిస్సహాయుడుగా కనిపించిన ముసలాడు "సెవటా, నెత్తురూ.... సేత్తక్కువ్వి కావు, కావు. నేను కాకపోతే నాలాంటోడు మరొకడు ఎవడో ఒకడు అడిగే రోజొస్తాది బావ్" కథ ముగింపులో దోపిడీ సమాజం అంతమయ్యే రోజొస్తుందనీ, శ్రమ నుండి ఆ చైతన్యం పుడుతుందని చెప్పడం ఆశాజనకంగా వుంది.

ప్రపంచీకరణ ఫలితంగా అంతరించిపోతున్న ప్రజాకళలు, కళాకారిణి "బాలమ్మ" పడే జీవన సంఘర్షణ, నేటి సినిమా, టి.వీ. ప్రభావం యువతను నైతికంగా ఎలా పతనం చేస్తుందో చూపే దృశ్యమాలిక 'కంచి దారిలో.. కథ. ఈ కథలో తల్లి స్టేజీమీద కుప్పకూలిపోయిన స్థితిలో అశ్లీలంగా విన్యాసాలిస్తూ గెంతులు వేస్తున్న కుర్రాళ్ళలో తన కొడుకు మల్లేశును చూస్తూ బాలమ్మ అలా వుండిపోయే హృదయ విదారక ముగింపు సన్నివేశం గగుర్పాటును కలిగిస్తూంది.

నేటి సమాజంలో దోపిడీవర్గం సమాజ సేవకులుగా బయటకు ఎలా కనబడతారో, ప్రకృతి వనరులు దోపిడీకి గురైన తీరు, దోపిడీ వర్గానికి రాజ్యం కల్పిస్తూన్న రక్షణ "పిడికిట్లో ఇసుక" కథలో స్పష్టపరిచారు రచయిత. ఇప్పటి ఇసుక మాఫియాను ముందే ఊహించినట్టు ఎరుకపరిచారు. సామాన్య జనం సంఘటిత శక్తిగా అవతరించిన నాడు దోపిడీదారులను రక్షిస్తూన్న పాలక వ్యవస్థ దిగిరాక తప్పదని కథ చివరలో "మనందరం నిలబడితే గవర్మెంటు మాకు మెడ్డెస్తదేటి"? అన్న ధిక్కారస్వరాన్ని గంగరాజు పాత్రతో చివర వినిపించడం రచయిత ప్రజాదృక్పథాన్ని పట్టి యిస్తూంది.

మార్కెట్ మాయజాలంలో భాగంగా సినిమా హీరోలు, క్రికెటర్లు చేస్తూన్న వ్యాపార ప్రకటనల దుష్ఫలితాలు, పేద, బడుగు బాలల లేత మనసులు ఎలా విధ్వంసానికి లోనవుతున్నాయో చూపే కథ 'సురగ'. భ్రమలు గొల్పుతూ దాహం తీర్చుకోవడానికి ఎండమావుల వెంటపడేటట్టు చేసే దుస్థితికి అద్దం పడుతుంది ఈ కథ. సునిశిత పరిశీలన, సూక్ష్మ దృష్టి కలిగిన ఈ రచయిత ప్రజల పక్షాన నిలిచిన తీరు ప్రతి కథలోనూ తేటతెల్లం అవుతుంది. గ్రామీణ జీవన విధ్వంసం, వ్యవసాయ కూలీలు పనులు లేక, ఆధునిక యంత్రాలు వల్ల, వ్యవసాయకూలీల జీవితాలు ఎలా నేలమట్టం చేస్తున్నాయో.... వేర్లు ఎక్కదీసి, మొదళ్ళు కూలదోసి చిగుర్లు నాశనం కావడం కంటనీరు పెట్టిస్తుంది "మొదళ్ళు - చిగుళ్ళు"

కథ. అసమ సామాజిక వ్యవస్థ పసిపిల్లల చదువుకునే హక్కును ఎలా హరించి, వారి బతుకుల్లో చీకటి నింపుతుందో ఎరుక పరిచింది. గ్రామీణ ఫ్యూడల్ పెత్తందార్లు కురమయ్యలాంటి అమాయక శ్రమజీవులను, తమ స్వార్థ ప్రయోజనాలకు ఎలా వాడుకుంటారో విడమర్చి చెప్పిన కథ 'కాబట్టి ఈ బస్సు నాదే!'. బస్సు బొమ్మ కోసం ఇద్దరు పిల్లల దెబ్బలాట ద్వారా కురమయ్యకు జరిగిన అన్యాయం, దగాపడ్డ తీరు చాకచక్యంగా తెలియపరిచారు రచయిత. బలవంతుడు దుర్భర జాతిని బానిసలను కావించడం అనే విషయానికి ఈ కథ మంచి దృష్టాంతంగా నిలుస్తుంది. పోలయ్య కొడుకు చూపిన తెగువతో స్ఫూర్తి పొందిన కురమయ్య ఆలోచనల్లో పడడం బాగుంది.

ఈ రచయిత అటు గ్రామీణ జీవన విధ్వంసంతో పాటు, విద్యార్థులు పడే అవస్థలు చూపించిన కథలలో బాల్యం, జీవన వెతలు వివిధ కోణాలలో ఆవిష్కరించారు. 'కట్టడి' కథలో పెద్దలు పిల్లలను కృతకంగా పెంచి, కట్టడి చేయడం వల్ల వారిలోని సహజత్వం పోయి వారు పడే అవస్థలు చూపారు.

ఊరిలో బడి ఉండాలి గానీ, బడిలో ఊరు ఉండకూడదన్న విషయం ఊరోళ్ళకెలా అర్థం అవుతుందో అని అర్థం చేయించింది 'చోటు' కథ. సినిమా, టి.వి. ప్రభావం పసి హృదయాలపై ఎలా ప్రభావితం చేస్తున్నాయో తెలియజెప్పిన ఇంకో గొప్ప ఆలోచన రేకెత్తించిన కథ 'ఆయుధపాణి'.

మొత్తంమీద ఈ కథాసంపుటిలోని కథలన్నీ వివిధ పత్రికలలో వచ్చినవే కాబట్టి ఎంపిక చేసిన కథల సమాహారమే. ఈ కథలన్నింటిలో రచయితకు గల స్పష్టమైన దృష్టికోణం, సామాజిక బాధ్యతతో సరైన పరిశీలన చేసి ఇటు విద్యారంగం, అటు గ్రామీణ జీవన చిత్రపటం ప్రధానాంశాలుగా విశ్లేషించాయి. ఈ కథలన్నీ శ్రీకాకుళం గ్రామీణ మాండలికంతో, కథలను మంచి శిల్పంతో సహజంగా, సామాన్య జనజీవన గుండె చప్పుళ్ళుగా కథనం చేసిన కథాహారం ఈ 'అల్పపీడనం'. ఇది రచయిత మొదటి కథాసంపుటి అంటే నమ్మశక్యంగా లేదు. ఎంతో కథారచనానుభవం వున్న చేయి తిరిగిన రచయితగా, తను ఏర్పరుచుకున్న ప్రజాస్వామిక దృక్పథంతో ఎక్కడా రాజీపడకుండా చెక్కిన ఈ కథా శిల్పాలు తెలుగు కథా సాహిత్య చరిత్రలో సరైన స్థానం పొందుతాయని భావించవచ్చు.

**పుస్తకం ధర : రూ.150/-**

**ప్రతులకు : దాసరి రామచంద్రరావు, 19-27 కథానిలయం వీధి, విశాఖ 'ఎ' కాలనీ, శ్రీకాకుళం - 532001.**

**చరవాణి : 97044 59373.**

✦

గేయ కవిత

# సమర వసంతం

**- పి. మోహన్‌రావు**

**ఈ** దేశం ఒక శోకం
బాధితులు, పీడితులు
రగులుతున్న స్మశానం
రైతన్నల ఆక్రందన
కరోనా విజృంభణ
ప్రజల ఆస్తి రాంభజన!
నలు దిశలా వ్యాపించిన
దిక్కుమాలిన పరిపాలన!
దైవభక్తే దేశభక్తియని
వంచనతో ముంచేస్తూ
దగాచేసి దగుల్బాజి
రాక్షసంగా
రాజ్యమేలుతున్న వేళ!
ప్రజాస్వామ్య నిర్వచనం
అంబానీ, ఆదానీ పరంజేసి
భవిష్యత్తు భారతం
అంధకారమయం జేసి
దేశమంటె మనుషులంటూ
ప్రగల్భాలు, ప్రలోభాలు
అభివృద్ధి మంటలలో
అభాగ్యులంత ఆహుతి
సంపద మేటలెపుడు
బకాసురులకు పీటలే
నింగీ నేలా
హద్దే లేని దోపిడీ
మాటాడే హక్కు లేదు
జీవించే స్వేచ్ఛ లేదు
ప్రశ్నించే తత్వానికి
సంకెళ్లే సమాధానం
ఎన్నికల్లో ఏరులై
అవినీతి మత్తు పారుతోంది
అధికార దర్పంతో
అణచివేత సాగుతోంది
వ్యవస్థలన్నీ అవస్తల పాలై
అడుగంటెను నిత్య జీవనం
ప్రజల మరచి, ప్రజలు లేని
బ్రతుకులకై ఆరాటం
కుక్కమూతి పిందెల వలె
కుక్కగొడుగు పార్టీలు
ఎజెండాలు తోడేళ్లై
జెండాలతో పబ్బాలు
విద్యా, ఉద్యోగాలు
కునారిల్లిపోతుండగ
రోడ్డున పడి నవ యువత
రౌడీలై రక్తమోడుతున్నారు
కులమతాలె అమృతమై
చిగురించెను కుటిల నీతి
హత్యలు, అత్యాచారాలే
నేటి పాలకుల అర్హతలు
చితుకుతున్న బతుకులే
శిలాక్షర సాక్ష్యాలు
ఏటేటా ఉగాదుల
ఉత్సవాల తోరణాలు
నవ్యోన్నత ఉషస్సులకు
ఉద్యమాలే మనకు దిక్కు
వత్సరాలు మారితే
ఉద్ధరింపు ఏమున్నది?
'ప్లవ' నామ వత్సరాన
వి 'ప్లవ' మై జ్వలిద్దాం!
చేయి చేయి కలుపుకుంటూ
పిడికిళ్లై కదలుదాం!
రాబందుల రాజ్యంపై
పిడుగుల్లా కురుద్దాం!
అక్రమాల శిశిర వ్యవస్థపై
సమర వసంతమై
తిరగబడదాం!!

✦

కరపత్రం

# ఆట ముఖ్యమే కానీ ఆ ఆట వెనుక ఉన్న 'అసలు ఆట' తెలుసుకోవడం ఇంకా ముఖ్యం!

**ప్రపంచంలోనే** అతిపెద్ద క్రీడా ఈవెంట్ "ఒలింపిక్స్". ఒలింపిక్స్‌లో పాల్గొనడం, పతకాలు గెలవడం ఆయా దేశాలకు, క్రీడాకారులకు గర్వకారణంగా భావిస్తారు. అంతేకాకుండా కొన్ని దేశాలు తన శక్తిని ప్రపంచానికి చాటడానికి ఒలింపిక్స్‌ను ఒక వేదికగా పరిగణించే పరిస్థితి కూడా ఉంది. అయితే విశ్వ క్రీడా సంబరాలు మాటున 'కనిపించని చీకటి కోణాలు' అనేకం ఉన్నాయి.

ఇటీవల ఒక జాతీయ పత్రికలో "మీరు మీ నగరంలోని పేదలను వదిలించు కోవాలనుకుంటే, అక్కడ ఒలింపిక్స్ నిర్వహించండి" అనే ఆలోచన రేకెత్తించే వ్యాసం వచ్చింది. అందులో సియోల్ ఒలింపిక్స్ (1988) నుండి బీజింగ్ ఒలింపిక్స్ (2008) వరకు కేవలం 20 సంవత్సరాలలో ఒలింపిక్ క్రీడల కారణంగా 3.5 మిలియన్ల మంది బలవంతపు నిర్వాసిత్వానికి గురయ్యారని పేర్కొన్నారు. అయితే ఇటువంటి పెద్ద క్రీడా ఈవెంటులు వలన ఎంతమంది పేద ప్రజలు నిర్వాసితులవుతారనడానికి 2010లో మన దేశంలో జరిగిన 'కామన్వెల్త్ గేమ్స్' ఒక ఉదాహరణ. అప్పుడు మొత్తం 2 లక్షల 50 వేల మంది నిర్వాసితులయ్యారు. ఆ క్రీడలు జరుగుతున్నంత కాలం ఢిల్లీని మిలిటరీ కంటోన్మెంట్‌గా మార్చేశారు. అన్ని రకాల నిరసన ప్రదర్శనలను నిషేధించారు. బ్యూటిఫికేషన్ పేరుతో, చుట్టుపక్కల ఉన్న మురికివాడలన్నింటినీ తొలగించారు. బస్తీల్లో నివసిస్తున్న వారిని ఢిల్లీ నుండి తరిమికొట్టారు. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (IOC) మొత్తం 383 మిలియన్ డాలర్లను సంపాదించింది. మరోవైపు ఈ ఒలింపిక్స్ కారణంగా మొత్తం 1.5 మిలియన్ల మంది నిరాశ్రయులయ్యారు. ఈ చర్యలకు వ్యతిరేకంగా నిరసన తెలిపినందుకు వేలాదిమంది ప్రజలు జైలుకు వెళ్లాల్సి వచ్చింది. ఇవన్నీ ప్రతి ఒలింపిక్స్‌లో చాలా పెద్ద స్థాయిలో జరుగుతాయి.

టోక్యోలో కరోనా విపత్తు మధ్యలో అదే జరిగింది. అందుకే అక్కడ 83 శాతం మంది ప్రజలు ఒలింపిక్స్‌ను వ్యతిరేకిస్తున్నారు. లాక్‌డౌన్ వల్ల మా పిల్లలు ఆడలేకపోతుంటే, ప్రభుత్వం మాత్రం ఒలింపిక్స్ ఎలా నిర్వహిస్తోందని జపనీస్ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అయితే అక్కడ ప్రజల ఆందోళనలను, నిరసనలను జపాన్ ప్రభుత్వం పట్టించుకోకపోగా, ఆ ప్రజల గొంతుకలను సైనిక బూట్ల కింద అణచేశారు. ప్రస్తుత ఒలింపిక్స్ హక్కులను గెలుచుకున్న జపాన్ 2013లో ఫుకోషిమా న్యూక్లియర్ రియాక్టర్ పేలుడు వలన సుమారు 20,000 మంది చనిపోగా, లక్షలాది మంది నిర్వాసితులయ్యారు. ఫుకోషిమా న్యూక్లియర్ రియాక్టర్ నుండి వచ్చే రేడియేషన్ వల్ల ప్రజలు యిప్పటికీ మరణిస్తున్నారు. ఆ ఘటనతో అతలాకుతలమైన జపాన్, తన వనరులలో ఎక్కువ భాగాన్ని ఫుకోషిమా న్యూక్లియర్ రియాక్టర్ పేలుడు బాధితుల కోసం ఉపయోగించాలి. కానీ దీనికి విరుద్ధంగా జపాన్ ప్రభుత్వం తన వనరులన్నిటిని ఒలింపిక్ సన్నాహాలకే ఉపయోగించింది. అప్పటి నుండి జపాన్ ప్రజలు ఒలింపిక్స్‌ను వ్యతిరేకిస్తున్నారు, వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

"ఒలింపిక్స్ వేడుక నిజానికి పెట్టుబడిదారీ వేడుక అని, ఒలింపిక్స్‌లో 'పబ్లిక్ స్పేస్' ఏ విధంగా సైనికీకరించబడుతుందో, ఒలింపిక్స్ నిర్వహించడానికి ఉపయోగించే అణచివేత విధానం ఒలింపిక్స్ ముగిసిన తర్వాత కూడా కొనసాగుతుందని" జువల్ బైకాఫ్ అంటారు ('సెలబ్రేషన్ క్యాపిటలిజం అండ్ ఒలింపిక్ గేమ్స్' అనే పుస్తక రచయిత). 1984 లాస్ ఏంజిల్స్‌లో ఒలింపిక్స్ భద్రత పేరిట, అక్కడి పోలీసులకు అత్యాధునిక ఆయుధాలను సమకూర్చారు. ఒలింపిక్స్ ముగిసిన తర్వాత ఈ ఆయుధాలను 'మాదక ద్రవ్యాలకు వ్యతిరేక పోరాటం' పేరుతో నల్లజాతీయులకు వ్యతిరేకంగా విస్తృతంగా ఉపయోగించారు. లండన్ ఒలింపిక్స్ సమయంలో (2012)లో ఇదే జరిగింది. ఒలింపిక్స్ జరుగుతున్న సందర్భంలో ఒక భవంతి నివాసులు పొద్దున్న లేచి చూసే సరికి వారి యింటి పైకప్పులపై వారి అనుమతి లేకుండానే ఆకాశంలోకి దాడిచేసే క్షిపణులు మోహరించడాన్ని చూసారు. తమ సొంత మేడల పైకి వెళ్ళకుండా వారిని నిరోధించారు.

ఆధునిక ఒలింపిక్స్ ఆరంభకుడైన జాత్యహంకారి కూబెర్టిన్ (ఫ్రాన్స్) ఒలింపిక్ క్రీడల లక్ష్యం చెపుతూ 'క్రీడలనేవి యుద్ధానికి సన్నద్ధం చేయడంలో భాగం' అంటాడు. ఇంకా ప్రజా పోరాటాలను శాంతింపజేయడంలో క్రీడ ఒక ముఖ్యమైన పాత్రగా మలచాలని కూడా అంటాడు. ఒలింపిక్స్‌లో ఒక్క పతకం గెలిచినా కార్పోరేట్ మీడియా, పాలకులు కలిసి ప్రతి ఒక్కరిలో దేశభక్తి(?)ని రాజెయ్యడానికి ఏ విధంగా ప్రయత్నిస్తున్నారో మనం చూస్తునే ఉన్నాం. అలాగే దాదాపు ఒలింపిక్ పతకాలు గెలిచిన విజేతలందరూ కొద్ది రోజుల్లోనే ఏదో ఒక బహుళజాతి కంపెనీలకు బ్రాండ్ అంబాసిడరలవ్వడం, వారి ఉత్పత్తులను ప్రచారం చేయడం, దేశభక్తితో ఊగిపోయిన ప్రజల ఆకాంక్షలను తుంగలో తొక్కడం ప్రతిసారి మనం చూస్తున్నదే (కూబెర్టిన్ కోరుకున్నది ఇదే!)

బహుళ జాతి కంపెనీలకు తమ ప్రపంచ వినియోగదారులను శక్తివంతంగా కలపగలిగే, తమ ఉత్పత్తులను వారికి చేర్చగలిగే ఒలంపిక్స్ లాంటి వేదిక మరెక్కడ దొరుకుతుంది? అందుకే బహుళజాతి కంపెనీలు ఒలింపిక్ వేదికలను సద్వినియోగం చేసుకోవడానికి పోటీపడుతుంటాయి. మధ్యప్రదేశ్‌లోని 16 వేల మంది ప్రజలు మరణించిన భోపాల్ గ్యాస్ ట్రాజెడీ (1984) ఘటనకు కారణమైన 'డౌ కెమికల్'; పేద దేశాల భూభాగాల్లో నీటి వనరులను విచక్షణారహితంగా, కారుచౌకగా దోచుకుంటూ అనేక దేశాలలో తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్న 'కోకా కోలా'; చమురు వెలికితీత పేరుతో సముద్రాలను కలుషితం చేస్తూ, పర్యావరణానికి తీవ్రమైన నష్టం కలిగిస్తున్న 'బ్రిటీష్

పెట్రోలియం' లాంటి అనేక అపఖ్యాతి పాలైన బహుళజాతి కంపెనీలే ఈ ఒలింపిక్స్‌కు స్పాన్సర్స్‌గా వ్యవహరిస్తున్నాయి. సామాన్య ప్రజల జేబులను నాజూకుగా కొట్టేయడానికి క్రీడలను, క్రీడా ఈవెంట్స్‌ను వాణిజ్య, ప్రచార వేదికలుగా మలుచుకుంటున్నాయి.

ఒలింపిక్ క్రీడలు నిర్వహణ వలన ప్రైవేట్ మరియు బహుళజాతి కంపెనీలు, ఒలింపిక్ కమిటీ భారీ లాభాలను ఆర్జిస్తాయి. కాగా ఆయా ప్రభుత్వాలు అప్పుల భారంతో ఉంటాయి. ఈ రుణాన్ని తీర్చడానికి ప్రభుత్వం విద్య, ఆరోగ్య బడ్జెట్‌లో అసాధారణ కోతలు చేస్తుంటాయి. దీని కారణంగా, ఎంతమంది ప్రజలు ప్రభావితమయ్యారు, ఎంత మంది నిరుద్యోగులు అయ్యారు, ఆరోగ్య సౌకర్యాల లేమి కారణంగా ఎంత మంది మరణించారు అనేది వేరే కథ. ప్రతి ఒలింపిక్స్ తర్వాత దాదాపు అదే కథ పునరావృతమవుతుంది. ఆసియాడ్, కామన్వెల్త్ గేమ్స్ తర్వాత మన దేశంలో కూడా అదే జరిగింది.

తమ వ్యాపార ప్రయోజనాల కోసం అనేకమంది ప్రజలను బలిపెడుతూ బహుళజాతి కంపెనీలు ఆడే అసలైన 'క్రీడ'ను అర్థం చేసుకున్న తర్వాత మనం ఒలింపిక్స్‌ను 'స్వచ్ఛమైన క్రీడ'గా చూడగలమా? హిట్లర్ లాంటి వాడు తన ఫాసిజాన్ని ప్రోత్సహించడానికి, ప్రచారం చేసుకోవడానికి 1936 బెర్లిన్ ఒలింపిక్స్‌ని ఎలా ఉపయోగించాడో మరిచిపోగాలమా? పాట-సంగీతం-నృత్యం అంటే అందరికీ ఇష్టమే. కానీ అవి ఎక్కడ జరుగుతున్నాయో అంటే గ్రామ చావడిలోనా లేక భూస్వామి ఆస్థానంలోనా అనేది పట్టించుకోవద్దా? దేనికోసం జరుగుతున్నాయో అంటే నిజమైన క్రీడా విలువలు, క్రీడా స్ఫూర్తి వర్ధిల్లడానికా లేక కార్పోరేట్లకి కాసులు కురిపించడం కోసమా.... ఆలోచించక్కరలేదా? ఆట చాలా ముఖ్యం. కానీ ఎందుకు, ఎక్కడ ఆడుతున్నారు, ఆ ఆట వెనుక ఉన్న 'అసలు ఆట' ఏమిటో తెలుసుకోవడం అంతకంటే చాలా ముఖ్యమని విద్యార్థులు, మేధావులు ఆ వైపుగా ఆలోచించాలనీ పిడిఎస్ఓ కోరుతుంది. ✦

కవిత

# నేను కవినే

**- చందు**

నేను కవిని కాదు
నాది సగటు మనిషి వేదన
ఆ వేదన కవిత్వమైతే
నాది కవిత్వమే.
కవిత్వమంటే
మనిషి తత్వాన్ని మూటగట్టుకుని
మాటల్లో దొర్లించడం
నా మాటలు జీరబోయి
అక్షరాలుగా పొరాడుతున్నాయి
అవి రాసి చూడ్డానికి
కన్నీటి పొరలు
అడ్డుపడుతున్నాయి
చెంప మీద జాలువారిన
కన్నీటి బొట్లను తుడుస్తుంటే
గొంతు గద్గద మౌతుంది
కలం కదులుతూనే వుంది.
ఎందుకు ఎందుకు ఎందుకు???
నేను కవిని కాదే
కానీ,
నాలో నిజమైన మనిషి
నిద్రలేచి తట్టి లేపుతున్నాడు
రేపు నీ దేశం గతి ఏమిటని
మట్టిమనిషి రైతుల
బతుకులేమిటని!
గురజాడని ఉటంకిస్తూ
కవిత్వం చెప్పే
సాహసం నాది కాదు
అంతటి విశ్వ విహంగ శక్తి నాకు లేదు.
కానీ,
సగటు మనిషిని గదా
అనుభవించింది పలవరించే
కించిత్తు భాషాజ్ఞానం వుంది
ఎందుకో
కవులు రచయితలు
మౌనం వహిస్తున్నారు
అక్షరాలు మూగబోతున్నాయి
భాష విగతజీవిగా మారుతోంది
అమ్మ ఆర్ద్రత చవిచూసిన వాడిని
అమ్మ నుండి సాంద్రత తెలుస్తోంది
పరాయి పాలన లేదు
పరాయీకరణకు గురౌతున్నాం
అన్నకు ఆశజూపి
తమ్ముల‌ను అదిలించి వశం చేసుకోడం
ఇంటిని రచ్చ చేసి
అదే గెలుపని ముచ్చట పడిపోతున్నాం
ఎంతటి విధాన వైచిత్రి!
మట్టి మనిషి చెట్టుకు వ్రేలాడితే
నా దేశానికి
చీమ కుట్టినట్లు లేదు
రోడ్డెక్కి న్యాయం అడిగితే
రబ్బరు బుల్లెట్లు వాటర్ క్యానన్లు
అభిమానం చచ్చిపోయి
రైతుల ఆత్మహత్యలు
చలి పులికి బలౌతున్న
మదుసలుల చావులు
కరదు గట్టిన గుండెల్ని
కదిలించలేకపోతున్నాయి!
ఏమైనా,
నా దేశం విశిష్టమైంది
అందుకే
ఈ దేశమట్టిని మట్టి మనుషుల్ని
ఎత్తిపట్టాడు గురజాడ
ఆ వత్తిని నిలువెత్తున
ఎగదోయడమే
కవి ప్రవృత్తి ధర్మమైతే
నేను కవినే. ✦

# సంతాపాలు

## ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త గెయిల్ ఒమ్వెడ్ మరణం



**అమెరికాలో** జన్మించిన గెయిల్ ఒమ్వెడ్ ఉన్నతవిద్య, పరిశోధనల అనంతరం సమాజ శాస్త్రవేత్తగా ఇండియాకు వచ్చి ఇక్కడే స్థిరపడ్డారు. 1983లో భారతీయ పౌరసత్వం పొందారు. మార్క్సిస్టు మేధావి భరత్ పతంకర్‌ను వివాహం చేసుకుని మహారాష్ట్రలో సాంగ్లీ దగ్గర కసేగాంవ్ గ్రామంలో స్థిరపడ్డారు. ఆమె తన 81వ ఏట 25 ఆగస్టు 2021న మరణించారు. ఆమె 2-8-1941లో మిన్నసోటా రాష్ట్రంలోని మిన్నియాపోలీస్‌లో జన్మించారు.

"1870-1930 కాలంలో వలస సమాజంలో సాంస్కృతిక తిరుగుబాటు : దక్షిణ భారతంలో బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమం" అనే అంశంపై పరిశోధన చేయడానికి అమెరికా నుండి వచ్చి ఇక్కడే స్థిరపడిపోయారు. బెంగాల్, మహారాష్ట్ర, దక్షిణ భారత రాష్ట్రాలలో దళిత, బహుజన ఉద్యమాలను అధ్యయనం చేశారు. పూనే విశ్వవిద్యాలయంలో సోషియాలజీ ప్రొఫెసరుగా పనిచేశారు. ఇంకా వివిధ సంస్థలలో వివిధ హోదాలలో తన సేవలందించారు. దళిత రాజకీయాలు, మహిళాపోరాటాలు, రైతు ఉద్యమాలు, పర్యావరణ ఉద్యమాలు, గ్రామీణ స్త్రీల సమస్యలు, మానవహక్కులు మొదలైన సామాజిక కార్యక్రమాలలో చురుకుగా పాలుపంచుకున్నారు.

భర్తతో కలసి 'శ్రామిక ముక్తిదళ్' సంస్థనేర్పరచారు. పూలే స్థాపించిన 'సత్యశోధక్ సమాజ్' గురించి ప్రపంచానికి ఈమె రచనల ద్వారానే తెలిసింది. "దళితులు-ప్రజాతంత్ర విప్లవం", "ఇండియాలో బౌద్ధం : బ్రాహ్మనిజంకి విసిరిన సవాలు", "కులము-అంబేడ్కర్ : వికాస భారతంవైపు", "బేగంపురా అన్వేషణలో : కులవ్యతిరేక మేధావుల సామాజిక దార్శనికత" మొదలగు పుస్తకాలు ఇంగ్లీషులో రాశారు. ఐదు శతాబ్దాలలో విస్తరించిన ఛోకమేలా, జనాబాయి, కబీర్, రబిదాస్, తుకారాం, కట్టబాజాలు, పూలే, జ్యోతిదాస్, పండిత రమాబాయి, పెరియార్, అంబేడ్కర్‌ల గురించి విస్తృత పరిశోధనాగ్రంథాలను, వ్యాసాలను అందించారు.



## జలదంకి ప్రభాకర్ 'ప్రజ' మరణం

**నాలుగు** దశాబ్దాలుగా పాత్రికేయునిగా పనిచేసిన, కావలికి చెందిన జలదంకి ప్రభాకర్ తన 70వ యేట 22-8-2021న నెల్లూరులో మరణించారు. మొదట చాలకాలంపాటు కావలిలో 'ఆంధ్రపత్రిక' జర్నలిస్టుగా చేశారు. ఆ తరువాత అగ్రిగోల్డ్ వారు నడిపిన 'నది' మాసపత్రికకు సంపాదకునిగా హైదరాబాద్‌లోనూ, విజయవాడలోనూ చేశారు. అది మూతబడిన తర్వాత స్థానిక దినపత్రిక 'స్వతంత్ర ప్రభ' నడుపుతూ వున్నారు.




## కార్టూనిస్టు యెనికపాటి కరుణాకర్ మరణం

**తన** 52వ యేట జులై 18, 2021న మరణించారు. ఆయన ప్రకాశంజిల్లా కొప్పెరపాడులో 23 అక్టోబరు 1969లో జన్మించారు.

దివ్యాంగుడైన కరుణాకర్ (పోలియో) ఎమ్.ఏ.బి.ఇడి చదివి మంగమూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఆంగ్లోపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. చిత్రకళలో ఆయన టీ.వీ. శిష్యుడు. 'విశాలాంధ్ర', 'ప్రజాశక్తి'లో పలు రాజకీయ వ్యంగ్య చిత్రాలు ప్రచురించారు. కరుణాకర్ స్నేహస్వభావుడు. తనకు పరిచయం ఉన్న అందరికీ అతను స్నేహపాత్రుడే. సాహిత్యాభిలాషి. సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళటానికి కృషిచేశాడు. హక్కుల సంఘంలో పనిచేశారు. విరసంతోనూ, ప్రగతిశీల భావాలు గల సంస్థలతోనూ వ్యక్తులతోనూ కలసి నడిచారు. కుల, మతాలకతీతంగా ఆదర్శ వివాహం చేసుకున్నారు. చివరివరకూ సమాజం మార్పుకోసం కృషిచేసిన కరుణాకర్‌కి 'ప్రజాసాహితి' సంతాపం ప్రకటిస్తూంది. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేస్తూంది.

# కొత్త శివమూర్తి మరణం



**తెనాలి** దగ్గర సంగం జాగర్లమూడికి చెందిన ప్రముఖ మార్క్సిస్టు, హేతువాది కొత్త శివమూర్తి తన 85వ ఏట 26-8-2021 ఉదయం రాజమండ్రిలో మరణించారు. ఒక దశాబ్దంపైగా ఆయన కడియంలో స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. ఆయన 1936లో జన్మించారు.

తనపై పడ్డ కమ్యూనిస్టు సాహిత్య ప్రభావంతో, రాహుల్ సాంకృత్యాయన్ స్ఫూర్తితో హోటల్ వర్కర్‌గా వివిధ ప్రాంతాల్లో పనిచేశారు. పీపుల్స్‌వార్‌లో దాదాపు దశాబ్దకాలం పాటు గోదావరిజిల్లాలో ఆర్గనైజర్‌గా క్రియాశీలక పాత్ర పోషించారు. ఆ తర్వాతే బ్రాహ్మణీయ సామాజిక వ్యవస్థపై తన రచనల ద్వారా, జీవితావరణ ద్వారా రాజీలేని పోరాటం చేశారు.

ఆరవ తరగతి వరకు మాత్రమే చదివిన శివమూర్తి ఆర్య సిద్ధాంతంపై పరిశోధించి ప్రత్యామ్నాయ చరిత్ర పరిశోధకునిగా పలు గ్రంథాలు రచించారు. 'బ్రాహ్మణిజం జన్మరహస్యం', 'దశావతారాల గుట్టు రట్టు', 'వేదభూమి కాదు - ఇది నాగభూమి', 'ఆర్యజాతి చరిత్ర', 'బ్రహ్మ మిథ్య - జగత్ సత్యం' మొదలగు పుస్తకాలు రచించారు.

# కత్తి మహేష్ మరణం




**తెలుగు** సినీ విమర్శకుడు, నటుడు, హేతువాది కత్తి మహేష్ 10 జూలై 2021న చెన్నైలోని ఆసుపత్రిలో యాక్సిడెంట్ కారణంగా చనిపోయారు. ఆయన చిత్తూరుజిల్లా యలమంద గ్రామంలో 1977లో జన్మించారు.

కత్తి మహేష్ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నుండి ఫిలిం థియరీలో పట్టభద్రుడయ్యాడు. 2011లో బాలగంగాధర్ తిలక్ రచించిన 'ఊరు చివర ఇల్లు' కథ ఆధారంగా ఒక షార్ట్‌ఫిలింకి దర్శకత్వం వహించటంతో ఆయన సినిమా ప్రయాణం ప్రారంభమయింది. ఒక న్యూస్ ఛానల్‌వారు నిర్వహించిన చర్చావేదికలో పాల్గొన్న మహేష్ 'శ్రీరాముడి'పై చేసిన వ్యాఖ్యలకుగాను అతనిపై అక్రమంగా క్రిమినల్ కేసులను పెట్టారు. నమ్మకం, విశ్వాసం ఆధారంగా ప్రవచించే మతతత్త్వవాదులు వత్తిడితో తన అభిప్రాయాలను శాస్త్రీయంగా వెలువరించిన మహేష్‌ను హైదరాబాద్ నగర బహిష్కరణ చేశారు. ఐనా ఆయన నిక్కచ్చిగా హేతువాద దృష్టితో, శాస్త్రీయ భావజాలంవైపు నిలబడ్డారు.

కత్తి మహేష్‌కు 'ప్రజాసాహితి' సంతాపం తెలియచేస్తూంది. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియచేస్తూంది.

# సాహితీ విమర్శకుడు కణుగుల వేంకటరావుగారి మరణం



**సవర** భాషా సంఘం అధ్యక్షులు, సాహిత్యాభిమాని కణుగుల వేంకటరావుగారు 17-6-2021న గుండెపోటుతో శ్రీకాకుళంలోని స్వగృహంలో మరణించారు. ఆయన 7-11-1931న శ్రీకాకుళంజిల్లా బూర్జ మండలం తోటవాడ గ్రామంలో జన్మించారు.

విజయనగరంలో బికాం వరకు చదివిన ఆయన సీనియర్ సూపరిండెంట్ ఆఫ్ పోస్టాఫీసుగా 1991లో ఉద్యోగ విరమణ చేశారు. విద్యార్థి దశ నుండీ సాహిత్య అధ్యయనం, సాహిత్యకారులతో పరిచయాల్లో వున్నారు. తనున్న ప్రాంతంలో ఎక్కడ సాహిత్య సభలు జరిగినా పాల్గొనేవారు. పుస్తక సేకరణ అలవాటుగా వున్న వేంకటారావుగారు చాలా సాహిత్యాన్ని 'కథానిలయానికి' సమకూర్చి పెట్టారు.

2005లో సవర భాషాసంఘం అధ్యక్షులుగా అయిన తర్వాత సాంకేతిక పదాలకు అనువాదాలు సేకరించారు. సోర మాన్యుయల్, సోర-ఇంగ్లీషు డిక్షనరీలకు రాసిన ముందుమాటలకు అనువాదం చేసే క్రమంలో, అంతర్జాతీయ ధ్వని లిపిని నేర్చుకున్నారు. ఆయన రచనల సంకలనం 2017లో వెలువడింది.

వేంకటరావుగారి మరణానికి ప్రజాసాహితి సంతాపం ప్రకటిస్తూంది. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నాం.

# కథారచయిత, సాహితీవేత్త
# అత్తలూరి నరసింహారావు మరణం




**ఆంధ్ర** విశ్వకళాపరిషత్తు, తెలుగుశాఖ అధిపతిగా పనిచేసిన సాహితీవేత్త, కథకుడు, విమర్శకుడు అత్తలూరి నరసింహారావు తన 75వ యేట కాన్సర్‌తో 14-9-2021న విశాఖపట్నంలో మరణించారు. ఆయన 1946 జూన్ 1న గుంటూరుజిల్లా బిక్కసానివారిపాలెంలో జన్మించారు. ఆయన ప్రాథమిక విద్య గోగినేనివారిపాలెంలో, డిగ్రీ తిరుపతిలో, ఎం.ఏ. ఆంధ్ర విశ్వకళాపరిషత్తులో సాగాయి. దేవరకొండ బాలగంగాధరతిలక్ సాహిత్యంపై పరిశోధన చేసి డాక్టరేటు పొందారు.

విద్యార్థి దశలోనే తన బంధువులైన త్రిపురనేని మధుసూదనరావు, త్రిపురనేని శ్రీనివాస్‌ల ప్రభావానికి లోనై మార్క్సిజం వైపు మొగ్గారు. అప్పట్లో వారు రాసిన 'నిద్ర' కథకు కరీంనగర్ నుండి ప్రచురింపబడుతున్న విప్లవ పత్రిక విద్యుల్లత నిర్వహించిన పోటీలో ప్రథమ బహుమతినందుకొంది. విరసంలో కొంతకాలం సభ్యులుగా వున్నారు. వీరి భార్య పద్మిని వీణావిద్వాంసురాలు. ప్రొఫెసర్ తుమ్మల వేణుగోపాలరావు, కృష్ణాబాయిల కూతురు. ఆమె కాన్సర్‌తో 2019 ఫిబ్రవరి 19న మరణించారు.

తెలుగు సాహితీలోకంలో వారికి నచ్చని విషయాలపట్ల నిరసన తెలియచేస్తూ 'నిరసన' పేరుతో లీఫ్‌లెట్లు అద్వయం బై.చం.కొ అనే పేరుతో (అత్తలూరి, అబ్బూరి గోపాలకృష్ణ, బైరవయ్య, చందు సుబ్బారావు, కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ) ప్రచురించారు. ఇవిగాక అత్తలూరి 'సాహిత్యరంగంలో ప్రతిభామూర్తులు', 'నేనెందుకు రాస్తున్నా', 'చలంగారి ఉత్తరాలు', 'రావిశాఖీయం' గ్రంథాలేగాక అరవింద కేజ్రీవాల్ 'స్వరాజ్యం', 'వర్గీస్ కురియన్', 'నాకు వుంది ఒక కల', 'త్రిపుర – ఓ జ్ఞాపకం', 'సరస్వతీ బజార్' (కథల సంపుటి), 'మోదీతో మంగళవారం' లాంటి మౌలిక అనువాద గ్రంథాలు రచించారు. కొన్నిటికి సంపాదకత్వం వహించారు.

వారి కళ్ళను ఎల్.వి. ప్రసాద్ హాస్పిటల్‌కూ, శరీరాన్ని ఆంధ్రా మెడికల్ కళాశాలకు ఇచ్చారు.

# ప్రజాస్వామికవాది, సామాజిక ఉపాధ్యాయుడు
# యం.ఆర్. గోవిందరెడ్డికి జనసాహితి జోహార్లు



**సాహిత్య** పిపాసి, గణితశాస్త్ర ఉపాధ్యాయులు, ఏపిటిఎఫ్ ఉపాధ్యక్షులు, ప్రజాతంత్రవాదిగా ఆదర్శవంతమైన జీవితం గడిపిన మారంరెడ్డి రామగోవిందరెడ్డిగారు 11-9-2021న గుండెపోటుతో నంద్యాలలోని స్వగృహంలో మరణించారు. ఆయన 1931వ సంవత్సరంలో సుద్దమల్ల గ్రామంలో జన్మించారు.

1959 జూలై 13న కోయిలకుంట్ల జిల్లాపరిషత్ పాఠశాలలో గణిత ఉపాధ్యాయునిగా ఉపాధ్యాయ జీవితం ప్రారంభించిన ఆయన 30-6-1992న పాణ్యం మండలం మద్దూరు గ్రామంలో పదవీ విరమణ చేశారు. సింగరాజు రామకృష్ణగారిపట్ల ఆయనకు ఎనలేని గౌరవం. 1976లో ఏపిటిఎఫ్ సంస్థలో చేరారు. ఆ సంస్థకు బాధ్యత వహిస్తూ చివరిక్షణం వరకూ కొత్త తరాలకు సామాజిక చైతన్యాన్ని అందించాలనే ఆకాంక్షను కనబర్చారు. గణిత మేధావి రామానుజన్ జయంతి రోజున గణిత ఒలింపియాడ్‌ను నిర్వహించేవారు. 2002లో నంద్యాల గణిత ఉపాధ్యాయ సంఘాన్ని ప్రారంభించారు. ఆయనకు 1975లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా, 1976లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా, 1984లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డును రాష్ట్రపతి జ్ఞానిజైల్‌సింగ్ చేతుల మీదుగా అందుకున్నారు.

భూస్వామ్య, పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న అన్ని ప్రజానుకూల సంస్థలనూ, ఉద్యమాలనూ గోవిందరెడ్డి ప్రోత్సహించేవారు. క్రియాశీలకంగా పాల్గొనేవారు. ప్రగతిశీల సాహిత్యాన్ని అధ్యయనం చేసేవారు. మిత్రులకు పరిచయం చేసేవారు. 'ప్రజాసాహితి'కి ఆప్తుడు. ఆయనకు పరిచయమున్న టీచర్లందరిచేత 'ప్రజాసాహితి'ని చదివించేవారు. 'ప్రజాసాహితి' ఆర్థిక ఇబ్బందులను వాకబు చేస్తూ అధిగమించటానికి తగు సూచనలిచ్చేవారు. 90 ఏళ్ళ పైబడిన వయసులో కూడా సాహిత్యాన్ని అధ్యయనం చేస్తూ, ప్రజాసాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని చివరిక్షణం వరకూ తపనపడ్డారు.

ఆయన కోరిక మేరకు దేహాన్ని కర్నూలు వైద్య కళాశాలకు కుటుంబసభ్యులు అప్పగించారు.

సమసమాజం కోసం తన వంతు కృషిని కొనసాగించిన గోవిందరెడ్డిగారి మరణానికి జనసాహితి సంతాపం తెలియచేస్తూంది. కుటుంబ సభ్యులు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడుల బాధలో పాలుపంచుకుంటూంది. ✦

# ఆదివాసీలకోసం నేను ఎలుగెత్తి అరుస్తాను! నేను దేశద్రోహినా?

**- ఫాదర్ స్టాన్ స్వామి**

*దేశద్రోహం నేరం ఆపాదింపబడిన తరువాత స్టాన్ స్వామి రాసిన ఈ బహిరంగ లేఖలో, తనను 'దేశద్రోహి'ని చేసిన తన కార్యకలాపాలన్నిటినీ ఏకరువు పెట్టారు. ఆదివాసీల పతల్ గడి ఉద్యమాన్ని బలపరిచినందుకు జార్ఖండ్ అధికారులు తనపై దేశద్రోహ కేసు పెట్టిన తరువాత దీనిని ఆయన రాశారు. ఇది మొదటిసారి ఆగష్టు 1, 2018 లో ప్రచురితమైంది. 'సబ్ రంగ్ ఇండియా'లో ఇటీవల మరలా ప్రచురించారు.*

**ఆదివాసీలు** హుందాగా ఆత్మగౌరవంతో జీవించడానికి చేస్తున్న పోరాటంలో నేను గత రెండు దశాబ్దాలుగా మమేకమై ఉన్నాను. వారు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ఒక రచయితగా విశ్లేషించడానికి ప్రయత్నించాను. ఈ క్రమంలో, భారత రాజ్యాంగం వెలుగులో ప్రభుత్వం చేసిన వివిధ చట్టాల పట్ల, దాని వివిధ విధానాల పట్ల నేను స్పష్టంగా నా నిరసన తెలియచేశాను. ప్రభుత్వమూ, పాలకవర్గాల వివిధ చర్యల చట్టబద్ధతను, న్యాయబద్ధతను నేను ప్రశ్నించాను.

ఇక పతల్ గడి సమస్య తీసుకుంటే, 'ఆదివాసులు ఇలా ఎందుకు చేస్తున్నారు?' అని నేను అడిగాను. వారి సహనాన్ని మించి వారిపై అణచివేత, దోపిడీ సాగిందని నేను నమ్ముతున్నాను. వారి నేల నుంచి త్రవ్వి బయటకు తీసిన ఖరీదైన ఖనిజాలు బయట వున్న పారిశ్రామిక వేత్తలను, వ్యాపారులను మరింత ధనికులను చేశాయి కానీ ఆదివాసీ ప్రజలను ఆకలి చావులకు గురి చేసేంత పేదరికంలోకి నెట్టివేశాయి.

వారు ఉత్పత్తి చేసే దానిలో వారికి భాగం లేదు. వారి సంక్షేమం కోసం చేసిన, రూపొందించిన చట్టాలు, విధానాలు ఆచరణలోకి రాలేదు. కనుక వారు 'అయిందేదో అయింది' అనుకొని పతల్ గడీల ద్వారా గ్రామసభలను సాధికారం చేసుకోవడం ద్వారా వారి అస్తిత్వాన్ని తిరిగి పొందాలనే పరిస్థితికి వచ్చారు. వారి ఈ చర్య అసంగతం కాదు.

నేను లేవనెత్తిన కొన్ని ప్రశ్నలు ఈ క్రింద ఉదహరిస్తాను :

1. ఆదివాసీ జాతివారు మాత్రమే సభ్యులుగా వుండే 'తెగల సలహా మండలి' (Tribes Advisory Council) ఆ రాష్ట్ర గవర్నర్‌కు రాష్ట్రంలోని ఆదివాసీల రక్షణ, సంక్షేమం, అభివృద్ధి విషయంలో సలహా ఇవ్వాలని భారత రాజ్యాంగం 244(1) ఆర్టికల్‌లో స్పష్టంగా చెప్పినా కూడా దానిని ఎందుకు అమలు చేయడంలేదని నేను ప్రశ్నించాను. ఆదివాసి ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఆదివాసుల రాజ్యాంగబద్ధ సంరక్షకునిగా గవర్నర్ స్వయంగా చట్టాలు చేయవచ్చు లేదా పార్లమెంట్ కానీ, శాసనసభ కానీ చేసిన చట్టాలను రద్దు చేయవచ్చు. కానీ వాస్తవమేమిటంటే గత ఏడు దశాబ్దాలుగా ఏ రాష్ట్ర గవర్నర్ కూడా తన రాజ్యాంగబద్ధ విచక్షణా అధికారాన్ని ఉపయోగించి ఆదివాసులకు మేలు చేయలేదు. ఎన్నిక అయిన రాష్ట్ర ప్రభుత్వపు ఆలోచనలకనుగుణంగా వుండాలి కదా అని సాకులు చెబుతున్నారు. పైన ఉదహరించిన సమితి సమావేశాలు చాలా అరుదుగా జరుగుతాయి. జరిగినా ఆ సమావేశాన్ని ముఖ్యమంత్రి ఏర్పరచి, దానికి అధ్యక్షత వహిస్తారు. పాలక పార్టీ అదుపులో నిర్ణయాలు తీసుకుంటారు. ఆ విధంగా ఈ సమితిని నిర్వీర్యపరిచారు. నిజంగా ఆదివాసీ ప్రజలు రాజ్యాంగబద్ధ వంచనకు గురి అయ్యారు.
2. భారతదేశంలోని ఆదివాసీ జాతుల వారికి గ్రామసభల ద్వారా స్వయంపాలన చేసుకునే ఒక విలువైన సాంఘిక, సాంస్కృతిక సంప్రదాయం వున్నదని మొదటిసారిగా గుర్తించిన 'పంచాయత్ చట్టం' (PESA)1996 (Extension to Scheduled Areas Act)ను ఎందుకు నిర్లక్ష్యం చేశారని నేను ప్రశ్నించాను. వాస్తవమేమిటంటే పార్లమెంట్ చేసిన ఈ చట్టాన్ని ఉద్దేశపూర్వకంగా మొత్తం తొమ్మిది రాష్ట్రాలలో అమలు చేయలేదు. అంటే పెట్టుబడిదారీ పాలకవర్గానికి ఆదివాసీ ప్రజలు స్వయంపాలన చేసుకోవడం నచ్చలేదు.
3. షెడ్యూలు ఏరియాలలో ఆదివాసీ జాతులవారికి గొప్ప ఉపశమనం కలిగించిన 1997 నాటి సుప్రీంకోర్టు 'సమత' తీర్పు, 1997 (సివిల్ అప్పీల్ నం. 4601-2 1997) పట్ల ప్రభుత్వ మౌనాన్ని నేను ప్రశ్నించాను. గ్లోబలైజేషన్, లిబరలైజేషన్, ప్రయివేటీకరణ విధాన ఫలితంగా జాతీయ, అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థలు ప్రత్యేకంగా మధ్య ఇండియాలోని ఆదివాసీ ప్రాంతాలపై ఖనిజ సంపదను వెలికి తీయడానికి దాడి చేశాయి. ఈ కంపెనీలకు ప్రభుత్వ యంత్రాంగం తన పూర్తి సహకారాన్ని అందించింది. ఆదివాసీ ప్రజల ఎటువంటి ప్రతిఘటననైనా ఉక్కు పిడికిలితో అణచి వేసింది. పైన పేర్కొన్న తీర్పు ఆదివాసీల భూముల్లో ఖనిజాలను వెలికితీయడాన్ని అదుపు చేయడానికి చెప్పుకోదగ్గ రక్షణ కల్పించడానికి, తద్వారా వారు ఆర్థికంగా అభివృద్ధి సాధించడానికి ఉపయోగపడుతుంది. కానీ రాజ్యం ఉన్నతోన్నత న్యాయస్థానం తీర్పును నిర్లక్ష్యం చేసింది. బాధిత జాతులవారు ఎన్నో కేసులు పెట్టారు. ఐనా ఆదివాసీల భూమిని పరాయీకరణ చేయడానికి, విలువైన ఖనిజ సంపదను దోచుకోడానికి వలస పాలకుల 'law of eminent domain'ను బయటకు తీశారు.
4. అటవీ హక్కుల చట్టం 2006 : (పార్లమెంట్ చట్టం నెం.2 of 2007) పట్ల ప్రభుత్వపు అర్ధ మనస్కతను నేను ప్రశ్నించాను. ఆదివాసీ ప్రజల ఆర్థిక జీవనానికి పునాది జల్, జంగిల్, జమీన్ అన్న విషయం మనందరికీ తెలుసు. సంప్రదాయకంగా అడవిపై వారికున్న హక్కులపై దశాబ్దాలుగా పద్ధతి ప్రకారం అతిక్రమణ జరుగుతోంది. చాలాకాలం తరువాత, ఆదివాసులకు, సంప్రదాయక అటవీ వాసులకు

చారిత్రకంగా ఒక అన్యాయం జరిగిందని గుర్తించి దీనిని సరిచేయడానికి ఈ చట్టాన్ని చేశారు. కానీ వాస్తవం చేదుగా వుంది. 2006 నుండి 2011 వరకు టైటిల్ డీడ్స్ కొరకు 30 లక్షల దరఖాస్తులు దేశ వ్యాప్తంగా పెడితే వాటిలో 11 లక్షలు అనుమతించారు, 14 లక్షల మంది దరఖాస్తులను తిరస్కరించారు. వాటిలో 5 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో వున్నాయి. పరిశ్రమల కోసం అటవీ భూమిని సేకరించే క్రమంలో ఇటీవల జార్ఖండ్ ప్రభుత్వం గ్రామ సభ ప్రమేయం లేకుండా నిర్ణయాలు తీసుకోడానికి ప్రయత్నిస్తోంది.

5. 'భూమి యజమానే ఆ భూమిలోపల ఉండే ఖనిజాలకు కూడా యజమాని' అనే సుప్రీంకోర్టు ఆదేశాన్ని (సివిల్ అప్పీల్ నం.4549 of 2000) పాటించడంలో ప్రభుత్వ నిర్లిప్తతను నేను ప్రశ్నించాను. ఆ ఆదేశం ఇలా వుంది. 'భూమి లోపల ఉండే ఖనిజ సంపదకు హక్కు రాజ్యానిది అనేది న్యాయ చట్టాలలో ఎక్కడా లేదు, భూమిపై హక్కు సరైన పద్ధతిలో ఆ యజమాని కోల్పోతే తప్ప, సాధారణంగా ఆ భూమి యజమానే ఆ భూమి లోపల వుండే ఖనిజ సంపదకు యజమానిగా వుంటాడు.' అయితే వారి భూముల్లో వుండే విలువైన ఖనిజాలను ప్రభుత్వము, ప్రైవేటు కంపనీలు దోచేస్తున్నాయి. దేశంలో వున్న 219 బొగ్గు గనుల్లో 214 గనులు చట్ట వ్యతిరేకమనీ, వాటిని వెంటనే మూసివేయమనీ, చట్ట వ్యతిరేకంగా తవ్వకాలు చేసినందుకు వారికి జరిమానా విధించింది. ఈ చట్ట వ్యతిరేక గనులను చట్టబద్ధం అనిపించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని వేలం వేయడం అనే పద్ధతిని అనుసరిస్తున్నాయి.

6. 'ఒక నిషిద్ధ సంస్థలో కేవలం సభ్యత్వం ఉన్నంత మాత్రాన ఒక వ్యక్తిని నేరస్తునిగా పరిగణించరాదు. అతడు హింసకు ఒడిగడితే లేక ప్రజలను హింసకు రెచ్చగొడితే ఆ విధంగా హింస ద్వారా లేక రెచ్చగొట్టడం ద్వారా హింసాత్మక ఘటనలకు కారణభూతుడైతే తప్ప అతనిని నేరస్తునిగా పరిగణింపరాదు. (క్రిమినల్ అప్పీల్ నం.889 of 2007). కోర్టు 'ఒక సంస్థతో సంబంధం వుండటమే నేరం' అనే దానిని కోర్టు తిరస్కరించింది. నక్సలైట్లకు సహాయం చేస్తున్నారన్న అనుమానంతో ఎంతో మంది స్త్రీ, పురుషులు జైళ్ళలో ఉన్నారన్నది అందరికీ తెలిసిన విషయమే. వారిని అరెస్టు చేసిన తరువాత వేరే నేరాలను మోపుతున్నారు. పోలీసులు ఎవరినైనా పట్టుకోవాలంటే ఈ ముద్ర వేయడం తేలిక. దీనికి రుజువులు, సాక్ష్యాలు అక్కర్లేదు. నిషిద్ధ సంస్థలో సభ్యుడుగా వున్నా గూడా ఒక వ్యక్తిని నేరస్తునిగా పరిగణించగూడదు అని సుప్రీంకోర్టు చెబుతోంది. న్యాయవ్యవస్థ నుండి శాంతిభద్రతల శాఖ ఎంత దూరంలో వుందో చూడండి!

7. జార్ఖండ్ ప్రభుత్వం ఇటీవల 'భూసేకరణ చట్టం 2013'కు చేసిన సవరణ, ఆదివాసీలకు మృత్యుఘంట మ్రోగించడాన్ని నేను ప్రశ్నించాను. బాధిత ప్రజల సామాజిక సంబంధాలను సాంస్కృతిక విలువలను రక్షించడానికి ఉద్దేశించబడిన 'సామాజిక ప్రభావ అంచనా' (Social Impact Assessment)కు కావాల్సిన దానిని ఇది తొలగించి వేస్తోంది. అత్యంత ప్రమాదకరమైన అంశం ఏమిటంటే ప్రభుత్వం ఎటువంటి వ్యవసాయ భూములనైనా వ్యవసాయేతర కార్యక్రమాలకు ఉపయోగించడానికి అనుమతి ఇవ్వవచ్చు.

8. ఆదివాసీ ప్రజలను అంతం చేయడానికి పన్నిన 'భూమి బ్యాంకు' పథకాన్ని నేను ప్రశ్నించాను. 2017లో 'జార్ఖండ్ ఉరవడి' కార్యక్రమంలో ప్రభుత్వం తన భూమి బ్యాంకులో 21 లక్షల ఎకరాల భూమి ఉందనీ దానిలో 10 లక్షల ఎకరాలు పారిశ్రామికవేత్తలకు కేటాయించడానికి తయారుగా ఉందని ప్రకటించింది. సాగు చేయని భూమి (గైర్ మజుర్వా) ప్రైవేటు కావచ్చు లేదా అందరిదీ కావచ్చు. సంప్రదాయం ప్రకారం ఆదివాసీ కుటుంబాలు కానీ, జాతులు కానీ వీటిని ఉపయోగించుకుంటాయి (జమాబంది). ఇప్పుడు అత్యంత బాధను కలిగించే పద్ధతిలో ప్రభుత్వం అన్ని 'జమాబందీ' హక్కులను రద్దు చేసి సాగు చేయని భూమి అంతా ప్రభుత్వానికి చెందుతుందని దానిని ఎవరికైనా (అంటే పరిశ్రమలకు) చిన్న, పెద్ద పరిశ్రమల స్థాపనకు ఇస్తుందని ప్రకటించింది.

తమ భూమిపై తమకున్న హక్కును ఈ విధంగా రద్దు అయిన విషయం ఆ ప్రజలకు తెలియదు. ఐదవ షెడ్యూలు ప్రకారం అవసరమైన అనుమతిని TAC ఇవ్వలేదు. PESA చట్టం ప్రకారం ఆయా గ్రామసభలు వాటి అంగీకారాన్ని తెలియచేయలేదు. భూ సేకరణ చట్టం (2013) ప్రకారం బాధిత ఆదివాసీ ప్రజలు తమ అనుమతిని ఇవ్వలేదు.

నేను పదే పదే పై ప్రశ్నలను లేవనెత్తాను.

ఇది దేశద్రోహం అయితే కానీయండి!

**(సబ్ రంగ్ ఇండియా సౌజన్యంతో)**

తెలుగులోకి అనువాదం : **కొత్తపల్లి రవిబాబు** ✦

# తెలంగాణ ఆదివాసీ తెగల కళల ప్రదర్శన

**జూలై** 31 నుండి ఆగష్టు 15 వరకు రోజూ ఉదయం 11 నుండి సాయంత్రం 6 వరకు ఈ ప్రదర్శనను హైదరాబాదు, మాదాపూర్‌లో వున్న స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఆచార్య జయధీర్ తిరుమలరావు, ఆచార్య గూడూరు మనోజ ఏర్పాటు చేశారు.

గతంలో వీరే హైదరాబాదులోనూ, గుంటూరులోనూ ఆదివాసుల సంగీత ధ్వనుల ప్రదర్శన 'ఆదిధ్వని' పేరుతో ఏర్పాటుచేసి మరుగున పడిపోతున్న అనేక సంగీత సాధనాలను, సంగీతాన్నీ పరిచయం చేశారు. అంతకంటే ముందు గొండీ భాష పునరుద్ధరణకు, గొండీ భాషలో వాచకాలు తయారుచేసి ప్రచురించే కృషి చేశారు. 2012 లోనే జయధీర్ తిరుమలరావు 'తెలుగు రాత ప్రతులు' అనే పుస్తకంలో ప్రాచీన తెలుగు వ్రాతప్రతులు, ఆనాడు రాతకు వుపయోగించిన వస్తు సామగ్రి వివరాలు, వాటిని పరిరక్షించడానికి సూచనలు ఇచ్చారు.

ఇక ఇప్పుడు ఈ ప్రదర్శనను నాలుగు విభాలుగా ఏర్పాటు చేశారు. 1.ఆది ధ్వని, 2.ఆది చిత్రం, 3.ఆది అక్షరం 4.ఆదివాసుల లోహా, రాతి, చెక్క కళాకృతులు. తాళపత్ర గ్రంథాలు, వాటిపై రాయడానికి వాడిన పరికరాలు, వస్త్రాలపై వేసిన రంగుల బొమ్మలు, కొయ్యతో,

లోహంతో చేసిన కళాకృతులూ ఇక్కడ ప్రదర్శించారు. ఇవి తెలంగాణా ఆదివాసుల, మూలవాసుల ఆత్మలు. వారి జానపదకళల ప్రతిరూపాలు. ఈ ప్రదర్శనలో పురాతన సంగీత వాయిద్యాలు, ఆనాటి రాతి శాసనాలూ రాతి లిపి, తాటి యాకులపై గొలుసుకట్టు తెలుగు రాత, మహిళల కాళ్ళ కడియాలు, దస్తావేజులు, కైఫీయతులు రాగి రేకులపై రాతలు, ఎద్దు ఎముకలపై అక్షరాలు ఇలా ఎన్నెన్నో గిరిజన సాంస్కృతిక వారసత్వానికి సాక్ష్యాలుగా వున్నాయి.

వీటన్నిటినీ ఇన్నాళ్ళు సేకరించడమే గాక, వాటిని వివిధ ప్రైవేటు స్థలాలలో భద్రపరిచారు. ప్రభుత్వం పూనుకుని దీనికొక శాశ్వతమైన కళా ప్రదర్శన గృహాన్ని (గ్యాలెరీని) ఏర్పాటు చేయడం అత్యవసరమని వీక్షకులు, నిర్వాహకులు అభిప్రాయ పడ్డారు.

**చరిత్రను రక్షించుదాం**

ప్రసిద్ధ చరిత్రకారుడు ఇర్ఫాన్ హబీబ్ 90వ పుట్టినరోజు సందర్భంగా, సహమత్, సోషల్ సైంటిస్టు, తూలిక బుక్స్ సంస్థలు కలిసి ఆగస్టు 12వ తేదీన సాయంత్రం 6.30 నుండి 9.00 వరకు ఒక ఆన్‌లైన్ సింపోజియమ్‌ను 'చరిత్రను రక్షించుదాం' అనే శీర్షికతో నిర్వహించారు. ప్రభాత్ పట్నాయక్ అధ్యక్షత వహించిన ఈ సింపోజియంలో ప్రసిద్ధ చరిత్రకారిణి రొమేలా థాపర్ మాట్లాడుతూ మన దేశంలో సాంస్కృతిక భిన్నత్వం క్రీస్తు పూర్వంనాటి భారతీయ మూలాల్లోనే వుందనీ, ఆర్యులు వలస వచ్చినవారేననీ, వారు వచ్చేటప్పటికే ఇక్కడ హరప్పా నాగరికత వుందనీ సుదీర్ఘంగా వివరించారు. అమియకుమార్ బాగ్చి, ఆదిత్య ముఖర్జిల ప్రసంగాల తరువాత ఇర్ఫాన్ హబీబ్ ధన్యవాదాలు తెలియచేస్తూ చరిత్ర పుస్తకాలపై, చరిత్రకారులపై జరుగుతున్న దాడులను ఖండించారు. ఇంకా ఈ విషయంపై చర్చలు బహుముఖంగా, విస్తృతంగా జరగాలని కోరారు. కార్యక్రమ ప్రారంభంలో ఇర్ఫాన్ హబీబ్‌కు శుభాకాంక్షలు తెలియచేస్తూ సీతారాం ఏల్చూరి, షిరీన్ మూస్వి ప్రసంగించారు. ఇందు చంద్రశేఖర్ వందన సమర్పణ చేశారు. ఈ సింపోజియమ్‌లోని ప్రసంగాలన్నీ రాబోయే 'సోషల్ సైంటిస్టు' పత్రికలో ప్రచురిస్తామని చెప్పారు. ✦

# కాబూల్‌లోని నేషనల్ మ్యూజియం భవిష్యత్తు!

**విగ్రహారాధన,** విగ్రహ సంస్కృతి ఇస్లాం మతానికి విరుద్ధమన్న బండ్ సూత్రీకరణతో, తాలిబాన్లు గతంలో అధికారం చలాయించిన కాలంలో బామియాన్ పర్వతంలో చెక్కిన ప్రపంచంలోనే ప్రసిద్ధమైన రెండు బుద్ధ విగ్రహాలను డైనమైట్ పెట్టి కొంత ధ్వంసం చేశారు. 175 అడుగుల ఎత్తు గల విగ్రహం 5వ శతాబ్దానిది కాగా 120 అడుగుల విగ్రహం మూడవ శతాబ్దానికి చెందినది. కాబూల్‌కు పశ్చిమ దిక్కున 90 మైళ్ళ దూరంలో ఈ బామియాన్ పర్వతం వుంది.

ఇప్పుడు మరల ఇస్లాం మత తీవ్రవాదులు ఆఫ్గనిస్తాన్‌లో అధికారంలోకి వస్తున్న సమయంలో, కాబూల్‌లో వున్న జాతీయ ప్రదర్శనశాలలో బుద్ధిజానికి చెందిన 6000 కళాఖండాల పరిస్థితి ఏమిటని పురావస్తు ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు. ఈ జాతీయ మ్యూజియం వయసు 102 ఏళ్ళు. దీనిలో ప్రస్తుతం 50,000 వస్తువు లున్నాయి. చరిత్ర పూర్వకాలం నుండి గ్రీకు, బౌద్ధ, హిందూ, ఇస్లామిక్ కాలాలనాటికి సంబంధించినవి అవన్నీ.

గతంలో తాలిబాన్ల పరిపాలనలో ఈ మ్యూజియంలోని 70 శాతం వస్తువులు అదృశ్యమయ్యాయి. అవన్నీ తరువాత అంతర్జాతీయ నల్లబజారులో ప్రత్యక్షమయ్యాయి, తాలిబాన్లలో వున్న కొన్ని ముఠాలవారు ఇలా మ్యూజియంపై లూటీచేసి చరిత్ర ప్రసిద్ధమైనవి పట్టుకుపోయి అమ్ముకున్నారు. మరల అదేవిధంగా చరిత్రపట్ల, కళలపట్ల ఏమాత్రం గౌరవం, అవగాహన లేని గుంపులు మ్యూజియంను లూటీ చేస్తారేమోనన్న భయంతో 2016 నుండి దానికి డైరెక్టర్‌గా చేస్తున్న మహమ్మద్ షహీమ్ రహీమి తనకు తోచిన కొన్ని జాగ్రత్తచర్యలు తీసుకున్నారు. ముందుగా భవనంపై ఎగురుతున్న జాతీయ పతాకాన్ని తొలగించారు. మ్యూజియం మూసేసి సీలు వేశారు. దీనిని రోజూ రక్షించే 25 నుండి 30 మంది ప్రత్యేక పోలీసు బలగాలు కానీ, దీనిలో పనిచేసే ఉద్యోగులు కానీ రావడం మానుకున్నారు. ఈ పరిస్థితిలో మ్యూజియం ప్రాముఖ్యత చెప్పి, సరిగా ఆలోచించే తాలిబాన్లకు నచ్చజెప్పి, నలుగురు పోలీసులు రక్షణగా వుండేట్లు ఆ డైరెక్టరు చేయగల్గారు. అయితే భవిష్యత్తు మనం వూహించలేం.

ఈ సందర్భంగా మన దేశంలోని హిందూ తాలిబాన్లు 2004 జనవరిలో పూనేలో వున్న ప్రతిష్ఠాత్మక పరిశోధనా గ్రంథాలయంపై దాడిచేసిన సంఘటన గుర్తు వస్తోంది. జులై 6, 1917న పూనేలో భండార్కర్ ఓరియంటల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభమైంది. 6 జూలై 1837 – 24 ఆగస్టు 1925 మధ్య జీవించిన ప్రాచ్య విజ్ఞానంలో (ఓరియంటాలజి) పండితుడైన రామకృష్ణ గోపాల్ భండార్కర్ పేరుతో ఈ సంస్థ ఆయన 80వ పుట్టినరోజు కానుకగా ప్రారంభమైంది. తన వద్ద వున్న 2,200 అపురూపమైన, అరుదైన గ్రంథాలను ఆయన దీనికి ఇచ్చేశారు. 90 ఏళ్ళ కాలంలో సేకరించిన ఒక లక్షా, నలభై వేల గ్రంథాలు, 28 వేల వ్రాత ప్రతులు దీనిలో వున్నాయి. వీటిలో 20 వేల పుస్తకాలు అరుదైనవి. ఇవి సంస్కృతం, ప్రాకృతం, భారతీయ భాషలు, ఆసియా, యూరోపియన్ భాషల్లో వున్నాయి.

ఈ గ్రంథాలయంలో లభించిన పుస్తకాల సహాయంతో జేమ్స్ డబ్ల్యు లెయిన్ (James W. Laine) అనే అమెరికన్ చరిత్రకారుడు శివాజీపైన రాసిన పుస్తకంలో శివాజీ తండ్రి గురించి రాసిన వ్యాసాలు, మరాఠా సేవాసంఘానికి చెందిన శంభాజీ బ్రిగేడ్ అనే గుంపుకు ఆగ్రహాన్ని కలుగచేసాయి. ఒక 150 మంది ఆ గ్రంథాలయంపై పడి అమూల్యమైన వేలాది పుస్తకాలను ధ్వంసం చేశారు. శివాజీపై వున్న పుస్తకాలను చింపి పోగులు పెట్టారు. సరస్వతి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. ఎంతో విలువైన సాహిత్య, సాంస్కృతిక సంపదను నాశనం చేశారు. కోట్లాది రూపాయలు నష్టం వాటిల్లింది. గ్రంథాలయంలోని పుస్తకాలు రోడ్లపై ప్రత్యక్షమయ్యాయి.

విచక్షణ కోల్పోయిన మతోన్మాద గుంపులు ఒక జాతికి సంబంధించిన వారసత్వ సంపద విలువను గుర్తించరు, కనుకనే ఇప్పుడు కాబూల్‌లోని జాతీయ మ్యూజియం భవిష్యత్తు గురించి భయం! ✦

## చైతన్యవాహిని

**5-9-2021** ఆదివారం సాయంత్రం తెనాలి సీనియర్ సిటిజన్ హాల్‌లో బొల్లిముంత శివరామకృష్ణ, తాపీ ధర్మారావుల సాహిత్య కృషిపై జరిగిన సభకు 'ప్రజాసాహితి' ప్రధాన సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు అధ్యక్షత వహించారు.

బెన్‌హర్ వక్తలకు స్వాగతం పల్కారు. అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ బొల్లిముంత కథా, నవలా రచయితగా, సినిమా సంభాషణల రచయితగా, గేయ రచయితగా, పత్రికా సంపాదకునిగా చేసిన బహుముఖ కృషిని వివరించారు. రైతుకూలీ సంఘం, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బొల్లిముంత సాంబశివరావు తన ప్రసంగంలో బొల్లిముంత శివరామకృష్ణ తెనాలి తాలూకా ఉమ్మడి కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శిగా చేసిన కృషిని, వివిధ గ్రామాలకు పార్టీని విస్తరింపచేసిన విషయాలను వివరించారు.

జనసాహితి అధ్యక్షుడు దివికుమార్ తన ప్రసంగంలో తాపీ ధర్మారావు ఎలా సంప్రదాయ గ్రాంధికవాదం నుండి అభ్యుదయ వ్యావహారిక వాదానికి ప్రచారకులుగా మారారో వివరించారు. 'కాగడా', 'జనవాణి' పత్రికల ద్వారా, సినిమాలకు రాసిన సంభాషణల ద్వారా వ్యావహారిక భాషను వ్యాపింపచేశారన్నారు.

అరసం గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకుపల్లి సింగారావు తనకు శివరామకృష్ణతో గల అనుభవాలను వివరించారు.

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ (మైసూరు) వారి సహకారంతో, రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ, చదలవాడ తరఫున చందు సాంబశివరావు ఏర్పాటుచేసిన ఈ సభకు మోహనరావు వందన సమర్పణ చేశారు.

**19-9-2021న** ఒంగోలులోని భాగ్యనగర్‌లో అవ్వారు నాగేశ్వరరావు సంస్మరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని జనసాహితి ప్రధానకార్యదర్శి అరుణ నిర్వహించారు. అవ్వారు నాగేశ్వరరావు నాగులుప్పలపాడు గ్రామంలో 1951 జూలై 31న జన్మించారనీ, 1971లో ఆయన వివాహం నాస్తికోద్యమ నిర్మాత చార్వాక రామకృష్ణగారి అన్నయ్య కూతురు విజయలక్ష్మితో కూరగాయల దండల మార్పిడితో సాంప్రదాయాలకు వ్యతిరేకంగా కొండవీటి వెంకటకవిగారు చేశారని చెప్పారు. అప్పటి నుండి ఆయన తల్లితండ్రీ, అన్నదమ్ముళ్ళు, అక్కచెల్లెళ్ళు, అందరూ హేతువాద భావజాల వ్యాప్తిలో భాగమయ్యారని గుర్తుచేశారు. నాగేశ్వరరావు మొదట్లో ఆర్.యం.పి. ప్రాక్టీస్ చేసేవారనీ, ఆ రోజుల్లో వూర్లో అందరికీ ఒంగోలులోని డా॥ ప్రసాద్‌గారి సహాయ సహకారాలతో సకాలంలో సరైన వైద్యం అందేలా కృషిచేశారన్నారు. ఆ తర్వాత ఎల్ఐసిలో పనిచేస్తూ ఒంగోలు వచ్చారనీ, 1982 నుండీ ప్రజాసాహితి పాఠకులుగా వున్నారని, ప్రజాఉద్యమాలకు సహాయ సహకారాలు అందించేవారని చెప్పారు. ఆయన మరణానంతరం ఆయన కోరినట్లుగానే మృతదేహాన్ని కాటూరి మెడికల్ కాలేజికి అప్పగించారు. ఏ విధమైన కర్మకాండలు చేయకుండా మూఢత్వానికి వ్యతిరేకంగా కుటుంబం నిలబడటం – ఆచరించటం గొప్ప విషయమన్నారు. జనసాహితి బాధ్యులు, హైకోర్టు లాయరు గోవిందయ్య మాట్లాడుతూ 1982 నుండి నాగేశ్వరరావుగారికి 'ప్రజాసాహితి'ని అందించేవాడినని గుర్తుచేసుకున్నారు. చనిపోయిన తర్వాత జరిగే తంతులు, కర్మకాండలు వీటన్నింటిలో పూర్వకాలపు సమాజ అవసరాలరీత్యా ఏర్పడిన పద్ధతులను మతం – మూఢాచారాలుగా మార్చివేసిందన్నారు. ఆయన శరీరాన్ని మెడికల్ కాలేజీకి ఆయన కుటుంబసభ్యులు ఇవ్వటం ఎంతో చైతన్యంతో కూడుకున్నదని, ఆదర్శవంతమైనదని చెప్పారు. ఆ తర్వాత డా॥ ప్రసాద్‌గారు నాగేశ్వరరావుతో కుటుంబంతో ఆయనకున్న అనుబంధాన్ని తెలియచేశారు. హేతువాద సంఘం నాయకులు నార్నె వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ చనిపోయిన తర్వాత ఆత్మ వుండదనీ అలాగే కర్మకాండలు వంటివన్నీ బ్రాహ్మణుల పొట్టకూటి కోసం ఏర్పడిన ఆచారాలన్నారు. మరణానంతరం వేరే జీవితం ఏదీ వుండదని తెలియజేశారు. నాగేశ్వరరావుగారి అమ్మాయి రజని, ఇతర కుటుంబసభ్యులు మాట్లాడారు. ✦

### పితృస్వామ్యంపై పోరాటం చేసిన మహిళా ఉద్యమకారిణి

## కమలా భాసిన్ మరణం

**మహిళా** ఉద్యమకారిణి, కవయిత్రి, రచయిత, సామాజిక శాస్త్రవేత్త, వక్త కమలా భాసిన్ తన 75వ ఏట కాన్సర్‌తో 25-9-2021న ఢిల్లీలో మరణించారు. ఆమె 24-4-1946న పాకిస్తాన్‌కు చెందిన పంజాబ్‌లో షహిదావలీలో జన్మించారు. ఆ కుటుంబం దేశ విభజన సమయంలో ఇండియాకు వచ్చింది.

కమల తండ్రి రాజస్థాన్‌లో వైద్యునిగా పనిచేశారు. ఆమె రాజస్థాన్ విశ్వవిద్యాలయంలోనూ, పశ్చిమ జర్మనీలోనూ విద్యాభ్యాసం చేశారు. ఆ తర్వాత ఉదయపూర్‌లోని సేవామందిర్ సంస్థలో చేరారు. ఢిల్లీలోని ఫుడ్ అండ్ అగ్రి కల్చర్ ఆర్గనైజేషన్ (FAO)లోనూ, ఐక్యరాజ్యసమితి వారి సంస్థలోనూ పనిచేశారు. 2002లో యుఎన్‌ఓలోని ఉద్యోగానికి రాజీనామాచేసి 'సంగత్' అనే సంస్థను స్థాపించారు.

ఆమె దక్షిణ ఆసియాలోని జండర్ సమస్యపై కృషి చేసారు. ప్రధానంగా పితృస్వామిక వ్యవస్థపై పోరాటం చేసారు. పెట్టుబడిదారీ విధానం, పితృస్వామిక వ్యవస్థకు ఒక ఏజెంటు అన్నారు. స్త్రీల శరీరాలను వస్తువులుగానూ, అశ్లీలతకోసం, సౌందర్య పోషక వస్తువుల అమ్మకం కోసం ఉపయోగించడాన్ని నిరసించారు. భాషలో పితృస్వామిక భావాలను ఖండించారు. ఎక్కువగా వెనుకబడిన గిరిజన, శ్రామిక ప్రజలతో జీవించారు. ఆడపిల్లలు ఈలవేయడం తప్పేమీ కాదని, తాను ఈలవేసి ఆడపిల్లలతో వేయించేవారు. ఆమె రాసి పాడిన 'ఆజాదీ' కవితే ఈనాడు పలువురు సందర్భానికనుగుణంగా పాడుకుంటున్నారు. 'నేను ఆడపిల్లను కనుకనే చదువుకోవాలి' అనే కవిత బహుళ జనాదరణ పొందింది. పాకిస్తాన్‌కు, బంగ్లాదేశ్‌కు తరచు వెళ్ళిన ఆమె 2005 జనవరిలో "2005 నోబెల్ శాంతి బహుమతిని అర్హులైన 1000 మంది మహిళలు" అనే పుస్తకాన్ని నోబెల్ శాంతి బహుమతి కమిటీకి అందచేశారు. వారి మరణానికి 'ప్రజాసాహితి' సంతాపాన్ని తెలియజేస్తోంది. ✦




**ప్రొఫెసర్‌గారి విశిష్ట యాత్రా కథనాలు :**

కన్నడ మూలం : ప్రొ॥ రహమత్ తరీకెరె, తెలుగు అనువాదం : శాఖమూరు రామగోపాల్.

1/8 డెమ్మీలో 290 పుటలు. వెల : రూ. 290/- మొదటిముద్రణ : సెప్టెంబర్ 2015. ప్రతులకు : శాఖమూరు రామగోపాల్, ఇంటి నెం. 31-7-4, ఫ్లాట్ నెం. 202, జయప్రద ఫార్చ్యూన్ అపార్టుమెంట్స్, జె.ఎం.జె. కాలేజి ఎదురుగా, సరళానగర్, సుల్తానాబాద్ వార్డు, తెనాలి - 522202. గుంటూరుజిల్లా. మొబైల్ : 90525 63666.

**కొత్త వేకువ : కవిత్వం**

రచయిత : పద్మావతి రాంభక్త

1/8 డెమ్మీలో 144 పుటలు. వెల : రూ. 100/- మొదటిముద్రణ : ఫిబ్రవరి 2020. ప్రచురణ : పాలపిట్ట బుక్స్, హైదరాబాద్.

ప్రతులకు : పద్మావతి రాంభక్త, 10-38-4, రాంనగర్, విశాఖపట్నం - 530002 మరియు పాలపిట్ట బుక్స్, హైదరాబాద్ నందు.

**(మార్క్స్, ఎంగెల్స్‌ల తొలి ఉమ్మడి రచన) పవిత్ర కుటుంబం : (విమర్శనాత్మక విమర్శపై విమర్శ)**

అనువాదం : వై.వి. రమణరావు.

1/8 డెమ్మీలో 432 పుటలు. వెల : రూ. 325/- మొదటిముద్రణ : మార్చి 2021. ప్రతులకు : నవతెలంగాణ, విశాలాంధ్ర, నవోదయ, ఇతర ప్రముఖ పుస్తక కేంద్రాలలో.

**మార్క్స్, ఎంగెల్స్‌ల ఉమ్మడి రచన "జర్మన్ భావజాలం" : (సంపుటి -1, అధ్యాయం - 1)**

అనువాదం : వై.వి. రమణరావు

1/8 డెమ్మీలో 160 పుటలు. వెల : రూ. 130/- మొదటిముద్రణ : మార్చి 2021. ప్రతులకు : నవతెలంగాణ, విశాలాంధ్ర, నవోదయ, ఇతర ప్రముఖ పుస్తక కేంద్రాలలో.

**నిస్వార్థ ప్రజాసేవకుడు, పీడిత బాంధవుడు కామ్రేడ్ ఐదుకల్లు సదాశివన్ జీవిత విశేషాలు :**

రచయిత : విద్వాన్ పి. దస్తగిరి.

1/8 డెమ్మీలో 115 పుటలు. వెల : రూ. 30/-

మొదటిముద్రణ : 29 డిశెంబరు 1997, ప్రతులకు : విశాలాంధ్ర పుస్తకాల షాపులన్నింటిలో.

**దీప నిర్వాణ గంధం .... (An Anthology about Death)**

రచయిత : లంకా శివరామప్రసాద్.

1/8 డెమ్మీలో 239 పుటలు; వెల : రూ. 250/- మొదటిముద్రణ : జూలై 2013. ప్రచురణ : డాక్టర్ లంకా శివరామప్రసాద్ 88978 49442. ప్రతులకు : విశాలాంధ్ర అన్ని పుస్తకాల షాపుల్లో దొరుకుతుంది.

**వకాలత్ వజ్రాయుధం అయ్యిందా! ఎలా?**

కోర్టు రణభూమిలో వెయ్యి యుద్ధాలు, వెయ్యి విజయాలు, న్యాయ సైనికుడి అంతరంగం.

రచయిత : గులాబీల మల్లారెడ్డి.

1/8 డెమ్మీలో 254 పుటలు; వెల : రూ. 200/- మొదటిముద్రణ : జూన్ 2014. ప్రచురణ : గులాబీల మల్లారెడ్డి (అడ్వకేట్). ప్రతులకు : జి.యం.ఆర్. పటేల్, ఇం.నెం. 3-1-706, వావిలాలపల్లి, కరీంనగర్ - 505001. మొబైల్స్ : 94400 41351, 94916 43263.

**ఎద్దు ఎవుసం - సరుకుల వైద్యం : కవిత్వం**

రచయిత : గులాబీల మల్లారెడ్డి.

1/8 డెమ్మీలో 136 పుటలు; వెల : రూ. 100/- మొదటిముద్రణ : ఆగస్టు 2020. ప్రచురణ : పాలపిట్ట బుక్స్, హైదరాబాద్. ప్రతులకు : గులాబీల మల్లారెడ్డి, 3-1-706, వావిలాలపల్లి, కరీంనగర్ - 505001 మరియు పాలపిట్ట బుక్స్, డోర్.నెం. 16-11-20/6/1/1; 403, విజయసాయి రెసిడెన్సీ, సలీంనగర్, మలక్‌పేట, హైదరాబాద్ - 500036. ఫోన్ : 040-27678430, 9848787284.

**సామల సదాశివ స్మృతివ్యాసాలు - పరిశీలన :**

రచయిత : కిషోర్ రాథోడ్.

1/8 డెమ్మీలో 116 పుటలు; వెల : రూ. 190/- మొదటి ముద్రణ : మార్చి 2016. ప్రతులకు : కిషోర్ రాథోడ్, 1-2, పార్డి(బి), కుబీర్, (బెన్సా) నిర్మల్ (అదిలాబాద్) - 504103, తెలంగాణ. ఫోన్ : 94903 13325, 76800 29598.

**మూడు ఇరవైలు : ప్రముఖ రచయిత - సంపాదకుడు బులుసు వెంకట కామేశ్వరరావు షష్టిపూర్తి సంచిక (1957-2017)**

1/8 డెమ్మీలో 184 పుటలు; వెల : రూ. 100/- మొదటిముద్రణ : ఏప్రిల్ 2020. ప్రచురణ : సీతాపబ్లికేషన్స్, మచిలీపట్నం. ప్రతులకు : సీతాపబ్లికేషన్స్, 101 - వసుంధరా ఎన్‌క్లేవ్, నారాయణపురం, ఈడేపల్లి, మచిలీపట్నం-521001. ఫోన్ : 9885459193, 8500538318.

**విరాళి : కవితాసంకలనం**

కవయిత్రి : జన్ను లక్ష్మి

1/8 డెమ్మీలో 200 పుటలు. వెల : రూ. 150/- మొదటిముద్రణ : డిశంబర్ 2019. ప్రచురణ : వాత్సల్య పబ్లికేషన్స్, హైదరాబాద్. ప్రతులకు : విశాలాంధ్ర, నవచేతనలకు చెందిన అన్ని పుస్తకాల దుకాణాల్లోనూ.

**ఒకే ఒక్క దారి (అష్టాంగ మార్గం) :** రచయిత : బొర్రా గోవర్ధన్

1/8 డెమ్మీలో 168 పుటలు. వెల : రూ. 150/- మొదటిముద్రణ : సెప్టెంబర్ 2018. ప్రచురణ : లతా రాజా ఫౌండేషన్, హైదరాబాద్.

ప్రతులకు : ఆర్ట్స్ అండ్ లెటర్స్, కేరాఫ్ హైదరాబాద్ స్టడీ సర్కిల్, 1-2-365/25/సి, ఇందిరా పార్కు క్రాస్‌రోడ్స్, దోమల్‌గూడ, హైదరాబాద్ - 500029. ఫోన్ : 040-27635654, 97046 40273.

**(ఇంకా వున్నాయి)** ✦

కవిత

# ప్రతిఘటించండి! నా ప్రజలారా!! వారిని ప్రతిఘటించండి!!

ఆంగ్ల మూలం : ఇజ్రేలీ – అరబ్ కవయిత్రి డరీన్ టాటూర్ అనువాదం : కొత్తపల్లి రవిబాబు

ప్రతిఘటించండి! నా ప్రజలారా! వారిని ప్రతిఘటించండి!
జెరూసలెంలో నా గాయాలకు కట్లు కట్టుకొని
నా దుఃఖాన్ని వెళ్ళబోసుకున్నాను,
అరచేతిలో ప్రాణాలు పెట్టుకున్నాను,
ఇదంతా అరబ్ పాలస్తీనా కోసం....
శాంతియుత పరిష్కారానికి నేను లొంగను గాక లొంగను
వారిని నా భూమి నుండి తరిమేసేంతవరకు
నా జెండాను అవనతం చేయనుగాక చేయను!
వారిని ప్రక్కకు తోసేస్తా ఆగామి దినాలలో....
ప్రతిఘటించండి! నా ప్రజలారా! వారిని ప్రతిఘటించండి!
వలసదార్ల దోపిడీని అడ్డుకోండి!
అమరవీరుల బాట ననుసరించండి!
నీచత్వాన్నీ, అవమానాల్నీ మనపై రుద్ది
న్యాయ పునరుద్ధరణకు మనల్ని అడ్డుకుంటున్న
అవమానకరమైన రాజ్యాంగాన్ని తుంగలో తొక్కండి!
వారు నిరపరాధులైన బాలలను బలికొన్నారు
హదీల్[1] నైతే బహిరంగంగా తూటాలకు ఎరచేశారు
ఆమెను పట్టపగలే దారుణంగా చంపేసారు!
ప్రతిఘటించండి! నా ప్రజలారా! ప్రతిఘటించండి!!
వలసదారుల దాడిని ప్రతిఘటించండి!
'శాంతి' భ్రాంతితో మనల్ని కట్టిపడేసే
మనతోనే వున్న దళారీల మాటల్ని పట్టించుకోవద్దు -
రెండు నాల్కలవారికి భయపడకండి!
దాడులపై విజయాలు సాధిస్తూ నిలబడిన ఈ నేలపై
నీవు ఎదురు తిరుగుతూ వున్నంతకాలం
నీలో వున్న సత్యమే నీకు బలాన్నిస్తుంది!
ఆలీ[2] తన సమాధి నుంచి చెప్తున్నాడు
ఎదురు తిరగండి! నా ప్రజలారా! వారిని ఎదుర్కోండి!
నా సమాధిపై రాయండిలా
నా అవశేషాలు మీకు స్ఫూర్తినిస్తాయి!
ప్రతిఘటించండి నా ప్రజలారా! వారిని ప్రతిఘటించండి!
ఎదురు తిరగండి నా ప్రజలారా వారికి ఎదురు తిరగండి!

వివరణలు :

1. హదీల్ : Hadeel al Hashlamon – 18 సంవత్సరాల పాలస్తీనా యువతి – విశ్వవిద్యాలయ విద్యార్థిని. ఈమెను ఇజ్రేలీ సైనికుడొకడు ఇజ్రేలీ చెక్‌పోస్ట్ వద్ద 2015 సెప్టెంబర్ 22న కాల్చి చంపాడు.
2. ఆలీ : మహమ్మద్ ప్రవక్త.



కవయిత్రి గురించి :

36 సంవత్సరాల ఇజ్రేలీ అరబ్ కవయిత్రి డరీన్ టాటూర్ ఈ కవితను వీడియోగా తన సామాజిక మాధ్యమాల్లో పెట్టినందుకు, 'ఇది హింసను ప్రేరేపిస్తోందని, ఉగ్రవాదాన్ని సమర్థిస్తోందని' ఆరోపించి ఇజ్రేలీ మిలటరీ కోర్టు 11 అక్టోబర్ 2015న అరెస్టు చేసి 5 నెలల జైలుశిక్ష విధించింది. ఈ కవితలో 'పాలస్తీనియులను విచ్చలవిడిగా చంపేస్తున్నారనీ, ఇజ్రేలీ ఆక్రమణను ఖండిస్తూ, 70 ఏళ్ళ వ్యథకు స్వస్తి పలకాలనీ చెప్పి వారిని రెచ్చగొట్టాను. నిజమే' అని కోర్టులో ప్రకటించారు. తన జైలు అనుభవాలతో రాసిన నవల అరబిక్, ఇంగ్లీషు, హిబ్రూ భాషల్లో రాబోతోంది.

ఆమె కంప్యూటర్ ఇంజనీరింగ్ పూర్తిచేసి, మీడియా మరియు ఫిల్మ్ డైరెక్షన్‌లో ప్రవేశించి, కవితా రచనలో నిమగ్నమయ్యారు.

PRAJA SAAHITI August - October 2021 (TELUGU) Rs. 25/- RNI No.APTEL/1977/00571 Postal Regd. No. Vj/030/2021-2023
No. of Pages : 52 Date of Publication : 28th of Last Month Posting : 1st or 2nd of Every Month




ప్రజాసాహితి 30-7-6, అనపర్తివారి వీధి, అన్నదాన సమాజం రోడ్డు, దుర్గాఅగ్రహారం, విజయవాడ - 520002.
Editor : P.S. NAGARAJU, Edited, Printed and Published by K. RAVI BABU at Vanaja Press, Vijayawada - 520 002 for Co-operative Press, Vijayawada
A PUBLICATION OF JANASAAHITHI